www.visalaandhra.com
స్థాపితం : 1952

విశాలాంధ్ర

VISALAANDHRA Regd No.VJ/042/2018-20
అక్షరాక్షరం అభ్యుదయం

సంపుటి : 66 | సంచిక : 258 | శనివారం 10-03-2018 | Simultaneously published from Vijayawada, Hyderabad, Visakapatnam, Tirupathi, Kurnool, Karimnagar, Khammam | వెల: రూ.3.00 | పేజీలు : 12+ టాబ్లాయిడ్ | విజయవాడ ప్రచురణ

కారుణ్య మరణానికి సుప్రీం ఓకే

అమలుకు మార్గదర్శకాలు ఖరారు



> కారుణ్య మరణానికి అనుమతించాలని 2014లోనే ప్రధాని మోడీని కోరా. సుప్రీం కోర్టు తీర్పు నాలాంటి వారికి ఎంతో ఉపశమనం. ఇదో మంచి నిర్ణయం.
> - మస్క్యులర్ డిస్ట్రోపీ బాధితురాలు అనామిక

న్యూఢిల్లీ : కారుణ్య మరణంపై సుప్రీంకోర్టు శుక్రవారం చరిత్రాత్మక తీర్పు వెల్లడించింది. ప్రాణాంతక రుగ్మతలతో బాధపడుతున్న రోగుల 'సజీవ వీలునామా'ను పరిగణనలోకి తీసుకుని పరోక్ష కారుణ్య మరణాన్ని ప్రసాదించాలన్న పిటిషన్‌పై సుప్రీంకోర్టు స్పందించింది. పరోక్ష కారుణ్య మరణాలు, వాటి కోసం పరిగణించే సజీవ వీలునామా అనుమతించదగినవేనని స్పష్టం చేసింది. అయితే ఇలాంటి కేసుల్లో సజీవ వీలునామాను పరిగణనలోకి తీసుకోవడానికి కొన్ని కఠిన మార్గదర్శకాలను జారీ చేసింది. ఈ కేసులపై చట్టం తీసుకొచ్చేంతవరకు ఈ మార్గదర్శకాలు అమల్లో ఉంటాయని పేర్కొంది. ఈ మేరకు సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ దీపక్‌మిశ్రా నేతృత్వంలోని ఐదుగురు సభ్యులతో కూడిన రాజ్యాంగ ధర్మాసనం తీర్పు వెలువరించింది. వైద్యంతో నయం కాని రోగాలతో బాధపడే రోగులకు ఆ బాధల నుంచి విముక్తి కల్పించేందుకు పరోక్ష కారుణ్య

- మిగతా 2 లో



మాట్లాడుతున్న కారత్, పక్కన రాజా

విగ్రహాల కూల్చివేతపై

లెఫ్ట్ ఆగ్రహం

పార్లమెంట్‌కు మార్చ్ : అడ్డుకున్న పోలీసులు
బీజేపీ అసహన ధోరణికి ప్రతిబింబం : నేతలు

న్యూఢిల్లీ : ప్రప్రథమ సోషలిస్టు రాజ్యనిర్మాత వీఐ లెనిన్ విగ్రహాన్ని త్రిపురలో కూల్చివేయడాన్ని, తమిళనాడులో పెరియార్ ఈవీ రామస్వామి విగ్రహాన్ని మతోన్మాద శక్తులు ధ్వంసంచేయడం బీజేపీ నేతల అసహన ధోరణిని ప్రతిబింబిస్తోందని వామపక్షాల నాయకులు పేర్కొన్నారు. లెనిన్ విగ్రహం కూల్చివేత, రామస్వామి విగ్రహాన్ని ధ్వంసం చేయడాన్ని నిరసిస్తూ ఏడు వామపక్ష

- మిగతా 2 లో

పోరాటం ఉధృతం

అంచెలవారీగా కేంద్రంపై ఒత్తిడి

- ముమ్ముందు మరిన్ని కీలక నిర్ణయాలు
- 15వేల మంది టీడీపీ నేతలతో చంద్రబాబు టెలికాన్ఫరెన్స్
- ఎన్డీఏ నుంచి కూడా బయటకురావాలన్న నేతలు
- కాంగ్రెస్, బీజేపీలను ఎండగట్టాలని పిలుపు



విశాలాంధ్ర బ్యూరో- అమరావతి : రాష్ట్రానికి తీవ్ర అన్యాయం చేసిన కాంగ్రెస్, బీజేపీలను ఎండగట్టాలని తెలుగుదేశం పార్టీ శ్రేణులకు ముఖ్యమంత్రి చంద్రబాబు పిలుపునిచ్చారు. రాజ్యసభ అభ్యర్థుల ఎంపిక, కేంద్ర మంత్రుల రాజీనామా తర్వాత నెలకొన్న పరిణామాలపై చర్చించేందుకు తొలుత తెలుగుదేశం పార్టీ వ్యూహ కమిటీ సమావేశం నిర్వహించారు. అనంతరం రాష్ట్రంలోని 13 జిల్లాలకు చెందిన ముఖ్యనేతలతో పాటు గ్రామస్థాయి నేతలందరితోనూ దాదాపు రెండున్నర గంటల పాటు 15వేల మంది నేతలతో టెలికాన్ఫరెన్స్‌లో చంద్రబాబు మాట్లాడారు. రెండు జాతీయ పార్టీలు ఏపీ ప్రజల మనోభావాలను అర్థంచేసుకోలేదు. రాష్ట్రానికి జరిగిన అన్యాయాన్ని ఎంపీలు సమర్థవంతంగా ఎండగడుతున్నారు. ప్రత్యేక హోదా, ప్రత్యేక సాయం విషయాల్లో బీజేపీ మనకు తీవ్ర అన్యాయం చేసింది. కాంగ్రెస్ పార్టీ మన కన్ను పొడవాలనుకుని. తన రెండు కళ్లు పొడుచుకుంది. విభజనకు కారణమైన మరో జాతీయపార్టీ బీజేపీ రాష్ట్రానికి న్యాయం చేస్తుందని పొత్తు పెట్టుకుంటే అదీ అన్యాయం చేసింది. అందువల్ల రెండు జాతీయ పార్టీలు చేసిన అన్యాయాన్ని ప్రజలకు వివరించండి. ఎన్డీఏ ప్రభుత్వం నుండి బయటకు రావాలని మనం తీసుకున్న నిర్ణయాన్ని ప్రజలు స్వాగతిస్తున్నారు. పార్లమెంట్‌లో టీడీపీ ఎంపీలు పోరాడుతుంటే వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఎంపీలు కూర్చుంటున్నారని, ప్రధాని సభలో వుంటే వారు బయట ఆందోళన చేస్తున్నారని చంద్రబాబు విమర్శించారు. బడ్జెట్‌పై కూడా వైసీపీ ఎంపీ విజయసాయిరెడ్డి తొలుత బాగుందని చెప్పి, మనం వ్యతిరేకించగానే రూటు మార్చారని గుర్తు చేశారు. రాష్ట్ర విభజన సమయంలో కూడా జగన్ పార్లమెంట్‌లో సోనియాకు కనబడకుండా తిరిగారని, ఇప్పుడు మోడీ ప్రాపకం కోసం పాకులాడుతున్నారు విమర్శించారు. ఎంపీలు రాజీనామా చేస్తే పార్లమెంట్‌లో ఏపీ ప్రజల

- మిగతా 2 లో

ఎల్లుండే అవిశ్వాసం

ఆ తరువాత పార్టీ ఎంపీల రాజీనామా
మద్దతుపై చంద్రబాబే తేల్చుకోవాలి
వైసీపీ నేత బొత్స



విశాలాంధ్ర బ్యూరో-హైదరాబాద్: ఆంధ్రప్రదేశ్‌కు ప్రత్యేక హోదా కోసం సోమవారమే లోక్‌సభలో అవిశ్వాస తీర్మానం పెడతామని వైసీపీ సీనియర్ నాయకులు బొత్స సత్యనారాయణ స్పష్టం చేశారు. అవిశ్వాసం తర్వాత పార్టీ ఎంపీలు రాజీనామాలు చేస్తారని, అవిశ్వాసానికి మద్దతిస్తారో, లేదో ముఖ్యమంత్రి చంద్రబాబు తేల్చుకోవాలన్నారు. మంత్రి పదవులకు రాజీనామాలు చేసిన అశోక్, సుజనా హోదా కోసమే రాజీనామాలు చేశామని చెప్పుకోలేకపోతున్నారని బొత్స వ్యాఖ్యానించారు. రాష్ట్రానికి కేంద్రం ఎన్నో చేసిందన్న సుజనా చౌదరి ఇప్పుడు మాటమార్చి ఏమీ ఇవ్వలేదనడం విడ్డూరంగా ఉందన్నారు. పార్టీ కేంద్ర కార్యాలయం లోటస్‌పాండ్‌లో శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ముఖ్యమంత్రి అనుసరిస్తున్న విధానాలను తీవ్రంగా తప్పుబడుతూ, రాజకీయ ప్రయోజనాలపైనే చంద్రబాబు దృష్టి సారించారని ఆరోపించారు. ప్రకాశం జిల్లాలో పాదయాత్రలో ఉన్న జగన్‌మోహన్‌రెడ్డి వైసీపీ పార్టీ ముఖ్యులు, ఎంపీలతో సమావేశమై బీజేపీపై అవిశ్వాస

- మిగతా 2 లో

ఆ ముగ్గురూ రావాల్సిందే

- ఢిల్లీలో ధర్నా చేయాలి
- జర్నలిస్టుల హోదా పోరులో రామకృష్ణ డిమాండు
- నినాదాలతో మారుమోగిన ఏపీ భవన్



ఢిల్లీలో జర్నలిస్టుల హోదా పోరులో నినాదాలు చేస్తున్న రామకృష్ణ, కొణతాల రామకృష్ణ, చలసాని తదితరులు

న్యూఢిల్లీ- విశాలాంధ్ర బ్యూరో : ఆంధ్రప్రదేశ్‌కు ప్రత్యేక హోదా కోసం జర్నలిస్టుల ఆధ్వర్యంలో న్యూఢిల్లీలోని ఏపీభవన్‌లో ధర్నా జరిగింది. ధర్నాకు సీపీఐ ఏపీ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ, ప్రత్యేక హోదా సాధన సమితి నేత చలసాని శ్రీనివాస్ సంఘీభావం తెలిపారు. ఆంధ్రప్రదేశ్‌కు ప్రత్యేక హోదా ఇస్తామని చెప్పి మోసం చేసిన కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా జర్నలిస్టులు నినాదాలు చేశారు. రామకృష్ణ మాట్లాడుతూ ఏపీకి ప్రత్యేక హోదా కోసం నాలుగు రోజులు నుంచి దేశరాజధానిలో ఆందోళన జరుగుతున్నా కేంద్రంలో ఏ మాత్రం చలనం లేదని విమర్శించారు. ప్రత్యేక హోదాపై జాతీయ పార్టీలు రెండు ఏపీ ప్రజల్ని మోసం చేశాయని అన్నారు. వైసీపీ, టీడీపీ, జనసేన పార్టీల అధినేతలు ఢిల్లీ వచ్చి ధర్నా చేయాలని రామకృష్ణ డిమాండు చేశారు. ఇక్కడికి వచ్చి ఆందోళనలు చేయాల్సి ఉండగా అక్కడ పాదయాత్రలు, ఇతర పనులు

- మిగతా 2 లో

భూమిచ్చినా.. నిర్మాణాలేవీ!?

- ముఖం చాటేసిన ప్రైవేటు సంస్థలు
- ప్రభుత్వశాఖలదీ అదే తీరు
- రెండు సంస్థలకు నోటీసులు
- 1260 ఎకరాల కేటాయింపు
- ఇదీ రాజధాని అమరావతి పరిస్థితి



విశాలాంధ్ర బ్యూరో - అమరావతి : రాజధాని అమరావతి అభివృద్ధిపై ఆరంభంలోనే నీలినీడలు అలముకుంటున్నాయి. రాజధాని బృహత్ ప్రణాళిక ప్రకారం తొమ్మిది నగరాలను నిర్మించాలని చంద్రబాబు ప్రభుత్వం నిర్ణయించింది. ఇందులో భాగంగా వివిధ జాతీయ, అంతర్జాతీయ సంస్థల ఏర్పాటుకు భూముల కేటాయింపు ప్రక్రియ రెండేళ్ల క్రితమే ప్రారంభమైంది. ఒకట్రెండు ప్రైవేటు సంస్థలు మినహా మిగిలిన సంస్థలు కార్యకలాపాలను నిర్వహించేందుకు అంతగా ఆసక్తి చూపడంలేదు. రాజధానిలో అనేక సంస్థలు, పరిశ్రమలు వస్తాయని, నిరుద్యోగ సమస్యకు పరిష్కారం లభిస్తుందన్న పాలకుల మాటలు నీటిమీదరాతలుగా మారాయని యువత ఆవేదన చెందుతోంది. రాజధాని ప్రాంతంలో మొత్తం 46 ప్రభుత్వ, ప్రైవేటు సంస్థల కోసం 1260 ఎకరాల భూమిని రాజధాని ప్రాంత అభివృద్ధి ప్రాధికార సంస్థ (సీఆర్‌డీఏ) కేటాయించింది. ఇందులో 12 ప్రభుత్వ సంస్థలకు 287 ఎకరాలు, 14 ప్రైవేటు సంస్థలు, కంపెనీలకు 973 ఎకరాలను మంజూరు చేసింది. ఈ భూముల్లో తొలి విడతగా 673 ఎకరాలకు సంబంధించి అంగీకార పత్రాలను అందచేసింది. నిర్మాణాలు ప్రారంభమైన

- మిగతా 2 లో

మంత్రుల రాజీనామాకు రాష్ట్రపతి ఆమోదం

11లో

ఇదీ లోకం!



మంటలే మంటలు

ఈ ఏడాది వడగాడ్పులు అధికం

- ప్రజలంతా తగు జాగ్రత్తలు తీసుకోవాలి
- 40 రోజులు పైబడి అత్యధిక ఉష్ణోగ్రతలు
- ఐఎండీ డైరెక్టర్ వై కే రెడ్డి



విశాలాంధ్ర -అమరావతి : ఈ వేసవికాలం రాష్ట్రంలో తీవ్రమైన వడగాడ్పులు వీచే అవకాశముందని ఐఎండి డైరెక్టర్ వైకే రెడ్డి, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర విపత్తుల నిర్వహణ శాఖ కమిషనర్ శేషగిరిరావు చెప్పారు. గుంటూరు జిల్లా కుంచనపల్లిలోని ఏపీఎస్‌డీఎంఏ రాష్ట్ర కార్యాలయంలో శుక్రవారం వారు మీడియా సమావేశం నిర్వహించారు. ఈ నెల నుంచి భానుడు ప్రతాపం చూపనున్నాడని తెలిపారు. గతేడాది కన్నా ఈ ఏడాది వడగాడ్పుల ప్రభావం అధికంగా ఉంటుందని తెలిపారు. ఎప్పుడైతే 45 డిగ్రీల కంటే ఎక్కువ ఉష్ణోగ్రతలు నమోదవుతాయో అప్పుడు వీచే గాడ్పులనే వడగాడ్పులు అంటారని తెలిపారు. గత 89 సంవత్సరాలుగా నమోదైన ఉష్ణోగ్రతలను పరిగణనలోకి తీసుకొని రానున్న వడగాడ్పుల గురించి గణాంకాలు రూపొందిస్తామన్నారు. గత ఏడాది 23 రోజులు 47 శాతం వడగాడ్పులు వీస్తే ప్రస్తుతం 52 శాతంగా వడగాడ్పులు వీచే అవకాశముందని తెలిపారు. 2016వ సంవత్సరంలో 12 రోజుల పాటు వీచిన వడగాడ్పులకు 1369 మంది చనిపోగా , 14 రోజులు కోస్తాలో

- మిగతా 2 లో

అప్పుల్లో టీడీపీ, టీఆర్ఎస్

- సంపన్న పార్టీగా ఎస్పీ
- ప్రాంతీయ పార్టీల ఆస్తులపై ఏడీఆర్ నివేదిక

11లో

పెళ్లింట విషాదం

- వరుడు సహా ఐదుగురి మృతి
- వధువుకు గాయాలు
- చెట్టును ఢీకొన్న వాహనం
- ఖమ్మం జిల్లాలో ఘటన



11లో




మేలో అమెరికా-ఉత్తరకొరియాల మధ్య ముఖాముఖి చర్చలు..!

వాషింగ్టన్ : అమెరికా, ఉత్తర కొరియా మధ్య దీర్ఘకాలంగా నెలకొన్న వివాదం సమసిపోనున్నాయా..? అంటే అవుననే సంకేతాలు వెల్లడవుతున్నాయి. అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్, ఉత్తర కొరియా అధ్యక్షుడు కిమ్ జోంగ్ ఉన్ మేలో ముఖాముఖి చర్చలకు మార్గం సుగమమైంది. ట్రంప్‌ని చర్చలకు ఆహ్వానిస్తూ గురువారం వైట్ హౌస్‌ని సందర్శించిన దక్షిణ కొరియా ప్రతినిధులు కిమ్ పంపిన లేఖను అందజేశారు. ఈ సందర్భంగా కిమ్ ప్రత్యేకంగా 'అణునియంత్రణకు కట్టుబడిఉన్నట్లు' తెలియజేశారు. ఉత్తర, దక్షిణ కొరియాల మధ్య జరుగుతున్న చర్చల సారాంశాన్ని వివరించారు. దీనిపై సానుకూలంగా స్పందించిన ట్రంప్ ట్వీటర్‌లో తన అభిప్రాయాలను వెల్లడించారు. కిమ్‌తో దక్షిణ కొరియా ప్రతినిధులు, అణు క్షిపణుల నియంత్రణకు జరుపుతున్న చర్చలు కొనసాగుతున్నాయని ట్రంప్ తెలిపారు. ఉత్తర కొరియా ఇటీవల క్షిపణి పరీక్షలకు దూరంగా ఉండటాన్ని ఆయన స్వాగతించారు. ఒప్పందాలు కుదిరే వరకు ఇది ఇలాగే కొనసాగాలన్నారు. సమావేశానికి ఏర్పాట్లు జరుగుతున్నాయని అన్నారు. డోనాల్డ్ ట్రంప్ అధ్యక్ష బాధ్యతలు చేపట్టాక ట్రంప్, కిమ్‌ల మధ్య మాటల యుద్ధం తారాస్థాయికి చేరింది. కిమ్ కూడా తగ్గకుండా తమ అణు క్షిపణులతో ప్రపంచానికే పెను సవాలు విసురుతూ వచ్చారు. దీంతో ప్రపంచ దేశాలన్నీ శాంతి చర్చల ద్వారా వివాదానికి తెర దించాలని ఇరు దేశాలకు సూచించాయి. ఇటీవలే పొరుగు దేశమైన దక్షిణ కొరియా అధికారులు చర్చల కోసం దశాబ్ద కాలం తర్వాత ఉత్తర కొరియాలో అడుగుపెట్టారు. ఈ క్రమంలోనే కిమ్ సోదరి దక్షిణ కొరియాలో జరిగిన ఒలంపిక్స్‌కి హాజరవ్వడంతో, చర్చలు సత్ఫలితాలు ఇచ్చే సంకేతాలు వెలువడ్డాయి.

విశాలాంధ్ర ప్రపంచం

స్పెయిన్‌లో మహిళల భారీ ప్రదర్శన

లింగ వివక్ష రూపుమాపాలని, సమానపనికి సమానవేతనం చెల్లించాలని డిమాండు



మాడ్రిడ్ : అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా స్పెయిన్‌లో మహిళా లోకం మాడ్రిడ్ వీధుల్లో కదం తొక్కింది. లింగ వివక్ష రూపుమాపాలని, మహిళల హక్కుల కోసం మహిళాలోకం ప్రభుత్వాన్ని డిమాండ్ చేసింది. పురుషులతో సమానంగా వేతనాలు చెల్లించాలని, పనిచేస్తున్న ప్రదేశాల్లో లైంగిక వేధింపుల నిర్మూలన కోసం తగిన చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. మహిళా దినోత్సవం సందర్భంగా భారీ ర్యాలీ నిర్వహించారు. మాడ్రిడ్, బార్సిలోనా, వాలెన్సియాతో పాటు 200 నగరాల్లో పలు నిరసన కార్యక్రమాలు భారీ ఎత్తున నిర్వహించారు. ప్లకార్డులు, బ్యానర్లు చేతపట్టుకుని ప్రభుత్వ వ్యతిరేక నినాదాలు చేశారు. లింగ వివక్ష నిర్మూలన కోసం ప్రభుత్వం కృషి చేయాలని డిమాండ్ చేశారు. ఈ ప్రదర్శనకు స్పెయిన్ ట్రేడ్‌యూనియన్స్, పౌరహక్కుల సంఘాలు తమ తోడ్పాటు నందించాయి. సమాజంలో మహిళపాత్ర గురించి ఈ సందర్భంగా నొక్కి చెప్పారు. ఈ కార్యక్రమాలకు ఐదుగురు మహిళా మంత్రులతో పాటు ప్రముఖ సినీనటి పెనా లోప్ క్రజ్ మద్దతు తెలిపారు. మహిళలు తలపెట్టిన పలు నిరసన కార్యక్రమాల ఫలితంగా రవాణావ్యవస్థకు, విద్యాలయాలకు, ఆసుపత్రులకు పలు అంతరాయం ఏర్పడింది. వాహ నాల రాకపోకలు స్తంభిం చాయి. 300 రైళ్లను రద్దు చేసుకున్నట్టు రైల్వే అధికారులు తెలిపారు. పలు వాణిజ్య సంస్థలు మూతపడ్డాయి. యూరో స్టాట్ నివేదిక ప్రకారం... స్పెయిన్‌లో ప్రభుత్వ, ప్రయివేట్ రంగాల్లో పనిచేస్తున్న మహిళలకు తక్కువ వేతనాలు అందుతున్నాయి. పురుషులకు అందుతున్న వేతనాలతో పోల్చితే మహిళలకు 19శాతం తక్కువగా చెల్లిస్తున్నారు. అంతేగాకుండా, పనిచేస్తున్న ప్రదేశాల్లో మహిళలపై లైంగిక దాడుల ఘటనలు ఎక్కువగా నమోదవుతున్నాయి. ఈ ప్రదర్శనను స్పెయిన్‌ప్రధానమంత్రికి చెందిన పీపుల్స్ పార్టీ తీవ్రంగా వ్యతిరేకించినట్లు ట్వీట్ చేశారు. సోషలిస్టు పార్టీనాయకుడు పెడ్రో సాంచెజ్ మాట్లాడుతూ,

ఈరోజు చరిత్రగతినే మార్చివేసే రోజని పేర్కొన్నారు. పడోమాస్ నాయకుడు పాబ్లొ ఇగ్లేషియా ట్వీట్‌లో తమ పార్టీకి చెందిన మహిళలందరూ ఈ ప్రదర్శనకు మద్దతు తెలిపినట్లు పేర్కొన్నారు.

సుసంపన్న గ్రామాలే లక్ష్యం

13వ నేషనల్ పీపుల్స్ కాంగ్రెస్‌లో జిన్‌పింగ్



బీజింగ్ : సుసంపన్న గ్రామాలే తమ ప్రభుత్వ లక్ష్యమని, గ్రామీణ ప్రాంతాల బలోపేతం, హైక్వాలిటీ అభివృద్ధి లక్ష్యంతో ముందుకు సాగుతున్నామని చైనా అధ్యక్షుడు, సీపీసీ సెంట్రల్ కమిటీ చైర్మన్ గ్జి జిన్‌పింగ్ తెలిపారు. 13వ నేషనల్ పీపుల్స్ కాంగ్రెస్ తొలి సెషన్‌లో భాగంగా సహాయ మంత్రులతో ఆయన సమావేశమయ్యారు. గ్రామీణ అభివృద్ధికి అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని అధికారులకు సూచించారు. ఇందుకోసం వ్యూహాలను సిద్ధం కోని, సాధ్యమైనంత తర్వలో వాటిని అమలు చేయాలని ఆదేశించారు. వ్యవసాయం, గ్రామీణ అభివృద్ధి తదితర అంశాలపై సుదీర్ఘంగా చర్చించారు. అధికారులకు దిశానిర్దేశం చేశారు. గ్రామాల్లో పరిశ్రమలను పునరుత్జేపర్చేందుకు వీలుగా కార్మికుల వేతనాలను పెంచాలని, పేదరికరాన్ని పారద్రోలి గ్రామీణ జీవితాన్ని సుసంపన్నం చేయాలని ఆయన అధికారులకు సూచించారు. జాతీయ ఆహార భద్రతా హామీ, వ్యవసాయ వ్యవస్థ పటిష్టత, గ్రామీణ పారిశ్రామిక వ్యవస్థ ఆధునికీకరణ వంటివి శరవేగంగా జరగాలన్నారు. గ్రామాల్లో ప్రతిభను ప్రోత్సాహించాలని, సంస్కృతి, సంప్రదాయాలు, సిద్ధాంతాలు, నైతిక విలువులతో కూడిన విద్యను అందించే విధంగా వ్యవస్థను పటిష్టపర్చాలని జిన్‌పింగ్ ఆదేశించారు. పర్యావరణ సంరక్షణ, పచ్చదనాన్ని పెంపొందించడం చాలా అవసరమన్నారు. గ్రామీణ జీవితాన్ని మెరుగుపర్చేందుకుగాను మూడేళ్ల కార్యాచరణ ప్రణాళికను వెంటనే అమలు చేయాలని, టాయిలెట్ విప్లవాన్ని కొనసాగించాలని జిన్‌పింగ్ సూచించారు. ఆధునిక పరిపాలనా యంత్రాంగాన్ని నెలకొల్పడంతో పాటు మెరుగైన పరిపాలనను అందించే విధంగా చైనా కమ్యూనిస్టు పార్టీ (సీపీసీ) గ్రామీణ నాయకత్వాన్ని బలోపేతం చేయాలని ఆయన అధికారులకు ఆదేశాలు జారీచేశారు. గ్రామీణుల ఆకాంక్షలను గౌరవించాలని, వారికి మెరుగైన జీవనం కల్పించేందుకు కృషిచేయాలని, వారి ప్రాథమిక హక్కులను పరిరక్షించాలని, గ్రామాలను సుసంపన్నం చేయాలని జిన్‌పింగ్ సూచించారు.

అమెరికా కొత్త టారిఫ్‌ను వ్యతిరేకించిన చైనా

బీజింగ్ : స్టీల్, అల్యూమినియం దిగుమతులపై అమెరికా తాజా టారిఫ్‌ను చైనా వ్యతిరేకించింది. ఈ తాజా పరిణామం ప్రభావం అంతర్జాతీయ వర్తకంపై పడుతుందని అభిప్రాయపడింది. దేశంపై దాడులను అరికట్టేందుకు స్టీల్, అల్యూమీనియంపై దిగుమతి సుంకాన్ని పెంచుతున్నట్టు అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ పేర్కొన్నారు. కొత్త టారిఫ్ ప్రొక్లమేషన్లపై సంతకాలు చేశారు. దీనిపై చైనా స్పందిస్తూ స్టీల్‌పై 25శాతం, అల్యూమీనియంపై 10శాతం మేర టారిఫ్‌ను పెంచడం అంతర్జాతీయ వాణిజ్యంపై ప్రభావం చూపుతుందని, తద్వారా చమురు ధరలూ పెరగవచ్చునని పేర్కొంది. ట్రంప్ తాజా నిర్ణయాన్ని యూరప్ కూడా వ్యతిరేకించింది.

మహిళా సాధికారతకు 'సమయం ఆసన్నం' : గుటెర్రస్



ఐరాస : 'మహిళా సాధికారత'కు సమయం ఆసన్నమైందని అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా ఐక్యరాజ్యసమితి ప్రధాన కార్యదర్శి ఆంటోనియో గుటెర్రస్ పిలుపునిచ్చారు. సమాన అవకాశాలకు గౌరవానికి, ప్రాతినిధ్యానికి ఇదే సమయమన్నారు. ప్రపంచ వ్యాప్తంగా మహిళలపై హింస, వివక్ష ప్రదర్శించడానికి కాలం చెల్లిందని, మహిళలపట్ల పురుషుల ధోరణిలో మార్పు వస్తోందని గురువారం ఐక్యరాజ్యసమితి ముఖ్యకార్యాలయంలో జరిగిన అంతర్జాతీయ మహిళాదినోత్సవ కార్యక్రమంలో ఆయన తెలిపారు. ఆయన ఏం కోరుకుంటున్నానో మహిళలు, బాలికలు కూడా అదే కోరుకుంటున్నారని, దాన్నే సున్నితులైన పురుషులు, బాలురు కోరుకుంటున్నారన్నారు. లింగసమానత్వం ప్రాథమిక మానవహక్కని, దీనిద్వారానే శాంతి, అభివృద్ధి సాధ్యమ వుతుందన్నారు. శక్తి అనేది హృదయానికి సంబంధించిందని, అయినప్పటికీ ఇప్పటివరకు మనమంతా పురుష ఆధిపత్య ప్రపంచంలోనూ, సంస్కృతిలో ఉన్నామన్నారు. మహిళలు అన్ని రంగాల్లో పురోభివృద్ధి చెందుతున్నారని, కంపెనీలు, దేశాధిపతులుగా ఆర్థికాభివృద్ధిలో పాలు పంచుకుంటు న్నారన్నారు. ప్రపంచశాంతి కోసం మహిళలు మరింత కృషి చేయాలన్నారు. ఇంతకు ముందులా కాకుండా లింగ సమానత్వంలో సమాజంలో మార్పు వచ్చిందన్నారు. లైంగిక దాడులను ఎట్టిపరిస్థితుల్లోనూ సహించేది లేదని గుటెర్రస్ స్పష్టం చేశారు. లైంగిక హింసను ఎదుర్కొన్న మహిళల్లో ఆత్మగౌరవం నింపి, సాధికారిత దిశలో, న్యాయపోరాటం కోసం కొనసాగించడానికి స్ఫూర్తి నింపుతున్నామని ఆయన వెల్లడించారు.

మళ్లీ రెచ్చిపోయిన తాలిబాన్లు

16 మంది ఆఫ్ఘన్ సైనికుల మృతి



కాబూల్ : ఆఫ్ఘనిస్థాన్‌లో మరోసారి తాలిబాన్లు రెచ్చిపోయారు. తూర్పు ఆఫ్ఘనిస్థాన్‌లోని తాఖర్ ప్రావిన్స్ ఖ్వాజాఘర్ జిల్లాలోని చెక్‌పోస్టుపై దాడులు చేశారు. ఈ దాడుల్లో 16 మంది ఆఫ్ఘన్ సైనికులు మరణించారు. ఈ వివరాలను ఆఫ్ఘన్ చీఫ్ ఎగ్జిక్యూటివ్ అబ్దుల్లా అబ్దుల్లా శుక్రవారం వెల్లడించారు. తాలిబాన్ల దాడిలో 10 మంది ఆర్మీ జవాన్లు, ఆరుగురు పోలీసులు చనిపోయినట్టు ధ్రువీకరించారు. ఈ దాడి చేసినది తామేనంటూ తాలిబాన్లు ప్రకటనలో పేర్కొన్నారన్నారు. ప్రభుత్వానికి భారీ నష్టం జరిగిందని అబ్దుల్లా చెప్పారు.

సుప్రీం ఓకే

(మొదటిపేజీ తరువాయి)

మరణాలను ప్రసాదించాలని కామన్ కాస్ అనే ఎన్జీవో సుప్రీంకోర్టులో ప్రజాప్రయోజన వ్యాజ్యం దాఖలు చేసింది. ఇందుకు సజీవ వీలునామాను పరిగణనలోకి తీసుకోవాలని పిటిషన్‌లో కోరారు. రోగులు తమకు ఇవ్వాల్సిన చికిత్సపై ముందుగానే సూచనలు జారీ చేసే పత్రాన్ని సజీవ వీలునామాగా పేర్కొంటారు. ఈ పిటిషన్‌పై గతేడాది అక్టోబరు 11నే వాదనలు ముగించిన సుప్రీంకోర్టు... తీర్పును వాయిదా వేసింది. తాజాగా శుక్రవారం దీనిపై తీర్పును వెలువరించింది. కారుణ్య మరణాలను అమలుచేయడానికి కొన్ని మార్గదర్శకాలను తయారుచేసింది. సజీవ వీలునామాను పరిగణనలోకి తీసుకోవచ్చని, అయితే అందుకు రోగుల కుటుంబసభ్యుల నుంచి అనుమతి ఉండాలని పేర్కొంది. వీరితో పాటు ఆ రోగి కోలుకోవడం సాధ్యం కాదని చెప్పిన వైద్యుల బృందం అనుమతి తప్పనిసరని సూచించింది. సజీవ వీలునామాను తీసుకుని రోగి కుటుంబసభ్యులు లేదా సన్నిహితులు హైకోర్టుకు వెళితే.. పరోక్ష కారుణ్యం అవసరమో లేదో నిర్ణయించేందుకు ఆ న్యాయస్థానం మెడికల్ బోర్డును ఏర్పాటు చేయాలని తెలిపింది. జస్టిస్ దీపక్ మిశ్రా తీర్పును వెలువరిస్తూ.. అలాంటి రోగులకు గౌరవంగా చనిపోయే హక్కు ఉంటుందని స్పష్టంచేశారు.



స్వాగతించిన అనామిక

కారుణ్య మరణానికి అనుమతిస్తూ సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పును మస్క్యులర్ డిస్ట్రోపీ (కండరాల బలహీనత) వ్యాధితో బాధపడుతున్న అనామిక మిశ్రా స్వాగతించింది. సుప్రీంకోర్టు తీర్పు నేపథ్యంలో అనామిక మిశ్రా మాట్లాడుతూ..తనకు కారుణ్య మరణానికి అనుమతి ఇవ్వాలని 2014లో ప్రధాని నరేంద్రమోడీని కోరగా..ఈ అంశంపై దృష్టి సారించాలని స్థానిక అధికారులకు చెప్పారని పేర్కొంది. కారుణ్య మరణం అంశంలో సుప్రీంకోర్టు మంచి నిర్ణయం తీసుకుందని, ఇపుడు తనకు ఉపశమనం దొరుకుతుందని ఆమె విశ్వాసం వ్యక్తం చేసింది.

మస్క్యులర్ డిస్ట్రోపీతో బాధపడుతున్న తన కూతురు అనామికా మిశ్రాను యుథనేషియాకు అనుమతించాలని ఆమె తల్లి 2014లో మోడీకి లేఖ రాశారు. తనకున్న దుర్భరమైన ఆర్థిక పరిస్థితుల దృష్ట్యా కారుణ్య మరణానికి అనుమతి ఇవ్వాలని ఆమె కోరారు. అనామికా మిశ్రా తండ్రి కూడా ఇదే సమస్యతో బాధపడుతూ ప్రాణాలు కోల్పోయాడు.

లెఫ్ట్ ఆగ్రహం

(మొదటిపేజీ తరువాయి)

పార్టీలు -సీపీఐ, సీపీఐ(ఎం), ఏఐఎఫ్‌బీ, ఆర్‌ఎస్‌పీ, సీపీఐ(ఎంఎల్), ఎస్‌యూసీఐ, సీజీపీఐ- శుక్రవారం పార్లమెంట్‌కు మార్చ్ నిర్వహించాయి. ఈ కార్యక్రమంలో కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. పార్లమెంట్‌కు చేరుకోకుండా వారిని పోలీసులు అడ్డుకున్నారు. పార్లమెంట్ స్ట్రీట్ వద్ద కార్యకర్తలు, మద్దతుదారులనుద్దేశించి నాయకులు ప్రసంగించారు. సీపీఐ(ఎం) మాజీ ప్రధాన కార్యదర్శి ప్రకాశ్ కారత్ మాట్లాడుతూ, త్రిపుర ఎన్నికలలో విజయం సాధించిన తరువాత బీజేపీ వామపక్షాలపై దాడులకు ప్రయత్నిస్తోందని విమర్శించారు. రాష్ట్రంలో వామపక్ష సంఘటనకు ఓటువేసిన వారిపై వేధింపులను ప్రారంభించిందని అన్నారు. "త్రిపురలో లెనిన్ విగ్రహాన్ని కూల్చివేసిన తరువాత బీజేపీ కార్యకర్తలు తమిళనాడులో పెరియార్ విగ్రహాన్ని ధ్వంసం చేశారు. ఉత్తరప్రదేశ్‌లో వారు రాజ్యాంగ నిర్మాత బీఆర్ అంబేద్కర్ విగ్రహాన్ని ధ్వంసం చేశారు. బీజేపీ అసహన ధోరణిని ఇది ప్రతిబింబిస్తోంది. ఏ ఇతర ఆలోచనా విధానాన్ని, హిందూత్వ మినహా ఇతర మతాలను సహించే పరిస్థితిలో వారు లేరు" అని కారత్ తెలిపారు.

సీపీఐ జాతీయ కార్యదర్శి డి. రాజా మాట్లాడుతూ, లెనిన్‌ను విదేశీయుడుగా పేర్కొంటూ బీజేపీ-ఆర్‌ఎస్‌ఎస్ శక్తులు సామాజిక మీడియాలో అసత్య ప్రచారం చేయడం వాటి దిగజారుడుతనానికి నిదర్శనంగా పేర్కొన్నారు. "మహాత్మాగాంధీ బోధనల నుంచి ప్రపంచ వ్యాప్తంగా ప్రజలు స్ఫూర్తి పొందారు. గాంధీజీ



విగ్రహాలు ప్రపంచ వ్యాప్తంగా ఉన్నాయి. విదేశీయుడని చెప్పి ఆయన విగ్రహాలను ఆయా దేశాలలో కూల్చివేస్తారా?" అని ప్రశ్నించారు. "భగత్‌సింగ్ సైతం స్వాతంత్ర్యోద్యమంలో లెనిన్ నుంచి స్ఫూర్తిని పొందాడు. లెనిన్ ఆయనను ప్రభావితం చేశారు. అదే సమయంలో సావార్కర్ హిట్లర్, ముస్సోలినిలను స్ఫూర్తిగా తీసుకున్నారు. అంబేద్కర్, పెరియార్ కూడా విదేశీయులేనా?" అని రాజా ప్రశ్నించారు. సీపీఐ(ఎంఎల్) నాయకులు కవితా కృష్ణన్ మాట్లాడుతూ, విదేశీయుడన్న కారణంతో లెనిన్ విగ్రహాన్ని కూల్చలేదని, అసమానతలకు, అట్టడుగు వారిని దోచుకోవడానికి వ్యతిరేకంగా ఆయన విలువలు నిలిచినందున కూల్చివేశారని చెప్పారు. సమానత్వం కోసం పోరాడుతారనే భయంతో లెనిన్ విగ్రహాన్ని కూల్చివేశారని విమర్శించారు.

నిర్మాణాలేవీ!?

(మొదటిపేజీ తరువాయి)

తర్వాత మరో 300 ఎకరాలను సమకూర్చేవిధంగా ఆయా సంస్థలతో అవగాహన ఒప్పందాలు కుదుర్చుకుంది. ప్రభుత్వ సంస్థలతోపాటు క్రీడాకారులకు భూమిని ఉచితంగా ఇచ్చింది. ప్రభుత్వ, ప్రైవేటు సంస్థలకు అందచేసిన భూమి ధర ఎకరానికి రూ. 10 లక్షల నుంచి గరిష్టంగా రూ. 4 కోట్లుగా నిర్ణయించింది. వెల్లూరు ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (విట్), ఎస్‌ఆర్‌ఎం యూనివర్సిటీలు మాత్రమే ఇక్కడ కార్యకలాపాలను ప్రారంభించాయి. మిగిలిన సంస్థలు భూములనైతే తీసుకున్నాయి కానీ ఎలాంటి నిర్మాణాలు చేపట్టకపోవడమే కాకుండా ఆయా మొత్తాలను సీఆర్‌డీఏకు చెల్లించని పరిస్థితి. మొత్తం 14 ప్రైవేటు సంస్థల్లో నాలుగు మాత్రమే భూముల ధరలు చెల్లించగా మిగిలిన 10 కంపెనీలు కొనుగోలు ధరలను చెల్లించడంలో మీనమేషాలు లెక్కిస్తున్నాయి. మరికొన్ని సంస్థలైతే నిర్దేశిత ధరలను చెల్లించినప్పటికీ నిర్మాణాలు చేపట్టకుండా విపరీతమైన తాత్సారం చేస్తున్నాయి. దీంతో సీఆర్‌డీఏ ఆయా సంస్థలకు నోటీసులివ్వాలని నిర్ణయించింది. ఇండో-యూకే ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ సంస్థకు మొదటి దశలో 50 ఎకరాలు, రెండో దశలో 100 ఎకరాలను కేటాయిస్తూ మున్సిపల్ పరిపాలన, పట్టణాభివృద్ధిశాఖ 2016 జూలై 4న జీవో జారీ చేసింది. ఈ సంస్థకు ఎకరం రూ. 50 లక్షల చొప్పున కేటాయించింది. అలాగే బీఆర్‌ఎస్ మెడిసిటీ, హెల్త్‌కేర్ రీసెర్చ్ ప్రైవేట్ లిమిటెడ్‌కు ఎకరం రూ. 50 లక్షల వంతున వంద ఎకరాలను అదే సంవత్సరం డిసెంబరు 13న కేటాయించింది. తీసుకున్న భూముల్లో సత్వరమే పనులు ప్రారంభించాలని ఆయా సంస్థలకు సీఆర్‌డీఏ అధికారులు నోటీసులు జారీ చేశారు. రాజధాని ప్రాంతంలో కేంద్ర ప్రభుత్వానికి సంబంధించి రెండు కేంద్రీయ విద్యాలయాల ఏర్పాటు కోసం ఐదు ఎకరాల చొప్పున కేటాయించారు. ఇందుకు సంబంధించిన ఒప్పంద పత్రాలనైతే 2017 జూలై 21న అందచేశారే కానీ ఇంతవరకూ కేంద్రం నుంచి ఏవిధమైన అనుమతులు రాలేదు. మరిన్ని కేంద్రప్రభుత్వ సంస్థలు జనాభా లేని కారణంగా కార్యకలాపాలు సాగవనే ఉద్దేశంతో నిర్మాణాలు చేపట్టలేదని తెలుస్తోంది.

భూములు పొందిన ముఖ్య ప్రభుత్వ, ప్రైవేటు సంస్థలు...

సంస్థ పేరు	కేటాయించిన భూమి(ఎకరాలు)	ధర (ఎకరం)
సెంట్రల్‌పబ్లిక్ వర్క్స్ డిపార్ట్‌మెంట్	28	రూ. 1 కోటి
రిజర్వ్‌బ్యాంకు ఆఫ్ ఇండియా	11	రూ. 1 కోటి
ఇండియన్ నేవీ	15	రూ. 1 కోటి
తపాలాశాఖ	5.50	రూ. 1 కోటి
భారతీయ స్టేట్ బ్యాంకు (ఎస్‌బీఐ)	3.30	రూ. 4 కోట్లు
ఆంధ్రాబ్యాంకు	2.65	రూ. 4 కోట్లు
బ్యాంకు ఆఫ్ ఇండియా	1.50	రూ. 4 కోట్లు
నాబార్డ్	4.30	రూ. 4 కోట్లు
కాగ్	17	రూ. 1 కోటి
ఆప్కాబ్	4	రూ. 2 కోట్లు
నందమూరి బసవతారక రామారావు క్యాన్సర్ ఫౌండేషన్	15	రూ. 25 లక్షలు
జేవియర్ స్కూల్ ఆఫ్ మేనేజిమెంట్	50	రూ. 10 లక్షలు
బ్రహ్మకుమారీస్ సొసైటీ	10	రూ. 10 లక్షలు
హైదరాబాద్ ఐ ఇన్‌స్టిట్యూట్	12	రూ. 25 లక్షలు
తిరుమల తిరుపతి దేవస్థానములు (టీటీడీ)	25	రూ. 50 లక్షలు

ఎల్లుండే అవిశ్వాసం

(మొదటిపేజీ తరువాయి)

తీర్మానం నిర్ణయం తీసుకున్నారని బొత్స తెలిపారు. 2016 సెప్టెంబర్‌లో కేంద్ర ఆర్థికమంత్రి అరుణ్ జైట్లీ ఏం చెప్పారో ఇప్పుడు అదే చెబుతున్నారు కానీ అప్పుడు ఆ విషయాన్ని స్వాగతించిన చంద్రబాబు ఇప్పుడు ఎన్నికల సమయం కాబట్టి మరోలా స్పందిస్తున్నారన్నారు.

చంద్రబాబుకు చిత్తశుద్ధి ఉంటే తమతో కలిసి రావాలని, లేకుంటే చంద్రబాబు అవిశ్వాసం పెడితే మేం మద్దతు ఇస్తామని బొత్స పేర్కొన్నారు. నిజానికి అవిశ్వాస తీర్మానం ప్రవేశపెట్టడానికి కనీసం 50 మంది సభ్యుల మద్దతు అవసరమని, వైసీపీకి ఐదుగురు సభ్యులే ఉన్నారు. లోక్‌సభ 198వ నిబంధనను అనుసరిస్తూ అవిశ్వాస తీర్మానం ప్రవేశపెట్టాలి.

ఈ నిబంధన ప్రకారం 50 మంది ఎంపీలు దానికి మద్దతిస్తే అవిశ్వాస తీర్మానంపై చర్చకు స్పీకర్ అంగీకరిస్తారు.

పోరాటం ఉధృతం

(మొదటిపేజీ తరువాయి)

గళాన్ని ఎవరు విన్పిస్తారు? ఎంపీలంతా రాజీనామాలు చేస్తే బీజేపీకి లాభం చేకూర్చడమే అవుతుంది. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ వైఖరి చూస్తుంటే ఇలాగే కనబడుతోంది" అని ప్రతిపక్షపార్టీ అవలంభిస్తున్న విధానాలను చంద్రబాబు వివరించారు. బీజేపీ విషయంలో మరింత దూకుడుగా వెళ్లాలని ఈ సందర్భంగా ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్య చౌదరి సూచించారు. ప్రత్యేక హోదా అంశంలో టీడీపీపై వస్తున్న విమర్శలకు గట్టిగా జవాబు ఇవ్వాలని మంత్రి సుజయ్‌కృష్ణ రంగారావు అన్నారు. ఎన్డీఏలో కొనసాగడంపై విమర్శలు వస్తున్నాయని పలువురు నేతలు అభిప్రాయం వ్యక్తం చేయగా, కేంద్రంపై ఒత్తిడి పెంచడానికి అంచలంచెలుగా వ్యూహాలు ఉంటాయని బాబు వివరించారు. ప్రజల అభిప్రాయాలకు అనుగుణంగానే అన్నీ జరుగుతాయని వ్యాఖ్యానించారు.

ఆ ముగ్గురూ రావాల్సిందే



(మొదటిపేజీ తరువాయి)

అంటూ కాలక్షేపం చేస్తున్నారని అన్నారు. ఈ నిర్లక్ష్యాన్ని ఎంతమాత్రం ప్రజలు క్షమించరని హెచ్చరించారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, వైసీపీ అధినేత జగన్‌మోహన్‌రెడ్డి, జనసేన నేత పవన్ కల్యాణ్ ఢిల్లీలో ధర్నా చేయటానికి ఎందుకు వెనుకాడుతున్నారని సూటిగా ప్రశ్నించారు. ఢిల్లీ వచ్చి ధర్నా చేయకపోతే వారు చరిత్రలో ద్రోహులుగా మిగిలిపోతారన్నారు. తాము ఆందోళన చేస్తుంటే ప్రభుత్వం అరెస్టులకు పాల్పడుతున్నదని, చర్చలకు కూడా పిలవకపోవటం దారుణమన్నారు. ఇద్దరు కేంద్ర మంత్రులు రాజీనామా చేసినా నరేంద్ర మోడీ సర్కారులో చలనం లేదన్నారు. టీడీపీ ఎన్‌డీఏ నుంచి వైదొలగి అన్ని రాజకీయ పార్టీలతో కలిసి ఆందోళన చేయాలని డిమాండు చేశారు. చలసాని శ్రీనివాస్ మాట్లాడుతూ హోదా విషయంలో కేంద్రం చేస్తున్న మోసపూరిత విధానాలను తీవ్రంగా ఖండిస్తున్నట్లు చెప్పారు. బీజేపీ పునరాలోచన చేసుకుని ప్రత్యేక హోదాపై నిర్ణయం తీసుకోవాలని లేకుంటే ప్రజల క్షమించరని హెచ్చరించారు. జర్నలిస్ట్ అసోసియేషన్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ నాయకులు కృష్ణాంజనేయులు మాట్లాడుతూ హోదాపై పార్లమెంటులో ఇచ్చిన వాగ్దానాలను కేంద్ర ప్రభుత్వం అమలు చేయాలన్నారు. పెండింగ్‌లో ఉన్న విభజన హామీలన్నింటిని వెంటనే అమలు చేసి ఆంధ్రప్రదేశ్‌ను ఆదుకోవాలని డిమాండు చేశారు. ప్రత్యేక హోదాతోనే ఆంధ్రప్రదేశ్‌కు న్యాయం జరుగుతుందని, ఈ విషయంలో రాజకీయ పార్టీలన్నీ ఏకమై కేంద్రంపై ఒత్తిడి తేవాలని కోరారు. ఆందోళనలో ఆంధ్రప్రదేశ్‌లోని వివిధ జిల్లాలకు చెందిన జర్నలిస్టులు పాల్గొన్నారు.

మంటలే మంటలు

(మొదటిపేజీ తరువాయి)

8 రోజులు రాయలసీమలో వడగాడ్పుల ప్రభావం ఉందన్నారు. 2017లో 10 రోజుల పాటు కోస్తా జిల్లాల్లో , రెండు రోజుల పాటు రాయలసీమలో వడగాడ్పులు వీచినట్లు తెలిపారు. 2015 లో 2200 మంది వడగాడ్పుల భారీనపడి చనిపోగా, 2016లో 800 మంది మృత్యు వాత పడ్డారని వారు వివరించారు. ఇదే క్రమంలో 2017వ సంవత్సరంలో 200 మంది మాత్రమే మరణించారని తెలిపారు. ప్రభుత్వం ప్రజలలో ముందస్తు అవగాహన కల్పించటం వలనే వడగాడ్పుల మరణాలు తగ్గాయని చెప్పారు. 2013 లో జాతీయ హీట్ ప్లాన్ తయారు చేస్తే , 2016లో రాష్ట్రంలో హీట్ యాక్షన్ ప్లాన్ తయారు చేసినట్లు తెలిపారు.

రాష్ట్రంలో 30 నుంచి 40 రోజులు వడగాడ్పులు : నవ్యాంధ్రలో ఈ ఏడాది వడగాడ్పుల ప్రభావం అత్యధికంగా ఉంటుందని. భారత వాతావరణ శాఖ (ఐఎండీ) డైరక్టర్ వైకె రెడ్డి చెప్పారు. రానున్న మూడు నెలలు వేసవి గాలులు తీవ్ర ప్రభావం చూపనున్నట్లు తెలిపారు. అయితే గత కాలపు అనుభవాలను తారుమారు చేస్తూ ఈసారి రాయలసీమలో వడగాడ్పుల ప్రభావం తక్కువ ఉంటుందని చెప్పారు.

నెల్లూరు , ఉభయ గోదావరి జిల్లాలు , క ృష్ణ, గుంటూరు, ప్రకాశం జిల్లాల్లో వేసవి ఎండలు అత్యధిక స్థాయిలో ప్రభావం చూపుతామని తెలిపారు. రామన్న 48 గంటల్లో ఏ మోతాదులో వేసవి గాలులు వీస్తాయనే అంశంపై ముందుగా సమాచారం కోసం తమ శాఖ వద్ద సాంకేతిక పరిజ్ఞానం ఉందని తెలిపారు. ప్రతిరోజూ వేసవి ఎండల ప్రభావాన్ని, శాతాలను ఆయా జిల్లాల కలెక్టర్లకు , ఇతర అధికార్లుకు ,మీడియాకు తెలుపుతామని చెప్పారు. వేసవిలో జాగ్రత్తలు తీసుకుని వడగాడ్పుల భారీనపడకుండా ఆరోగ్యాన్ని పరిరక్షించుకోవాలని సూచించారు. వడగాడ్పులు ఇంతగా వీయడానికి గ్లోబల్ వార్మింగ్ పెరిగిపోవడం ఒక కారణం కాగా అడవులు నరికివేయటం మరో కారణంగా చెప్పారు. కాలుష్యం తగించుకోకపోతే భవిష్యత్తు తరాల వారు ఇబ్బందులు ఎదుర్కోక తప్పదని వ్యాఖ్యానించారు పల్లెటూరి వాతావరణం మాదిరిగా భారీగా చెట్లు పెంచుకొని వాతావరణంలో వచ్చే మార్పుల నుంచి ఆరోగ్యాన్ని రక్షించుకోవాలని సూచించారు. వాతావరణంలో వస్తున్న మార్పులను ఎప్పటికప్పుడు సర్కార్‌కి తెలియ చేస్తామన్నారు. మీడియా ద్వారా ప్రజల్లో విస్తృత అవగహన కల్పించి వడగాడ్పులపై ప్రతి ఒక్కరిని అప్రమత్తం చేసేందుకు కృషి చేస్తున్నామన్నారు. ఒకేసారి లక్ష మందికి మెస్సేజ్ పంపించే సౌకర్యం తమ వద్ద ఉందని చెప్పారు. దేశం మొత్తం మీద రాజస్థాన్ , ఒడిశా, గుజరాత్ వంటి అనేక రాష్ట్రాల్లో వడగాలుల ప్రభావం అత్యంత తీవ్రంగా ఉంటుందని తెలిపారు. ఎండ తీవ్రంగా ఉన్నప్పుడు జాగ్రత్తలు తీసుకొని ప్రయాణించాలని లేకపోతే వడదెబ్బకు గురికావాల్సిన పరిస్థితి ఏర్పడుతుందని హెచ్చరించారు. ప్రజల సంక్షేమాన్ని కాంక్షించి వేసవి వడగాడ్పుల సమాచారాన్ని నిత్యం ప్రజలకు సమాచార మాధ్యమాల ద్వారా తెలియ చేస్తామని వెల్లడించారు. వాతావరణ శాఖ ప్రజలను అప్రమత్తం చేసే దానిలో ముందుందని తెలిపారు. వడగాలులపై అప్రమత్తంగా ఉండాలనే సూచనలు తెలియచేసే పోస్టర్ లను ఆవిష్కరించారు. ఈ సమావేశంలో ఏపీఎస్ డీపీఎస్ శాస్త్రవేత్త రమణమూర్తి ,కిషన్ తదితరులు పాల్గొన్నారు.

వెబ్‌సైట్లో టెన్త్ హాల్‌టిక్కెట్లు

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: పదో తరగతి పరీక్షల హాల్‌టిక్కెట్లను వెబ్‌సైట్లో అధికారులు అందుబాటులో వుంచారు.ఈ నెల 15వ తేదీ నుంచి 29వ తేదీ వరకూ ప్రతిరోజూ ఉదయం 9.30 గంటల నుంచి మధ్యాహ్నం 12.15 గంటల వరకూ పదో తరగతి పరీక్షలను నిర్వహించనున్నారు. పరీక్షలకు హాజరవుతున్న విద్యార్థులంతా 'డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ.బీఎస్‌సీఏపీ.ఓఆర్‌జి' వెబ్‌సైట్ నుంచి డౌన్‌లోడు చేసుకోవాలని పరీక్షల విభాగం డైరెక్టర్ వీఎస్ భార్గవ పేర్కొన్నారు.హాల్‌టిక్కెట్లలో పొరపాట్లు, ఇతర తప్పిదాలుంటే..సంబంధిత పాఠశాల ప్రధానోపాధ్యాయుని నుంచి ఎటెస్ట్ చేయించుకోవాలని సూచించారు.

12 నుంచి ఒంటిపూట బడులు

ఉత్తుర్వ్యులు జారీ చేసిన పాఠశాల విద్యాశాఖ కమిషనర్

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: రాష్ట్ర వ్యాప్తంగా అన్ని పాఠశాలల్లో 2017-18 విద్యా సంవత్సరానికిగాను ఈ నెల 12 నుంచి ఒంటిపూట బడులు నిర్వహించనున్నారు.ఈ మేరకు పాఠశాల విద్యశాఖ కమిషనర్ కె.సంధ్యారాణి శుక్రవారం అన్ని జిల్లాల డీఈవోలకు ఉత్తర్వులు జారీ చేశారు. వేసవి ఆరంభంతో విద్యార్థుల ఆరోగ్యాన్ని దృష్టిలో వుంచుకుని ఒంటిపూట బడులను ఏర్పాటు చేస్తు న్నారు.రాష్ట్రంలోని ఆర్జేడీలు, డీఈవోలు ఈ నెల 12 నుంచి ఒంటిపూట బడుల నిర్వహణకు చర్యలు తీసుకోవాలని ఆమె అదేశించారు. ప్రతిరోజూ ఉదయం 7.45 గంటల నుంచి 12.30 గంటల వరకూ నిర్వహిస్తారు. ఈ నెల 15 నుంచి పదో తరగతి పరీక్షలు కొనసాగనున్నాయి.ఈ పరీక్షా కేంద్రాలున్న పాఠశాలల్లో మధ్యాహ్నం 2 గంటల నుంచి 5 గంటల వరకూ తరగతులను ఏర్పాటు చేస్తారు.



జనసేనలోకి గంగాధరం

మహాసభ బాధ్యతలను అప్పగించిన పవన్

విశాలాంధ్ర బ్యూరో-హైదరాబాద్ : జనసేన అవిర్భావ దినోత్సవ మహాసభ పర్యవేక్షణ బాధ్యతలను మాదాసు గంగాధరంకు అప్పగించినట్లు జనసేన అధినేత పవన్‌కళ్యాణ్ ప్రకటించారు. సుదీర్ఘకాలంగా ప్రజాక్షేత్రంలో వుండి ఎమ్మెల్సీగా రెండు దఫాలు పనిచేసిన గంగాధరం శుక్రవారం పవన్ అధ్వర్యంలో పార్టీలో చేరారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ, గంగాధరం తమ కుటుంబ మిత్రుడని, 30 ఏళ్ల క్రితం నుండే వారితో తనకు పరిచయం ఉన్నట్లు చెప్పారు. ఎమ్మెల్సీగా, ఏపీ పోలీస్ హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్‌గా పనిచేసిన అనుభవం ఆయనకు ఉందని గుర్తు చేశారు. తన ఆహ్వానం మేరకు ఆయన పార్టీలో చేరారని, మున్ముందు ఆయన సలహాలు, సూచనలు తీసుకుని ముందుకు సాగుతామని అన్నారు. ఈనెల 14వ తేదీన గుంటూరులో నిర్వహించే జనసేన అవిర్భావ దినోత్సవ మహాసభ పర్యవేక్షకుడిగా బాధ్యతల్ని ఆయనకి అప్పగించినట్లు తెలిపారు. గంగాధరం మాట్లాడుతూ, గత సంవత్సర కాలంగా రాజకీయాలకు దూరంగా ఉన్నానని, పవన్ పిలుపుమేరకు జనసేనలో చేరినట్లు వెల్లడించారు. ఆయన నిబద్ధత తనకు తెలుసని, పవన్ తండ్రి వెంకట్రావు నెల్లూరులో ఉద్యోగం చేస్తున్న నాటి నుండే వారి కుటుంబంతో తనకు పరిచయం ఉందన్నారు. ఆయన నాకు ఏ బాధ్యతలు ఇచ్చినా తీసుకుంటానని, పార్టీ ప్రతి కార్యకర్తకి ఒక సోదరుడిలా అండగా ఉంటానని హామీ ఇచ్చారు.

తటస్థుడే కీలకం ?

- 1982 రాయపాటి ఎన్నిక ఫార్ములా అమలుపై టీడీపీ వ్యూహం
- రాజ్యసభ ఎన్నికల్లో మూడో అభ్యర్థిపై తర్జనభర్జన

విశాలాంధ్ర-అమరావతి : రాజ్యసభ ఎన్నికల నామినేషన్ల గడువు మరో 48 గంటల్లో ముగియనుంది. తెలుగుదేశం పార్టీ అధిష్టానం అభ్యర్థుల ఎంపికపై కసరత్తు ప్రారంభించింది. ఎన్నికలు జరగనున్న మూడు స్థానాలకూ అభ్యర్థులను రంగంలోకి దించే విషయంపై ఆ పార్టీ అగ్రనేతల్లో తర్జనభర్జనలు జరుగుతున్నాయి. రెండు స్థానాలకు పార్టీ అభ్యర్థులను రంగంలోకి దించి, మూడవస్థానానికి తటస్థుడు పోటీ చేస్తే టీడీపీకి ఉన్న మిగులు ఓట్లను ఆ అభ్యర్థికి కేటాయించి వైసీపీని రాజకీయంగా దెబ్బతీయాలన్న వ్యూహం కూడా నడుస్తున్నట్లు తెలుస్తోంది. 1982 రాజ్యసభ ఎన్నికల్లో ఇండిపెండెంట్‌గా నామినేషన్ దాఖలు చేసి పోటీ చేసిన రాయపాటి సాంబశివరావుకు ఆ సమయంలో ముఖ్యమంత్రిగా ఉన్న భవనం వెంకట్రామ్ కాంగ్రెస్ మిగులు ఓట్లను కేటాయించేలా చేశారు. ఇతర పార్టీ సభ్యుల మద్దతు కూడగట్టుకున్న రాయపాటి ఆ ఎన్నికల్లో తొలిసారి రాజ్యసభకు ఎన్నికయ్యారు. ఇదే వ్యూహాన్ని అమలు చేస్తే ఎలా ఉంటుందన్న దానిపై టీడీపీ అధిష్టానంలో చర్చ సాగుతున్నట్లు తెలుస్తోంది. మూడవ అభ్యర్థిగా పార్టీ నాయకుడుని రంగంలోకి దించాలా, ఎవరన్నా ఇండిపెండెంట్‌గా పోటీ చేస్తే మద్దతు పలకాలా అన్న అంశంపై చంద్రబాబు నాయుడు ఎటూ తేల్చుకోలేకపోతున్నట్లు తెలుస్తోంది. ఒకవైపు కేంద్ర ప్రభుత్వాన్ని తెలుగుదేశం పార్టీ ఢీ కొంటోంది. ఏపీ హక్కుల సాధనకు పార్లమెంటు వేదికగా కేంద్రంపై టీడీపీ పోరాటం చేస్తోంది. దీంతో టీడీపీ, బీజేపీల మధ్య బంధం తెగినట్టే. తాము ఎన్‌డీఏలో కొనసాగుతున్నామని చంద్రబాబు చెప్పుకొస్తున్నారు. మిత్ర బంధం తెగిపోయి రాజకీయాలు క్షణక్షణానికి మారుతున్న ఈ తరుణంలో రాజ్యసభ ఎన్నికలు జరుగుతున్నాయి. శాసనసభలో బలాబలాలను బట్టి రెండు టీడీపీకి, ఒకటి వైసీపీకి దక్కుతాయి. మూడవస్థానానికి కూడా అభ్యర్థిని నిలబెట్టి వైసీపీని రాజకీయంగా దెబ్బతీయాలన్న ఆలోచనలో టీడీపీ ఉంది. ఈ పరిస్థితుల్లో మూడవ అభ్యర్థిని నిలబెట్టడంపై టీడీపీ అధిష్టానంలో భిన్నాభిప్రాయాలు వ్యక్తమవుతున్నట్లు తెలుస్తోంది. పార్టీ అభ్యర్థిని నిలబెట్టాలా లేకుంటే తటస్థుడు ఇండిపెండెంట్‌గా పోటీ చేస్తే టీడీపీకి ఉన్న మిగులు ఓట్లను ఆ అభ్యర్థికి కేటాయించి మద్దతు పలకాలా అన్న అంశంపై ఒక నిర్ణయానికి రాలేకపోతోంది. మొత్తం 175 మంది ఎమ్మెల్యేలలో 105మంది టీడీపీ, 44మంది వైసీపీ, 22 మంది వైసీపీ నుంచి టీడీపీలోకి చేరిన వారు, నలుగురు బీజేపీకి చెందినవారు ఉన్నారు. టీడీపీ బలం 127. బీజేపీ, టీడీపీ అధికారం నుంచి విడిపోయినా ఎన్‌డీఏలో భాగస్వాములుగా ఉన్నాయి. బీజేపీకి చెందిన నలుగురు ఎమ్మెల్యేలు కూడా టీడీపీకి అండగా ఉంటే టీడీపీ బలం 131కి చేరుతుంది. ఒక్కో రాజ్యసభ అభ్యర్థికి 45 మొదటి ప్రాధాన్యత ఓట్లు లభిస్తే ఆ అభ్యర్థి గెలిచినట్లే. ఆ లెక్కన టీడీపీకి చెందిన ఇద్దరు



అభ్యర్థులు సులభంగా గెలుస్తారు. టీడీపీ, బీజేపీలకు కలిపి మిగులు ఓట్లు 41 ఉంటాయి. వైసీపీ బలం 44. ఇప్పటికే ఆ పార్టీ అభ్యర్థిగా ప్రముఖ పారిశ్రామికవేత్త వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి నామినేషన్ దాఖలు చేశారు. వైసీపీ నుండి ఇద్దరు ఎమ్మెల్యేలు పార్టీ ఫిరాయిస్తే వైసీపీ అభ్యర్థి ఓడిపోతారు. ఈ వ్యూహంలో భాగంగా వైసీపీకి చెందిన ఇద్దరు ఎమ్మెల్యేలు టీడీపీలో చేరనున్నట్లు ప్రచారం ప్రారంభమైంది. ఆ ఇద్దరూ వస్తున్నందునే టీడీపీ మూడవ అభ్యర్థిని నిలబెట్టే ఆలోచన చేస్తోంది. తీరా అధికారికంగా మూడవ అభ్యర్థిని నిలబెట్టిన తర్వాత బీజేపీ సభ్యులు ఎదురుతిరిగితే ఏమి చేయాలన్న దానిపై చంద్రబాబు ఏ నిర్ణయానికి రాలేకపోతున్నట్లు సమాచారం. అందుకే వైసీపీ నుండి కొందరు ఎమ్మెల్యే మద్దతు కూడగట్టుకొనే సమర్థుడైన తటస్థుడు నామినేషన్ వేసే పక్షంలో మిగులు ఓట్లను ఆయనకి కేటాయించి మద్దతు పలకాలన్న వ్యూహం నడుస్తోంది. తటస్థుడుగా నామినేషన్ వేసే అభ్యర్థి ఎవరన్నది టాప్ సీక్రెట్‌గా నడుస్తోంది. వైసీపీ నుండి ఎమ్మెల్యేలు పార్టీ ఫిరాయించినా నామినేషన్‌కు ముందురోజే బయటకు రావాలి. వైసీపీకి చెందిన ఇద్దరు ఎమ్మెల్యేలకు మంత్రి పదవులు కూడా ఇస్తామని టీడీపీ బంపర్ ఆఫర్ ఇచ్చినట్లుగా రాజకీయవర్గాల్లో జోరుగా ప్రచారం సాగుతోంది. టీడీపీ రాజ్యసభ స్థానాలు సులువుగా గెలుచుకొనే రెండు స్థానాల కోసం సిట్టింగ్ ఎంపీ సీఎం రమేష్, మాజీ ఎంపీ కంభంపాటి రామమోహన్‌రావు, రిలయన్స్ మాధవ్ ఓసీ ప్యానల్‌లో, బీసీ కోటాలో ఆర్థిక మంత్రి యనమల రామకృష్ణుడు, బీదా మస్తాన్‌రావు, ఎస్సీ కోటాలో డొక్కా మాణిక్యవరప్రసాద్, వర్ల రామయ్య, నల్లగట్ల స్వామిదాసు, సుధారాణి, మాజీ ఎమ్మెల్యేలు హేమలత (చిత్తూరు), మసాల పద్మజ (కర్నూలు) పేర్లు పార్టీ అధిష్టానం పరిశీలిస్తోంది. 2014 ఎన్నికల్లో కాకినాడ పార్లమెంట్‌కు వైసీపీ అభ్యర్థిగా పోటీ చేసి ఓడిపోయిన చలమలశెట్టి సునీల్ శనివారం టీడీపీ సీనియర్ నాయకులను కలవనున్నట్లు సమాచారం. ఆయన ఇండిపెండెంట్‌గా రాజ్యసభకు నామినేషన్ దాఖలు చేసేందుకే టీడీపీనేతలను కలుస్తున్నారని ప్రచారం జరుగుతోంది. టీడీపీ అభ్యర్థుల ఎంపిక ఆదివారం జరగనున్న పొలిట్‌బ్యూరో సమావేశంలో ఖరారు కానున్నట్లు సమాచారం. మూడు స్థానాలకు నాల్గవ అభ్యర్థి రంగంలోకి దిగితే ఎన్నికల రాజకీయం రసవత్తరంకానున్నది.



కేంద్ర ప్రభుత్వ వైఖరికి నిరసనగా

13న రాష్ట్రవ్యాప్త నిరసన, ర్యాలీ

ఏపీఎన్‌జీఓ రాష్ట్ర అధ్యక్షుడు అశోక్ కుమార్

విశాలాంధ్ర బ్యూరో - కడప : రాష్ట్ర విభజన చట్టంలోని హామీలను అమలుపరచడంలో కేంద్ర ప్రభుత్వం చూపుతున్న నిర్లక్ష్య వైఖరికి నిరసనగా ఈ నెల 13 నుంచి రాష్ట్ర వ్యాప్తంగా అన్ని జిల్లా కేంద్రాలలో నిరసన ర్యాలీ నిర్వహిస్తున్నామని ఆంధ్రప్రదేశ్ ఎన్‌జీఓ సంఘం రాష్ట్ర అధ్యక్షులు అశోక్ కుమార్ తెలిపారు. ఇందులో భాగంగా సాయంత్రం 4 గంటల నుంచి 6 గంటల వరకు ర్యాలీలు నిర్వహిస్తామన్నారు. ఈ కార్యక్రమాల్లో రాజకీయాలకు అతీతంగా అన్ని వ్యవస్థలు పాల్గొనాలని ఆయన పిలుపునిచ్చారు. జిల్లా ఎన్‌జీఓ కార్యాలయంలో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్రం విడిపోయాక రాష్ట్ర ఆర్థిక పరిస్థితి, ఉద్యోగుల ఆర్థిక పరిస్థితి ఉద్యోగులకు తప్ప ప్రజలకు తెలియదన్నారు. ఆర్థిక శాఖ అధికారులను తరచూ కలుస్తుండటంతో తమకు రాష్ట్ర ఆర్థిక పరిస్థితి అర్థమవుతోందన్నారు. 11 పీఆర్సీ ఏర్పాటు చేయాలని, 10వ పీఆర్సీ అరియర్స్ వెంటనే చెల్లించాలని ప్రభుత్వంతో చర్చించామని, రూ.3,900 కోట్లు అరియర్స్ బకాయిలు ఉన్నాయన్నారు. రాష్ట్రానికి కేంద్రం సహాయం లేక పోవడంతో సామాజిక బాధ్యతతో రాష్ట్రం తరపున పోరాటం చేసేందుకు సిద్ధంగా ఉన్నామన్నారు. ఉమ్మడి రాష్ట్రంలో వేసిన పీఆర్సీ కారణంగా తెలంగాణ ఉద్యోగులతో పాటు ఫిట్‌మెంట్ ఇచ్చామని కేంద్రానికి తెలిపిందన్నారు. కాంట్రిబ్యూటరీ పెన్షన్ స్కీంపై కేంద్రం నిర్ణయం తీసుకోవాల్సి ఉంటుందని సీఎం చెప్పారన్నారు. దేశ వ్యాప్తంగా 50 లక్షల మంది కాంట్రిబ్యూటరీ పెన్షన్ స్కీంలో వున్నారని,తక్షణమే సీపీసీ విధానాన్ని నిలిపివేసి గతంలోని పెన్షన్ విధానాన్నే అమలు చేయాలని, ఇందుకోసం కేంద్రపై ఒత్తిడి తెచ్చేందుకు దేశ వ్యాప్తంగా ఉద్యమాలు ఉధృతం చేస్తామని, ఈ విషయంలో తగ్గే ప్రసక్తే లేదన్నారు. ఈ సమావేశంలో ఏపీ ఎన్‌జీఓ అధ్యక్ష కార్యదర్శులు శివారెడ్డి, శ్రీనివాసులు పాల్గొన్నారు.



ఏపీ అభివృద్ధికి బీజేపీ కట్టుబడి ఉంది: పురంధేశ్వరి

విశాలాంధ్ర బ్యూరో - అమరావతి : ఆంధ్రప్రదేశ్ అభివృద్ధికి బీజేపీ కట్టుబడి ఉందని ఆపార్టీ మహిళా మోర్చా జాతీయ ఇన్‌చార్జి దగ్గుబాటి పురందేశ్వరి స్పష్టం చేశారు. బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో శుక్రవారం జరిగిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడుతూ రాష్ట్రాభివృద్ధికి పునర్విభజన చట్టంలో పేర్కొన్న అంశాలన్నీ అమలుచేస్తామన్నారు. అయితే రాష్ట్రాభివృద్ధికి కేంద్రం ఇస్తున్న సహకారంపై దుష్ప్రచారం జరుగుతోందన్నారు. ప్రత్యేకహోదా వల్ల కేంద్ర ప్రాయోజిత పథకాల్లో 90 శాతం నిధులు రాష్ట్రాలకు వస్తాయని, హోదా లేని రాష్ట్రాలకు 60 శాతం నిధులు వస్తాయన్నారు. హోదాలో పారిశ్రామిక పన్ను రాయితీలు, ప్రోత్సాహకాలు కూడా ఉంటాయని భావించడం పొరబాటన్నారు. ప్రత్యేక పరిస్థితుల్లోనే పన్ను రాయితీలు, ప్రోత్సాహకాలను కొన్ని రాష్ట్రాలకు అదనంగా ఇచ్చిన విషయాన్ని ఆమె గుర్తుచేశారు. రాష్ట్రంలోని వెనుకబడిన జిల్లాల్లో ఏర్పాటు చేయనున్న పరిశ్రమలకు రాయితీలు, ప్రోత్సాహకాలను ఇప్పటికే కల్పించామన్నారు. రాజధాని నిర్మాణానికి రూ.2,500 కోట్లు ఇచ్చామని చెబుతూ ఆ పనులు ఎంత వరకు అమలు జరుగుతున్నాయో పరిశీలించాలని ఆమె కోరారు. జాతీయ విద్యా సంస్థల ఏర్పాటుకు అనుమతులిచ్చి వాటిలో విద్యార్థుల ప్రవేశానికి అవకాశమిచ్చిన ఘనత తమ ప్రభుత్వానికే చెందుతుందన్నారు. అన్నీ ఇస్తున్నా.. ఏమీ ఇవ్వడం లేదని రాజకీయ పక్షాలు అసత్య ప్రచారం చేయడం సరికాదని పురంధేశ్వరి ఆందోళన వ్యక్తం చేశారు. సమావేశంలో బీజేపీ ఎస్సీ మోర్చా రాష్ట్ర అధ్యక్షులు దారా సాంబయ్య, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు రామినేని వెంకటకృష్ణ, రాష్ట్ర మీడియా ఇన్‌ఛార్జి పి దిలీప్ పాల్గొన్నారు.

బడ్జెట్‌లో చేనేత రంగానికి మొండిచేయి

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్టులో చేనేత రంగానికి మొండిచేయి చూపారని వైసీపీ చేనేత విభాగం రాష్ట్ర అధ్యక్షులు చిల్లపల్లి మోహనరావు విమర్శించారు. విజయవాడ వైసీపీ రాష్ట్ర కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. దేశంలో వ్యవసాయ తర్వాత చేనేతే అతిపెద్ద పరిశ్రమగా వుందని, రాష్ట్ర జనాభాలో 12శాతం మంది చేనేత రంగంపై ఆధారపడి జీవిస్తున్నారని చెప్పారు.చేనేత రంగంపై రాష్ట్ర ప్రభుత్వం తీవ్ర వివక్షత చూపిందని ఆయన మండిపడ్డారు.

రాయలసీమ వర్శిటీ మెంబరు నియామకానికి నోటిఫికేషన్

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: కర్నూలు రాయలసీమ యూనివర్శిటీలో ఎగ్జిక్యూటివ్ మెంబరు నియామకానికి ప్రభుత్వం నోటిఫికేషన్ విడుదల చేసింది.ఈ మేరకు శుక్రవారం స్పెషల్ చీఫ్ సెక్రటరీ ఆదిత్యనాథ్ దాస్ జీవో విడుదల చేశారు.కర్నూలు ప్రభుత్వ డిగ్రీ కళాశాల కామర్స్ లెక్చరర్ శివశంకర్‌ను మెంబరుగా ఎంపిక చేయాలని అధికారులకు ఉత్తర్వులు జారీ చేశారు.

గుంటూరులో అదుపులోకిరాని డయేరియా

- పెరుగుతున్న రోగుల సంఖ్య
- ప్రభుత్వ, ప్రైవేట్ ఆసుపత్రులలో వెయ్యిమంది రోగులు
- ఇప్పటివరకు తొమ్మిదిమంది ఉద్యోగులపై వేటు
- కీలక అధికారులపై చర్యలేవి?

విశాలాంధ్రబ్యూరో-గుంటూరు : గుంటూరు నగరంలో డయేరియా అదుపులోకి రాలేదు. గత ఆరురోజుల నుంచి డయేరియా కేసులు నమోదు అవుతున్నాయి. డయేరియా సోకి ఇప్పటివరకు పదిమంది మృతిచెందారు. దాదాపు వెయ్యిమంది రోగులు ప్రభుత్వ, ప్రైవేట్ ఆసుపత్రులలో చికిత్స పొందుతున్నారు. గుంటూరు నగరంలో తాగునీరు కలుషితం అవ్వడం వలన డయేరియా విజృంభిస్తున్నది. డయేరియాను అదుపులోకి తీసుకురావడానికి వైద్యులు, అధికారులు విశ్వప్రయత్నాలు చేస్తున్నారు. ఒక ప్రాంతంలో కొంత వరకు నియంత్రణలోకి వస్తే మరొ ప్రాంతం నుంచి కేసులు నమోదు అవుతున్నాయి. ఇలా డయేరియా సోకిన సంఖ్య రోజురోజుకు పెరుగుతూ వస్తోంది. ఒక్క గుంటూరు ప్రభుత్వ ఆసుపత్రిలో శుక్రవారం 134 మంది రోగులు చేరారు. వసంతరాయపురం, రామిరెడ్డితోట, శారదాకాలనీ, నల్లచెరువు ప్రాంతాల నుంచి ఎక్కువగా వచ్చి చేరారు. కేవలం అధికారుల నిర్లక్ష్యం వల్లే డయేరియా సోకుతున్నదని ప్రతిపక్షాల నాయకులు విమర్శిస్తున్నారు. దీనికి కారకులైన అధికారులు అందరిపైనా చర్యలు తీసుకోవాలని డిమాండు చేస్తున్నారు. ఇప్పటివరకు కేవలం ఏడుగురు ఉద్యోగులను సస్పెండ్ చేశారు. మరొ ఇద్దరు ఉద్యోగులను సరెండర్ చేశారు. కానీ నగరపాలకసంస్థలో కీలకమైన అధికారులపై చర్యలు తీసుకోలేదని స్థానికులు విమర్శిస్తున్నారు.



నగరపాలకసంస్థలో ముదిరిన అవినీతి జబ్బు

గుంటూరు నగరపాలకసంస్థలో అవినీతి పెచ్చురెల్లుతున్నది. ఇక్కడ అన్ని స్థాయిలలో అవినీతి రాజ్యమేలుతోంది. అధికారులు అక్రమంగా డబ్బు సంపాదించడానికి చూపేంచే ఆసక్తి ప్రజలకు సేవలు అందించడానికి చూపించడంలేదనే విమర్శలు ఉన్నాయి. దీనివలన ప్రజల ప్రాణాలు గాలిలో కలిసిపోతున్నాయి. ఐఏఎస్ అధికారుల పాలన కంటే గ్రూప్-1 అధికారుల పాలనలో అక్రమాలు ఎక్కువగా జరుగుతున్నాయనే ఆరోపణలు ఉన్నాయి. రాజకీయ నేతల అండదండలతో చిరుఉద్యోగులు సైతం విధుల్లో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. పైగా పెద్దఎత్తున అక్రమాలకు పాల్పడుతున్నారు. లేబర్‌సెస్ చెల్లింపుల్లో నకిలీ పన్ను రసీదులు పెట్టి రూ.5కోట్లు ఆదాయాన్ని గండికొట్టారు. నకిలీ టీడీఎస్ బాండ్ల కుంభకోణంలో పెద్దఎత్తున సొమ్ములు కాజేశారు. భూగర్భడ్రైనేజీ పనుల్లో నాణ్యతపై ఆరోపణలు రావడంతో విజిలెన్సు అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు రంగంలోకి దిగి నాణ్యతను పరీక్షిస్తున్నారు. పట్టణ ప్రణాళికా విభాగంలో అవినీతికి అడ్డులేకుండా పోయింది. ఇక్కడ అధికారుల చేయి తడపందే ఏపనులు కావు. ఇలా అన్ని విభాగాల్లో అవినీతి పేరుకుపోయింది. వీటిని ప్రక్షాళన చేయాల్సివుంది.

ఏపీ టెట్ మార్కులకు వెయిటేజీ ఇలా..

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: ఏపీ టెట్(ఉపాధ్యాయ అర్హత పరీక్ష)లో అభ్యర్థులు సాధించిన ప్రతి మార్కుకూ వెయిటేజీ వస్తుంది. టెట్ పేపర్-1, పేపర్-2, పేపర్-3 పరీక్షను మూడు విభాగాలలో పాఠశాల విద్యాశాఖ కమిషన్ నిర్వహించింది.మొత్తం 150 ప్రశ్నలకుగాను 150 మార్కులుంటాయి. ప్రతి పేపరులోనూ 1 నుంచి 59 మార్కుల వరకూ వెయిటేజీ మార్కులను ప్రకటించరు. 60 మార్కులకు వెయిటేజీ 8.00 నుంచి 150 మార్కుల (20 వెయిటేజీ) వరకూ ప్రతి మార్కునకూ వెయిటేజీ వుంటుంది.

15 ప్రశ్నల కరెక్టు జవాబులకు రెండు మార్కుల వెయిటేజీ లభిస్తుంది. ఈ నెల 9 సాయంత్రం 5 గంటలతో ఏపీ టెట్ అభ్యంతరాలపై గడువు ముగిసింది.మూడు పేపర్ల నుంచి 16 వేలకు పైగా అభ్యంతరాలు అధికారులకు అందాయి. ఈ నెల 21 నుంచి మార్చి 2వరకూ ప్రతిరోజూ సెషన్లు, సబ్జెక్టుల వారీగా ప్రశ్నాపత్రాల్ని, కీ వివరాల్ని పాఠశాల విద్యాశాఖ కమిషన్ వెబ్‌సైట్లో పొందుపరిచారు.61 నుంచి 150 మార్కులకు లభించే వెయిటేజీ వివరాలిలా వున్నాయి.

మార్కులు-వెయిటేజీ :

61 మార్కులకు-8.13 వెయిటేజీ, 62-8.27, 63-8.40, 64-8.53, 65-8.67, 66-8.80, 67-8.93, 68-9.07, 69-9.20, 70-9.33, 71-9.47, 72-9.60, 73-9.73, 74-9.87, 75-10.00, 76-10.13, 77-10.27, 78-10.40, 79-10.53, 80 మార్కులకు-10.67 వెయిటేజీ వస్తుంది.

81 మార్కులకు-10.80 వెయిటేజీ, 82-10.93, 83-11.07, 84-11.20, 85-11.33, 86-11.47, 87-11.60, 88-11.73, 89-11.87, 90-12.00, 91-12.13, 92-12.27, 93-12.40, 94-12.53, 95-12.67, 96-12.80, 97-12.93, 98-13.07, 99-13.20, 100-13.33.

101 మార్కులకు-13.47 వెయిటేజీ, 102-13.60, 103-13.73, 104-13.87, 105-14.00, 106-14.13, 107-14.27, 108-14.40,

109-14.53, 110-14.67, 111-14.80, 112-14.93, 113-15.07, 114-15.20, 115-15.33, 116-15.47, 117-15.60, 118-15.73, 119-15.87, 120-16.00.

121 మార్కులకు-16.13వెయిటేజీ, 122-16.27, 123-16.40, 124-16.53, 125-16.67, 126-16.80, 127-16.93, 128-17.07, 129-17.20, 130-17.33, 131-17.37, 132-17.60, 133-17.73, 134-17.87, 135-18.00, 136-18.13, 137-18.27, 138-18.40, 139-18.53, 140-18.67, 141-18.80, 142-18.93, 143-19.07, 144-19.20, 145-19.33, 146-19.47, 147-19.60, 148-19.73, 149-19.87, 150-20.00 వెయిటేజీ వస్తుంది.

9 నుంచి ఉన్నతాధికారులకు భాషా పరీక్షలు : ఏపీపీఎస్సీ

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: కేంద్ర, రాష్ట్ర సర్వీసులలోని ఐఏఎస్,ఐపీఎస్, ఐఎఫ్ఎస్ స్థాయి అధికారులకు భాషా పరీక్షలను ఏప్రిల్ 9 నుంచి 12వరకు నిర్వహిస్తున్నామని ఆంధ్రప్రదేశ్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (ఏపీపీఎస్సీ) సెక్రటరీ వైవీఎస్ సాయి శుక్రవారం తెలిపారు.ప్రతిరోజూ ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం 5.15 గంటల వరకూ దశల వారీగా పరీక్షల్ని నిర్వహిస్తామన్నారు. దిగువ, ఉన్నత స్థాయి అధికారులకు భాషా, వైవా వాయిస్ పరీక్షలు కొనసాగుతాయని వివరించారు. పూర్తి వివరాలకోసం అభ్యర్థులు ఏపీపీఎస్సీ వెబ్‌సైట్‌ను తిలకించాలన్నారు.

టీడీపీ దగా..

వైసీపీ రైతు విభాగం రాష్ట్ర అధ్యక్షులు ఎంవీఎస్ నాగిరెడ్డి

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: రుణమాఫీ చేయకుండా టీడీపీ రైతులను దగా చేసిందని వైసీపీ రైతు విభాగం రాష్ట్ర అధ్యక్షులు ఎంవీఎస్ నాగిరెడ్డి విమర్శించారు. విజయవాడ వైసీపీ రాష్ట్ర కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఈ ఏడాది ప్రవేశపెట్టిన సాధారణ బడ్జెట్టు మొత్తం పెరుగుదల 28.6శాతం కాగా, వ్యవసాయ బడ్జెట్టులో పెరుగుదల కేవలం 4.6శాతమే కన్పించిందని వివరించారు. గత వ్యవసాయ బడ్జెట్టు రూ.18,214 కోట్లు వుండగా,ఈ ఏడాది ఆ మొత్తం రూ.19,070 కోట్లకు పెంచామని పేర్కొన్నారు. టీడీపీకి రైతుల ఉసురు తగులుతుందని ఎద్దేవా చేశారు.ఈ సమావేశంలో రైతు విభాగం రాష్ట్ర అర్గనైజింగ్ సెక్రటరీ సింహాద్రి రమేష్ పాల్గొన్నారు.

అభివృద్ధికి కేంద్రవైఖరి ఆటంకం కారాదు

- మరింత కష్టపడాలి
- తెలుగువారి మధ్య విబేధాలొద్దు
- హెచ్‌ఓడీలతో వీడియో కాన్ఫరెన్స్‌లో సీఎం చంద్రబాబు

విశాలాంధ్ర బ్యూరో- అమరావతి : రాష్ట్రాలు వేరైనా తెలుగువారి మధ్య విభేదాలు వుండకూడదనేదే నా అభిమతమని సీఎం చంద్రబాబు చెప్పారు. కేంద్రప్రభుత్వ సహకారం లేకున్నా అభివృద్ధిలో తేడా రాకూడదని, అందరూ మరింత కష్టపడాలని కోరారు. హేతుబద్ధత లేని విభజన చేసి కాంగ్రెస్, ఇచ్చిన హామీలు అమలు చేయకుండా బీజేపీ పార్టీలు ఏపీకి తీవ్ర అన్యాయం చేశాయని ఆవేదన వ్యక్తం చేశారు. శుక్రవారం సచివాలయంలో హెచ్‌వోడీలతో సీఎం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. విభజన నాటి పరిస్థితులు, ఇప్పుడు జరుగుతున్న రాజకీయ పరిణామాలను అధికారయంత్రాంగానికి వివరించారు. కేంద్రంలో ఫ్రెండ్లీ పార్టీ వుందని, యూసీలు ఇవ్వకపోతే తరువాత నష్టం జరుగుతుందని మన అధికారులను ఎప్పటికప్పుడు అప్రమత్తం చేశాను. ఆమేరకు అధికారులు యూసీలు పంపించారు. అయినప్పటికీ పోలవరం కోసం డబ్బులు పంపించి మరీ రివర్ట్ చేసింది కేంద్రం.ఇప్పుడు యూసీలు పంపలేదని సాకులు చెబుతోంది.ఇవన్నీ మీరూ తెల్సుకోవాలని కోరారు.33 వేల ఎకరాల భూములను రైతులు త్యాగం చేసి ఇస్తే వారి త్యాగనిరతికి కనీస గౌరవం ఇవ్వకుండా రాజధానికి నిధులు కేటాయించడంలో మొండిచెయ్యి చూపించారు.రాజధానికి కేవలం రూ.2,500 కోట్లు ఇచ్చి ఏం ఖర్చుపెట్టారని అడుగుతున్నారు, కేంద్రం కన్నా రాజధాని రైతులు దాదాపు 40 వేల కోట్ల రూపాయల విలువైన భూములు ఇచ్చారన్న విషయాన్ని గుర్తించాలన్నారు. కేంద్ర వైఖరి రాష్ట్రానికి సాయం చేయాల్సింది పోయి ఎదురుదాడికి దిగుతున్నట్టుగా వుందని, ఇవన్నీ పరిశీలించాకే తుది నిర్ణయం తీసుకున్నాం, కేంద్రం నుంచి మంత్రులు రాజీనామాలు సమర్పించమని చెప్పామని తెలిపారు. అయితే మనకు చాలా కష్టాలు వున్నాయి, అలాగే చాలా అవకాశాలు వున్నాయని, ఇకపై మరింత కష్టపడి మన లక్ష్యాన్ని చేరుకోవాలని కోరారు.కష్ట సమయంలో బాగా పనిచేస్తున్నారంటూ అధికారులను అభినందించారు. ఏ దేశానికైనా, రాష్ట్రానికైనా సమర్థుడైన నాయకుడు ఉండే ఫలితాలు అవే కనిపిస్తాయి. పైనుంచి తగిన ఊతం లేకపోయినా నాయకత్వం సమర్థంగా ఉన్నప్పుడు ఫలితాలు బాగానే వస్తాయి.ఏపీని ఒక అత్యుత్తమ నమూనాగా రూపొందించాలని స్థిర నిర్ణయం తీసుకున్నాం. ఈ లక్ష్య సాధనలో ఎక్కడున్నామో ప్రతి ఏటా స్టేటస్ రిపోర్టు వెలువరిస్తామన్నారు. మనకున్న పరిమిత వనరులలోనే సంక్షేమానికి విరివిగా ఖర్చు పెట్టాలని, అదే సమయంలో మళ్లీ ఆదాయం పెరిగేలా అభివృద్ధి కార్యక్రమాలను చేపట్టి, సుస్థిర ఆర్థిక వృద్ధి సాధించాలన్నారు. అన్ని అంశాలలో గ్లోబల్ బెంచ్ మార్కులు పెట్టుకోవాలి. థర్డ్ పార్టీ అవాల్యుయేషన్ చేయించాలి. జాతీయ, అంతర్జాతీయ సంస్థల అక్రిడిటేషన్ సాధించాలని సూచించారు. సంపద సృష్టి, సంపద పంపిణీ సక్రమంగా జరిగితే ఫలితాలు బాగా ఉంటాయని చెప్పడానికి ఆంధ్రప్రదేశ్ ఉదాహరణగా పేర్కొన్నారు. విభజన సమయం కన్నా ప్రస్తుతం మెరుగైన స్థితిలో రాష్ట్రాని అభివృద్ధి చేయగలిగామని, దీని వెనుక మనందరి కష్టం దాగుంది. ఈ ఫలితాలు మన కష్టార్జితం. వంశధార, నాగావళి, గోదావరి, కృష్ణా, పెన్నా నదుల అనుసంధానం ద్వారా మహాసంగమం సాకారం చేయాలన్నదే తన ఆశయమని చంద్రబాబు మరోసారి స్పష్టం చేశారు.

సంపాదకీయం

మోడీప్రభుత్వ మేకపోతు గాంభీర్యం

చెప్పిన సుద్దులు చట్టుబండలైనప్పుడు.. చేసిన వాగ్దానాలు నీటిమీద రాతలుగా మారిపోయినప్పుడు పాలకులపై ప్రజాగ్రహం కట్టలు తెంచుకోక తప్పదు. కేంద్రంలోని మోడీ నేతృత్వంలోని ఎన్డీఏ ప్రభుత్వంపై ఇప్పుడు అదే జరుగుతోంది. అన్ని వర్గాల ప్రజలు ఎంతో ఆగ్రహంతో వున్నారు. ఇటీవల పలు రాష్ట్రాల్లో జరిగిన పార్లమెంటు, శాసనసభ స్థానాల ఉప ఎన్నికల్లో వరుసగా బీజేపీ పరాజయాలు చవిచూడటం, చేసిన వాగ్దానాలు నెరవేర్చడంలో ప్రభుత్వం విఫలం కావడం, అనేక ప్రజావ్యతిరేక చర్యలు, విధానాలతో ఆర్థిక భారాలను మోపడం వల్ల వివిధ వర్గాల్లో పెరుగుతున్న ఆగ్రహంతో కేంద్ర ప్రభుత్వం నిరాశ నిస్పృహలకు గురికాక తప్పలేదు.. చేసుకున్న వారికి చేసుకున్నంత మహదేవ అన్న చందంగా. నిరాశా, నిస్పృలకు గురైన మోడీ ప్రభుత్వం ప్రజల నుండి మరింత దూరమయ్యే విధంగా చర్యలు తీసుకొంటున్నది. ప్రభుత్వం తీసుకున్న కార్పొరేట్ అనుకూల, ప్రజావ్యతిరేక చర్యలవల్ల ప్రజాగ్రహానికి గురికాక తప్పదని గ్రహించి కూడా మేకపోతు గాంభీర్యాన్ని ప్రదర్శిస్తోంది. డబ్బు వరదలా పారించడం ద్వారా, అవకాశవాద పొత్తులు, గవర్నర్ల ద్వారా అధికార దుర్వినియోగానికి పాల్పడి ఈశాన్య రాష్ట్రాల్లో విజయం సాధించిన విషయాన్ని మరచి, మోడీ చేసిన అభివృద్ధిని చూసి ప్రజలు బీజేపీకి పట్టం కట్టారని నమ్మబలికేందుకు ప్రయత్నిస్తోంది. ప్రధాని నరేంద్ర మోడీ బుధవారం బీజేపీ పాలిత రాష్ట్రాల ముఖ్యమంత్రులతో సమావేశం జరిపి, కష్టాలను పరిష్కరించి, ప్రజల ఆగ్రహాన్ని తగ్గించడానికి ప్రయత్నించాలని హితబోధ చేయడంతో ప్రజాగ్రహ సెగ మోడీ ప్రభుత్వానికి తాకినట్లు స్పష్టమవుతోంది. రాజస్థాన్, ఒడిశా, మధ్యప్రదేశ్ ఉప ఎన్నికల్లో బీజేపీ ఓటమి ప్రజలు ఘాటుగా స్పందిస్తున్నారనడానికి నిదర్శనం మాత్రమేకాక, 2014 లోక్‌సభ ఎన్నికల్లో "మోసకారి" (జుమ్లేబాజ్) మాటలను విశ్వసించడం తాము చేసిన పెద్ద పొరపాటని గ్రహించడాన్ని ప్రతిబింబిస్తోంది. కార్పొరేట్ల నియంత్రణలో వున్న మీడియా "ఒక పర్యాయం ప్రధాని" పై చర్చను కూడా ప్రారంభించింది. విభిన్న వర్గాల ప్రజలు ముఖ్యంగా యువతరం, విద్యార్థులు సమస్యల పరిష్కారానికి వీధుల్లోకి వస్తున్నారు. ఉద్యోగకల్పన ఆశలు రేకెత్తించి బూటకపు వాగ్దానాలతో మభ్యపెట్టిన మోడీ సర్కారుకు వ్యతిరేకంగా నిరుద్యోగ యువశక్తి ఆందోళనలకు పూనుకొంటున్నారు. అన్ని రకాల అత్యాచారాలకు, వివక్షతలకు గురవుతున్న మహిళలు నిరసనలు తెలుపుతున్నారు. ప్రతిరోజు జీవన వ్యయం పెరుగుతుండటంతో 'గృహబడ్జెట్' నిర్వహణ తల్లకిందులు కావడం, అసాధ్యం కావడంతో మహిళలు ఎంతో గుర్రుతో వున్నమాట వాస్తవం. వేల సంఖ్యలో రైతుల బలవన్మరణాలు కొనసాగుతున్నాయి. రోజువారీ వేతన కూలీలు ఉపాధి కోల్పోతున్నారు. ఎన్నో పోరాటాలు చేసి సాధించుకున్న హక్కులు నిరాకరించబడే విధంగా కార్పొరేట్ల కొమ్ముకాస్తున్న మోడీ ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా కార్మికులు పెద్దఎత్తున ఉద్యమాలు కొనసాగిస్తున్నారు. దళితులు, ముస్లిం మైనారిటీలపై దాడులు జరుగుతున్నాయి. బ్యాంకు ఆధారిత అనేక పథకాల ద్వారా పేదలకు 'సహాయం' చేయడానికి మోడీ ప్రభుత్వం అన్ని హామీలను గుప్పించింది. అయితే, పేదల పేరిట అటువంటి అన్ని పద్దులు కార్పొరేట్లకు, దోచుకొన్న డబ్బును చట్టబద్ధం చేసుకోడానికి బ్లాక్‌మనీ దారులకు ఉద్దేశించినవేనన్నది ఇప్పుడు స్పష్టమవుతోంది. పెద్దనోట్ల రద్దు చర్య లక్షలాది కోట్ల డబ్బును తెలుపు చేసుకోడానికి నల్లకుబేరులకు దోహదం చేసింది. బ్యాంకులను దోచుకోడానికి నిరర్థక ఆస్తులు (ఎన్‌పీఏ) ఒక సాధనంగా మారాయి. మోడీ తరువాత మోడీ, మాల్యాలు వేలకోట్ల రూపాయలతో దేశం నుండి పలాయనం చిత్తగించారు. బ్యాంకులన్నీ దివాలాటంచున వున్నాయి. ఆర్థిక వ్యవస్థ ఇప్పుడప్పుడే కోలుకోలేని విధంగా కుదేలయింది. వెయ్యి రూపాయల పెద్దనోటు రద్దు చేసి, దానికన్నా పెద్ద నోటు 2000 చలామణిలోకి తీసుకువచ్చారు. దీంతో లెక్కచూపని డబ్బు దాచుకోవడం మరింత సులవైపోయింది. రూ. 2 వేల నోట్లు ఇప్పుడు అధోజగత్తులోకి చేరిపోయాయి. ఈ చర్య ప్రధాని మోడీ నిజచింతనను, చిత్తశుద్ధిలేమిని పట్టిస్తోంది. అన్నింటికి మించి 'న ఖావుంగా, న ఖానేదేవుంగా' (తినను తిననివ్వను) అన్న మోడీ మాయమాటలు ఆయనకే బెడిసికొట్టాయి. బిర్లా-సహారా డెయిరీ కుంభకోణంలో ఆయనపై వచ్చిన అవినీతి ఆరోపణలను సద్దుమణుగయ్యేటట్లు చేయగలిగారు. అయితే, రాఫెల్ కుంభకోణం వాస్తవంగా ఆయన్ని వెంటాడుతోంది. "జాతీయ భద్రత" పేరుతో ఫ్రాన్స్‌తో కుదుర్చుకొన్న రాఫెల్ యుద్ధ విమానాల ఒప్పందం వివరాలపై పార్లమెంటును విశ్వాసంలోకి తీసుకోడానికి నిరాకరించిన తరువాత ఒప్పందంలో తప్పేమీ జరగలేదని ఇప్పుడు ప్రభుత్వ వర్గాలు మీడియాలో కట్టుకథలు అల్లుతున్నాయి. కానీ, గత యూపీఏ ప్రభుత్వ హయాంలో ఖరారు చేసుకున్న ధరకన్నా ఒక్కో యుద్ధ విమానానికి మూడు రెట్లు ఎక్కువ ధరను చెల్లించేటట్లు ఫ్రాన్స్‌తో ఒప్పంద సవరణకు ఎందుకు అంగీకరించిందో వివరించేందుకు నిరాకరించడం మోడీ ప్రభుత్వం అనేక అనుమానాలకు తావిచ్చేదిగా వుందనడం అతిశయోక్తికాదు. ఎక్కువ ధర చెల్లించడం వల్ల ప్రభుత్వ ఖజానాకు లక్షలాది రూపాయల నష్టం వాటిల్లుతుంది. ఈ ఒప్పందంలో ఎవరైనా కమీషన్ లేదా లంచం మేశారా? అన్న ప్రశ్న ఉదయిస్తుంది. ప్రధానితో కలిసి ఫ్రాన్స్ వెళ్లడానికి కొద్దిరోజులు ముందు అనిల్ అంబానీ ఏర్పాటు చేసిన సంస్థ అనుబంధ కాంట్రాక్టు పొందడానికి సంబంధించి ప్రధానమంత్రి సమాధానం యివ్వవలసిన రెండవ ప్రశ్న. యూపీఏ ప్రభుత్వ హయాంలో ఒప్పందం సందర్భంగా దీన్ని ప్రభుత్వరంగ సంస్థ హెచ్ఎఎల్‌కు అప్పగించాలని భావించారు. రాఫెల్ ఒప్పందం భారీ మొత్తంతో కూడినందున స్వాతంత్ర్యానంతరం ఇది అతిపెద్ద కుంభకోణంగా పేర్కొనవచ్చు. దీన్నిబట్టి చూస్తే "అవినీతిని అసలు సహించేది లేదని" అతి గంభీరంగా మోడీ పలికిన పలుకులు గాలికి కొట్టుకుపోయాయి. రాఫెల్ ఒప్పందం బహిర్గతమైన ఒక కుంభకోణం మాత్రమే. బహిర్గతం కాని కుంభకోణాలు మోడీ పాలనలో ఇంకెన్ని వున్నాయో అన్న అనుమానం కలగడం సహజం. ప్రభుత్వం పాల్పడిన నేరాల నుండి ప్రజల దృష్టి మరల్చడానికి చిన్నచిన్న కుంభకోణాలను మోడీ ప్రభుత్వం ఉపయోగించుకొంటున్నది. మోడీ అవినీతి ప్రభుత్వ అక్రమాలను విజ్ఞులైన భారత ప్రజలు నిశితంగా ఆలోచించి, తగిన గుణపాఠం చెబుతారన్నది ఖాయం.

చురక

రాజకీయ లబ్ధిలో
రాష్ట్రాల్లో బడ్జెట్లు
ప్రజాకర్ష కనికట్టు
పార్టీ గెలుపే టార్గెట్లు

కులం మతం గుర్రాలకు
గుగ్గిళ్లతో ఎరవేత
సంక్షేమం పథకాలకు
శక్తి కరిగే మంచు పూత

- వేల్పుల నారాయణ

విశ్లేషణ

విగ్రహాల విధ్వంసం

హిందూత్వ ఉన్మాదానికి పరాకాష్ఠ

జ్యోతి

విగ్రహాలను కూల్చినంత మాత్రాన సైద్ధాంతిక భూమికను నిర్మూలించలేరు. ప్రతీకార దాడులతో ప్రజాస్వామ్య ఉనికిని నాశనం చేయలేరు. కారుచీకట్ల గర్భాన్ని చీల్చుకునే కాంతిరేఖ ఆవిష్కృతమవుతుంది. మౌనం నుంచే మాట పుట్టుకొస్తుంది. అణచివేత నుంచే తిరుగుబాటుకు బాటలు పడతాయి. నేడు త్రిపులో జరుగుతున్న విధ్వంసం నుంచే రేపటి అరుణోదయం ఆవిర్భవిస్తోందనడానికి సందేహం లేదు.

మానవ సమాజ గతిని మార్చి కొత్త చరిత్రకు పునాదులు వేసిన మార్గదర్శకుల విగ్రహాలపై మత రక్కస మూకల దాడులు మధ్య యుగాల ఆటవిక అనాగరిక సంస్కృతిని తలపిస్తోంది. వారి అసహనానికీ, అజ్ఞానానికి ప్రతీకగా నిలుస్తోంది. అయితే ఈ విగ్రహాల కూల్చివేత తాత్కాలిక ఉద్వేగంతో జరిగినది మాత్రంకాదు, ముందస్తు ప్రణాళిక, పక్కా వ్యూహంతోనే ఒక సామాజిక తాత్వికతతో ఈ విధ్వంసకాండను బీజేపీ శ్రేణులు సాగించాయి. త్రిపుర ఎన్నికలలో బీజేపీ విజయంపై స్పందించిన ప్రధాని మోడీ.. విగ్రహాల విధ్వంసంపై చాలా ఆలస్యంగా ప్రతిస్పందించడంలోనే ఈ కుట్ర దాగి ఉంది. ఈ విజయం ఒక సైద్ధాంతిక విజయంగా ప్రధాని పేర్కొనడంతోనే విగ్రహ విధ్వంసకారులు మరింతగా రెచ్చిపోయారు. వాస్తవానికి బీజేపీకి హింసోన్మాద సంస్కృతి కొత్తేమీ కాదు. త్రిపురలో లెనిన్ విగ్రహాన్ని కూల్చివేసిన తర్వాత కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి హంసరాజ్ గంగారామ్ చేసిన వ్యాఖ్యలు వారి నిజస్వరూపాన్ని చూపింది. భారత్‌లో విదేశీ నేతల విగ్రహాలకు స్థానం లేదంటూ ఆయన లెనిన్ విగ్రహ విధ్వంసంపై వ్యాఖ్యానించడం ఆయనలోని క్రూర తాత్వికతకూ, అప్రజాస్వామిక వైఖరికి దర్పణం పడుతోంది. లెనిన్ విదేశీయుడు, ఒకరకంగా ఉగ్రవాదీ. అలాంటి వ్యక్తి విగ్రహం మనదేశంలో ఉండకూడదు అని బీజేపీ ఎంపీ సుబ్రమణ్యస్వామి ప్రకటించారు. మరో బీజేపీ నేత రామ్ మాధవ్.. విగ్రహాన్ని తొలగించింది రష్యాలో కాదు, త్రిపురలోనే అని పేర్కొంటూ చలో పాల్టాయ్ (మార్చేద్దాం పదండి) అంటూ పిలుపునిచ్చారు! బీజేపీ, మోడీ వాంఛించే మార్పు దశదిశా ఏమిటో స్పష్టమవుతోంది. బీజేపీ శ్రేణులు ... 1539 ఇండ్లపై దాడులు జరిపాయనీ, 196 ఇండ్లను బీజేపీ కార్యకర్తలు తగులబెట్టారనీ,134 సీపీఎం కార్యాలయాలపై దాడులుచేశారనీ, 64 కార్యాలయాలను తగులబెట్టారని సీపీఎం నేతలు పేర్కొన్నారు. ఈ విగ్రహాల ఏర్పాటు వెనుక వ్యక్తిగత ఆరాధన, ఆ ఒక వ్యక్తే సర్వస్వం అనే పరిస్థితులు ఏమీ లేవు. విగ్రహం కూల్చివేత అంటే ఒక ఆదర్శాన్నీ, నిబద్ధతను దెబ్బతీయడం మినహా ఏమీ కాదు. పూర్వకాలం యుద్ధాల్లో విజేతలు పరాజితుల సంస్కృతిని కాలరాసేందుకే దేవాలయాలపై దాడులు, విగ్రహాల విధ్వంసం చేసేవారు. కానీ ప్రజాస్వామ్య వ్యవస్థలో విజేతలతోపాటు పరాజితులు కూడా సమాన భాగస్వామ్యంతో స్వేచ్ఛగా జీవించగలుగుతారు. ప్రజలెన్నుకున్న ప్రభుత్వం తమకు ఓట్లు వేసిన ప్రజలతోపాటు ఓటు వేయని వారికీ సమాన బాధ్యత వహించే సమసమాజ స్థాపనకు వీలుగా పాలన అందించడం ప్రధాన లక్షణం. కానీ బూజుపట్టిన మతోన్మాదం, హిందూ అగ్రవర్ణ భావజాలాన్ని ప్రజలపై రద్దుతూ హింసోన్మాద శక్తులు ఇటీవల కాలంలో పెచ్చురిల్లుతున్నారు. బీజేపీ అసలు స్వరూపాన్ని అప్పట్లో అంచనావేసిన మార్క్సిస్టు నేత జ్యోతిబసు.. దాన్ని అనాగరిక పార్టీగా పేర్కొన్నారు. ఇప్పుడే కాదు, అయోధ్యలో బాబ్రీ మసీదును కూల్చినప్పుడే దాని నిజస్వరూపం తేటతెల్లమైంది. అసహన రాజకీయాల పునాది మీద అధికారాన్ని చేజిక్కించుకోవడం దానికి ఓ అలవాటుగా మారింది. దాని తాత్విక పునాదే ఫాసిజం నుంచి పుట్టుకొచ్చింది. డాక్టర్ బాలచంద్ర సదాశివరావు ముంజే 1931 మార్చి 19నుంచి తొమ్మిది రోజులు ఇటలీ పర్యటించి ముస్సోలినీ, ఫాసిజం అనుసరణీయంగా హిందూరాజ్యస్థాపనకు ఎలా ఆదర్శమో చెప్పి ఉన్నారు. అతని అడుగుజాడల్లోనే ఆరెస్సెస్ స్థాపకుడు హెడ్గేవార్, గోల్వాల్కర్, దేవరస్ నుంచి నేటిదాకా హిందుత్వవాదులు విభిన్న జాతి సంస్కృతులు కలిగిన దేశాన్ని ఏకశిలా సదృశంగా మార్చేందుకు ప్రయత్నిస్తున్నారు. కులవివక్ష, అణిచివేత వంటి సామాజిక రుగ్మతలను నిరసించడాన్ని కూడా సహించలేక పోతున్నారు. త్రిపురలో విగ్రహాల విధ్వంసం చూసి ఉత్సాహపడిన తమిళనాడు బీజేపీ నేత హెచ్. రాజా 'కులోన్మాది పెరియార్ ఇ.వి. రామస్వామి విగ్రహానికి కూడా ఇదే గతి పడుతుంద'ని ఫేస్‌బుక్‌లో హెచ్చరించడం, కొద్దిసేపటికే కొందరు దుండగులు వెల్లూరులో పెరియార్ విగ్రహాన్ని కూల్చడం జరిగిపోయాయి. ఆవేశం తలకెక్కి, విచక్షణ కోల్పోయిన గుంపు ఏదో చేసిందనుకోవడానికి లేకుండా త్రిపుర గవర్నర్ తథాగతరాయ్, పలువురు బీజేపీ నేతలు ఆ ఉదంతాలను సమర్థిస్తూ మాట్లాడిన తీరు విస్మయం కలిగిస్తుంది. రాజ్యాంగ రక్షకుడంటున్న గవర్నర్ ప్రభుత్వాలు మారినప్పుడల్లా సంభవించే ఓ తేలికపాటి పరిణామంగా దీనిని తీసిపారేయడం ఆశ్చర్యకరం. ప్రజాస్వామ్యబద్ధంగా జరిగిన ఎన్నికల్లో ఘనవిజయం సాధించిన ఓ రాజకీయ పార్టీ, ఇంతటి అప్రజాస్వామికంగా తన విజయోత్సవాన్ని నిర్వహించడం మాత్రం ఇదే తొలిసారి. భారతదేశ చరిత్రలో మరే రాజకీయపార్టీ కార్యకర్తలూ ఇప్పటివరకూ ఇంతటి ఉన్మాదానికి ఒడికట్టే ధైర్యం చేయలేదు. లెనిన్, కార్ల్‌మార్క్సులు తమ జీవితాలను ప్రజల కోసం, మార్పు కోసం అర్పించిన మహనీయులు. మెరుగైన సమాజాన్ని స్థాపించడానికి పాటుపడినవారు. కుల, మత నిచ్చెనమెట్ల సమాజాన్ని కొనసాగించాలనుకునే శక్తులకు వారి ఆలోచనలు, త్యాగాలు, కృషి గిట్టవు.. సహజమే! వారి అభిప్రాయాలు, సిద్ధాంతాలు నచ్చకపోయినందున వారి విగ్రహాలను కూల్చితే ఆ భావాలు పోతాయా? అలా ఆ భావాలు, సిద్ధాంతాలను మటుమాయం అవుతాయనుకోవడం మతిమాలిన గుంపుపని తప్ప, బుర్రున్నవారు చేసే పని కాదు. వీరిద్దరూ ఈ దేశానికి చేసిందేమిటని ప్రశ్నించేవారూ ఉన్నారు. చరిత్ర తెలుసుకోలేకపోయిన అజ్ఞానమే దానికి కారణం. మార్క్స్, లెనిన్ కూడా మన దేశంపై బ్రిటీష్ వలసవాదుల పెత్తనాన్ని గట్టిగా వ్యతిరేకించారు. సమాచార, ప్రసార సాధనాలు అంతగా అందుబాటులో లేని 1850ల్లోనే మన దేశంలోని వివిధ ప్రాంతాల్లో వెల్లువెత్తిన విముక్తి పోరాటాలను అధ్యయనం చేసి, విశ్లేషించారు మార్క్స్. 1857నాటి సిపాయిల తిరు గుబాటుపై వచ్చిన వార్తల ఆధారంగా అమెరికాకు చెందిన న్యూయార్క్ డైలీ ట్రిబ్యూన్‌లో మార్క్స్, ఏంగెల్స్ పలు వ్యాసాలు రాశారు. 'పూర్ణ స్వరాజ్' కోసం పోరాడాలని 1929 డిసెంబర్ 19న లాహోర్‌లో కాంగ్రెస్ తీర్మానించడానికి పదేళ్లముందే భారతదేశం బ్రిటిష్ పాలన నుంచి విముక్తి సాధించాలని అభిలషించాడు లెనిన్. దేశంలో కమ్యూనిస్టు పార్టీ ఏర్పాటులో ఎంఎన్ రాయ్‌లాంటి వారికి తోడ్పాటునందించాడు. త్రిపురలో విగ్రహ విధ్వంసం తర్వాత తమిళనాడులో పెరియార్, అంబేద్కర్ విగ్రహాలను, కేరళలో గాంధీ విగ్రహాన్ని ఉన్మాదులు ధ్వంసం చేశారు. ఈ పనంతా హిందూత్వ మూకలు చేసినదేనని నిర్ధారితమైంది. మనకు రాజ్యాంగాన్ని అందించిన మహనీయుడు అంబేద్కర్. సమాజానికి వ్యాధిగా పరిణమించిన కులాన్ని నిర్మూలించడానికి, మహిళలకు సమాన హక్కులు సాధించడానికి, హేతువాద దృక్పథాన్ని పెంపొందించడానికి కృషిచేసిన వాడు. పెరియార్ ఇ.వి. రామస్వామి. తమిళనాట ఆయన నాయకత్వంలో సాగిన 'ఆత్మగౌరవ పోరాటం' దక్షిణాదినంతటినీ ప్రభావితం చేసింది. ఇదే తరహాలో అడపాదడపా గాంధీ, ఇందిరాగాంధీ, నెహ్రూ, రాజీవ్‌గాంధీ తదితరుల విగ్రహాలను ధ్వంసం చేయడం చూస్తూనే ఉన్నాం.



విగ్రహాలను ధ్వంసం చేయడం వల్ల ఏం సాధించవచ్చను కుంటున్నారో అనూహ్యం. వాస్తవానికి విగ్రహధ్వంస రచన ఈనాటిది కాదు. మధ్యయుగాల్లో రాజుల దండయాత్రల్లోనే దీని వేళ్లు ఉన్నాయి. మతపరమైన విగ్రహాలు, పూజాస్థలాలను ధ్వంసం చేసేవారు. వాటికి సంబంధించిన సంపదను దోచేసేవారు. ఆధునిక కాలంలో రాజకీయ నేతలు, సిద్ధాంతకర్తలు, సంఘసంస్కర్తల విగ్రహాల విధ్వంసం కూడా ఫ్రెంచి విప్లవం నుంచే మొదలైంది. 1960వ దశకం చివర్లో ప్రారంభమైన నక్సలైట్ ఉద్యమకాలంలో పశ్చిమ బెంగాల్‌లో ముఖ్యంగా కోల్‌కతాలో రాజారామ్మోహన్‌రాయ్, ఈశ్వరచంద్ర విద్యాసాగర్ వంటి సంఘసంస్కర్తలు, గాంధీ, నెహ్రూ, బోస్ వంటి స్వాతంత్ర్యసమరయోధుల విగ్రహాలను ధ్వంసం చేయడం సంచలనం సృష్టించింది.

1991 జూన్-డిసెంబర్ మధ్య జరిగిన పరిణామాలతో సోవియెట్ యూనియన్ విచ్ఛిన్నమై కమ్యూనిస్ట్ పాలన ముగిసినప్పుడు రాజధాని మాస్కో పోలండ్, బల్గేరియా వంటి తూర్పు ఐరోపా దేశాల్లో లెనిన్, స్టాలిన్‌ల భారీ విగ్రహాలను కూల్చివేశారు. దక్షిణాఫ్రికాలోని జొహాన్నెస్‌బర్గ్‌లో గాంధీ విగ్రహాన్ని 2015 ఏప్రిల్ 12న కొందరు దుండగులు ధ్వంసం చేశారు. 1960ల చివర్లో ఆంధ్రప్రదేశ్‌లోని విశాఖపట్నంలో ఉక్కు ఫ్యాక్టరీ నిర్మించాలంటూ సాగిన ఆందోళన సందర్భంగా విజయవాడలోని అప్పటి కేంద్ర ఉక్కు శాఖ మంత్రి నీలం సంజీవరెడ్డి విగ్రహాన్ని ఉద్యమకారులు తొలగించి ఎదురుగా ఉన్న ఏలూరు కాలవలో వేశారు. 2011లో ప్రత్యేక తెలంగాణ కోసం ట్యాంక్‌బండ్‌పై సాగిన మిలియన్ మార్చ్ సందర్భంగా కొందరు అక్కడి తెలుగు వైతాళికుల విగ్రహాలను ధ్వంసం చేశారు. తెలంగాణ ఉద్యమం సందర్భంలోనే సిద్దిపేట పట్టణంలోని పొట్టి శ్రీరాములు విగ్రహాన్ని పగలగొట్టారు. 1700 సంవత్సరాల నాటి బామియాన్ బుద్ధ విగ్రహాన్ని తాలిబాన్‌లు డైనమైట్లు పెట్టి కుప్పకూల్చినప్పుడు, చారిత్రక కట్టడాలనూ విగ్రహాలను ఇస్లామిక్ స్టేట్ ధ్వంసం చేస్తున్నప్పుడు ప్రపంచమంతా ఆ మతోన్మాదానికి నిర్ఘాంతపోయింది. ఇరాక్‌లో విజయం తరువాత అమెరికన్ సైనికులు సద్దాం హుస్సేన్ విగ్రహాన్ని కుప్పకూల్చి, కాళ్ళతో తొక్కుతూ తుపాకుల కాల్పులతో వీరంగం వేసినప్పుడు ప్రపంచం అసహ్యించుకుంది. ఈ దురాక్రమణలో అమెరికా.. ఇరాక్‌ను వశంచేసుకొని ఉండవచ్చు, దాని దృష్టిలో సద్దాం ఓ నియంతే కావచ్చును కానీ, ఈ చర్య అమెరికా అహంకారానికి పరాకాష్ఠగా, ఓ నాగరికతపై జరిపిన నిస్సిగ్గు చర్యగా ప్రపంచానికి కనిపించింది. ఉన్మాదంలో బెలోనియా-బామియాన్ ఘటనల మధ్య ఏ తేడాలేదు. బెలోనియా నడిబొడ్డున ఉన్న ఈ లెనిన్ విగ్రహం వామపక్ష అనుకూలుర సంగమస్థలిగా ఉంటూ, పాతికేళ్ల వామపక్ష పాలనకు ప్రతీకగా నిలుస్తోంది. సహజంగా యుద్ధానంతర విజయాల్లోనో, ప్రజా ఉద్యమాల్లోనో, తిరుగుబాటు సందర్భాల్లోనో సాగిన విగ్రహాల కూల్చివేత, ఈ దేశంలో ఒక ప్రజాస్వామిక ప్రక్రియ అనంతరం జరగడమే ఒక అనూహ్య పరిణామం. ఈ దేశం ఫాసిజం గుప్పెట్లోకి వెళుతుందన్నదానికి సంకేతం. త్రిపురలో ఒక ప్రధాన కూడలిలో ఉన్న విగ్రహాన్ని నినాదాలు, కేరింతల మధ్య బుల్డోజర్ల సహాయంతో కుప్పకూల్చుతూ, ఆ ఘనకార్యాన్ని చిత్రీకరించడానికి అంతటి ధైర్యం వారికి ఎక్కడనుంచి వచ్చిందో తెలియంది కాదు. గోసంరక్షణ పేరిటో, గొడ్డుమాంసం తిన్నారన్న నెపంతోనో దాడులు జరిగినప్పుడు అధినాయకులు నిస్సిగ్గుగా వెనకేసుకొచ్చిన గతానుభావాలే వారిని ఆ దిశగా నడిపించాయి. అంతా జరిగిన తర్వాత ప్రధాని హెచ్చరికలు చేయడం ఓ నాటకం కాదా? ఒకపక్కన క్షేత్రస్థాయిలో విద్వేషాన్ని విస్తృతంగా వెదజల్లుతూనే, ఆనక మాట వెనక్కుతీసుకున్నంత మాత్రాన విధ్వంసాలు నిలిచిపోతాయా?

ప్రజాస్వామ్యంలో ఎన్నికల్లో గెలవడమే సర్వస్వం అనుకోవడం, విలువలకు తిలోదకాలిచ్చి వీరంగం వేయడం సరికాదు. ఏ విజయమైనా విధ్వంసాలకూ, ఉన్మాదాలకు దారితీయకూడదు. అవధుల్లేని అధికారంతో, అహంకారంతో ప్రవర్తించవచ్చని ప్రజలు తీర్పు ఇవ్వలేదు. చరిత్రను చెరిపేయడం విగ్రహం కూల్చినంత సులభం కాదు. పాతికేళ్ల పాలనలో వామపక్ష ప్రభుత్వం ఏం చేసిందో గ్రహించి, అంతకు మించి మంచి పనులు చేయాలే తప్ప ఓడిన పార్టీ కార్యాలయాలను తగలబెట్టడం, చరిత్రకు దిక్సూచిగా నిలిచే వారి విగ్రహాలను ధ్వంసం చేయడం లాంటి దురాగతాలకు పాల్పడితే అది అంతిమంగా అరాచకానికి దారితీస్తుంది. చివరకు తన నెత్తిన తానే కొరివి పెట్టుకున్నట్లవుతుంది. ఇటువంటి మత రాజకీయాలకు అడ్డుకట్ట వేయడానికే లౌకిక ప్రజాస్వామికశక్తుల పునరేకీకరణ అంశం ముందుకువచ్చినట్లుగా భావించాలి. హింసాత్మక పోకడలను ఎదుర్కోవడం చారిత్రక బాధ్యతగా ప్రజాస్వామికశక్తులు స్వీకరించాల్సిన సందర్భం ఇది.

ఈ-మెయిల్

చరిత్రను పాఠ్యపుస్తకాలలో తిరగరాయటానికి అంగీకరించని కమిటీ

చరిత్రను తిరగరాయటానికి బీజేపీ ప్రభుత్వం ఏర్పాటు చేసిన కమిటీయే చరిత్రను తిరగరాయటానికి అంగీకరించని పరిస్థితి వచ్చింది. ఏర్పాటు చేసిన సభ్యులు సంస్కృతాన్ని పుట్టు పూర్వోత్రాలు విషయంలో వున్న అనేక పరిశీలనను మాని ప్రభుత్వం చెప్పినట్లు మార్చటానికి అంగీకరించలేదు. ఆరెస్సెస్ తరపున మాట్లాడిన మన్మోహన్ వైద్య నిజానిజాలు తెలియకుండా చెప్పినట్లుగా మార్పు చేయటానికి అంగీకరించలేదు. కమిటీ మెంబర్లు చెప్పినట్లుగా, హిస్టరీ బుక్స్ చరిత్రలో వున్న సత్యాలను మార్చి సంస్కృతిని గురించిన కొన్ని వేల సంవత్సరాల నాటి నుండి వున్న సత్యాలను మార్చి రాయమనటం సరికాదని అన్నారు. దీని వివరాలు ఆరెస్సెస్, బీజేపీ ప్రభుత్వ ధోరణి ముందు ముందు కనబడుతుంది. ఆరెస్సెస్, బీజేపీ వారి ద్వేషపూరిత సైన్యాలు ప్రజల ముసుగులో చేసే ఘోరాలు, చాలా కొద్దిలో కోల్పోయిన పార్టీలపై దాడి, త్రిపురలో లెనిన్ విగ్రహాలను పడగొట్టడంలో వారి నగ్నరూపం కనబడుతోంది. విద్వేషంతో అధికారంలోకి వచ్చిన హిట్లరు, నాజీలు ఏ విధంగా మట్టికరిచారో చరిత్ర నిరూపించింది. ఆంధ్రప్రదేశ్‌కు ఏ విధంగా వారు చేసిన వాగ్దానాలు గాలికి వదిలేసారో అందరికి తెలిసిందే. బీజేపీ ఎమ్మెల్యేలు కాని, ఎంపీలు కానీ, ఎమ్మెల్సీలు కానీ ఒక్కరు కూడా దుర్యోధనుని, దుశ్యాసనుని ద్రౌపతి వస్త్రాభరణంలో లాగా వికర్ణుడులాగా కూడా వ్యతిరేకించలేదు. (ఆంధ్ర ప్రజల మనోగతం) ఇదంతా ప్రజలు గమనించాలి.

- వీరభద్రం, గాయత్రీనగర్, విజయవాడ-10

యథేచ్ఛగా లింగనిర్ధారణ పరీక్షలు

కామిరెడ్డి సతీష్‌రెడ్డి

తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా అన్ని జిల్లాల్లోని కార్పొరేటు, ప్రైవేటు ఆసుపత్రుల్లో లింగనిర్ధారణ పరీక్షలు యధేచ్ఛగా కొనసాగుతున్నాయి. వైద్య, ఆరోగ్య శాఖ అధికారుల పర్యవేక్షణ లోపం, నిర్లక్ష్యం మూలంగా కాసులకు కక్కుర్తిపడిన వైద్యులు లింగనిర్ధారణ పరీక్షలు చేసి అబార్షన్లు చేస్తూ భ్రూణహత్యలకు పాల్పడుతూ అక్రమంగా లక్షలాది రూపాయలను ఆర్జిస్తూ, పవిత్రమైన వైద్యవృత్తికే మచ్చతెస్తున్నారు. తాజాగా మహబూబాబాద్ జిల్లా కురవి మండల కేంద్రానికి చెందిన శ్వేత నర్సింగ్ హోంలో బీఏ ఎంఎస్ వైద్యులు రాపర్తి శ్రీనివాస్ పోలీసుల స్టింగ్ ఆపరేషన్‌లో చిక్కడంతో లింగనిర్ధారణ పరీక్షల ఉదంతం బహిర్గతమైంది. లింగనిర్ధారణ పరీక్షలు నిషేధ చట్టం అమ లులో ఉన్నా, కార్పొరేట్, ప్రైవేటు 'ఆసుపత్రుల ముందు పెద్ద అక్షరాలతో లింగనిర్ధారణ పరీక్షలు చేయబడవు' అని రాసిపెట్టి ఉన్నా, లోలోపల యధేచ్ఛగా సాగుతున్నాయనే విషయం బట్టబయలు అయింది. నిత్యం ఏదో ఒక ప్రాంతంలో భ్రూణహత్యలకు సంబంధించి శిశువులను ముళ్లపొదలలో వదిలేయడం, మురికికాలువలు, డ్రైనేజీలలో పడేయడం లాంటి సంఘటనలు చోటు చేసుకుంటున్నాయి. ముఖ్యంగా వివిధ జిలాల్లోని గిరిజన ప్రాంతాలు, తండాలు ఉన్న ప్రదేశాలలో లింగనిర్ధారణ పరీక్షలు. భ్రూణహత్యలు జరుగుతున్నట్లు తెలుస్తోంది. తమకు జన్మించో, సంతానంలో ముందుగా ఇరువురు ఆడపిల్లలు పుట్టిన అనంతరం కొడుకు పుట్టాలనే ఆలోచనలతో వైద్యులను సంప్రదించడం, వారు లింగనిర్ధారణ పరీక్షలు చేసిన తదనంతరం కుమారుడు అని తేలితే ఉంచడం, ఒకవేళ మళ్లీ అమ్మాయి అని వైద్యులు చెబితే అబార్షన్ చేయించడం జరుగుతుంది. గ్రామాలు, తండాలలో గల స్థానిక ఆర్ఎంపీ, పీఎంపీలు కీలకపాత్ర పోషిస్తున్నారు. అమాయక ప్రజల అమాయకత్వాన్ని ఆసరా చేసుకొని, వేలాదిగా డబ్బులు గుంజుతూ ఆర్ఎంపీ వైద్యులే వివరాలు సేకరించి మండలాలు, పట్టణాలు, నగరాలలో ఉన్న ప్రైవేటు, కార్పొరేటు ఆసుపత్రులతో సంబంధాలు పెట్టుకొని గర్భవతులైన మహిళలను ఆసుపత్రులకు పంపించివేస్తూ అధిక మొత్తంలో కమిషన్‌లు తీసుకుంటున్నారు. కొన్ని ప్రాంతాల్లో సీనియర్, అనుభవం గల ఆర్ఎంపీ, పీఎంపీలే అబార్షన్లు చేస్తున్నారనే ప్రచారం వాడుకలో ఉంది. విలువైన స్కానింగ్ మిషన్‌లను సమకూర్చుకుని, తమను ఎవరేం చేయలేరనే ధీమాతో వైద్యులు చేయరాని పనులు చేస్తూ వృత్తికే మచ్చ తెస్తున్నారు. ప్రాణాలు పోయాల్సిన వైద్యులు, ప్రాణాలు తీస్తున్నారు. అర్హత, అనుభవం లేని వైద్యులు సైతం లింగనిర్ధారణ పరీక్షలు చేస్తే భ్రూణహత్యలకు పాల్పడుతున్నారు. అనేక ప్రాంతాల్లో కాలేజీలకు వెళ్లే యువత ప్రేమించుకొని, పెళ్లికి ముందే సంబంధాలు పెట్టుకోవడం, చివరగా ప్రెగ్నెన్సీ బయటపడ్డ తరువాత ప్రేమించిన యువకుడు పెళ్లికి నిరాకరించడంతో తోచలేని పరిస్థితులలో అమ్మాయిలు అబార్షన్లు చేయించుకుంటున్నారు. ఇలాంటి సంఘటనల ద్వారా వైద్యులు లక్షలాది రూపాయలు గుంజుతున్నారు. ఇకనైనా రాష్ట్ర వ్యాప్తంగా ప్రైవేట్ ఆసుప్రతులు, కార్పొరేట్ ఆసుపత్రుల్లో జరుగుతున్న లింగనిర్ధారణ పరీక్షలు, భ్రూణహత్యల దందాపై పోలీసుశాఖ ఉక్కుపాదం మోపాలి. ముమ్మర తనిఖీలు చేపట్టాలి. బాధ్యులైన వారిని గుర్తించి కఠినంగా శిక్షించడంతో పాటు, అస్పత్రులను, మిషన్‌లను సీజ్ చేయాలి. ఆయా జిల్లాల ఎస్‌పీలు, సీపీలు చొరవ చూపాలి. మహబూబాబాద్ జిల్లాలో వెలుగుచూసిన సంఘటనలో స్వయంగా జిల్లా ఎస్పీ కోటిరెడ్డి పాల్గొనడం అభినందనీయం. నిద్రమత్తులో ఉన్న రాష్ట్ర, జిల్లా వైద్య ఆరోగ్య విధాన పరిషత్ అధికారులు దాడులను ముమ్మరం చేయాలి. వైద్యులపై పీడీ యాక్టును ప్రయోగించాలి.

...కవితా నిరసన

..దుష్ట గ్రహాలకు దురాగ్రహమొచ్చింది

భ్రష్ట రీతి దురాశ హెచ్చింది
అగ్ర మానవ విగ్రహాలపై దృష్టి పడింది
కొంచెం విషం రాల్చి, మరింత విద్వేషం రగిల్చి
కూల్చేయాలని భ్రమించాయి.
అవేమైనా లోహపు ముద్దలా?
విరిగి, కరిగి నేలకొరగడానికి!

సమున్నత భావ ముద్రలవి
సజీవ సముద్రాలై వెల్లువెత్తేవి.
అయినా, బుద్ధి లేని బొద్దింక లకేం తెలుసు
మహోన్నతుల గురుతులు రద్దు కానివని.
విగ్రహాల చిరునామా వీధి మలుపు కాదని
ఎద ఎద అవి కొలువుండే గృహాలని.

-డా.డి.వి.జి.శంకరరావు, మాజీ ఎంపీ, పార్వతీపురం.

గెలుపు-బలుపా?

ముదనష్టపు-మూకలారా
మానవతకే-మచ్చతెచ్చే
మీ మత సంకేతం!
మానవ జాతి మనుగడకే-
మార్గమిచ్చిన మహనీయులు
మార్క్సు లెనిన్ విగ్రహాలు

కూల్చితే - మీ గ్రహాలు మారునా-
మూర్ఖులారా!
నిజం ఎప్పుడైన నిలకడగా
నిగ్గు తేలుతుంది నిదానంగా-
నిజం కాదు మీ గుండాయిజం
తేలుస్తారు జనం, మీ మత మౌఢ్యాన్ని!

- పాటిబండ్ల కోటేశ్వరరావు, విజయవాడ, సెల్ : 9866283011



మహిళా దినోత్సవం!

ఈ నెల ఎనిమిదో తేదీ గురువారం అంతర్జాతయ మహిళా దినోత్సవం సందర్భంగా దేశ రాజధాని ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద మహిళలు పెద్ద ఎత్తున నినదిస్తున్న దృశ్యం.



పల్లె వట్టిపోతోంది!

పల్లెటూరు అంటే పచ్చదనం, పరిశుభ్రత, స్వచ్ఛమైన వాతావరణం, కాలుష్యం లేని గాని, కలుషితం కాని నీరు, కల్మషం లేని మనుషులు, ఆత్మీయతను పంచే లోగిళ్ళు అనుబంధాలు పెనవేసుకున్న కుటుంబాలు, అనురాగం పంచే స్నేహితులు....వెరసి ఆనంద నిలయాలు, ప్రశాంతతకు మారుపేరు....ఇదంతా ఒకప్పుడు. ఇప్పుడు పల్లెల్లో ఇందుకు పూర్తి భిన్నమైన వాతావరణం నెలకొంది. కారణం ఆధునికత, సాకేంతికత. పట్టణాల మాదిరిగానే పల్లెల్లోనూ ఆధునికత ఊడలు దిగిపోయాయి. అన్నింటినీ మించి జీవనోపాధి సమస్య. పల్లె జనమంతా పొట్ట చేత పట్టుకుని పట్టణాలకు వలస పోవడంతో చాలా గ్రామాలు బోసిపోతున్నాయి. కొద్దోగొప్పో ఉన్న కుటుంబాలూ ఎవరికి వారే యమునా తీరే అన్న చందంగా ఉంటున్నాయి. కారణమేదైతేనేం పల్లెలు ప్రభ కోల్పోయాయి, ఇంకా కోల్పోతున్నాయి.

ఇప్పుడు ఉన్న పెద్దతరంలో మూడు వంతుల మంది గ్రామాల్లో పుట్టి పెరిగిన వాళ్ళే. వాళ్ళను కదిలిస్తే చాలు ఎక్కడ లేని కబుర్లు వస్తాయి. వాళ్ళ బాల్యం, వాళ్ళ తాతముత్తాతల కబుర్లు, పెరట్లో చెట్టుకింద మంచమో, చాపో వేసుకుని ఇంటిల్లిపాదీ హాయిగా కబుర్లు చెప్పుకున్న రోజులు...అన్నీ గబగబా చెప్పేస్తారు. చెప్పడమే కాదు ఆహా! ఆ రోజులే బాగున్నాయి అని కూడా అంటారు. అవును ఇదే నిజం...ఆ రోజులు అంత ఆహ్లాదంగానే ఉండేవి. ఈతరం దక్కని అసలైన ఆనందం కూడా అదే! ఇంతకీ ఇదంతా ఎలా సాధ్యమైందీ....అంటే అది పల్లెటూరు కనుక. అవును ఆనాడు పల్లెటూళ్ళు పచ్చని పట్టుకొమ్మలు. అక్కడ నిత్యం పండగ సందడే కనిపించేది. ఇక పండగ వచ్చిందంటే జాతర ఉన్నట్టే ఉండేది. అదీ పల్లెటూరి వైభవం. మరి ఈనాడు ఇదంతా ఏమైంది?

మన అమ్మానాన్నలను వారి చిన్నతనం గురించి చెప్పమంటే...ఇంటి చుట్టుపక్కల వాళ్ళతో కలిసి గుజ్జనగూళ్ళు, బొమ్మరిల్లు, బొమ్మల పెళ్ళిళ్ళు, చింతపిక్కలు, కర్రాబిళ్ళా, ఏడు పెంకులాట, చెరువులో ఈత, స్నేహితులతో కలిసి బడికెళ్ళిన రోజులు ఇవన్నీ....గుర్తుకొస్తున్నాయి అంటూ ఎంచక్కా రాగం తీసేస్తారు. ఈగాలీ....ఈ నేలా...ఈ ఊరు...సెలయేరు, నను గన్న నా ఊరు అంటూ పాటలూ అందుకుంటారు. ఇందుకు కారణం వారు పుట్టి పెరిగింది గ్రామాల్లో. అదీ గ్రామాల్లో, పల్లెల్లో ఉన్న మహత్తు, గమ్మత్తు!

పెద్దతరం, వృద్ధ తరం వ్యవసాయ పనులు ముగించుకుని వచ్చి సాయంత్రం వేళ ఊరిలోని రచ్చబండ దగ్గరో, రావిచెట్టు నీడనో ఊరి సమస్యలన్నీ చర్చించి పరిష్కరించుకునేవారు. ఇక్కడ ఎలాంటి భేషజాలు, కల్మాషాలు కనిపించేవి కావు. కక్షలుకార్పణ్యాలకు దూరంగా నిర్మలమైన, నిస్వార్థమైన ఆలోచనలతో సొంత ఊరిని కన్నతల్లిలా చూసుకునేవారు. ఇలాంటి సుహృద్భావ వాతావరణంలో ప్రశాంతమైన జీవనం కాక ఇంకేముంటుంది.

ఇప్పుడు ఈ గ్రామాలే కనిపించడం లేదు. మరి ఇలాంటి సందళ్ళు ఎక్కడ నుంచి వస్తాయి. పొలాలు పచ్చగా ఉన్నన్నాళ్ళూ పల్లెల్లో వైభవమూ అలాగే ఉంది. వాతావరణం మారింది. వ్యవసాయం కుంటుపడింది. ఉపాధి తగ్గింది. క్రమంగా పనులు, ఉపాధి, ఉద్యోగాలు పేరు చెప్పి గ్రామీణులూ వలస బాట పట్టారు. జీవనోపాధి కోసమంటూ కుటుంబాలకు కుటుంబాలు తరలిపోయాయి. దీనికి తోడు మారిన కాలానుగుణంగా సిటీల్లో ఉండడానికి ఇష్టపడే మనస్తత్వాలూ పెరిగాయి. చదువుల కోసం యువతరమూ పట్టణాలు, నగరాలకు వచ్చింది. అందుకే పల్లెలు పూర్వ ప్రభను కోల్పోవడమే కాదు ఆధునికత, సాంకేతికత ముసుగులో ఇక్కడ వాతావరణమూ పూర్తిగా మారిపోయింది. పట్టణాలు, నగరాల ప్రభావం పల్లెల మీదా బాగా కనిపిస్తోంది. గ్రామాల్లో సమూలంగా మారిపోయిన జీవన విధానమే ఇందుకు ప్రత్యక్ష నిదర్శనం.

మామూలు జీవన విధానం సరే...పోనీ పండగలైనా మునుపటి మాదిరిగా కోలాహలంగా జరుగుతున్నాయా? అంటే అదీ లేదు. సంక్రాంతి, దసరా, దీపావళి అంటూ పల్లెటూళ్ళకు రావడమే కానీ పూర్వపు సంప్రదాయాలు ఎక్కడా కనిపించడమే లేదు. కుంకుడు రసం లేని తలస్నానాలు, సాంబ్రాణి ధూపం లేని కురులు, పూలకు నోచుకోని జడలు, కత్తిరించుకున్న కరులు, కాటుక ఎరుగని కళ్ళు, గాజులు లేని కరములు, అరచేత కనిపించని గోరింట మెరుపులు, వరిపిండి కలవని రంగవల్లులు, పట్టుపావడాలు లేని చిన్నారులు, పాస్టిక్ తోరణాలు, కొని తెచ్చుకున్న వంటలు, కృత్రిమ నవ్వులూ....ఇదీ ఈనాటి పల్లెల్లో పండగల ముఖచిత్రం.

పచ్చటిపంట పొలాల నడుమ ధాన్యపు సిరులతో తులతూగిన పల్లెలు ఇప్పుడు నిస్సారంగా, నిస్తేజంగా తయారయ్యాయి. పల్లెటూళ్ళే దేశానికి పట్టుగొమ్మలు అన్నారు మన బాపూజీ. అంటే పల్లెటూళ్ళు బాగుంటేనే దేశం బాగుంటుంది. ఇలాంటి పల్లెటూళ్ళే పాడుపడి, బీడుపడి, శిథిలావస్థను తలపిస్తుంటే ఇక దేశం ఎలా ఉంటుందో వేరే ఊహించుకోవాలా! పల్లెలు, గ్రామాలకు పూర్వవైభవం వచ్చిననాడే మనదేశం బాగుపడుతుంది. ఇందులో ఎలాంటి సందేహం లేదు. ఆ రోజు ఇంకెంత దూరంలో ఉందో ఎవరికెరుక!

విశాలాంధ్ర, బంగారుపాళ్యం
చిత్తూరు జిల్లా

గ్రామాలూ, పల్లెల్లోనూ ఇప్పుడు ఏ ఇల్లు చూసినా టీవీలు, కంప్యూటర్లు, ఇంటర్నెట్‌లే. ఎవరిని చూసినా సెల్‌ఫోన్‌లు, సోషల్ మీడియా ఊసులే. ఒకప్పుడు ప్రశాంతమైన, సంతోషకరమైన జీవితాలు కనిపించిన పల్లెల్లోనూ ఇప్పుడు యాంత్రిక జీవనమే. ఉదయం స్కూల్‌కి వెళ్ళిన పిల్లలు వచ్చేది సాయంత్రమే. ఆ తర్వాతైనా ఆటలూ లేవు పాటలూ లేవు. కాలక్షేపం కథలూ లేవు. ఇదంతా పట్టణాల్లో కనిపించే దృశ్యం కదా అంటారా! అవును మిగతా అన్ని విషయాల మాటేమో గానీ జీవన విధానంలో మాత్రం ఇప్పుడు పల్లెలు అయినా పట్టణాలు అయినా ఒకలానే ఉన్నాయి.





రుచి

వేసవి ప్రారంభమైందిగా. ఇక అందరి చూపు పానీయాలు, సలాడ్లు మీదే ఉంటుంది. మరి వంటల విషయానికొస్తే ఏం చేయాలి. రైస్ ఐటమ్స్ తినబుద్ధి కాదు. తినకపోతే నీరసం వస్తుంది. జారుగా ఉండే పులుసులు, చార్లు బాగుంటాయి సమ్మర్‌లో. ఇవే ఆరోగ్యకరం కూడా. ఇవి వేసవి తాపాన్ని తగ్గిస్తాయి. ఒంట్లో నీరు తగ్గిపోకుండా చూస్తాయి. మరి ఇలాంటి రెండు వంటకాలు మనమూ గుర్తుచేసుకుందాం.

కొబ్బరి చారు!



కావలసిన పదార్థాలు

కొబ్బరి పాలు ఒక కప్పు, పచ్చిమిర్చి ఆరు నుంచి ఎనిమిది, పసుపు అర టీ స్పూన్, నిమ్మ రసం రెండు టేబుల్ స్పూన్‌లు, కరివేపాకులు గుప్పెడు, జీలకర్ర అర టీ స్పూన్, ఆవాలు అర టీ స్పూన్, వెల్లుల్లి రేకలు కొద్దిగా, ఉప్పు, నూనె రుచికి సరిపడ

తయారీ విధానం

పాన్‌లో ఆయిల్ వేసి వేడి చేసి జీలకర్ర, ఆవాలు, పచ్చిమిర్చి, వెల్లుల్లి, కరివేపాకులు వేసి తాలింపు పెట్టండి. ఇవి వేగిన తర్వాత పసుపు, కొబ్బరి పాలు, ఒక కప్పు నీళ్ళు కూడా పోయండి. సరిపడ ఉప్పు కూడా వేసి పది నిముషాలు ఉడకనివ్వండి. చివరగా నిమ్మరసం కలిపేయండి. అంతే ఇక మంట కట్టేయండి. కొబ్బరి చారు రెడీ. మంచి రుచిగానూ ఉంటుంది. ఆరోగ్యాన్నీ కాపాడుకోవచ్చు.

కలర్‌ఫుల్ సలాడ్ !



కావలసిన పదార్థాలు

కీరదోస ముక్కలు అరకప్పు, క్యారెట్ ముక్కలు అరకప్పు, బీట్‌రూట్ సన్నని తరుగు పావు కప్పు, క్యాబేజీ సన్నని తరుగు పావు కప్పు, టమాటా ముక్కలు అరకప్పు, ఉల్లిపాయ ముక్కలు అరకప్పు, కొత్తిమీర తరుగు రెండు స్పూన్‌లు, పచ్చిమిర్చి నాలుగు లేదా ఆరు , వెనిగర్ ఒక స్పూన్, నిమ్మరసం రెండు స్పూన్‌లు, ఉప్పు రుచికి సరిపడ

తయారీ విధానం

పైన చెప్పిన కూరగాయ ముక్కలు అన్నింటినీ సన్నగా, పొడుగ్గా తరగాలి. ఒక గిన్నె తీసుకుని అందులో కూరగాయ ముక్కలన్నీ వేసి ఉప్పు వేసి బాగా కలపాలి. కొత్తిమీర, పచ్చిమిర్చి కలిపి మెత్తగా నూరాలి. ఈ ముద్దను కూరగాయ ముక్కల్లో వేసి బాగా కలపాలి. చివరగా వెనిగర్, నిమ్మరసం కలపడమే. ఆ పైన కొత్తిమీర తరుగు చల్లితే కలర్‌ఫుల్ సలాడ్ రెడీ. ఈ సలాడ్‌తో దాదాపుగా అన్ని రకాల పోషకాలూ ఒకేసారి శరీరానికి అందుతాయి.

ఇంటి శుభ్రతకు బొరాక్స్...!

మార్కెట్‌కి బయలుదేరారా! ఏం సరుకులు కొనాలో లిస్ట్ తయారు చేసుకున్నారా? అందులో ఇంటి శుభ్రత కోసం ఉపయోగించే ఫినాయిల్, చెదలు, బొద్దింకలు రాకుండా హిట్, ఫంగస్ రాకుండా ఫంగస్ రిమూవల్ ఇలా ఎన్నో రాసి ఉంటారు కదా! మార్కెట్‌లో రకరకాల ఉత్పత్తుల్ని చూసి, వందశాతం ఫలితం అని ప్రకటనలిచ్చే వాటిని కొంటారు. వాటి కోసం ఎక్కువ డబ్బును వెచ్చిస్తారు. కానీ వాటి వల్ల ప్రయోజనం మాత్రం అంతంతమాత్రమే. ఇవన్నీ అందరికీ తెలిసిందే. అయినా వాటినే కొనక తప్పదుగా అంటారు చాలామంది. మీరు ఇవేమీ కొనక్కర్లేదు. వీటన్నింటికీ ప్రత్యామ్నాయం ఒకటి ఉంది. అదొక్కటి కొంటే చాలు. మీ ఇల్లు తళతళలాడుతుంది. అదే బొరిక్ పౌడర్. ఫినాయిల్, హిట్ లాంటివి ఏమి కొనకుండా ఒక్క బొరిక్ పౌడర్‌తోనే మీ ఇంటిని శుభ్రపరుచుకోవచ్చు. అదెలాగో చూద్దామా! బొరాక్స్‌ని డిటర్జంట్స్, కాస్మెటిక్స్ వంటివాటిల్లోనూ ఉపయోగిస్తారు.



■ **చెదల నివారణ**

ఇంట్లో చెదలు నివారించడమనేది అతి పెద్ద సమస్య. కనీసం సంవత్సరానికి రెండుసార్లు వీటిని నివారించడానికి మార్కెట్‌లో వున్న ఎన్నో ఉత్పత్తులు కొంటూ వుంటాం. ఈసారి బొరాక్స్ పౌడర్ చల్లి చూడండి. వంటిట్లో మురికిగా వున్న ప్రదేశాల్లో, మంచం కింద బొరాక్స్ పౌడర్‌ని చల్లితే కీటకాలు, బొద్దింకలు, చుంచు ఎలుకలు, చెదలు, నల్లులు చేరకుండా నివారించవచ్చు. బొరాక్స్ పౌడర్ చాలా వరకు చెదలు దరిచేరకుండా చేస్తుంది.

■ **మొండి మరకలు పోగొడుతుంది**

ప్రతి డిటర్జంట్‌లోనూ బొరిక్స్ పౌడర్‌ని వాడతారు. దీని వల్ల బట్టల మీద వున్న మొండి మరకలు తేలికగా పోతాయి. ఈ పొడితో కుండలు, పాన్స్, బెడ్స్ మీద వున్న ప్రతి మరకను తొలగించవచ్చు. నేలను శుభ్రపరచడానికి కూడా ఈ పౌడర్‌ని ఉపయోగించవచ్చు. బొరాక్స్ పౌడర్‌లో నిమ్మరసాన్ని కలిపి వాడవచ్చు.

■ **ఫంగస్ నివారణకు**

బొరాక్స్ ఇంట్లో ఫంగస్ పెరుగుదలనూ అడ్డుకుంటుంది. డాక్టర్లు కూడా వీటిని ఉపయోగించమని చెబుతున్నారు. దీని వల్ల శరీరంపై బ్యాక్టీరియా చేరదు. దీనివల్ల ఎటువంటి దుష్ప్రభావాలు వుండవు, ఫంగల్ ఇన్ఫెక్షన్స్ రావు.

■ **ఇతర ఉపయోగాలు**

బొరాక్స్ పౌడర్‌ని ఇంట్లో, ఫ్రిజ్, బాత్ రూమ్స్‌లో అక్కడక్కడా వేయడం వల్ల ఎటువంటి దుర్వాసనలు రావు. ఇంట్లో ఎటువంటి కలుపు మొక్కలు పెరగవు.

కొన్ని దేశాల్లో ఆహారాన్ని నిల్వ చేయడానికి కూడా దీన్ని ఉపయోగిస్తారు. బొరాక్స్ పౌడర్‌లో ఎటువంటి విష పదార్థాలు లేవు. దీన్ని వాడటం వల్ల కేన్సర్ వస్తుందన్న ప్రచారంలో వాస్తవం లేదు. చిన్న పిల్లలు, పెంపుడు జంతువులకు మాత్రం ఈ పొడిని దూరంగా ఉంచండి.

తమలపాకుతో
మధుమేహం అదుపు...!



తమలపాకులో పలు ఔషధ గుణాలున్నాయి. తమలపాకులను రోజుకొకటి నమిలితే గ్యాస్, ఎసిడిటీ దూరమవుతాయి. జీర్ణవ్యవస్థ పనితీరు మెరుగవుతుంది. రక్తంలోని చక్కెర స్థాయిలు తగ్గుతాయి. తద్వారా మధుమేహం అదుపులో ఉంటుంది. తమలపాకులకు కొద్దిగా తేనె కలిపి నమిలితే దగ్గు తగ్గిపోతుంది. చర్మ సంబంధ వ్యాధులు దూరమవుతాయి. తమలపాకులను వేడిచేసి వాపు, నొప్పి కలిగిన కీలు మీద కడితే నొప్పి తగ్గుతుంది. తమలపాకు రసం తీసుకుంటే గొంతు సమస్యలు తొలగిపోతాయి. మాటలో స్పష్టత వస్తుంది. కఫం తొలగిపోతుంది. జలుబు చేసి చిన్నపిల్లలు ఇబ్బంది పడుతున్న సమయంలో తమలపాకును వేడి చేసి కొద్దిగా ఆముదాన్ని రాసి, ఛాతిమీద వేసి కడితే ఉపశమనం లభిస్తుంది. తమలపాకును ముద్ద చేసి తలకు పట్టించాలి. ఓ గంటసేపు తర్వాత తలస్నానం చేస్తే చుండ్రు తగ్గుతుంది. తమలపాకుల్ని రోజూ నమిలితే లైంగిక పటుత్వమూ పెరుగుతుంది. శృంగార సామర్థ్యం రెట్టింపు అవుతుందిన ఆయుర్వేద నిపుణులు చెబుతున్నారు. శ్వాసకోశ సమస్యలతో బాధపడుతున్నవారికి తమలపాకులు బాగా పనిచేస్తాయి. వీటిని తగిన మోతాదులో తేనెతో కలిపి తీసుకుంటే మంచి ఉపశమనం లభిస్తుంది.



అతడు-ఆమె 97

డాక్టర్ వుప్పల లక్ష్మణరావు



జరిగిన కథ

ఏదో చాలా ముఖ్యం అయిన విషయం అంది. ఊర్వశిగారికి ముఖ్యమైన విషయాలన్నీ రాత్రేగాని, పగలు తట్టవా యేమిటని విసుక్కుంటూ వెళ్ళాను - షేక్స్పియర్ పుస్తకం కూడా చేతిలో పట్టుకునే.

"బర్మా కాందిశీకులకోసం చందాలు పోగు చెయ్యాలి - యెల్లుండి ఆదివారం ఉదయం బయలుదేరి వెళదాం - అనసూయ, దమయంతి, లీల ఇంకా యెవరెవరో నలుగురైదుగురు కూడా వస్తున్నారు, రమ్మన"మని. "ఎవరెవరి దగ్గిర కెళదాం అన్నా "అదంతా ఇప్పుడెందుకులే. అది నేను చూచుకుంటాను. వెనక పాటకి మీరుంటే - అసలు మేళం అంతా నేను నడిపిస్తా - తప్పకుండా రావాలిసుమా!" అంది. ఆమె మాటలతీరు నాకు నచ్చలేదు. కాని మంచిపని చేస్తూన్న పుడు మనం సాయం చేయకపోవడమేమిటని "సరే" అన్నాను.

(నిన్నటి సంచిక తరువాయి)

.....రాత్రి అంతా కలత నిద్దర. ఆ కలత నిద్దరలో అమృతరావు తమ్మెట్లు ధగధగ మెరుస్తూ వెండి బాణాల్లాగు కళ్ళలో పొడుస్తున్నట్టనిపించింది.

12 అతడు

ఈవేళ ఎంచేతో నాకు మంచి హుషారుగా వుంది.

పనులు చురుగ్గా సాగుతున్నాయి. నా 'ప్రీస్ట్రెస్డు కాంక్రీటు బ్రిడ్జీ డిజైను' కూడా బాగా జరుగుతుంది. ఒక చిక్కు వచ్చేటట్టు అవుపిస్తూంది. నా లెక్కల ప్రకారం మామూలు మైల్డుస్టీలు ఉపయోగించడానికి వీలులేదు. అందుకు బదులు హైటెన్ సైల్ స్టీలు కావాలి. ఎంత లేదన్నా 0.1 అంగుళం దళసరి తీగెకి 2,50,000 పి.ఎస్.ఐ. వుంటేనేగాని బలం చాలదు. అబ్బ! ఇంత బలంగల తీగెల మన దేశంలో తయారు కావడంలేదే? నా లెక్కల్లో యేదేనా తప్పుందేమో మళ్ళీ మరోసారి చూడాలి. పోనీ 1,50,000 పి.ఎస్.ఐ.డిజైను స్ట్రెస్ చూస్తే ఎలాగుంటుందో? నిజంగా ఇలాంటి ఖడ్డీలు 0.2 అంగుళాల మందంవి దొరికితే, ఇంకా ఎంత ఉక్కు కలిసి వస్తుందో కదా! దూలాల విషయం చూస్తే, రోల్డు స్టీలు బీము 24"×7"×100 పౌనులు అడుగులు మచ్చుకు తీసుకుంటే - రన్నింగ్సు అడుగుకీ 100 పౌన్లు బరువుగల ఉక్కు కావలసివస్తే - రీఇన్‌ఫోర్సుడు కాంక్రీటుకు 30 పౌనులు ఉక్కు చాలు. ప్రీస్ట్రెస్డు అయితే 8 పౌన్లు. మహా అయితే 9 పౌన్లు ఉక్కుతో సరిపోతుందే! అబ్బ,యెంత ఉక్కు కూడిక చెయ్యొచ్చు! అసలు కాంక్రీటు బరువులోనే రన్నింగు అడుగుకి 790 పౌన్లునుంచి 300 పౌన్లకు తగ్గించి తేలిక చేసేయవచ్చు. ఇంత కూడిక చేయటానికి అవకాశమా? నేను వేసినదానిలో ఏం పొరపాట్లు లేవుకదా? క్యూబిక్ క్రషింగు సాధారణ గ్రేడు కాంక్రీటుకి 2,250 పి.ఎస్.ఐ. అని తీసుకున్నాను. ఇది సరిగానే వుంది. దీనికి ప్రత్యామ్నాయంగా ప్రిస్ట్రెస్‌డుకి 5500 పి.ఎస్.ఏ. అని వొచ్చింది. అక్కడ డిజైన్ స్ట్రెస్ 750 పి.ఎస్.ఐ వుంటే ఇక్కడ 2,500 వేశాను. మైల్డుస్టీలు డిజైన్ స్ట్రెస్ 18,000 పి.ఎస్.ఐ. ప్రిస్ట్రెస్‌కి 1,50,000 వచ్చింది. స్టీలు దూలం చదరపు అంగుళానికి 8 టన్నులు డిజైను స్ట్రెస్ తప్పదుకదా! అక్కడ మోడ్యులస్ రేషో 15 వుంటే ఇక్కడ 6 తోనే సరిపోతూంది. స్టీలు అవుతే 29.5 చదరపు అంగుళాల దూలం. రీ ఇన్‌ఫోర్సుడు అవుతే ఇందుకు బదులు 5.9 చదరపు అంగుళాలా? ప్రీస్ట్రెస్డుకి 2.2 చదరపు అంగుళాలా? ఇంతే? ఏమిటి ఆశ్చర్యం! ఒక్క ఇనుం లోనే మూడింట రెండుపాళ్ళు కూడిక చేసుకోవచ్చు నన్నమాట!

అన్నట్టు రెండేళ్ళకిందట మీరట్‌లో మిలిటరీవాళ్ళు టాంకులకోసం మోటారు గరాజిలు కట్టేరుట ప్రీస్ట్రెస్డు పద్ధతిని ఉపయోగించి. దీన్ని గురించి వివరాలన్నీ వాళ్ళకిరాసి తెప్పించాలి. నిజంగా కొత్తపద్ధతులమీద పరిశోధన ఎంతేనా చేయడానికి అవకాశం వుందికదా? అయితే, నా మాటలు ఎవరు పట్టించుకుంటారు? తీర ఎవరితోనేనా చెప్పామా నేరకపోయి - చీఫ్ ఇంజనీరుచేత నేను వెనక తిట్లు తిన్నట్లే, మళ్ళీ తిట్లు తినాల్సొస్తుందేమో? తింటే తింటాను. అంతేనేకాని సాంకేతిక విద్యల అభివృద్ధిని, పరిశోధనలో అభ్యుదయాన్నీ మంటకలుపుతానా? 'లీమెక్కాల్' అమెరికన్ పద్ధతిగురించి కూడా తెలుసుకోవాలి. సంవత్సరంపాటు శెలవు పుచ్చుకొని మళ్ళీ కాలేజీలో




చేరి చదువుకుంటే బాగుండుననిపిస్తూంది. ఈ యుద్ధం రోజుల్లో సంవత్సరం కాదుకదా, వారంరోజులు సెలవు ఇవ్వడంలేదే. పోనీ కాలేజీ ప్రొఫెసర్లనీ కలుసుకొని నా లెక్కలనీ, డ్రాయింగులనీ చూపించి తప్పులూ పొరపాట్లూ ఎక్కడేనా దొర్లాయేమో చూడమని అడగాలి. అంతెందుకు సీతారాంగారు వున్నారుగా బాగా చదువుకున్న ఇంజనీరు. అతన్ని పిలిచి నాలుగైదురోజులు తదేకధ్యానంగా కూచుంటే నా డిజైనులో పొరపాట్లుంటే దిద్దగల మనిషి. నేను స్వదేశీ ఇంజనీరునే అయినా - అతడు నాలుగు దేశాలలో చదువుకుని విదేశపద్ధతులను చూసివొచ్చాడు కూడాను. చిత్రం అయిన మనిషి! ఇంజనీరింగు విషయాలు చర్చించినప్పుడూ వేమన పద్యాలనే సమయస్ఫూర్తిగా తీసుకొస్తాడు. అతని విశాఖపట్నం యాస వింటే నాకు ఇంటిమీద బెంగపడినట్టుంటుంది. డిక్సనుగురించి మాటాడుతూను - "పోనిద్దురూ - వాడొక బైతు, మరొకపోరి' కబురు 'తోలీయండి' ఎలా పారొస్తాడో అతను!" అన్నాడు. అని ఇద్దరం నవ్వుకున్నాం! ఈ యాస చెవిని పడితే మళ్ళీ విశాఖపట్నం వెలమపేట మార్కెట్టు - రంగిరీజు వీధి - అమ్మ అన్నీ జ్ఞాపకం వస్తాయి. సీతారాం ఇంటిపేరు 'కనగల' అని మొన్నే వాళ్ళు అన్నమాట. 'నాగవరపు వాళ్ళు' అంటే ద్రవిడులు, యక్షులు, నాగులు అనే నాగవంశమే. రెండువేల యేళ్ళ కిందటి వాళ్ళన్నమాట! ఈ మధ్య సీతారాం గారికి నాకు కలుస్తూంది. అన్నట్టు - మొన్న నేదో మాట సందర్భంలో కాంగ్రెసు వూసువొచ్చి సుభగారితో పరిచయం వున్నట్టు మాటాడేదు! ఏమి - సుభగారిని నేనేం గుత్తకి కొన్నానా? మరెవ్వరూ ఆమెకి పరిచయస్తులు వుండకూడదా? ఆమెతో నాకుకూడా పరిచయం వుందని నేను అనబోయాను. కాని సందర్భం ఆదివారం కనక యీవేళ వస్తాడనుకుంటాను. డిజైన్లూ నోటుబుక్కులూ అన్నీ సిద్ధంగా వుంచుతున్నాను. ఇంట్లో టెలిఫోను గ్రంట వాగింది. ఎవరు చెప్మా అనుకుని తీశాను. "నేను సుభని - జనార్దనరావుగారేనా? నేనూ మరికొంత మంది స్నేహితురాండ్రమూ మిమ్మల్ని చూడ్డానికి వస్తున్నాం. మరో అరగంటలో వస్తాం. ఇంట్లోనే వుండండేం - మేం వస్తూన్నాం అని పారిపోకండి!" అని - అక్కడి సంభాషణ ఆగిపోయింది. గొంతుక సుభగారి గొంతుకలా లేదే. ఒకవేళ జలుబు చేసిందేమో. స్నేహితులతో కలిసి వస్తున్నాం అంది. అందరికీ కాఫీ యిస్తే బాగుంటుందా? లేకపోతే - మరీ చనువు వున్నట్టు అనిపిస్తుందా? ఏమీ ఇవ్వకపోతే మర్యాద కాదేమో? ముక్కూ మొహం తెలీనట్టుగా నటించినట్టు వుంటుందేమో? ఈ ధర్మసందేహం ఎవరు తీరుస్తారు? ఎందుకేనా మంచిది అని అయ్యరుని పిలిచి పదిమందికి ఉప్మా, కాఫీ తయారుచెయ్యమన్నాను. సుభగారు ఇదివరకెప్పుడూ మా ఇంటికి రాలేదు. యెప్పుడు కలుసుకున్నా - అక్కడా అక్కడా కలుసుకోవడం తప్ప. అంచేత నాకు మరీ గాభరాగా వుంది.

మనసు స్తిమితంగా వుండటానికి - కాగితం, పెనసలు, స్లయిడు రూలు తీసి ఫ్రీటెన్షన్డు ప్రెస్డ్ కాంక్రీటుకిన్నీ, రీఇన్‌ఫోర్సు కాంక్రీటుకిన్నీ (1:2:4) ఫ్లెక్సురల్ రిజిడిటీ ఫార్ములాలు లెక్కగడదాం అని ప్రయత్నించాను. కాని ధ్యానం నిలవలేదు. గడియారం ఐదు గంటలు కొట్టింది. ఇంట్లోకీ కార్ల చప్పుడైంది. సుభ, ఆమెతోకూడా ఐదారుగురు స్త్రీలు- వాళ్ళతో కూడా గులాబుచంద్ సేట్జీ - వచ్చారు. సుభ అందం యేమని చెప్పను? ఆ కళ్ళలో తేజస్సు, ఆ ముఖంలో లావణ్యం ఏమని చెప్పను? అసలే సహజంగా అందమైన మనిషి, అందులోనూ తలంటిపోసుకున్నట్టుంది, మరీ చక్కగా వుంది. నా కళ్ళు అన్నీ ఆమెమీదే వున్నాయి. కాని అందరూ యేమనుకుంటారో అని సిగ్గుపడి కళ్ళు వాల్చేశాను. సుభతో వచ్చినవాళ్ళలో వొకావిడె ముందుకొచ్చి "మొట్టమొదట మీకొక క్షమాపణ చెప్పాలి. మీకు ఫోను చేసినది నేను కాని, సుభ కాదు. మీకు నా పరిచయం లేకపోబట్టి. ఆమె పేరు పెట్టుకుని చేశాను. అందుకు క్షమించండి జనార్దనరావుగారూ! మాలో సుభకు తప్ప మరెవరికీ పరిచయం లేదనుకుంటాను మీతో - అంచేత నేను పరిచయం చేస్తాను" అని అందరి పేర్లు చెప్పి: "నా పేరు ఊర్వశి మిత్రా. బహుశ మీరు వినేవుంటారు. సెట్జీ నాకు ముఖ్య స్నేహితుల్లో ఒకరు. ఆయన కాంగ్రెసు అభిమాని. నేను అచ్చంగా కాంగ్రెసు. వీళ్ళందరూ అటూ ఇటూను. మేం వచ్చిన పనికీ, కాంగ్రెసుకీ యేమీ సంబంధం లేదనుకోండి. ఆ పనేమిటంటే: బర్మా కాందిశీకుల సహాయార్థం చందాలు పోగుచేస్తున్నాం. మీ దగ్గరకి కూడా వచ్చాం. సీతారాంగారి దగ్గరకెళ్ళగానే, ఆయన వెయ్యి రూపాయలు విరాళం చెప్పి డబ్బు వెంటనే చెల్లించేశాడు. నన్ను చూసి సేట్జీగారు కూడా వెయ్యి రూపాయలకి చెక్కు ఇచ్చేశారు. ఇప్పుడు మీవంతు. సుభా! జనార్దనరావుగారికి కాగితం ఇయ్యి" అంది. ఆమె నిర్మొహమాటంగా మాటాడేస్తూంది. పెదిమెలకి, చెక్కిళ్ళకి, గోళ్ళకి పుష్కలంగా రంగేసుకుంది. వయస్సు ముప్పై నుంచి యేభై వరకూ ఎంతుంటుందో మరి! నేను ఎన్నో ప్రశ్నలు వేదాం అనుకున్నాను - ఈ నిధికి యేదేనా సంఘం అంటూ వుందా? డబ్బు యే బ్యాంకీలో వుంచుతారు? జమా ఖర్చులు చూడడానికి తగిన కట్టుదిట్టాలున్నాయా? అని. కాని ఊర్వశి గారు అడగడానికి అవకాశం యిచ్చిందా? అంకె వేసినదాకా ఒకటే మొహమాట పెట్టేస్తూంటే నేనేం ప్రశ్నల్ని అడగను? నేను కొంచెం తటపటాయించి రెండువందలు వేశాను. ఆ అంకె చూసి ఊర్వశిగారికి చాలా కోపం వచ్చింది. అంకె హెచ్చు వేస్తేనేగానీ వీల్లేదంది. సుభ ఆవిడని మందలించింది. దానిమీద సెట్జీ "ఊర్వశిగారూ! జనార్దనరావుగారు చాలా యోగ్యులు. ఆయనని మొహమాట పెట్టడం భావ్యంకాదు. ఆయన రెండు వందలూ రెండువేలతో సమానం అనుకోండి! ఇంకా వూళ్ళో మీకు తెలిసినవాళ్ళు చాలామంది వున్నారుకదా! నేనూ వస్తాను మీతో. రేపు మరికొందరి పెద్దమనుష్యుల దగ్గరికి వెళుదాం" అన్నాడు. దాంతో ఆవిడె ఆగింది. నేను చెక్కు పుస్తకం తీసి లెక్క రాయబోతూంటే ఆవిడె అంది: "చెక్కు నాపేర రాయండి. రోజులు బాగులేవు. గవర్నమెంటుకి ఏ నిముషానికేనా కళ్ళు కుట్టొచ్చు సంస్థల పేర బ్యాంకు ఖాతా వుంటే. అంచేత వ్యక్తులపేర వుంటేనే సురక్షితం. రశీదు మీకు పంపిస్తాలెండి !" అని అంటూ లేచిపోయింది.

- ఇంకా వుంది.

విటమిన్లు... ముఖ్య సమాచారం



- విటమిన్లు శరీరానికి కావలసిన ముఖ్యమైన అమైనో ఆమ్లాలు
- వైటల్, అమైన్ అనే పదాల నుంచి విటమిన్స్ అనే పదం రూపొందింది.
- సర్ హెచ్.జి.హోప్‌కిన్స్ 1912లో మొదటిసారిగా పాలల్లో విటమిన్లను గుర్తించారు.
- విటమిన్లు అనే పదాన్ని సూచించింది ఫంక్.
- విటమిన్ల గురించి అధ్యయనం చేసే శాస్త్రం 'విటమినాలజీ'
- విటమిన్ల ద్రావణీయత ఆధారంగా అవి రెండు రకాలు :

1. కొవ్వులో కరిగే విటమిన్లు
2. నీటిలో కరిగే విటమిన్లు

- కొవ్వులో కరిగే విటమిన్లు ఎ, డి, ఇ, కె
- నీటిలో కరిగే విటమిన్లు బి, సి.
- విటమిన్లు ఎంజైములకు సహ ఎంజైములుగా పనిచేస్తాయి.
- ఇవి సూక్ష్మపోషకాలుగా వ్యవహరిస్తాయి.
- విటమిన్లు దేహ నిర్మాణంలో కానీ, శక్తినివ్వడంలోకానీ పాలుపంచుకోవు. కానీ దేహంలో జరిగే విధంగా జీవక్రియలు సక్రమంగా జరిగేలా పనిచేస్తాయి.

విటమిన్ - ఎ

- విటమిన్ ఎ రసాయనిక నామం 'రెటినాల్'.
- మరో పేరు 'యాంటీ గ్జెరాఫ్తాల్మిక్ విటమిన్'.
- ఇది కంటిచూపుకు తోడ్పడే విటమిన్
- రక్తనాళాల్లో మ్యూకస్ అనే పొరను రక్షిస్తుంది.
- రెటీనాలో వర్ణద్రవ్యాల్ని ఏర్పరచడానికి ఉపయోగపడుతుంది.
- మొక్కల్లో విటమిన్ ఎ బీటా కెరోటిన్ రూపంలో ఉంటుంది.
- ఆకు కూరల్ని ఆహారంగా తీసుకున్నపుడు బీటా కెరోటిన్ శరరంలోని పేగుల్లో విటమిన్ ఎ గా మారుతుంది.
- రోజువారీ తీసుకునే ఆహారంలో విటమిన్ ఎ ఉండాల్సిన పరిమాణం 750 మిల్లీగ్రాములు.
- విటమిన్ ఎ లోపం వల్ల ప్రతి ఏడాది భారత్‌లో అంధత్వానికి గురయ్యేవారి సంఖ్య 60 వేలని ఒక అంచనా.
- దీని లోపం వల్ల రేచీకటే కాకుండా వర్ణాంధత్వం కూడా సంభవిస్తుంది.
- లభ్యమయ్యే పదార్థాలు : బొప్పాయి, క్యారెట్, ఆకుకూరలు, గుడ్లు, చేప నూనె, పాలు, పసుపు పచ్చని ఫలాలు (గుమ్మడిపండు, జామపండు), కాలేయం, వెన్న, టొమాటో.
- మానవ శరీరం ఆరు నెలలపాటు విటమిన్ ఎను నిల్వ ఉంచుకోగలదు.
- జాతీయ పోషకాహార సంస్థ (ఎన్ఐఎన్) ప్రతి ఆరునెలలకు ఒకసారి పాఠశాల పిల్లలకు విటమిన్-ఎ ను అందించడం ద్వారా అంధత్వాన్ని నివారించవచ్చని సిఫారసు చేసింది.
- విటమిన్ ఎ లోపించడం వల్ల చర్మం పొడిబారుతుంది.
- కనుగుడ్లు ఎండిపోవడాన్ని 'జెరాఫ్తాల్మియా' అంటారు.
- విటమిన్-ఎకు 'యాంటీ ఇన్ఫెక్టివ్' విటమిన్ అనే మరో పేరు కూడా ఉంది.
- నేత్రగోళం మీద కార్నియా శాశ్వతంగా నశించిపోవడాన్ని 'కేరటో మలేసియా' అంటారు.
- లాక్రిమల్ గ్రంథులు విడుదల చేసే స్రావాలు ఆగిపోవడం వల్ల నేత్రాలు పొడిబారిపోయి జెరాఫ్తాల్మియాకు కారణమవుతుంది.
- రేచీకటి వ్యాధినే 'నిక్టిలోఫియా' అంటారు.
- కన్ను తెల్లగుడ్డు మీద తెల్లని చారలు మచ్చల్లా కనిపిస్తాయి. వీటిని బైటాల్ చుక్కలు అంటారు. ఇవి విటమిన్ ఎ లోపం వల్ల ఏర్పడతాయి.

విటమిన్-బి

- విటమిన్ - బి కాంప్లెక్స్ 8 రకాలు

1. విటమిన్ - బి 1

- దీని రసాయన నామం 'థమియన్'.
- వాడుక పేర్లు యాంటీ బెరిబెరి, యాంటీ న్యూరైటిస్ విటమిన్.
- పాలిష్ చేసిన బియ్యంలో ఈ విటమిన్ లోపిస్తుంది.
- హృదయస్పందన క్రమరహితమవ్వడాన్నే 'బెరిబెరి' అంటారు.
- నరాలు బలహీనమవ్వడం, పాక్షిక పక్షవాతాన్నే పాలీన్యూరైటిస్ అంటారు.
- లభ్యమయ్యే పదార్థాలు : వేరుశనగ, తవుడు, సోయాబీన్స్, దంపుడు బియ్యం, గంజి, బియ్యం, గోధుమ, జొన్నల్లోని పైపొరలు.

2. విటమిన్ - బి 2

- దీని రసాయన నామం 'రైబోఫ్లేవిన్'.
- వాడుకపేర్లు ఎల్లో విటమిన్, యాంటీ ఖీలోసిస్ విటమిన్, యాంటీ గ్లాసైటిస్ విటమిన్, విటమిన్ జి.
- ఆవుపాలు లేత పసుపు రంగులో ఉండటానికి కారణం విటమిన్- బి2.
- లోపం వల్ల వచ్చే వ్యాధులు : ఖీలోసిస్, గ్లాసైటిస్, డెర్మటైటిస్.
- నోటి మూలాలు పగలడాన్ని 'ఖీలోసిస్' అంటారు.
- గ్లాసైటిస్‌లో వల్ల నాలుకపై పూత, నాలుక మంట కనిపిస్తాయి.
- ముఖంపై చర్మం పాటిపోవడాన్నే 'డెర్మటైటిస్' అంటారు.
- లభ్యమయ్యే పదార్థాలు : కొబ్బరి, బార్లీ, జీడిమామిడి, బాదం పప్పు, రాగులు, తవుడు, బొప్పాయి, గుడ్లు, పాలు, కాలేయం, మూత్రపిండం.
- పాలను బాగా మరగబెట్టినప్పుడు అవి లేత పసుపు రంగు పొందడానికి కారణం పాలలో రైబోఫ్లేవిన్ ఉండటమే.

3. విటమిన్ - బి3

- దీని రసాయన నామం 'నియాసిన్' లేదా 'నికోటిన్ ఆమ్లం' లేదా 'నికోటీనమైడ్'.
- వాడుక పేర్లు యాంటీ పెల్లాగ్రా విటమిన్ 4 డి విటమిన్, సుస్థిర విటమిన్, విటమిన్ - పీపీ
- ఇది ఎన్‌డీపీ, ఏడీపీ సంయోగాల తయారీలో క్రియాశీలకంగా పనిచేస్తుంది.
- ఈ విటమిన్‌ను ఆక్సీకరణ, ఉష్ణం తేలికగా నాశనం చేయలేవు.
- లోపం వల్ల వచ్చేవ్యాధులు : పెల్లాగ్రా, పెదాలు లావెక్కడం, మచ్చలతో, మందమైన చర్మంతో అరిచేతులు తయారవడం.
- చర్మం గరుకుగా తయారై, పొలుసులుగా ఏర్పడి ఊడిపోవడాన్ని 'పెల్లాగ్రా' అంటారు.
- లభ్యమయ్యే పదార్థాలు : ముల్లంగా, బఠాణీ, కాలేయం, ఈస్ట్, చేపలు, వేరుశనగ.

4. విటమిన్ - బి5

- దీని రసాయన నామం 'పాంటోథెనిక్ ఆమ్లం
- ప్రకృతిలో విరివిగా లభించడం వల్ల దీన్ని 'సర్వ విస్తృత విటమిన్' అంటారు.
- గ్రీకు భాషలో పాంటోథెస్ అంటే ప్రతిచోటా అని అర్థం.
- లోపం వల్ల వచ్చే వ్యాధులు : పెరుగుదల మందగించడం, వెంట్రుకలు రాలడం, బాల నెరుపు, ఆర్థరైటిస్, బర్నింగ్ ఫీట్.
- కీళ్ల వాతాన్నే ఆర్థరైటిస్ అంటారు.
- అరికాళ్లు, అరిచేతుల్లో మంటలు పుట్టడాన్ని 'బర్నింగ్ ఫీట్' అంటారు.
- లభ్యమయ్యే పదార్థాలు : కాయగూరలు, కాలేయం, గుడ్లు, మాంసం, చిలగడదుంప, చేపలు, పాలు, ఈస్ట్, ధాన్యాలు, పండ్లు.

4. విటమిన్ - బి 6

- దీని నామం 'పైరిడాక్సిన్'.
- వాడుక నామం యాంటీ అనీమియా విటమిన్.
- అమైనో ఆమ్లాల ఉత్పత్తిలో, జీర్ణక్రియలో బీ 6 విటమిన్ క్రియాశీలకంగా వ్యవహరిస్తుంది.
- ప్రతి రక్షకాలు, హిమోగ్లోబిన్‌ల ఉత్పత్తిలో పాల్గొంటుంది.
- **లోపం వల్ల వచ్చే వ్యాధులు :** అజీర్తి, రక్తహీనత, ఫిట్స్ లాంటి వ్యాధులు, కోపం ఎక్కువగా రావడం, అనీమియా, మొటిమలు, చర్మవ్యాధులు.
- **లభిచే పదార్థాలు :** గోధుమ, దంపుడు బియ్యం, సోయా చిక్కుడు, మాంసం, గుడ్లు, కాలేయం, పాలు, గుడ్డు సొన.

5. విటమిన్ - బి 7

- దీన్ని విటమిన్ హెచ్ అంటారు.
- సల్ఫర్ మూలకం కలిగిన విటమిన్ ఇది.
- 1939లో ఈ విటమిన్‌ను కనిపెట్టారు.
- అమైనా ఆమ్లాల, కొవ్వు ఆమ్లాల జీవనక్రియల్లో ఇది తోడ్పడుతుంది.
- పచ్చిగుడ్డు తాగడం వల్ల శరీరం విటమిన్ బి7ను కోల్పోతుంది.
- దీని రసాయనిక వాడుక నామం 'బయోటిన్'
- లోపం వల్ల వచ్చే వ్యాధులు : కండరాల నొప్పులు, అలసట, నాడీ మండలంలో తేడాలు సంభవించడం, మానసిక రుగ్మత, రక్తంలో కొలెస్ట్రాల్ అధికమవ్వడం, ఆకలి మందగించడం.
- లభించే పదార్థాలు : చేపలు, మాంసం, సోయాచిక్కుడు, టొమాటో, పాలు, కాలేయం, మూత్రపిండం, గింజలు, కాయగూరలు.

6. విటమిన్ - బి 11

- వాడుక నామం 'ఫోలిక్ ఆమ్లం' లేదా 'ఫొలాసిన్'. రసాయన నామం కూడా ఇదే.
- దీన్ని ఎం - విటమిన్ అని కూడా అంటారు.
- దీన్ని ఎల్లాప్రగడ సుబ్బారావు కనుగొన్నారు.
- గర్భిణులకు మొదటిసారిగా ఇచ్చే విటమిన్ ఫోలిక్ ఆమ్లం.
- ఈ ఆమ్లం స్పినాక్ పత్రాల నుంచి మొదటిసారిగా లభ్యమైంది.
- 'ఫోలియం' అంటే 'పత్రం' అని అర్థం.
- కోలన్, సీరైన్ల సంశ్లేషణలో, న్యూక్లిక్ ఆమ్లాల (డీఎన్ఏ, ఆర్ఎన్ఏ) సంశ్లేషణలో ఫోలిక్ ఆమ్లం ఉపయోగపడుతుంది.
- లోపం వల్ల వచ్చే వ్యాధులు : రక్తహీనత, అతిసారం, మానసిక రుగ్మతలు.
- లభించే పదార్థాలు : మొక్కజొన్న, గోధుమ, మొలకెత్తే గింజలు, ఆకు కూరలు, ధాన్యాలు, ఫలాలు, పాలు, గుడ్లు, మాంసం, కాలేయం.

7. విటమిన్ - బి 12

- దీని రసాయన నామం 'సయనకోబాలమిన్'
- దీని మరో రసాయన నామం 'కోబాలమిన్'
- దీన్నే 'యాంటీ ఫెర్నీషియస్ ఎనీమియా' విటమిన్ అంటారు.
- నీలి రంగులో ఉంటూ కోబాల్ట్ (జశీ) అనే లోహ మూలకాన్ని కలిగి ఉంటుంది.
- ఇది కేంద్రకామ్లాల సంశ్లేషణలో, ఎర్ర రక్తకణాలు ఏర్పడటానికి, యాంటీ బాడీల ఉత్పత్తికి, నాడీ కణపు మైలిన్ తొడుగు ఉత్పత్తికి ఉపయోగపడుతుంది.
- **లోపం వల్ల వచ్చే వ్యాధులు :** పెర్నీషియస్ అనీమియా, మాక్రోసైటిక్ అనీమియా, బాలింతల్లో పాల ఉత్పత్తి కుంటుపడుట, హానికర రక్తహీనత.
- **లభించే పదార్థాలు :** కోడి మాంసం, పాలు, గుడ్లు, కాలేయం.

విటమిన్ - సి

- దీని రసాయన నామం 'ఆస్కార్బిక్ ఆమ్లం'.
- దీని వాడుక నామం 'యాంటీ స్కర్వీ విటమిన్.'
- గాయాలు త్వరగా మానడానికి, రోగ నిరోధకశక్తి పెరగడానికి, విరిగిన ఎముకలు త్వరగా అతుక్కోవడానికి విటమిన్ సి దోహదపడుతుంది.
- దంతాలలో డెంటిన్ అనే పదార్థం ఏర్పడటానికి దోహదం చేస్తుంది.
- దీని లోపం వల్ల రక్తనాళాలు పెళుసుగా అవుతాయి. చిగుళ్లు చిట్లి రక్తస్రావం జరుగుతుంది.
- స్కర్వీ వ్యాధిని 'సెయిలర్స్ డిసీజ్' అని కూడా అంటారు.
- **లభించే పదార్థాలు :** సిట్రస్ జాతి ఫలాలు (నిమ్మ, ఉసిరి), జామకాయలు, టొమాటో, ఆకుకూరలు.

విటమిన్ - డి

- దీని రసాయనిక నామం 'కాల్సిఫెరాల్'.
- వాడుక నామాలు సన్‌షైన్ విటమిన్, ఫ్రీ విటమిన్, హార్మోన్ లాంటి విటమిన్, యాంటీ రికెటింగ్ విటమిన్.
- అన్నవాహిక నుంచి కాల్షియం, ఫాస్ఫరస్‌లను ఎక్కువగా గ్రహించి ఎముకలు ఏర్పడటానికి, గట్టిపడటానికి తోడ్పడుతుంది.
- సూర్యరశ్మిలోని యూవీ కిరణాల ద్వారా చర్మం కింద గల కొలెస్టరాల్ విటమిన్ డిగా తయారవుతుంది.
- చిన్నపిల్లల్లో విటమిన్ డి లోపం వల్ల రికెట్స్, పక్షి లాంటి ఛాతీ, రాకిటిక్ రోజరీ అనే వ్యాధులు వస్తాయి.
- పెద్దవారిలో ఆస్టియోమలేసియా, ఆస్టియోపోరోసిస్ అనే వ్యాధులు వస్తాయి.
- దొడ్డికాళ్లు, ముట్టి కాళ్లు ఏర్పడటాన్ని 'రికెట్స్' అంటారు.
- పక్కటెముకల్లో బుడిపెటు ఏర్పడటాన్ని రాకిటిక్ రోజజీ అంటారు.
- **లభించే పదార్థాలు :** సూర్యరశ్మి, కాడ్, షార్క్ చేపల కాలేయనూనె, పాలు, క్యాబేజీ, గుడ్డు (పచ్చసొన)
- ప్రపంచంలో 80శాతం మంది డి-విటమిన్ లోపంతో బాధపడుతున్నారని ప్రపంచ ఆరోగ్య సంస్థ (డబ్ల్యూహెచ్ఓ) నివేదిక తెలుపుతోంది.

విటమిన్ - ఇ

- దీని రసాయనిక నామం 'టొకొఫెరాల్'.
- వాడుక నామాలు 'బ్యూటీ విటమిన్', 'యాంటీ స్టెరిలిటీ విటమిన్'.
- త్వచాల నిర్మాణానికి, యాంటీ యాక్సిడెంట్‌గా, కొటోజెనెసిస్, లైపోజెనెసిస్ ఆక్సీకరణ ప్రక్రియలకు, ప్రత్యుత్పత్తి వ్యవస్థ సక్రమ నిర్వహణకు, ముఖంపై ముడుతలు రాకుండా ఉండటానికి ఈ విటమిన్ ఉపయోగకరం.
- లోపం వల్ల వచ్చే వ్యాధులు : కండరాల క్షీణత, ఎర్రరక్తకణాలు విచ్ఛిన్నం అవడం, పురుషుల్లో వంధ్యత్వం, స్త్రీల్లో రుతుస్రావం, గర్భస్రావం.
- **లభించే పదార్థాలు :** సోయా చిక్కుడు, పత్తి గింజల నూనె, పామ్ ఆయిల్, గోధుమ, చిలగడ దుంపలు, పొద్దుతిరుగుడు గింజల నూనె, ఫలాలు.

విటమిన్ - కె

- దీని రసాయనిక నామం 'నాఫ్తోక్వినోన్' లేదా 'ఫిల్లోక్వినోన్'.
- వాడుక నామాలు రక్తస్కందన విటమిన్, రక్తస్రావక నిరోధక విటమిన్ (కొయాగ్యులేషన్ విటమిన్).
- ప్రోత్రాంబిన్ ఏర్పరచడంలో ఉపయోగపడుతుంది.
- రక్తం గడ్డకట్టడంలో ఉపయోగపడుతుంది.
- లోపం వల్ల వచ్చే వ్యాధులు : గాయాలైనప్పుడు ఆగని రక్తస్రావం, పిల్లల్లో వచ్చే కామెర్లు.
- విటమిన్ కెను కనుక్కొన్నవారు డాయిసీడాం.
- **లభించే పదార్థాలు :** క్యాలీఫ్లవర్, క్యాబేజీ, గుడ్లు, ఆకుకూలరు, ఆవుపాలు, టొమాటో.
- ఆపరేషన్ చేయడానికి ముందు రోగికి, ప్రసవానికి ముందు గర్భిణికి, కె.విటమిన్‌ను ఇస్తారు.
- శరీరంలో విటమిన్లు మితిమీరి చేరితే కొన్ని విశిష్ట రోగ లక్షణాలు ఏర్పడతాయి. విటమిన్లు ఎక్కువైన స్థితిని 'అతివిటమినీయ స్థితి' అంటారు.
- సి విటమిన్ ఎక్కువైతే గౌట్ వ్యాధి, మూత్రపిండాల్లో రాళ్లు ఏర్పడతాయి.
- డి విటమిన్ ఎక్కువైతే మృతు కణజాలం అస్థీకరణ చెందుతుంది.

జంతుశాస్త్రంలో అతి పెద్దవి, అతి చిన్నవి

- అతి పురాతన క్షీరదం - ఎకిడ్నా
- అతి పెద్ద భౌమ్య క్షీరదం - ఆఫ్రికా ఏనుగు
- అతి పెద్ద మాంసాహార క్షీరదం - కొడైక్ బీర్
- అతిపెద్ద క్షీరదం - బ్లూవేల్
- అతిపెద్ద సర్పం - పైథాన్
- అతిపెద్ద విషసర్పం - నాజా హన్నా
- అతి ఎత్తయిన జంతువు - జిరాఫీ
- అత్యధిక దూరం గెంతే జంతువు - కంగారు
- అత్యంత వేగంగా పరుగెత్తే జంతువు- చిరుత
- అతి ఎక్కువ కాలం జీవించే జంతువు- జైంట్ టార్టాయిస్
- అతి పెద్ద పక్షి - ఆస్ట్రిచ్
- అతి చిన్న పక్షి - హమ్మింగ్ బర్డ్
- అతిపెద్ద సముద్ర పక్షి - అల్బెట్రాస్
- అత్యంత వేగంగా పయనించే పక్షి - స్విఫ్ట్ పక్షి
- అత్యధిక దూరం వలస వెళ్లే పక్షి - ఆర్కిటెక్ టెర్న్
- ప్రస్తుతం జీవించిఉన్న అతిపెద్ద సరిసృపం - స్ట్రూతియోకేలమిన్
- ప్రస్తుతం జీవించి ఉన్న అతి పురాతన సరీసృపం- స్ఫినోడాన్




ప్రవేశాలు

టీఎస్ఆర్‌జేసీ సెట్-2018

తెలంగాణలోని 8 గురుకుల(రెసిడెన్షియల్) జూనియర్ కాలేజీల్లో 2018-19కి గాను ఇంటర్ ప్రథమ సంవత్సరంలో ప్రవేశానికి నిర్వహించే 'తెలంగాణ రాష్ట్ర రెసిడెన్షియల్ జూనియర్ కాలేజీ సెట్-2018 : టీఎస్ఆర్‌జేసీ సెట్-2018) నోటిఫికేషన్ వెలువడింది.

కోర్సు : ఇంటర్మీడియెట్ ప్రథమ సంవత్సరం.
విభాగాలు : ఎంపీసీ, బీపీసీ, ఎంఈసీ.
అర్హతలు : మార్చి 2018లో తుది పరీక్షలు రాయబోతున్న తెలంగాణలోని 31 జిల్లాల అభ్యర్థులు అర్హులు.
ఎంపిక : ప్రవేశపరీక్ష.
దరఖాస్తు రుసుం : రూ.150.
దరఖాస్తు విధానం : ఆన్‌లైన్.
దరఖాస్తుల ప్రారంభం : మార్చి 6, 2018.
దరఖాస్తు చివరి తేదీ : ఏప్రిల్ 9, 2018.
వెబ్‌సైట్ : http://tsrjdc.cgg.gov.in



కేంద్రీయ విద్యాలయాల్లో ప్రవేశాలు

దేశ వ్యాప్తంగా ఉన్న కేంద్రీయ విద్యాలయాల్లో 2018-19కి గాను 1వ, 2వ తరగతిలో ప్రవేశాలకు దరఖాస్తులు కోరుతూ ప్రకటన విడుదలైంది.

దరఖాస్తు స్వీకరణ తేదీలు : ఒకటో తరగతిలో ప్రవేశాలకు మార్చి 1, 2018 నుంచి; రెండో తరగతి నుంచి పదో తరగతి వరకు(ఖాళీలను బట్టి మాత్రమే) ప్రవేశాలకు ఏప్రిల్ 2 నుంచి దరఖాస్తులు స్వీకరిస్తారు.
దరఖాస్తు చివరి తేదీ : ఒకటో తరగతిలో ప్రవేశాలకు చివరి తేదీ మార్చి 19, 2018. రెండో తరగతి నుంచి పదో తరగతి వరకు ప్రవేశాలకు ఏప్రిల్ 9, 2018.
వెబ్‌సైట్ : http://kvsangathan.nic.in

విశాలాంధ్ర బిజినెస్

సెన్సెక్స్	నిఫ్టీ	బంగారం (విజయవాడ)	బంగారం (విశాఖపట్నం)	వెండి (విజయవాడ)	వెండి (విశాఖపట్నం)	డాలరు Vs రూపాయి
-44.43 ▼	-15.80 ▼	150 ▲	29,020	-400 ▼	41,500	
33,307.14	10,226.85	29,050	ప్రొద్దుటూరు 29,020	39,500	ప్రొద్దుటూరు 41,541	65.17
		22 క్యారెట్లు, 10 గ్రాములు	22 క్యారెట్లు, 10 గ్రాములు	కిలో (రూపాయల్లో)	కిలో (రూపాయల్లో)	

టాప్ గెయినర్స్ (సెన్సెక్స్)

కంపెనీ	ప్రస్తుత ధర	మార్పు (శాతాల్లో)
హెచ్‌డీఎఫ్‌సీ	1,818.45	1.17
టీసీఎస్	3,304.50	1.10
ఇన్ఫోసిస్	1,163.40	0.58
హెచ్‌యుఎల్	1,303.50	0.56
లార్సెన్	1,295.00	0.54

టాప్ లూజర్స్ (సెన్సెక్స్)

కంపెనీ	ప్రస్తుత ధర	లాస్ (శాతాల్లో)
టాటాస్టీల్	605.60	-4.66
అదానీపోర్ట్స్	377.30	-2.91
యాక్సిస్ బ్యాంక్	505.45	-2.85
సన్‌ఫార్మా	519.75	-1.67
ఐసీఐసీఐబ్యాంక్	300.95	-1.43

విదేశీమారకం విలువ (ఫారెక్స్)

కరెన్సీ	రూ.విలువ (క్రి.ముగింపు)	రూ.విలువ (ప్ర.ముగింపు)
డాలర్	64.88	65.17
యూరో	80.52	80.15
పౌండ్	89.97	90.16
ఆస్ట్రేలియా డాలర్	50.67	50.80
సింగపూర్ డాలర్	49.34	49.45

బులియన్

బంగారం (10 గ్రాములు)	22 క్యారెట్లు రూ.	24 క్యారెట్లు రూ.
హైదరాబాద్	29,020	31,037
చెన్నై	29,050	31,069
బెంగళూరు	28,600	30,160
ముంబై	29,940	32,021
విజయవాడ	29,050	31,400
విశాఖపట్నం	29,020	31,040
ప్రొద్దుటూరు	29,020	30,470
ముడి చమురు		63.61



స్వల్పంగా తగ్గిన

బంగారం, వెండి ధరలు

న్యూఢిల్లీ: బంగారం ధరలు శుక్రవారం స్వల్పంగా తగ్గాయి. 10గ్రాముల బంగారం ధర రూ.100లు తగ్గి రూ.31,350 వద్ద నిలిచింది. వెండి ధర కూడా రూ.115లు తగ్గి కేజీ వెండి ధర రూ.39,385లకు చేరింది. పరిశ్రమలు, నాణేల తయారీదారుల నుండి డిమాండ్ తగ్గడం ధరలు తగ్గడానికి ప్రధానకారణంగాఉంది.అంతర్జాతీయంగా బంగారం ధర 0.27శాతం తగ్గి ఔన్స్ 1318 డాలర్లు పలికింది. వెండి ధర 0.21శాతం తగ్గి ఔన్స్ 16.43కి చేరింది. దేశ రాజధానిలో 99.9 శాతం మరియు 99.5శాతం స్వచ్ఛమైన బంగారం ధర రూ.100లు తగ్గి రూ.31,350 మరియు రూ.31,200 పలికింది. సవరు బంగారం ధర రూ.24,800 పలికింది.

తగ్గిన రూపాయి విలువ



ముంబై:డాలర్ మారకంతో రూపాయి విలువ శుక్రవారం 0.02 శాతం తగ్గి 65.16 వద్ద నమోదైంది. గురువారం 65.18 పలికింది. ప్రారంభ మార్కెట్‌లో 65.15 వద్ద ప్రారంభమై 65. 05, 65.17 మధ్య ఊగి సలాడి చివరకు 65.16 వద్ద ముగిసింది. ఈ ఏడాది ఇప్పటివరకు రూపాయి 1.98శాతం నష్టపో యింది. ఆసియా కరెన్సీలు తక్కువగానే నమోదవుతున్నాయి. జపానీస్ యెన్ 0.440శాతం, మలేషియన్‌రింగిట్ 0.120శాతం, తైవాన్ డాలర్ 0.102శాతం సింగపూర్ డాలర్ 0.068 శాతం, థాయ్ బాత్ 0.003శాతం నష్టపోయాయి. ఇండోనేషియన్ రూపాయి 0.130శాతం ఫిలిప్పిన్స్ పెసో 0.108 శాతం, చైనా ఆఫ్‌షోర్ 0.080 శాతం, సౌత్ కొరియా వాన్ 0.065 శాతం హాంగ్‌కాంగ్ డాలర్ 0.019 శాతం నష్టపో యాయి. డాలర్ ఇండెక్స్ ఇతర ప్రధాన కరెన్సీ లతో పోల్చుకుంటే బలపడిందనే చెప్పవచ్చు. 0.01శాతం పెరిగి 90.188 వద్ద ట్రేడ్ అయింది.

త్వరలో షావోమి మరో బడ్జెట్ ఫోన్

ముంబై: చైనా మొబైల్ మేకర్ షావోమి త్వరలోనే మరో బడ్జెట్ స్మార్ట్‌ఫోన్‌ను లాంచ్ చేయనుంది. ఇప్పటికే బడ్జెట్ ఫోన్లతో మొబైల్ మార్కెట్‌లో సంచలనం రేపుతున్న షావోమి మరోసారి బడ్జెట్‌ధర, ప్రీమియం ఫీచర్లతో భారత వినియోగదారులకు ఆకట్టుకునేందుకు రడీ అవుతోంది. ఈ మేరకు షావోమి ఇండియా ఎండీ మను కుమార్ జైన్ ట్విటర్ లో ఒక టీజర్‌ను పోస్ట్ చేశారు. తమ స్లిమ్, స్లీక్, కాంపాక్ట్ పవర్ హౌస్ స్మార్ట్‌ఫోన్‌ను ఈ నెల 14న లాంచ్ చేయబోతున్నట్టు వెల్లడించారు. ఇప్పటికే చైనాలో విడుదల చేసిన రెడ్‌మి 5 ఇకపై భారతీయ కస్టమర్లకు అందుబాటులోకి తేనుందనే అంచనాలు భారీగా నెలకొన్నాయి. రూ.7వేలుగా దీని ధరను నిర్ణయించనుందని సమాచారం.

రాహుల్‌కు సీనియర్ల పోటు

- ఎన్నిక వద్దు...నియామకాలే ముద్దు
- సీడబ్ల్యూసీ సభ్యుల ఎన్నికపై పెద్దల వాదన
- పార్టీ పటిష్టతకు యత్నం



న్యూఢిల్లీ: కాంగ్రెస్ పార్టీ పునరుజ్జీవానికి ఆ పార్టీ అధ్యక్షుడు రాహుల్‌గాంధీ విశ్వప్రయత్నం చేస్తున్నారు. ఓ పక్క ప్రతిపక్ష పార్టీగా మోదీ ప్రభుత్వంపై పోరాటం చేస్తూనే మరోపక్క పార్టీని సంస్థాగతంగా పటిష్టవంతం చేయడానికి కృషి చేస్తున్నారు. ఇందుకు పార్టీ సీనియర్ల నుంచి రాహుల్‌కు సరైన సహకారం లభించడం లేదు. అదే సమయంలో రాహుల్ కూడా సీనియర్లను పక్కనపెట్టే యోచనలో కనిపిస్తున్నారు. పార్టీ పనితీరులో అంతర్గత మార్పులు తీసుకురావడానికి రాహుల్ నానాప్రయత్నాలు చేస్తున్నారు. కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ(సీడబ్ల్యూసీ)లో 12 స్థానాలకు ఎన్నికలు నిర్వహించాలని రాహుల్ భావిస్తున్నారు. దీనికి పార్టీలోనే ప్రత్యేకించి సీనియర్ల నుంచి ప్రతిఘటన వస్తు న్నది. సీడబ్ల్యూసీ అనేది కాంగ్రెస్ పార్టీకి విధాన నిర్ణాయక సంస్థ. కాంగ్రెస్ అధినేతగా పదోన్నతి పొందిన 47 ఏళ్ల రాహుల్‌గాంధీ... సీడబ్ల్యూసీ సభ్యులను ప్రజాస్వామ్య బద్ధంగా ఎన్నుకుంటామని ప్రకటించారు. సీడబ్ల్యూసీలో 24 మంది సభ్యులు ఉంటారు. అందులో 12 మందిని ఎన్నిక ద్వారా, మరో 12 మందిని నియామకం ద్వారా తీసుకోవాలని రాహుల్ కోరుకున్నారు. సీడబ్ల్యూసీకి కాంగ్రెస్ పార్టీ చీఫ్ అధ్యక్షుడిగా ఉంటారు. ఒకవేళ సీడ బ్ల్యూసీకి రాహుల్ ఎన్నిక నిర్వహిస్తే 19 ఏళ్లుగా పార్టీ చీఫ్‌గా తన తల్లి సోనియాగాంధీ కొనసాగించిన సంప్రదాయానికి రాహుల్ తూట్లు పొడిచినట్టే. తన హయాంలో సోనియా సభ్యులం దరినీ నియామకం ద్వారానే తీసుకున్నారు. కాంగ్రెస్ పార్టీ నిబంధనావళి సైతం ఎన్నికల నిర్వహించాలని చెబుతున్నప్పటికీ రాహుల్ ఆలోచనకు సీనియర్లు అడ్డుపుల్ల వేస్తున్నారు. సీడబ్ల్యూసీ సభ్యుల ఎన్నికను నిర్ద్వంద్వంగా తిరస్కరిస్తున్నారు. నియామక వ్యవస్థనే కొనసాగించాలని కోరుతున్నారు. కాంగ్రెస్ పార్టీ రూల్‌బుక్ ప్రకారం సీడబ్ల్యూసీ సభ్యులను ప్రతినిధులు ఎన్నుకోవాలి. మరో పదిమందిని పార్టీ అధినేత నియమిస్తారు. కమిటీలో కనీసం 20 మంది సభ్యులు ఉండాలి. మరికొంతమందిని శాశ్వత ఆహ్వానితులుగా తీసుకోవచ్చు. 1992, 1997లో సీడబ్ల్యూసీ సభ్యుల కోసం ఎన్నిక జరపాలని కొంతమంది వాదించారని, పీవీ నరసింహారావు, సీతారాం కేసరిల నాయకత్వాన్ని చాలామంది అంగీకరించలేదని, బలని రూపణ కోసం నాడు ఎన్నిక జరిగిందని పార్టీ వర్గాలు గుర్తుచేస్తున్నాయి. నిజంగా రాహుల్‌గాంధీకి, ఆయన నాయకత్వానికి సవాల్ లేకపోయినా ఇష్టమైన వారిని సీడబ్ల్యూసీ సభ్యులుగా నియమించుకునే స్వేచ్ఛ రాహుల్‌కు ఉందని వృద్ధనాయకులు అంటున్నారు. సీడబ్ల్యూసీ సభ్యుల కోసం ఎన్నిక నిర్వహించాలా? వద్దా? అనే దానిపై వచ్చేవారం జరిగే పార్టీ ప్లీనరీలో నిర్ణయం తీసుకోవచ్చుని వాదిస్తున్నారు. ఇదిలా ఉంటే...సీడబ్ల్యూసీకి సభ్యుల నియామకానికి సంబంధించి తమ అభిప్రాయాలకు మద్దతు కూడగట్టే పనిలో సీనియర్లు తలమునకలయ్యారు. పార్టీ, దాని అనుబంధ విభాగాలన్నింటికీ ఎన్నికల నిర్వహించాలని రాహుల్‌గాంధీ కోరుకుంటున్నారు. పార్టీ ఉపాధ్యక్షుడిగా రాహుల్ యువజన కాంగ్రెస్, నేషనల్ స్టూడెంట్స్ యూనియన్ ఆఫ్ ఇండియాలకు అంతర్గత ఎన్నికలు నిర్వహించారు.

ఇన్టసోలో శ్రీచైతన్య ఆధిపత్యం

విశాలాంధ్ర బ్యూరో-హైదరాబాద్: దేశవ్యాప్తంగా 3 నుంచి 10వ తరగతి విద్యార్థులకు నిర్వహించే ఇన్టసో పరీక్షలలో శ్రీ చైతన్య స్కూల్ ఆధిపత్యాన్ని చాటింది. ఆలిండియా స్థాయిలో అత్యధికంగా 75 మంది విద్యార్థులు గ్రాండ్ ప్రైజ్‌లుగా ల్యాప్ టాప్స్‌ను, 82 మంద ట్యాబ్స్‌ను గెలుచు కొన్నారు. ఆలిండియా మొదటి ర్యాంకును 27 మంది, 2వ ర్యాంకును 25 మంది, 3వ ర్యాంకును 30 మంది సాధించగా 114 మంది ప్రత్యేక బహు మతులను, 2664 మంది ప్రోత్సాహ కాలను పొందారు. మొత్తం 12,902 మంది విద్యార్థులు మెడల్స్ సాధించారు.ఈ ఫలితాలతో శ్రీచైతన్య మరో మారు నం.1గా నిలిచిందని విద్యా సంస్థల అధినేత డా.బీఎస్ రావు తెలిపారు. శ్రీచైతన్య స్కూల్ అకడమిక్ డైరెక్టర్ సీమ మాట్లాడుతూ ఇన్టసో ఫలితాలలో ఇంతటి విజయం సాధించడానికి తమ ప్రత్యేక అకడమిక్ ప్రోగ్రామ్స్, మైక్రో లెవల్ టీచింగ్ సిస్టమ్, అంకితభావంతో పనిచేసే అధ్యాపకులే కారణమని అన్నారు.

మహిళల కోసం హుందాయ్ ప్రచారం

విశాలాంధ్ర బ్యూరో-హైదరాబాద్: ఇండియాలో అత్యధి కంగా వాహనాలను విక్రయిస్తున్న రెండో అతిపెద్ద సంస్థ హ్యుందాయ్ మహిళా దినోత్సవం సందర్భంగా సోషల్ మీడియాలో వినూత్న ప్రచారాన్ని నిర్వహించింది. మహిళా కస్టమర్లకు పెద్దపీట వేస్తూ హుందాయ్ అన్ని డీలర్‌షిప్ కేంద్రాల్లో, రీజనల్ ట్రైనింగ్ సెంటర్లలో వారి వాహనాలకు సంబంధించిన కనీస నిర్వహణ, చెక్ పాయింట్స్‌పై అవగాహన కల్పించినట్లు సంస్థ సేల్స్ అండ్ మార్కెటింగ్ విభాగం డైరెక్టర్ రాకేష్ శ్రీవాస్తవ వెల్లడించారు. లింగ సమానత్వానికి తమ సంస్థ పెద్దపీట వేస్తుందని, ఈ కార్యక్రమం నెలాఖరు వరకూ సాగుతుందని తెలిపారు.

నష్టాల్లో మార్కెట్లు

44పాయింట్లు దిగజారిన సెన్సెక్స్



ముంబై: దేశీయ మార్కెట్లకు శుక్రవారం మళ్లీ నష్టాలు తప్పలేదు. ఆసియా మార్కెట్ల సానుకూల ప్రభావం, దేశీయ కంపెనీల కొనుగోళ్ల అండతో ట్రేడింగ్ ఆరంభం నుంచి లాభాల్లో పరుగులు పెట్టిన సూచీలు.. మార్కెట్ ముగింపులో నష్టాల్లో నమోదయ్యాయి. చివరి గంటల్లో మదుపర్లు తీవ్ర ఒత్తిడికి లోనవడంతో అమ్మకాలు వెల్లువెత్తడంతో సూచీలు నష్టాల్లోకి జారుకున్నాయి. ప్రారంభంలో 100 పాయింట్లకు పైగా లాభంతో ట్రేడ్ అయిన సెన్సెక్స్ మధ్యాహ్నం వరకు ఆ జోరును కొనసాగించింది. అయితే ఆఖరి గంటలో తీవ్ర అమ్మకాల ఒత్తిడిని ఎదుర్కొన్న సూచీ ఆరంభ లాభాలను కోల్పోయింది. శుక్రవారం మార్కెట్ ముగిసే సమయానికి 44 పాయింట్లు నష్టపోయిన సూచీ 0.13 శాతంతో 33,307 వద్ద స్థిరపడింది. అటు నిఫ్టీ కూడా 16 పాయింట్లు కోల్పోయి 0.15 శాతంతో 10,227 వద్ద ముగిసింది. బిఎస్ఇ 19 సెక్టరల్ సూచీల్లో 14 సూచీలు మెటల్స్‌తో సహా 1.94 శాతం నష్టపోయాయి. బిఎస్ఇ మిడ్‌కాప్, స్మాల్ కాప్ 0.35శాతం, 0.30శాతం నష్టపో యాయి. టిసిఎస్, హెచ్‌డిఎఫ్‌సి, ఇన్ఫోసిస్, హిందుస్తాన్ యూనిలీవర్ టాప్ గెయినర్స్ కాగా టాటాస్టీల్, యాక్సిస్ బ్యాంకు, అదానీ పోర్ట్సు, సన్‌ఫార్మా ప్రధా నంగా నష్టపోయాయి. విదేశీ మదుపరులు రూ.364.80 కోట్ల విలువైన షేర్లను అమ్మినట్లు తెలుస్తోంది. దేశీయ మదుపరులు సుమారు రూ.675.26 కోట్ల షేర్ల కొనుగోలు చేశారు.

అంతర్జాతీయ మార్కెట్లు: ఆసియా షేర్లు వారాంతంలో ర్యాలీ సృష్టించాయి. జపాన్ నిక్కీ 0.5శాతం పెరిగింది. సౌత్ కొరియా స్టాక్స్ 1శాతం పైగా నమోద య్యాయి. ఆసియా పసిఫిక్ షేర్లు జపాన్ వెలుపల 0.6శాతం పెరిగాయి.

మహిళల సంపాదన 20శాతం తక్కువే...

మాన్‌స్టర్ శాలరీ ఇండెక్స్ నివేదిక



న్యూఢిల్లీ: భారతదేశంలో మహిళలు పురుషులకన్నా 20 శాతం తక్కువ సంపాదిస్తున్నట్లు మాన్‌స్టర్ శాలరీ ఇండెక్స్ తాజా గణాంకాలు వెల్లడించాయి. గంటకు పురుషుల సగటు సంపాదన రూ.231 కాగా మహిళలు మాత్రం రూ.184.8లు సంపాదిస్తున్నట్లు తెలుస్తోంది. లింగ విచక్షణ 2016లో 24.8 శాతం ఉంటే 2017లో 5శాతం తగ్గినట్లు తెలుస్తోంది. నైపుణ్యత, అనుభవం కొలమానంగా ఈ విచక్షణ మరింతగా పెరిగి అత్యధికంగా 25శాతం ఉన్నట్లు తాజా సర్వే వెల్లడించింది. 2017లో నిర్వహించిన తాజా సర్వే ఆధారంగా పురుషుల అనుభవం 0-2ఏళ్లు ఉంటే మహిళలకన్నా ఎక్కువగా 7.8శాతం ఆర్జిస్తున్నారు. 6-10ఏళ్లు అనుభవం ఉన్న పురుషులు అయితే 15.3 శాతం, 11ఏళ్ల కన్నా అనుభవం ఎక్కువగా ఉంటే 25శాతం ఎక్కువ ఆర్జిస్తున్నట్లు మాన్‌స్టర్ సాలరీ సూచీ వెల్లడించింది. అయితే లింగసమానత్వం అవసరమని 69శాతం మంది అభిప్రాయపడ్డారు. లింగ సమానత్వానికి ప్రాధాన్యత ఇచ్చినప్పటికీ, 68శాతం మాత్రం ఆచరణలో సాధ్యపడే విషయం కాదని తేల్చి చెప్పారు. 36శాతం మంది అభిప్రాయం ప్రకారం, ఆచరణాత్మక విధానాలు అమలు చేయదానికి, భారతదేశం ప్రగతి సాధించేందుకు అవసరాన్ని సూచించగా, 44శాతం మంది వేతనాల్లో తేడాలను, ఆలోచనా దృక్కోణంలో తేడాలను తగ్గించి ఆరోగ్యకరమైన వాతావరణాన్ని సూచించగా, 17శాతం మంది సమాన అవకాశాలు కల్పించవలసిందిగా కోరారు. 44శాతం మంది పురుషులు కార్యాలయాల్లో లింగవి చక్షణలో మార్పులు రావాలని కోరగా, 39శాతం మంది మహిళలు కూడా ఈ విధమైన అభిప్రాయాన్నే వెలిబుచ్చారు. కాగా ప్రైవేటుగా పురుషులు లింగ సమానత్వలో భాగంగా మిత్రులుగా అభిప్రాయపడినప్పటికీ ఈ విధమైన అభిప్రాయాలతో వారు ఏకీభవిస్తారా...లేరా అనే దానిపై మాత్రం 40శాతం మంది సందేహాన్ని వెలిబుచ్చారు. మాన్‌స్టర్ ఇండియా నిర్వహించిన ఈ సర్వేలో సుమారు 5,500 మందిపై నిర్వహించిన సర్వేలో 3100 మంది మహిళలు కాగా 2300 మంది పురుషులు ఉన్నారు. ఢిల్లీ ఎన్‌సిఆర్ నుండి 24శాతం, ముంబై నుండి 22శాతం, బెంగళూరు నుండి 20శాతం మంది ఈ సర్వేలో పాల్గొన్నారు. నాన్ మెట్రోలనుండి 36శాతం మాత్రమే పాల్గొన్నారు.

పన్ను ఎగవేతదారులు 1.7 శాతం

న్యూఢిల్లీ: ప్రయత్నపూర్వకంగానే పన్ను ఎగవేసే ఎగవేతదారుల సంఖ్య డిసెంబర్ నాటికి 1.7శాతం పెరిగింది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం ఏప్రిల్-డిసెంబర్ మధ్యకాలంలో పబ్లిక్ సెక్టార్‌కు చెందిన బ్యాంకు రుణాలను చెల్లించనివారి సంఖ్య 1.66శాతంతో 9,063కు చేరినట్లు ప్రభుత్వ గణాంకాలు వెల్లడించాయి. పిఎస్‌బీ తాజా నివేదిక ఆధారంగా వీరు చెల్లించ వలసిన మొత్తం రూ.1,10,050కోట్లు నమోదైనట్లు ఆర్థికమంత్రిత్వ శాఖ సహాయ కార్యదర్శి శివ ప్రతాప్ శుక్లా శుక్రవారం లోక్‌సభలో వెల్లడించారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం తొమ్మిది మాసాల్లో చెల్లించవలసిన వారి సంఖ్య 9,063కాగా ఈ సంఖ్య 1.66శాతం పెరిగినట్లు తెలుస్తోంది. భారతదేశ రిజర్వుబ్యాంకు నిబంధనల ప్రకారం పన్ను చెల్లించనివారిపై నేరపూరిత చర్యలపై క్రిమినల్ యాక్షన్ చర్యలు ఉన్నాయని వీటి అమలులో ఎట్టి పరిస్థితిలోనూ ఉపేక్షించేదిలేది తెలిపారు.. మార్కెట్ రెగ్యులేటర్ సెబీ విడు దల చేసిన నిబంధనల ప్రకారం ప్రమోటర్లు, డైరెక్టర్లుగా ఉన్న ఎగవేత దారులు మూలధన మార్కెట్లను పెంచుకునేందుకు ఉద్దేశపూర్వకంగా మరిం తగా నిధులు విడుదల చేస్తున్నట్లు వెల్లడించారు. పిఎస్‌బి నివేదిక ఆధారంగా 2017, డిసెంబరు 31 నాటికి పన్ను ఎగవేతదారులపై 2,108 ఎఫ్‌ఐఆర్‌లు నమోదైనట్లు తెలుస్తోంది.

వ్యవసాయం, పరిశ్రమలతో ఉపాధి అవకాశాలు

దేశీయ ఉత్పత్తుల వినిమయానికి ప్రాధాన్యత



న్యూఢిల్లీ : అత్యధిక శాతం యువతకు ప్రాతినిధ్యం వహిస్తున్న మన దేశంలో వారికి ఉపాధి, అభివృద్ధి అవకాశాలను మెరుగు పరచేందుకు ప్రభుత్వం తగిన ప్రణాళికలను రూపొందించ వలసిన అవసరం ఎంతైనా ఉంది. పరిశ్రమలను, వ్యవసాయ రంగాన్ని వృద్ధి చేయడం ద్వారా ఉపాధి అవకాశాలను మరింత మెరుగు పరచుకోవడం ద్వారా వినిమయాన్ని మరింత పెంచవచ్చు. యువతకు సరైన ఉపాధి అవకాశాలు కొరవడితే వారు కోరుకున్న స్థాయికి వారు చేరలేదు సరికదా సామాజిక అశాంతి, రిటైల్ రంగంలో తీవ్ర అశాంతి, రాజకీయ తిరుగుబాటుకు అవకాశం కల్పించినట్లవుతుంది. భారతీయ యువతకు అన్ని రంగాల్లోఅవకాశం కల్పించినట్లయితే మన మార్కెట్ మరింత విస్తృతమయ్యే అవకాశం ఉందని తెలుస్తోంది. స్వయం ఉపాధి అవకాశాలు, చిన్న తరహా పరిశ్రమలు, ఉద్యోగాలద్వారా అవకాశం కల్పించినట్లయితే గుణాత్మకమైన రీతిలో జీవన విధానం మెరుగుపడేందుకు అవకాశం ఉంటుంది. భారతీయ యువత తప్పనిసరిగా దేశీయ ఉత్పత్తులను, సేవల వినియోగంతో ఎగుమతులను ప్రోత్సహించే విధానాన్ని మెరుగుపరచుకోవలసిఉంది. ప్రపంచంలోని వస్తువులను ధీటుగా మన ఉత్పత్తులను, సర్వీసు రంగాన్ని ప్రోత్సహించవలసిఉంది. ఈ విధానం ద్వారా భారతీయ వినియోగదారులు మన వస్తువులను కొనేందుకు మొగ్గు చూపుతారని వెల్లడైంది. ఆసియా దేశాలు తమ జీవన విధానాన్ని మెరుగుపరచుకునే రీతిలో ఉన్నాయి. పరిశ్రమల వృద్ధితో ఆర్థికావసరాలను తీర్చుకునేదిశలో పయనిస్తున్నాయి. తైవాన్,కొరియా,చైనావంటి దేశాలు ముఖ్యంగా పారిశ్రామిక విధానాలను మెరుగు పరచుకోవడంతో ఆర్థికాభివృద్ధి పెరుగుతోందని చెప్పవచ్చు. తమ ఆర్థిక అవసరాలను మెరుగు పరచుకునేందుకు భారత్ వంటిదేశాలు ప్రపంచ వాణిజ్యానికి ఉన్న అడ్డంకులను తొలగించాయి. తత్ఫలితంగా దిగుమతులు మరింత పెరిగాయి. ముఖ్యంగా 'వాల్యూ యాడెడ్‌గూడ్స్' దిగుమతులు పెరిగాయని చెప్ప వచ్చు. ముడిపదార్థాల ఎగుమతులు పెరగడంతో ఇతరదేశాల అవసరాలుకూడా తగ్గుముఖం పట్టాయి. 1990 నుండి భారత్, చైనాల మధ్య పారిశ్రామిక విధానం విరుద్ధంగాఉందని చెప్పవచ్చు. 1996లో పెద్దపెద్ద పారిశ్రామిక దేశాలన్నీ ప్రపంచ వాణిజ్య సంస్థలో భాగంగా ఇన్‌ఫర్మేషన్ టెక్నాలజీ ఒడంబడికలో చోటు చేసుకున్నాయి. ఐటి సంబంధిత తయారీ ఉత్పత్తుల దిగుమతి సుంకాన్ని తగ్గించేందుకు నిర్ణయించాయి. ప్రస్తుతం దేశ ఆర్థికప్రగతికి వెన్నెముకగా ఉన్న ఐటి రంగం కావడంతో దేశాలన్నీ ఉత్తమమైన, చౌకైన ఉత్పత్తులనే వినియోగించుకుంటున్నాయి. తయారీ రంగం, వ్యవసాయ రంగాలు ఉపాధి అవకాశాలకు మన దేశంలో పెద్దపీట వేస్తున్నాయి. యువతలో ప్రధానంగా నైపుణ్యతను, సాంకేతికతను మెరుగు పరచుకోవడం ద్వారా దేశీయ ఉత్పత్తులను పెంచుకోవచ్చు. చిన్న పరిశ్రమలను ప్రోత్సహించడం ద్వారా నైపుణ్యం కొరవడిన వారిని ప్రోత్సహించినట్లవుతుంది.

విజ్ఞానం

కిడ్నీ వ్యాధి లక్షణాలు



కిడ్నీ వ్యాధులకి సంబంధిం చిన లక్షణాల గురించి తెలుసుకుందాం. సాధా రణంగా, కిడ్నీ వ్యాధుల లక్షణాలను సులభంగా గుర్తించలేరు. కిడ్నీస్ అనేవి లోయర్ బ్యాక్‌లో ఉంటాయి. వెన్నుపూసకి ఇరువైపులా రెండు కిడ్నీలుంటాయి. శరీరం నుంచి టాక్సిన్స్‌ను తొలగించడం కిడ్నీల ప్రాథమిక కర్తవ్యం. టాక్సిన్స్‌ను యూరినరీ బ్లాడర్‌లోకి పంపిస్తుంది. యూరినేట్ చేస్తున్నప్పుడు ఈ టాక్సిన్స్ విడుదలకాబడతాయి. కిడ్నీలు ఎందుకు ఫెయిల్ అవుతాయో తెలుసా? రక్తం నుంచి వ్యర్థాలను తొలగించే సామర్థ్యం కిడ్నీలలో తొలగిపోయినప్పుడు కిడ్నీలు ఫెయిల్ అయ్యాయని అర్థం. వివిధ దీర్ఘకాల వ్యాధులు, పర్యావరణ కాలుష్యం, డీహైడ్రేషన్ వంటి సమస్యలు కిడ్నీల పనితీరును దెబ్బతీస్తాయి. దీర్ఘకాల కిడ్నీ వ్యాధుల లక్షణాలను మనం గుర్తించలేకపోవచ్చు. ఈ లక్షణాలు అత్యంత సాధారణ లక్షణాలుగా కనిపిస్తాయి. వీటిని పరిశీలిద్దాం.

1.ఎల్లప్పుడూ అలసటగా ఉండటం ఆరోగ్యకరమైన కిడ్నీలు ఎరిత్రోపొయిటిన్ అనే హార్మోన్ ని ఉత్పత్తి చేస్తాయి. ఈ హార్మోన్ అనేది రెడ్ బ్లడ్ సెల్స్‌ని క్యారీ చేసే ఆక్సిజెన్‌ని తయారుచేయమని శరీరానికి సూచి స్తుంది. కిడ్నీ ఫెయిల్యూర్ అయినప్పుడు, కిడ్నీలు తక్కువగా ఉత్పత్తి చేస్తుంది. అందువలన శరీరం త్వరగా అలసిపోతుంది. రెడ్‌బ్లడ్‌సెల్స్ తక్కువగా ఉండటం వలన ఇది జరుగుతుంది.

2. శ్వాస ఆడక పోవడం కిడ్నీలకు సంబంధించిన శ్వాస సమస్యలు రెండు రకాలు. శరీరంలోని పేరుకుపోయిన అదనపు ద్రవాలు ఊపిరితి త్తులలోకి చేరతాయి. అనీమియా వలన శరీరానికి ఆక్సిజన్ తగినంత ఉండదు. ఈ రెండు సమస్యల వలన శ్వాస ఇబ్బందులు తలెత్తుతాయి.

3. కళ్ళు తిరగడంతో పాటు బలహీనత కిడ్నీ ఫెయిల్యూర్‌కి సంబంధించిన అనీమియాలో మెదడుకి తగినంత ఆక్సిజన్ లభించదు. ఇది మూర్ఛకు, కళ్ళు తిరగడానికి అలాగే బలహీనతకు దారితీస్తుంది. ఈ లక్షణాలు కనిపిస్తే వెంటనే వైద్యున్ని సంప్రదించాలి.

4. కాళ్ళు చేతులలో వాపులు కనిపిస్తే, కిడ్నీ ఫెయిల్యూర్‌కి సూచనలు కావచ్చు. కిడ్నీ ఫెయిల్ అయితే శరీరంనుంచి అదనపు ఫ్లూయిడ్స్ అనేవి తొలగిపోవు. ఇవి శరీరంలో పేరుకు పోతాయి. అందువలన, కాళ్ళలో, చేతులలో, చీలమండలలో వాపులు కనిపించవచ్చు.

5. రక్తం నుంచి వ్యర్థాలను తొలగించడానికి కిడ్నీలు తోడ్పడతాయి. అయితే, కిడ్నీ ఫెయిల్యూర్ తలెత్తినప్పుడు, రక్తంలో వ్యర్థాలు పేరుకునే ఉంటాయి. ఇవి తీవ్రమైన దురదకు దారితీస్తాయి. ఇటువంటి లక్షణాలను మీరు గమనిస్తే వెంటనే వైద్యున్ని సంప్రదించాలి.

6. కిడ్నీ వ్యాధులకు గురైనప్పుడు ముఖంలో వాపు కనిపిస్తుంది. కిడ్నీ ఫెయిల్యూర్ వలన శరీరం నుంచి అదనపు ద్రవాలు తొలగిపోవు. అందువలన, శరీరంలో ద్రవాలు పేరుకుపోతాయి. ముఖంలో వాపు కనిపిస్తుంది. ఈ లక్షణం ఎదురైనప్పుడు అశ్రద్ధ చేయకుండా వైద్యున్ని సంప్రదించండి.

7. తరచూ యూరినేట్ చేయడం ప్రతి రాత్రి ఎక్కువగా యూరినేట్ చేస్తుంటే కిడ్నీ వ్యాధికి గురయ్యారేమో తెలుసుకోవాలి. ఇది కిడ్నీ వ్యాధి లక్షణం. కిడ్నీ ఫెయిల్యూర్ అయినప్పుడు, తరచూ యురినేట్ చేస్తారు.

8. మూత్రంలో నురుగు కనిపిస్తే కిడ్నీ ఫెయిల్యూర్ కి సంబంధించిన లక్షణంగా పరిగణించాలి.

9. కిడ్నీ వ్యాధులకు సంబంధించిన మరొక లక్షణం వికారం.



మార్కెట్లోకి బీఎండబ్ల్యూ కొత్త కారు

విశాలాంధ్ర బ్యూరో-హైదరాబాద్: ఇండియన్ ఆటో ఇండస్ట్రీలో తమ సరికొత్త ఎక్స్6ఎక్స్ డ్రైవ్35ఐఎం కారును విడుదల చేసినట్టు బీఎండబ్ల్యూ వెల్లడించింది. 6 సిలిండర్ పెట్రోల్ ఇంజన్‌తో ఈ కారు లభిస్తుందని, దేశవ్యాప్తంగా అన్ని ప్రధాన నగరాల్లో ఇది అందుబాటులో ఉందని సంస్థ పేర్కొంది. ప్రయాణికులకు అత్యుత్తమ డ్రైవింగ్ అనుభూతితో పాటు రక్షణలో ప్రపంచస్థాయి నాణ్యతా ప్రమాణాలను పాటిస్తుంది. ఆరు ఎయిర్ బ్యాగ్‌లు, డైనమిక్ స్టెబిలిటీ కంట్రోల్, డైనమిక్ ట్రాక్షన్ కంట్రల్, బ్రేక్ కంట్రోల్, తదితర సౌకర్యాలు ఉన్నాయి.



ప్రత్యేక రైళ్లకు పెరుగుతున్న డిమాండు


ప్రయాణికుల వెతలు పట్టని తూర్పుకోస్తా రైల్వే

విశాలాంధ్ర - విశాఖపట్నం : తూర్పు కోస్తా రైల్వే భువనేశ్వర్ కేంద్రంగా పనిచేస్తుండడం, ఒడిశా ప్రతినిధుల ఆధిపత్య ప్రభావం విశాఖపట్నంపై స్పష్టంగా కనిపిస్తుంది. దశాబ్దాల కాలంగా రైల్వేజోన్ కోసం విశాఖ వాసులు డిమాండు చేస్తున్నా పట్టించుకోకపోవడంతో అనేక సమస్యలు ఉత్పన్నమవుతున్నాయి. సుదూర ప్రాంతాలకు రాత్రి సమయంలో ప్రయాణం చేసేందుకు ప్రత్యేక రైలు ప్రవేశపెట్టాలని ఎప్పటినుంచో డిమాండు ఉంది. సెలవు రోజుల్లో ప్రవేశపెట్టిన రైళ్లను కొనసాగించాలని కోరుతున్నప్పటికీ అమలుచేయడంలేదు. గత దసరాకు ప్రయాణికుల డిమాండు మేరకు బెంగుళూరుకు విశాఖ నుంచి ప్రత్యేక రైళ్లు నడిపారు. 065179 /80 నెంబరుతో విశాఖ నుంచి యశ్వంతపూర్ జంక్షన్ వరకు ప్రత్యేక ఎక్స్‌ప్రెస్ కింద నడిపారు. ఈ రైళ్ల వల్ల ఐటీ ఉద్యోగులకు, విశాఖ స్థానికులు బెంగుళూరులో ఉద్యోగం చేస్తున్నవారికి సౌకర్యవంతంగా ఉండేది. దీంతో వందలాది వెయిటింగ్ లిస్టు ఉంటుంది. దీంతో దీన్ని రెగ్యులర్ ట్రైన్‌గా మార్చాలని డిమాండు ఉంది. దీంతోపాటు ముంబై, షిర్డీకి కూడా నేరుగా రైళ్లు నడపాలని ఉన్న ప్రతిపాదనలు ఇప్పటివరకు అమలుకు నోచుకోలేదు. దీంతో ప్రయాణికులు అనేక ఇబ్బందులు పడుతున్నారు. ఇటీవల ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో కొత్తరైళ్ల ప్రస్తావన రాలేదు. రైల్వేబోర్డు దీనిపై దృష్టి సారించి రాత్రి పూట దూరప్రాంతాలకు ప్రయాణించే విధంగా రైళ్లను ప్రవేశపెట్టాలని ప్రయాణికులు కోరుతున్నారు.

గూగుల్ హోం పేజి నుండే

టైమర్, స్టాప్ వాచ్ సెట్ చేయవచ్చు

ప్రస్తుతం అందుబాటులో ఉన్న ఫీచర్, స్మార్ట్ ఫోన్లు అన్నింటిలోనూ డీఫాల్ట్‌గా ఉండే అప్లికేషన్ క్లాక్ లేదా అలారం అప్లికేషన్. ఏదైనా ఒక పని కచ్చితత్వంతో పూర్తి చెయ్యాలి అని అనుకున్నప్పుడు సాధారణంగా టైమర్,స్టాప్ వాచ్‌ల కోసం ఈ అప్లికేషన్స్ పైన ఆధారపడుతాం. కాని పీసీలలో థర్డ్ పార్టీ సాఫ్ట్‌వేర్లు డౌన్‌లోడ్ చేసుకోవడం ద్వారా కాని, విండోస్ 10 లాంటి ఆపరేటింగ్ సిస్టమ్స్‌లో డీఫాల్ట్‌గా ఉన్న అప్లికేషన్ ద్వారా కాని సెట్ చేసుకోవచ్చు. కాని బ్రౌజర్ ఓపెన్ చేసి ఏదైనా పని చేస్తున్నప్పుడు ఒక్కొక్కసారి బ్రౌజర్ లోనే అలాంటి ఫీచర్ ఉంటే బాగుంటుంది అని చాలామంది వినియోగదారులు అనుకుంటూ ఉంటారు . వారికోసం గూగుల్ ప్రత్యేకంగా ఈ సదుపాయాన్ని కల్పించింది.




గూగుల్ హోం పేజిలో టైమర్ సెట్ చేయడం చేయుట:

వెబ్ బ్రౌజరు మీరు ఏది ఉపయోగిస్తున్నా డీఫాల్ట్ హోం పేజిగా గూగుల్.కామ్ ని సెట్ చేసుకుని ఉన్నట్లయితే, నేరుగా బ్రౌజర్ అడ్రెస్ బార్ లోనే "సెట్ టైమర్" కమాండ్ ఇవ్వడం ద్వారా టైమర్ సెట్ చెయ్యవచ్చు. ఉదాహరణకు set timer for 13 minutes అని నేరుగా బ్రౌసర్ అడ్రెస్ బార్ లోనే టైప్ చేసి టైమర్ సెట్ చేసుకొనవచ్చు. గూగుల్.కామ్‌ని హోం పేజిగా సెట్ చెయ్యని పక్షంలో గూగుల్.కామ్ సైట్ ఓపెన్ చేసి అక్కడ సెర్చ్ బార్ లో సెట్ టైమర్ అని కమాండ్ ఇవ్వవలసి ఉంటుంది. మనం టైమర్ సెట్ చేసిన వెంటనే start toggle stopగా మారడం చూడవచ్చు, అలాగే రీసెట్ toggle కూడా ఉంటుంది తిరిగి యధాస్థితికి వచ్చేందుకు.

డీఫాల్ట్‌గా టైమర్ 5 నిమిషాలకు చూపుతుంది. అక్కడ స్టార్ట్ పైన క్లిక్ చెయ్యడం ద్వారా టైమర్‌ను స్టార్ట్ చెయ్యవచ్చు. లేదా టైమర్ పై క్లిక్ చేసి మీకు కావలసిన టైం ని సెట్ చేసి స్టార్ట్ పై క్లిక్ చేయవచ్చు. టైమర్ పూర్తి అవగానే రింగ్‌టోన్ ద్వారా అలర్ట్ చేస్తుంది. అప్లికేషన్ కుడివైపు దిగువభాగాన సౌండ్ మ్యూట్ చేయడానికి సౌండ్ బటన్, ఫుల్ స్క్రీన్‌లో టైమర్, స్టాప్ వాచ్‌లను సెట్ చేసుకోవడానికి ఫుల్ స్క్రీన్ బటన్స్ కనిపిస్తాయి.

గూగుల్ హోం పేజి లో స్టాప్‌వాచ్ వినియోగించడం:

పైన చెప్పిన విధంగానే గూగుల్ హెూం పేజి సెట్ చేసిన బ్రౌజర్‌లో వెబ్ అడ్రెస్‌లో సెట్ టైమర్ అని కమాండ్ ఇవ్వడం ద్వారా కాని, లేదా గూగుల్.కామ్ లో సెర్చ్ బార్ లో "సెట్ టైమర్" అని కమాండ్ ఇవ్వడం ద్వారాకాని స్టాప్ వాచ్ వినియోగించవచ్చు. అవసరాన్ని బట్టి స్టార్ట్, స్టాప్, రీసెట్, ఫుల్ స్క్రీన్ toggles వినియోగించుకోవచ్చు. స్టాప్ వాచ్ క్లిక్ చేసినప్పుడు సౌండ్ toggle కనపడదు. ఇది ల్యాప్‌టాప్, పీసీ వినియోగదారులకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుంది. ముఖ్యంగా చదువుకునే సమయాల్లో, ఎక్సర్‌సైజ్, వర్కింగ్ ఇలా అనేక సందర్భాలలో కచ్చితత్వం కోసం ఈ ఫీచర్ ను వినియోగించుకోవచ్చు.



మంచి అప్లికేషన్ డౌన్‌లోడ్‌కు చిట్కాలు

మీరు ఆండ్రాయిడ్, ఐఓఎస్ ఏ వినియోగదారులైనా కావొచ్చు. ప్లేస్టోర్, యాప్‌స్టోర్‌లలో కుప్పలుతెప్పలుగా అప్లికేషన్లు కనిపిస్తూ ఉంటాయి. ప్రతిఒక్కటి కంటికిఇంపుగా యూఐ(యూసర్ ఇంటర్ఫేస్) డిజైన్ చెయ్యడంవలన వినియోగదారులు తెలియని, మోసపూరిత అప్లికేషన్లను సైతం డౌన్‌లోడ్ చేసుకుని తమకే తెలీకుండా స్పామ్, సైబర్ నేరాల బారినపడుతున్నారు. ఒక అప్లికేషన్ మనసులో ఉంచుకుని సెర్చ్ చేస్తే, దానితోపాటు కొన్ని వందలవేల అప్లికేషన్లు ఎక్కువ ఫీచర్లను కలిగి ఉన్నాయి అంటూ భ్రమింపజేస్తూ, వినియోగదారులు ఆకర్షితులయ్యేలా ప్రేరణని కల్పిస్తుంటాయి. ఈ మానసిక పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని అప్లికేషన్స్ ఎంపిక విధానంలో కొన్నిసూచనలను పొందుపరచడం జరిగినది. ఈ సూచనల ద్వారా కావలసిన అప్లికేషన్‌ను తక్కువ సమయంలో ఎంపిక చేసుకునేలా, మోసపూరిత అప్లికేషన్ల బారినపడకుండా జాగ్రత్తపడేలా చర్యలు తీసుకోవచ్చు.



రికమండేషన్స్

ఆండ్రాయిడ్ వినియోగదారులకు ప్లే స్టోర్‌లో యాప్స్ అండ్ గేమ్స్ విభాగంలో కేటగిరీల వారీగా రికమండేషన్స్ పొందుపరచబడి ఉంటుంది. ఈ రికమెండేషన్ అప్లికేషన్స్ ప్లేస్టోర్‌లో అత్యధిక వినియోగదారులు డౌన్‌లోడ్ చేసుకుని ఇచ్చిన రేటింగ్స్ మూలంగా, మీ గూగుల్ ప్లస్‌లో ఉన్న మీఫ్రెండ్స్ ఇచ్చిన లైక్‌లను దృష్టిలో ఉంచుకుని పొందుపరచడం జరుగుతుంది. మీ అభిరుచికి తగినవిధంగా ఉన్న మీ స్నేహితుడిని దృష్టిలో ఉంచుకుని కూడా అప్లికేషన్‌ను సెలెక్ట్ చేసుకోవచ్చు. ఇక ఐఓఎస్ వినియోగదారులకు అయితే ఫీచర్డ్ స్క్రీన్‌లో కిందుగానున్న "గేమ్స్ యు మైట్ లైక్" అనే సెక్షన్‌లో పొందుపరచబడి ఉంటాయి, ఈ అప్లికేషన్స్ మీరు ఇదివరకు కొన్న అప్లికేషన్ల హిస్టరీని ఆధారంగా చేసుకునని లిస్టు ఇస్తుంది. కావున మీరు ఎన్ని మంచి గేమ్స్ కొంటారో, ఆ గేమ్స్‌కి అనుబంధంగా, మీ అభిరుచికి తగినవిధంగా చూపెడుతుంది.

users also installed

గూగుల్ ప్లేస్టోర్ లో ఏదైనా యాప్ గురించి సెర్చ్ చేసి, స్క్రోల్ చేసినప్పుడు users also installed అనే లిస్టు కనిపిస్తుంది. ఈ లిస్టు మీ సర్కిల్స్‌లోని ఫ్రెండ్స్ లేదా ఎక్కువమంది డౌన్లోడ్ చేసుకున్న అప్లికేషన్స్ జాబితాగా ఉంటుంది. అదేవిధంగా ఐఓఎస్‌లో రిలేటెడ్ అనే సెక్షన్‌లో వినియోగదారులు అధికంగా కొన్న అప్లికేషన్ల లిస్టు చూపెడుతుంది.

ఐఓఎస్‌లో రిలేటెడ్ సెక్షన్స్

మీ అభిరుచులకు తగినవిధంగా ఫీచర్లను పొందుపరచిన అప్లికేషన్స్‌లో ఎక్కువగా డౌన్‌లోడ్ చేసుకున్నవి లేక కొనుగోలు చేసుకున్నవి ఏవి అనేది ప్రామాణికం. వీటిని ఎంచుకోవడంలో ప్లేస్టోర్‌లో users also installed, IOSలో రిలేటెడ్ సెక్షన్స్‌లో నిక్షిప్తం చేసినవే ప్రామాణికం అవ్వొచ్చు.



అప్లికేషన్స్ కింద స్కోర్స్

చాలామంది వినియోగదారులు అప్లికేషన్స్ కింద స్కోర్స్ ఇచ్చి, రివ్యూలు రాస్తుంటారు. వాటిలో అన్నీ నిజం అని అనుకోవడానికి లేదు. కావున ఒకటికి పది రివ్యూలు చదివి డౌన్‌లోడ్ చేసుకోవడం మంచిది. కొందరు కస్టమర్స్ కావాలనే రేటింగ్ ఎక్కువ ఇస్తుంటారు. వీటన్నిటిని దృష్టిలో ఉంచుకోవడం మంచిది.

లింక్డ్ అప్లికేషన్స్

కొన్ని అప్లికేషన్లకు లింక్డ్ అప్లికేషన్స్ కూడా ఉండడం సహజం. ఉదాహరణకు ఫేస్‌బుక్‌లో ఇన్‌స్టాల్ చేసుకుంటే మెసెంజర్ కూడా ఇన్‌స్టాల్ చేసుకోవలసి ఉంటుంది. అందువలన డెవలపర్ చేసిన మిగిలిన అప్లికేషన్లను కూడా గమనించడం మంచిది.

ప్లేస్టోర్, యాప్‌స్టోర్‌లలో ..

డెవెలపర్ సపోర్ట్ అప్లికేషన్‌కు ఉందా అనేది చాలా ముఖ్యమైన విషయం. చాలామంది అప్లికేషన్లని ప్లేస్టోర్, యాప్‌స్టోర్ లలో ఉంచుతారు కాని కొంతకాలానికి అప్డేట్స్ ఆపివేయడమో లేక సపోర్ట్ నిలిపివేయడమో చేస్తుంటారు. ఆ అప్లికేషన్స్ డౌన్లోడ్ చేసుకున్నా ఉపయోగం ఉండదు.

బెస్ట్ అప్లికేషన్స్

గూగుల్, ఆపిల్ స్టోర్స్ రెండింటిలో వినియోగదారుల డౌన్‌లోడ్స్ దృష్ట్యా బెస్ట్ అప్లికేషన్స్‌ను హోం పేజి లోనే చూపడం జరుగుతుంది. ఆయా అప్లికేషన్స్ మీ అభిరుచులకు తగ్గట్లుగా ఉన్నాయో లేదో చూసుకుని డౌన్‌లోడ్ చేసుకోవచ్చు.

రిలేటెడ్‌గా అనేక అప్లికేషన్స్

ఒక అప్లికేషన్ కు రిలేటెడ్ గా అనేక అప్లికేషన్స్ ఉంటాయి. ఎంత ఎక్కువ బ్రౌజ్ చేస్తే అంత ఎక్కువ ఇన్ఫర్మేషన్ లభిస్తుంది. దీని ఆధారంగా ఫిల్టర్ చేసుకుని అప్లికేషన్స్ సెలెక్ట్ చేసుకోవచ్చు. సెర్చ్ చెయ్యడంలో మెదడుకి పదును పెట్టాలి. ఉదాహరణకి సోషల్ మీడియా యాప్స్ కోసం సోషల్ నెట్‌వర్క్ అనే కీవర్డ్ వాడొచ్చు.

తెలివే మన సెక్యూరిటీ

మన తెలివే మన సెక్యూరిటీ. ఇష్టానుసారంగా తెలియని అప్లికేషన్లు డౌన్‌లోడ్ చెయ్యడం చివరికి ఉనికికే ప్రమాదం కావొచ్చు.

ఆకట్టుకోని 'ఏ మంత్రం వేసావె'

బ్యానర్స్: గోలిసోడా ఫిలింస్, సురక్ష్ ఎంటర్‌టైన్‌మెంట్స్
నటీనటులు: విజయ్ దేవరకొండ, శివానీ సింగ్, శివన్నారాయణ, ఆశిష్ రాజ్, ప్రభావతి, దీపక్ తదితరులు
మ్యూజిక్: అబ్బత్ సమత్
కెమెరా: శివారెడ్డి
నిర్మాణం, దర్శకత్వం: శ్రీధర్ మర్రి



పెళ్ళిచూపులు, అర్జున్ రెడ్డి చిత్రాలతో యూత్‌లో మంచి క్రేజ్ సంపాదించుకున్న హీరో విజయ్ దేవరకొండ సినిమా వస్తుందంటే సినిమాపై ఇంకాస్త అంచనాలుంటాయనడంలో సందేహం లేదు. అలాంటి క్రేజ్‌తో విడుదలకు సిద్ధమైన చిత్రం ఏ మంత్రం వేసావె. అసలు ఈ సినిమాను విజయ్ దేవర కొండ ఎప్పుడు చేశాడని అందరూ అనుకున్నారు. అసలు విషయమేమంటే కెరీర్ ప్రారంభ దశలోవిజయ్ దేవరకొండ చేసిన చిత్రమే ఇది. మరి ప్రేక్షకులను సినిమా ఎంత మేర ఆకట్టుకుందో తెలుసుకోవాలంటే సినిమా కథలోకి వెళదాం

కథ:

ఈ మధ్య యువత సోషల్ మీడియాకు ఏదో ఒక రూపంలో బానిసలవుతున్నారు. అలా ఆన్ లైన్ గేమింగ్‌కు, సోషల్ మీడియాకు బానిసైన కుర్రాడే నిఖిల్ (విజయ్ దేవర కొండ). తన ఓ రోజు ఫేస్ బుక్‌లో ర్యాగ్స్(శివానీ సింగ్) పరిచయం అవుతుంది. ఆమెతో పరిచయం పెంచుకోవాలనుకుంటాడు. కానీ ర్యాగ్స్ నిక్కి ఫ్రెండ్ రిక్వెస్ట్‌ను తోసిపుచ్చుతుంది. ఎలాగైతనేం ర్యాగ్స్‌ను చూసిన నిక్కి ఆమెను తన స్నేహం చేయమని కోరతాడు. తనకు కొన్ని షరతులు పెట్టి.. వాటిని దాటి వస్తే.. తనను కలుసుకోవచ్చునని చెబుతుంది. అయితే ర్యాగ్స్‌ను కలుసుకునే సమయంలో డానీ అనే వ్యక్తి.. నిక్కిని అడ్డుకుంటాడు. డానీ వల్ల ర్యాగ్స్‌కు ప్రమాదం ఉందని తెలుసుకున్న నిక్కి.. ఆమెను ప్రమాదం నుండి కాపాడాలని అనుకుంటాడు. అసలు ర్యాగ్స్‌కు వచ్చే సమస్యేంటి? నిక్కి, ర్యాగ్స్ ఒకటయారా? అనే విషయాలు తెలుసుకోవాలంటే సినిమా చూడాల్సిందే.

విశ్లేషణ:

విజయ్ దేవర కొండ తొలి చిత్రమిది. నిక్కి అనే ఆన్ గేమింగ్ కుర్రాడిగా విజయ్ తన పాత్రకు న్యాయం చేశాడు. దర్శకుడు చెప్పిన మోతాదులో హీరో విజయ్ దేవరకొండ, హీరోయిన్ శివానీ సింగ్, అశిష్ రాజ్, శివన్నారాయణ సహా అందరూ వారి వారి పాత్రలకు న్యాయం చేశారు. అయితే దర్శక నిర్మాత శ్రీధర్ మర్రి.. అనుభవలేమి కొట్టొచ్చినట్లు తెరపై కనపడుతుంది. ప్రస్తుత సమాజానికి తగినట్లు శ్రీధర్ కథను రాసుకున్నప్పటికీ దాన్ని ఆసక్తికరంగా, గ్రిప్పింగ్‌గా తెరకెక్కించడంలో విఫలమయ్యాడు. కథలోని సస్పెన్స్ ఎలిమెంట్స్‌ను ఎలివేట్ చేయాలనుకున్నాడు.. కానీ చాలా చోట్ల సన్నివేశాలకు మధ్య లింక్ ఉండదు. లాజిక్ కనపడదు. ఇలాంటి విషయాల్లో దర్శకుడు కాస్త జాగ్రత్త వహించాల్సింది. ఇక శివారెడ్డి సినిమాటోగ్రఫీ ఏ మాత్రం బాలేదు. ఇప్పుడున్న సినిమాల్లో సినిమాటోగ్రఫీలో తెలుగు సినిమా స్థాయి పెరిగింది. కానీ వీటికి భిన్నంగా శివారెడ్డి కెమెరా వర్క్ ఉంది. సమత్ సంగీతంలో ట్యూన్స్ బానే ఉన్నప్పటికీ బ్యాక్‌గ్రౌండ్ స్కోర్ బాలేదు. మొత్తంగా చూస్తే.. దర్శకుడి వైఫల్యంతో ఏ మాయం చేసావె ప్రేక్షకులను ఆకట్టుకోవడంలో విఫలమైంది. 'ఏ మంత్రం వేసావె' కాన్సెప్ట్ బావున్నా.. ప్రజెంటేషన్ మిస్ ఫైర్ అయింది



'రాజరథం'లో బొమ్మాలీ రవిశంకర్ పాట



'రాజరథం' నుండి ముచ్చటగా మూడో పాట 'చల్ చల్ గుర్రం' విడుదలైంది. ఆకట్టుకునే నైపుణ్యంతో, ఉన్నత ప్రమాణాలతో ఆకర్షిస్తున్న 'రాజరథం' ఈ పాటతో మరోసారి ఆశ్చర్యపరచనుంది. ఎన్నో సినిమాలకి, ఎంతో మందికి డబ్బింగ్ చెప్పిన ప్రముఖ నటుడు రవి శంకర్ మొట్ట మొదటిసారి 'రాజరథం'లో తాను పోషిస్తున్న 'అంకుల్' పాత్ర కోసం 'చల్ చల్ గుర్రం' పాట పాడారు. ఈ పాటని మహాబలేశ్వర్, పూణేలోని మాల్షెజ్ ఘాట్ వంటి అందమైన ప్రదేశాలలో కనువిందుగా చిత్రీకరించారు. దర్శకుడు అనూప్ భండారి సహజమైన మంచు కోసం మాల్షెజ్ ఘాట్‌ని ఎంచుకున్నారు. ఒకోసారి మంచు తీవ్రత తగ్గేవరకూ ఆగి షూటింగ్ చేసుకోవాల్సి వచ్చేది. 'రాజరథం' కోసం దిలీప్ రాజ్ ప్రత్యేకంగా డిజైన్ చేసి తయారు చేసిన పాతకాలపు సైడ్ కార్ ఉండే స్కూటర్ ఈ పాటకి అదనపు ఆకర్షణ. ఈ స్కూటర్ మనల్ని పాత జ్ఞాపకాల్లోకి తీసుకెళ్లడం ఖాయం. ఇప్పటివరకు విడుదలైన రెండు పాటల ట్యూన్లతో సరిపోయేలా ఉండే ఈ 'చల్ చల్ గుర్రం' సాహిత్యంలో చాల అరుదైన తెలుగు పదాలని సినిమా కథకి సరిపోయేలా ఉపయోగించారు. రామజోగయ్య శాస్త్రి గారి పదాల అల్లిక, అనూప్ భండారి స్వరపరిచిన బాణీ వలన ఈ పాట వీనుల విందుగా ఉంటూ సాహిత్య పరంగా ప్రత్యేకతని చాటుకుంది. నృత్య దర్శకులు బోస్కో – సీజర్ పర్యవేక్షణలో కనువిందు చేసేలా రూపొందిన ఈ పాటలో స్థానిక పల్లెజనాలు కూడా పాలుపంచుకున్నారు. అనూప్ భండారి దర్శకత్వంలో, 'జాలీ హిట్స్' నిర్మాణంలో నిరూప్ భండారి, అవంతిక శెట్టి, ఆర్య ప్రధాన పాత్రల్లో నటించి, 'రాజరథం' ప్రపంచవ్యాప్తంగా ఈ నెల 23న విడుదల కానుంది.

నాగశౌర్య నర్తనశాలలో సిమ్రాన్



నిఖిల్ హీరోగా నటించిన కిరాక్ పార్టీ అనే సినిమాతో తెలుగుతెరకు పరిచయమౌతోంది సిమ్రాన్. ఆ మూవీ ఇంకా థియేటర్లలోకి రాకముందే ఇప్పుడు మరో ఛాన్స్ కొట్టేసింది. సొంత బ్యానర్‌లో నాగశౌర్య నటించనున్న నర్తనశాల అనే సినిమాలో సిమ్రాన్‌ను హీరోయిన్‌గా తీసుకోవాలనుకుంటున్నారు. ఇప్పటికే చర్చలు పూర్తయ్యాయి. త్వరలోనే అఫీషియల్ స్టేట్‌మెంట్ రానుంది. శ్రీనివాస్ చక్రవర్తి అనే కొత్త కుర్రాడ్ని దర్శకుడిగా పరిచయం చేస్తూ నర్తనశాల అనే సినిమా చేయబోతున్నాడు నాగశౌర్య. తన తల్లిదండ్రులు స్థాపించిన ఐరా క్రియేషన్స్ బ్యానర్‌పై రెండో సినిమాగా ఇది రానుంది. టైటిల్ చూసి ఇదేదో సోషియో ఫాంటసీ అనుకోవద్దు. రెగ్యులర్ సినిమానే. కాకపోతే కథకు నర్తనశాలకు సంబంధం ఏంటనేది సినిమా చూసి తెలుసుకోవాలంటున్నాడు నాగశౌర్య. ఇప్పుడీ సినిమాలోనే హీరోయిన్‌గా సిమ్రాన్‌ను తీసుకున్నారు. ప్రస్తుతం నాగశౌర్య నటించిన అమ్మమ్మగారిల్లు విడుదలకు సిద్ధమైంది. మరోవైపు ఛలో కెమెరామెన్ సాయిశ్రీరామ్‌ను దర్శకుడిగా పరిచయం చేస్తూ ఓ సినిమాకు రెడీ అవుతున్నాడు నాగశౌర్య. సాయిశ్రీరామ్ సినిమా తర్వాతే నర్తనశాల సెట్స్ పైకి వస్తుంది.

ఈ నెల 16న ప్రేక్షకుల ముందుకు నెల్లూరి పెద్దారెడ్డి



సతీష్ రెడ్డి, మౌర్యానీ, ముంతాజ్ హీరో హీరోయిన్లుగా దర్శకుడు వీజే రెడ్డి రూపొందించిన చిత్రం నెల్లూరి పెద్దారెడ్డి. సిద్ధి విఘ్నేశ్వరా క్రియేషన్స్ పతాకంపై సీహెచ్ రఘునాథ రెడ్డి ఈ చిత్రాన్ని నిర్మించారు. ప్రభాస్ శీను, అంబటి శీను, సమ్మెట గాంధీ ఇతర కీలక పాత్రల్లో కనిపించనున్నారు. గ్రామీణ నేపథ్యంలో సాగే ఆహ్లాదకరమైన ప్రేమ కథగా ఈ సినిమా తెరకెక్కింది. చిత్ర నేపథ్యం భావోద్వేగాలతో ఉన్నా...కథనం ఆద్యంతం వినోదాత్మకంగా సాగుతుంది. నెల్లూరి పెద్దారెడ్డి చిత్రానికి సెన్సార్ యూ/ఏ సర్టిఫికెట్ ఇచ్చింది. అన్ని కార్యక్రమాలు పూర్తి చేసుకున్న నెల్లూరి పెద్దారెడ్డి గ్రాండ్ రిలీజ్ కు సిద్ధమవుతోంది. ఈ నెల 16న నెల్లూరి పెద్దారెడ్డి సినిమా ప్రేక్షకుల ముందుకు రాబోతోంది.

ఈ సందర్భంగా దర్శకుడు వీజే రెడ్డి మాట్లాడుతూ....నెల్లూరి పెద్దారెడ్డి చిత్రానికి సెన్సార్ అభినందనలు దక్కాయి. సెన్సార్ వాళ్లు యూఏ సర్టిఫికెట్ జారీ చేశారు. ఈ నెల 16న దాదాపు వంద థియేటర్‌లలో భారీగా మా చిత్రాన్ని విడుదల చేసేందుకు సిద్ధమవుతున్నాం. పల్లె వాతావరణంలో కథంతా సాగుతుంది. పచ్చటి పైరుల అందాలు ప్రేక్షకులకు ఆహ్లాదాన్ని కలిగిస్తాయి. ఎక్కడా విసుగు అనిపించకుండా కథనం సాగుతుంది. కథ రీత్యా సెంటిమెంట్ చిత్రమైనా దాన్ని బ్యాలెన్స్ చేసేందుకు కావాల్సినంత వినోదం ఉంటుంది. పాటలు ఇప్పటికే శ్రోతల ఆదరణ పొందుతున్నాయి. నలుగురికి మంచి చేసే పెద్దారెడ్డి ఓ యువతి కుటుంబానికి ఆశ్రయమిస్తాడు. ఈ క్రమంలో అతనికి అనుకోని పరిస్థితులు ఎదురవుతాయి. వాటి పర్యవసానంగా కథ ఎలాంటి మలుపులు తిరిగింది అనేది ఆసక్తికరంగా చూపిస్తున్నాం. చింతామణి నాటక రిహార్సల్స్ సన్నివేశాలు ప్రత్యేకంగా రూపొందించాం. ఈ ఎపిసోడ్ అంతా ప్రేక్షకులను బాగా నవ్విస్తుంటుంది. అన్నారు.

కథానాయకుడు సతీష్ రెడ్డి మాట్లాడుతూ.....నెల్లూరి పెద్దారెడ్డి అనే పాత్ర పేరు ప్రేక్షకులు వినే ఉంటారు. ఆ పెద్దారెడ్డి నవ్విస్తే....ఈ నెల్లూరి పెద్దారెడ్డి మీకు మర్చిపోలేని అనుభూతిని అందిస్తాడు. ఇంత గొప్ప పాత్రను నాకు ఇచ్చిన దర్శకులు వీజే రెడ్డి గారికి కృతజ్ఞతలు. ప్రణాళిక ప్రకారం కేవలం 28 రోజుల్లోనే షూటింగ్ పూర్తి చేశాం. అనుకున్న సమయానికే నిర్మాణాంతర కార్యక్రమాలు ముగించి...ఇప్పుడు మీ ముందుకు తీసుకొస్తున్నాం. 16న థియేటర్ లలో మిమ్మల్ని అలరించేందుకు సిద్ధమవుతున్నాం. అన్నారు.

నెల్లూరి పెద్దారెడ్డి చిత్రానికి మాటలు – సంజీవ్ మేగోటి, సినిమాటోగ్రఫీ – బాలసుబ్రహ్మణి, ఎడిటింగ్ – మేనగ శీను, సంగీతం – గురురాజ్, డాన్స్ – గోరా మాస్టర్.

ఫాన్స్‌ను ఖుషి చేస్తున్న వెంకటేష్ లుక్



తేజ దర్శకత్వంలో వెంకటేష్ నటిస్తోన్న సినిమా ఆటా నాదే వేటా నాదే. ఈ చిత్ర షూటింగ్ వచ్చేవారం హైదరాబాద్‌లో ప్రారంభం కానుంది. అనుప్ సంగీతం అందిస్తోన్న ఈ సినిమాను సురేష్ బాబు అనిల్ సుంకర సంయుక్తంగా నిర్మిస్తున్నారు. ఈ సినిమాలో వెంకటేష్ ప్రొఫెసర్ రోల్‌లో కనిపించబోతున్న సంగతి తెలిసిందే. తాజాగా వెంకటేష్ లుక్ సోషల్ మీడియాలో హల్ చల్ చేస్తోంది. ఫాన్స్ వెంకటేష్ లుక్ చూసి ఖుషి అయిపోతున్నారు. లుక్‌ను అధికారికంగా విడుదల చెయ్యకపోయినా ఇప్పుడు ఫేస్ బుక్, ట్విట్టర్‌లో వెంకటేష్ లుక్ వైరల్ అయ్యింది. తేజ సినిమాకోసం వెంకటేష్ ఫోటో షూట్‌లో పాల్గొన్నప్పుడు తీసిన ఫోటో అది. శ్రియ హీరోయిన్‌గా నటిస్తోన్న ఈ సినిమాలో నారా రోహిత్ ముఖ్య పాత్రలో కనిపించబోతున్నాడు.

ప్రియ ప్రకాష్ వారియర్ సినిమా తెలుగులో రీమేక్

మళయాళ నటి ప్రియా ప్రకాష్ వారియర్ ఇప్పుడు సోషల్ మీడియాలో పాపులర్ అయిన సంగతి తెలిసిందే. ఒరు ఆడార్ లవ్ చిత్రంలో పాట ఎంత సంచలనం సృష్టించిందో అందరికి తెలిసిందే. ఈ పాటలో ప్రియా ప్రకాష్ వారియర్ ఇచ్చిన ఎక్స్‌ప్రెషన్స్‌కు అందరు ఫిదా అయ్యారు. తెలుగులో ఈ అమ్మాయికి మంచి ఆఫర్స్ వస్తున్నాయి. కాని ఇంకా ఏ సినిమా ఓకే చెయ్యలేదని సమాచారం. నిఖిల్ తను నటించే తమిళ్ కనితన్ రీమేక్‌లో ఈ అమ్మాయిని తీసుకుందామని ట్రై చేశాడు, కాని కుదరలేదు. తాజా సమాచారం ఏంటంటే.. ఈ అమ్మాయి నటించిన ఒరు ఆడార్ లవ్ సినిమా తెలుగు రీమేక్ రైట్స్‌ను వికెఎ ఫిలిమ్స్ సంస్థ ఫాన్సీ రేటుకు సొంతం చేసుకున్నట్లు సమాచారం. ఈ చిత్రంలో ఏ తెలుగు హీరో నటిస్తాడో చూడాలి. ముఖ్యంగా ప్రియ పాత్రలో ఎవరు కనిపించాబోతున్నారో తెలియాలంటే కొన్ని రోజులు ఆగాల్సిందే.



శ్రీదేవి మృతిపై సందేహాలు లేవు : ప్రభుత్వం

న్యూఢిల్లీ : అతిలోక సుందరి శ్రీదేవి మరణంపై ఎలాంటి సందేహాలు లేవని భారత విదేశాంగ శాఖ స్పష్టంచేసింది. ఆ శాఖ అధికార ప్రతినిధి రవీష్ కుమార్ మాట్లాడుతూ.. యూఏఈ ప్రభుత్వ విచారణ పత్రాలు అన్నీ తమకు అందాయని చెప్పారు. ఆ విచారణ నివేదిక ప్రకారమే ఆమె మృతదేహం భారత్‌కు వచ్చిందన్నారు. ఒకవేళ ఆమె మృతి అనుమానాస్పదంగా ఉంటే ఇప్పటికే ఆ కారణమేంటో బయటకు వచ్చేది కదా అని ఆయన అన్నారు. దుబాయ్ హోటల్ గదిలోని బాత్‌టబ్‌లో ప్రమాదవశాత్తు మునిగి శ్రీదేవి మరణించినట్లు యూఏఈ ప్రభుత్వం చెప్పిన విషయం తెలిసిందే. ఆమె ఫిబ్రవరి 24న చనిపోయినా.. ఫిబ్రవరి 27న ఆమె మృతదేహం భారత్‌కు వచ్చింది. దుబాయ్ అధికారులు ఈ కేసుపై పూర్తి విచారణ జరిపి ప్రమాదవశాత్తూ జరిగిందేనని నిర్ధారించుకున్న తర్వాతే మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అప్పగించారు. ఫిబ్రవరి 28న శ్రీదేవి అంత్యక్రియలు జరపగా.. ఈ మధ్యే ఆమె అస్థికలను హరిద్వార్‌లో నిమజ్జనం చేశారు.

మావోయిస్టు ప్రాంతాల్లో సీఆర్పీఎఫ్ శిబిరాలు

ఛత్తీస్‌గఢ్: మావోయిస్టులను మరింత సమర్థంగా ఎదుర్కొనే దిశగా సీఆర్పీఎఫ్ కీలక నిర్ణయం తీసుకొంది. ఛత్తీస్‌గఢ్‌లో మావోయిస్టుల ప్రాబల్యం అధికంగా ఉండే అబూజ్‌మడ్ అడవుల్లో మెరుపుదాడుల కోసం మూడు శాశ్వత శిబిరాలను ఏర్పాటు చేయాలని నిర్ణయించింది. అటవీ ప్రాంతాల్లో పనిచేసిన అనుభవం ఉన్న సుశిక్షితులైన వందమంది సిబ్బందిని ఒక్కో శిబిరంలో నియమించనున్నారు. నారాయణపూర్, బీజాపూర్, బస్తార్‌ను కలిపే ప్రాంతాల్లో ఈ శాశ్వత శిబిరాలను ఏర్పాటు చేయనున్నారు. అయితే భద్రతపరమైన కారణాలతో శిబిరాలు ఏర్పాటు అయ్యే కచ్చితమైన ప్రాంతాలను వెల్లడించడం లేదని సీఆర్పీఎఫ్ తెలిపింది. స్థానిక భద్రత శిబిరాలు, పోలీసు స్టేషన్లకు సులభంగా చేరుకునేలా ఈ శిబిరాలకు రహదారి, వైమానిక అనుసంధానతను ఏర్పాటు చేయనున్నారు. తగినన్ని ఆయుధాలు, పేలుడు పదార్థాలు, నిత్యావసర వస్తువులు, ఔషధాలు ఈ శిబిరాల్లో అందుబాటులో ఉంచనున్నారు. తాజా నిర్ణయం మావోయిస్టులపై పోరులో మరింత మేలు చేస్తుందని సీఆర్పీఎఫ్ తెలిపింది.

బీజేపీకి మళ్లీ అధికారం ఇవ్వొద్దు

- విపక్షాల గొంతు నొక్కుతున్న మోడీ సర్కారు
- పార్లమెంటు మూసేస్తే ఇంటికెళతాం గదా
- అడుగడుగునా అసహనం
- భావసారూప్యత గల పార్టీలన్నీ ఒక్కటి కావాలి
- కాంగ్రెస్ పనితీరు మెరుగుపడాలి
- ఇండియా టుడే కాంక్లేవ్‌లో సోనియా



న్యూఢిల్లీ : కాంగ్రెస్ మాజీ అధ్యక్షురాలు సోనియాగాంధీ ఎన్డీయే ప్రభుత్వంపై తీవ్ర విమర్శలు చేశారు. ఇండియా టుడే కాన్‌క్లేవ్ 2018లో పాల్గొన్న సోనియా... మోడీ హయాంలో ప్రతిపక్షాలకు స్వేచ్ఛ లేకుండా పోయిందని, తమ నోరు నొక్కేస్తున్నారని మండిపడ్డారు. బీజేపీ అధికారం చేపట్టిన తర్వాత దేశం తిరోగమన పథంలో ఉందని అన్నారు. బీజేపీ హయాంలో అసహనం పెరిగిపోయిందన్నారు. భయం, బెదిరింపులు, మత ఘర్షణలు ఎక్కువవుతున్నాయని సోనియా ఆందోళన వెలిబుచ్చారు. పార్లమెంటులో ప్రతిపక్షాలకు మాట్లాడే అవకాశం కూడా ఇవ్వట్లేదని నిశిత విమర్శ చేశారు. పార్లమెంటును మూసేస్తే తామంతా ఇంటికి వెళ్లిపోతాముగదా అని అన్నారు. వాజ్‌పేయి హయాంలో మాదిరిగా పార్లమెంటు కార్యకలాపాలు గౌరవప్రదంగా ఉండట్లేదని సోనియా అభిప్రాయపడ్డారు. 'బీజేపీ హయాంలో ఆర్థికాభివృద్ధి గణనీయంగా ఉందని చెబుతున్నారు. 2014 మే 26కు ముందు భారత్ ఏమైనా అగాథంలో కూరుకుపోయి ఉందా? ఈ నాలుగేళ్లలోనే భారత్ అభివృద్ధి, గొప్పదనం సాధించిందా? ఇలా చెప్పుకోవడం భారత ప్రజల మేధస్సుకు అవమానం కాదా?' అని సోనియా సూటిగా ప్రశ్నించారు. మన న్యాయవ్యవస్థ ప్రస్తుతం సంక్షోభంలో ఉందన్నారు. తమపై అవినీతి ఆరోపణలు చాలా ఎక్కువ చేసి చూపుతున్నారని పేర్కొన్నారు. ప్రజాస్వామ్యంలో భిన్నాభిప్రాయాలను, చర్చలను అంగీకరించాలని, ఏకపాత్రాభినయాన్ని కాదని సోనియా ఘాటుగానే వ్యాఖ్యానించారు. ప్రజలతో అనుసంధానమయ్యేందుకు కొత్త పద్ధతిని ఎంచుకోవాలని భావిస్తున్నామని, ఆ దిశగా కాంగ్రెస్ పార్టీ ఆలోచిస్తోందని సోనియా అన్నారు. తిరిగి కేంద్రంలో అధికారంలోకి వచ్చేందుకు తమ హయాంలోని పాలసీలను, ప్రాజెక్టులను ప్రజల్లోకి ఎలా తీసుకెళ్లాలనే విషయంపై దృష్టి పెట్టనున్నట్లు చెప్పారు. కాంగ్రెస్ అధ్యక్షుడిగా ఎన్నికైన తన కుమారుడు రాహుల్ గాంధీ ప్రజల మద్దతు కూడగట్టుకోవాల్సిన అవసరముందని చెప్పారు. వచ్చే ఎన్నికల్లో తాను పోటీ చేయాలా వద్దా అనే అంశాన్ని పార్టీ నిర్ణయిస్తుందని తెలిపారు. మన్మోహన్ తన కంటే మంచి ప్రధాని అవుతారని భావించానని, తన పరిమితులు తనకు తెలుసని సోనియా అన్నారు. రాజస్థాన్, మధ్యప్రదేశ్‌లలో రానున్న అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ అధికారంలోకి వస్తుందని సోనియా ఆశాభావం వ్యక్తంచేశారు. బీజేపీని తిరిగి అధికారంలోకి రానివ్వొద్దంటూ దేశ ప్రజలకు సోనియా గాంధీ పిలుపునిచ్చారు. ప్రస్తుత రాజకీయ పరిస్థితులపై ఆమె స్పందించారు. మత ఘర్షణలు మరింతగా పెరిగిపోయాయి. కేవలం అధికా రమే పరమావధిగా అనైతిక రాజకీయాలను ప్రదర్శిస్తున్న బీజేపీ.. స్థానిక రాజకీయాలను దెబ్బతీస్తోందని సోనియా పేర్కొన్నారు. పారదర్శకత కోసం ఆర్టీఐ యాక్ట్ తీసుకొస్తే.. దానిని కోల్డ్ స్టోరేజీలో పెట్టేశారు. ఆధార్ పరిస్థితి కూడా అస్తవ్యస్తంగా తయారయ్యిందని సోనియా అన్నారు. 2019 ఎన్నికల్లో బీజేపీకి ఓటేసి మళ్లీ అధికారం కట్టబెట్టొద్దని వేదిక సాక్షిగా ఆమె ప్రజలకు విజ్ఞప్తి చేశారు. చివర్లో 2014 ఎన్నికల్లో ఓటమి కారణాలపై స్పందించిన ఆమె అవినీతి ఆరోపణలు తమను దారుణంగా దెబ్బతీశాయన్నారు. కాంగ్రెస్ పార్టీ కొత్త తరహా రాజకీయాలకు అలవాటు పడాలన్న విశ్లేషకుల సూచనతో తానూ ఏకీభవిస్తానన్న ఆమె.. రాహుల్ గాంధీ సారథ్యంలో అది సాధ్యమౌతుందని దీమా వెలిబుచ్చారు.

కాంగ్రెస్ సంస్థాగతంగా ప్రజలకు చేరువయ్యేందుకు నూతన శైలిని సంతరించుకోవాలని అన్నారు. రాహుల్ గాంధీకి సలహాలిచ్చే ప్రయత్నం చేయబోనని ఓ ప్రశ్నకు సమాధానంగా చెప్పారు. పార్టీకి నూతన జవసత్వాలు తేవడానికి యువ నేతలు, సీనియర్ నేతలతో సమతుల్యత సాధించాలనుకుంటున్నట్లు తెలిపారు. అయితే అది అంత సులువు కాదని చెప్పారు. భావసారూప్యత గల పార్టీలన్నీ దేశ విస్తృత ప్రయోజనాల దృష్ట్యా స్థానిక వైరుధ్యాలను పక్కన పెట్టాల్సిన అవసరం ఉందని సోనియా హితవు పలికారు. తాను, రాహుల్, ఇతర తమ పార్టీ సీనియర్లు భావసారూప్యత గల పార్టీల నాయకులతో తరచూ సంప్రదింపులు జరుపుతున్నామని చెప్పారు. ఇలాగే ఇంతకుముందు కలిసి పని చేశామన్నారు.

త్రిపుర సీఎంగా విప్లవ్‌కుమార్ దేవ్

ప్రమాణస్వీకారం

అగర్తల : త్రిపుర తొలి బీజేపీ ముఖ్యమంత్రిగా విప్లవ్‌కుమార్‌దేవ్ శుక్రవారం ప్రమాణస్వీకారం చేశారు. గవర్నర్ తతగతరాయ్ ఆయన చేత ప్రమాణస్వీకారం చేయించారు. ఉపముఖ్యమంత్రిగా జిష్ణుదేవ్ ప్రమాణ స్వీకారం చేశారు. బీజేపీ నుంచి ఐదుగురు, ఐపీఎఫ్‌టీ నుంచి ఇద్దరు, ఎన్‌సీ దేబుర్‌మన్, మరో ఏడుగురు, మంత్రులుగా ప్రమాణ స్వీకారం చేశారు. అగర్తలలో జరిగిన ఈ కార్యక్రమానికి ప్రధాని నరేంద్రమోడీతో సహా బీజేపీ అధ్యక్షుడు అమిత్‌షా, కేంద్రమంత్రులు రాజ్‌నాథ్‌సింగ్, బీజేపీ సీనియర్ నాయకులు ఎల్‌కే అద్వానీ, మురళీ మనోహర్‌జోషి తదితరులు హాజరయ్యారు. అలాగే ఈ కార్యక్రమానికి త్రిపుర మాజీ ముఖ్యమంత్రి మాణిక్ సర్కార్ హాజరయ్యారు. బీజేపీ పాలిత రాష్ట్రాల ముఖ్యమంత్రులు విజయ్ రూపానీ (గుజరాత్), శివరాజ్ సింగ్ చౌహాన్ (మధ్యప్రదేశ్), సర్బానంద సోనోవాల్ (అసోం), రఘువర్‌దాస్ (జార్ఖండ్)లు హాజరయ్యారు. విమానాశ్రయం నుంచి వేదిక వరకు వీధుల్లో ఇరువైపులా బీజేపీ జెండాలు పెట్టగా, అలాగే మోడీ, అమిత్‌షాల చిత్రాలు ఉన్న భారీ పోస్టర్‌లను నగరంలో అక్కడక్కడా పెట్టారు. ఇటీవల జరిగిన త్రిపుర శాసనసభ ఎన్నికల్లో భారతీయ జనతాపార్టీ విజయం సాధించిన విషయం తెలిసిందే.

త్రిపురకు అండగా ఉంటాం : మోడీ



అగర్తల : త్రిపురలో అభివృద్ధికి కేంద్రం అండగా ఉంటుందని ప్రధాని నరేంద్రమోడీ భరోసా ఇచ్చారు. 'త్రిపురను కొత్త శిఖరాలకు తీసుకెళ్తాం. దానివల్ల ప్రజల జీవితాలను మార్చొచ్చు. రాష్ట్రం అభివృద్ధి వైపు అడుగులేసేందుకు కేంద్రం అన్ని విధాలా సహకారం అందిస్తుందని హామీ ఇస్తున్నానని మోడీ చెప్పారు. కొత్త ప్రభుత్వం అభివృద్ధి కోసమే పనిచేస్తుందని చెప్పారు. 'సబ్‌కా సాథ్, సబ్‌కా వికాస్' నినాదమే తమ ప్రధాన లక్ష్యమని చెప్పారు. 'ప్రధానిగా నేను చాలాసార్లు ఈశాన్య రాష్ట్రాల్లో పర్యటించాను. త్రిపురలో బీజేపీ ప్రభుత్వం ఏర్పడింది. కొత్త ముఖ్యమంత్రిగా బీజేపీ నేత విప్లవ కుమార్ దేవ్ నియమితులయ్యారు. ఆయన శుక్రవారం ప్రమాణం చేశారు. ఈ కార్యక్రమంలో మోడీ ప్రసంగించారు. ఈశాన్య ప్రజలకు యావత్ భారతం తోడుగా నిలుస్తుందని మోడీ చెప్పుకొచ్చారు. కార్యక్రమానికి కేంద్రమంత్రి రాజ్‌నాథ్ సింగ్, బీజేపీ జాతీయాధ్యక్షుడు అమిత్‌షా, పార్టీ సీనియర్ నేతలు ఎల్‌కే అద్వానీ, మురళీ మనోహర్ జోషీ, బీజేపీ పాలిత రాష్ట్రాల ముఖ్యమంత్రులు విజయ్ రూపానీ(గుజరాత్), శివరాజ్ సింగ్‌చౌహాన్(మధ్యప్రదేశ్), శర్వానంద సోనోవల్(అసోం), రఘుబర్ దాస్(ఝార్ఖండ్) తదితరులు పాల్గొన్నారు.

మే నుంచి 'నొక్కుకూలి' రద్దు

అంగీకరించిన కేరళ కార్మిక సంఘాలు

తిరువనంతపురం : ఎటువంటి సేవ చేయకుండానే డబ్బు చెల్లించే (నొక్కుకూలి) పద్ధతికి తెరవేయాలన్న కేరళలోని వామపక్ష సంఘటన ప్రభుత్వ నిర్ణయానికి రాష్ట్రంలోని కేంద్ర కార్మిక సంఘాలు ఆమోదం తెలిపాయి. 'నొక్కుకూలి' తీవ్రవాద కార్మికోద్యమాన్ని ప్రోత్సహిస్తోందని భావిస్తున్నారు. రాష్ట్రంలోని వ్యాపారులు, కార్మికుల మధ్య తరచూ ఘర్షణలు చోటుచేసుకు నేందుకు ఈ పద్ధతి అవకాశం కల్పిస్తోంది. ఎటువంటి సేవలు అందించ కుండానే లోడర్లు డబ్బు తీసుకునే దశాబ్దాలనాటి పద్ధతికి ముగింపు పలకాలన్న నిర్ణయం ఈ ఏడాది మే 1 నుంచి అమలులోకి రానున్నది. ఈ విషయమై ముఖ్యమంత్రి పినరాయి విజయన్ గురువారం ఇక్కడ ఒక సమావే శాన్ని ఏర్పాటు చేశారు. ఆ సమావేశంలో పాల్గొన్న కేంద్ర కార్మిక సంఘాలు ప్రభుత్వ ప్రతిపాదనకు మద్దతు తెలిపాయి. నిర్ణయం అమలును ఖరారు చేసేందుకు జిల్లా కలెక్టర్లు కార్మిక సంఘాల సమావేశాలను ఏర్పాటు చేస్తారని ఫేస్‌బుక్ పోస్టులో ముఖ్యమంత్రి పేర్కొన్నారు. సంస్థలకు కార్మికులను సరఫరా చేసే పద్ధతికి తాము ముగింపు పలుకుతామని కార్మిక సంఘాలు ప్రకటించాయి. రాష్ట్రంలో గడిచిన దశాబ్ద కాలంగా కార్మికుల సమస్యతో ఏ కంపెనీ కూడా మూతపడలేదని, వ్యాపార, వాణిజ్యానికి సంబంధించి కార్మికుల నుంచి కూడా ఎటువంటి ఫిర్యాదు అందలేదని విజయన్ తెలిపారు. 'నొక్కుకూలి', కార్మిక సంఘాలు కార్మికులను సరఫరా చేయడం రాష్ట్ర కార్మికరంగానికి మచ్చగా ఉంటోందని తెలిపారు. ఆయా ప్రాంతంలో కొత్త పరిశ్రమలు ఏర్పడినప్పుడు ఈ కార్మికులు ఉపాధి పొందాలన్నదే ప్రభుత్వ విధానమని విజయన్ స్పష్టం చేశారు.

ఆ పేరు ఉపయోగించడానికి వీల్లేదు : ఏఐఏడీఎంకే

చెన్నై : ఏఐఏడీఎంకే పేరును టీటీవీ దినకరన్ ఉపయోగించడానికి వీల్లేదని ఆపార్టీ శుక్రవారం స్పష్టం చేసింది. ఈ విషయంలో న్యాయసలహా తీసుకుంటామని ఆపార్టీ సీనియర్ నాయకుడు డి. జయకుమార్ తెలిపారు. ఢిల్లీ హైకోర్టులో దినకరన్ పిటిషన్ దాఖలు చేస్తూ సాధారణ గుర్తు లేదా ప్రెషర్ కుక్కర్ తోపాటు ఆయన కోరుకున్న పార్టీ పేర్లలో ఒకటి ఇవ్వాలని కోరారు. అయితే ఏఐఏడీఎంకే పార్టీ పేరును ఉపయోగించుకోవడాన్ని జయకుమార్ వ్యతిరేకించారు. దీనిపై మూడు వారాల్లో విచారణ చేపట్టాలని ఢిల్లీ హైకోర్టు ఎన్నికల కమిషన్‌కు ఆదేశించింది. ఏఐఏడీఎంకే రెండాకుల గుర్తును రాష్ట్ర ముఖ్యమంత్రి పళనిస్వామి, ఉపముఖ్యమంత్రి పన్నీర్ సెల్వంలకు కెటాయిం చడంపై ఎన్నికల కమిషన్‌ను సవాలు చేస్తూ నవంబరు 23న వీకే శశికళ- దినకరన్ మధ్యంతర పిటిషన్ దాఖలు చేశారు. పన్నీర్ సెల్వం ఏఐఏడీఎంకే కోఆర్డినేటర్ కాగ, పళనిస్వామి కో కోఆర్డినేటర్‌గా వ్యవహరిస్తున్నారు. ప్రెషర్ కుక్కర్ గుర్తుపై డిసెంబరులో జరిగిన ఆర్కే నగర్ ఉప ఎన్నికల్లో దినకరన్ స్వతంత్ర అభ్యర్థిగా విజయం సాధించిన విషయం తెలిసిందే. ఆయన పార్టీకి 'ఆల్ ఇండియా అమ్మా అన్న ద్రవిడ మున్నేట్ర కజగం'తో లేదా కోరుకున్న మరో రెండు పేర్లను కేటాయించాల్సిందిగా దినకరన్ ఎన్నికల కమిషన్‌ను కోరారు. మాజీ సినీహీరో, ముఖ్యమంత్రి ఎంజీ రామచంద్రన్ 1972లో డీఎంకేతో విడిపోయి ఏఐఏడీఎంకే పార్టీని స్థాపించారు.

ఐఎన్‌ఎక్స్ కేసులో కార్తీకి ఊరట

న్యూఢిల్లీ : మాజీ ఆర్థికమంత్రి, కాంగ్రెస్ సీనియర్ నాయకుడు, చిదంబరం కుమారుడు కార్తీ చిదంబరం ఐఎన్‌ఎక్స్ మీడియా కేసులో ఎన్‌ఫోర్స్ డైరెక్టరేట్ (ఈడీ) అరెస్టు చేయకుండా ఢిల్లీ హైకోర్టు ఊరట నిచ్చింది. న్యాయమూర్తులు మురళీధర్, ఐఎస్ మెహతాలతో కూడిన ద్విసభ్య ధర్మాసనం ధర్మాసనం శుక్రవారం ఉదయం 10.30 నుంచి 1.15 వరకు రహస్య విచారణ జరిపి తదుపరి విచారణవరకు అరెస్టు చేయరాదని ఈడీని ఆదేశించింది. సీబీఐ కేసులో ట్రయల్ కోర్టు బెయిలు ఇవ్వాలని నిర్ణయించుకుంటే విచారణలో సహకరించాలని, దేశం విడిచి వెళ్లరాదని కోరినప్పుడు హాజరు కావడం వంటి షరతులు విధిస్తుందన్నారు. సెక్షన్ 19 ప్రకారం మనీలాండరింగ్ నిరోధక చట్టంలో ఈడీ అధికారాలను కూడా పరిశీలిస్తామని కోర్టు పేర్కొంది. విచారణ సమయంలో చిదంబరం కూడా కోర్టు రూములోనే ఉన్నారు. సీబీఐ కార్తీని శుక్రవారం కోర్టులో హాజరు పరచి, మరో ఆరు రోజులపాటు కస్టడీకి ఇవ్వాలని కోర్టును కోరింది. సుప్రీంకోర్టు తన పిటిషన్‌ను వెనక్కితీసుకోమని కోరడంతో గురువారం ఆయన హైకోర్టులో ఈడీ అధికారాలను సవాలు చేస్తూ రిట్ పిటిషన్ దాఖలు చేశారు. సీబీఐ నమోదు చేసిన ఎఫ్ఐఆర్ ఈడీకి విచారణ జరిపే అధికారం లేదని ఆయన అత్యున్నత న్యాయస్థానంలో పిటిషన్ దాఖలు చేశారు. ఈ విషయంలో సరాసరి సుప్రీంకోర్టులో కేసు నమోదు చేయడం సరికాదని హైకోర్టును సంప్రదించాలని సుప్రీంకోర్టు రిట్‌పిటిషన్‌ను వెనక్కుతీసుకోమని కోరింది. 2017 మే 15న సీబీఐ ఎఫ్ఐఆర్ నమోదు చేసింది. కార్తీని ఫిబ్రవరి 28న అరెస్టు చేశారు. 2007లో ఐఎన్ఎక్స్ మీడియా విదేశాల నుంచి రూ. 305 కోట్లు అందుకుంది. ఇందుకోసం చిదంబరం ఆర్థిక మంత్రిగా ఉన్న సమయంలో ఫారిన్ ఇన్వెస్టిమెంట్ ప్రమోషన్ బోర్డు(ఎఫ్ఐపీబీ) క్లియరెన్స్ కోసం కార్తీ రూ.10 లక్షలు లంచం పుచ్చుకున్నారని సీబీఐ ఆరోపిస్తోంది. ఈ కేసులో కార్తీ చిదంబరంతోపాటు, ఐఎన్ ఎక్స్ మీడియా డైరెక్టర్లు పీటర్ , ఇంద్రాణీ ముఖర్జీలు నిందితులుగా ఉన్నారు.

టికెట్ల వేటలో వారసులు



కొడుకులు, కూతుళ్లపై నేతల ఆసక్తి

బెంగళూరు: కర్ణాటకలో అసెంబ్లీ ఎన్నికలు సమీపిస్తున్న వేళ రాజకీయ పార్టీల్లో వారసులకు టికెట్ల గోల ప్రారంభమైంది. పార్టీలకతీతంగా నాయకులు కుమారులు, కుమార్తెలు, ఇతర వారసులు పార్టీ టికెట్ల కోసం ఒత్తిడి చేస్తున్నారు. సీనియర్ నేతలు స్వయంగా తమ బిడ్డలకు టికెట్లు ఇప్పించుకోవడానికి నానాతంటాలు పడుతున్నారు. రాజకీయ నాయకుల కొడుకులు, కూతుళ్లు పార్టీ టికెట్ల కోసం క్యూ కడుతున్నారు. ముఖ్యమంత్రి సిద్ధరామయ్య ఈ ఎన్నికల్లో తన కొడుకును పోటీకి దించుతున్నారు. పదవిలో ఉన్న ముఖ్యమంత్రి, ఆయన కుమారుడు ఒకేసారి ఎన్నికల్లో పోటీ చేయడం కర్ణాటక ఎన్నికల చరిత్రలోనే తొలిసారి. సిద్ధరామయ్య తన కుమారుడు యతీంద్ర కోసం వరుణ నియోజకవర్గాన్ని వదులుకొని తాను గతంలో విజయం సాధించిన మైసూర్ జిల్లాలోని చాముండేశ్వరి నియోజకవర్గం నుంచి పోటీకి దిగనున్నారు. సిద్ధరామయ్య 1983-2008 మధ్య చాముండేశ్వరి నియోజకవర్గం నుంచి ఐదుసార్లు ఎమ్మెల్యేగా ఎన్నికయ్యారు. ఆ తర్వాత పక్కనే ఉన్న వరుణ నియోజకవర్గానికి మారారు. సిద్ధరామయ్య పెద్ద కుమారుడు రాకేశ్ 2016లో బెల్జియంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో మరణించారు. దీంతో చిన్న కుమారుడు యతీంద్రను రాజకీయాల్లోకి తీసుకొస్తున్నారు. వైద్యుడైన యతీంద్ర తొలుత రాజకీయాల్లోకి వచ్చేందుకు నిరాకరించినా తర్వాత అంగీకరించారు. 1994 కర్ణాటక ఎన్నికల్లో జనతా దళ్ ముఖ్యమంత్రి అభ్యర్థిగా పోటీ చేసిన హెచ్‌డీ దేవెగౌడ తన కుమారుడు హెచ్‌డీ రేవన్న కోసం హోలెనరసిపుర నియోజకవర్గాన్ని ఖాళీ చేసి రామనగర నుంచి పోటీ చేశారు. ఆ ఎన్నికల్లో ఇద్దరూ విజయం సాధించారు. దేవెగౌడ ముఖ్యమంత్రి అయ్యారు. ఆ తర్వాత పద్దెనిమిది నెలలకు ప్రధాని అయ్యారు. ప్రస్తుతం కర్ణాటకలో ఒక్క సిద్ధరామయ్య మాత్రమే కాకుండా దాదాపు డజనుమందికి పైగా కాంగ్రెస్ మంత్రులు తమ కొడుకులు, కూతుళ్లకు టికెట్ల కోసం లాబీయింగ్ చేస్తున్నారు. వారి సంఖ్య దాదాపు 15 దాకా ఉంటుందని అంచనా వేస్తున్నారు. కర్ణాటకలో ప్రతిపక్ష పార్టీ బీజేపీ, తర్వాత స్థానంలో ఉన్న జేడీఎస్‌లో ఇదే పరిస్థితి ఉన్నట్లు తెలుస్తోంది. యతీంద్ర రాజకీయాల్లోకి రావాలని ప్రజలు కోరుకుంటున్నారని, వరుణ నుంచి తనను పోటీకి దించాలని అడుగుతున్నారని సిద్ధరామయ్య తెలిపారు. అందుకే తాను తన పాత నియోజకవర్గానికి మారానని చెప్పారు. కాంగ్రెస్ అధిష్ఠానం అంగీకరిస్తేనే తన కుమారుడు ఎన్నికల్లో పోటీ చేస్తాడని, టికెట్లను తాను నిర్ణయించనని సీఎం వెల్లడించారు. కర్ణాటక కాంగ్రెస్‌లో దాదాపు 15 మంది మంత్రులు రెండేసి టికెట్లు అడుగుతున్నట్లు తెలుస్తోంది. ఒకటి వారి కోసం, మరొకటి వారి వారసుల కోసం. ప్రస్తుత అసెంబ్లీలో ఉన్నవారిలో నలుగురు ఎమ్మెల్యేలు తండ్రీ కొడుకులే కావడం విశేషం. వీరంతా కాంగ్రెస్‌కు చెందిన వారు. కాంగ్రెస్‌లో డా. మహాదేవప్ప, టీబీ జయచంద్ర, ఆర్ రోషన్ బేగ్, కె. రెహమాన్ ఖాన్, ఆర్. రామలింగారెడ్డి, సీకే జఫ్ఫార్ షెరీఫ్, మార్గరెట్ అల్వాల్, కె హెచ్ మునియప్ప తదితరులు తమ పిల్లల కోసం టికెట్లు కావాలని కోరుతున్నట్లు తెలుస్తోంది. బీజేపీ నేత యడ్యూరప్ప సైతం.. ఎమ్మెల్యే అయిన తన కుమారుడు బీ వై రాఘవేంద్రను రానేబెన్నూర్ నియోజకవర్గం నుంచి పోటీకి దింపే యోచనలో ఉన్నారు. జేడీఎస్ నేత హెచ్‌డీ దేవెగౌడ మనవడు ప్రజ్వల్ రేవన్న బెంగళూరులోని ఆర్ ఆర్ నగర్ టికెట్ అడుగుతున్నట్లు తెలుస్తోంది. జేడీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు హెచ్‌డీ కుమారస్వామి భార్య అనిత చెన్నపట్న నియోజకవర్గం నుంచి పోటీ చేయాలని భావిస్తున్నారు. పార్టీ అధినేత తన ఇద్దరు కుమారులు కాకుండా ఇతర కుటుంబసభ్యులెవరూ పోటీ చేయొద్దని చెప్పారు. కానీ నామినేషన్ తేదీ లోపు ఆయనను ఒప్పించాలని కుటుంబ సభ్యులు అనుకుంటున్నట్లు తెలుస్తోంది.

మహిళా దినోత్సవం నాడే బాలికపై అత్యాచారం

ఇండోర్ : మహిళ దినోత్సవం నాడే తొమ్మిదేళ్ల బాలికపై అత్యాచారం జరిగింది. నిందితుడు అర్జున్ రాథోర్(19)ని అదుపులోకి తీసుకున్నామని ఇండోర్ డీఐజీ హరినారాయణ మిశ్రా తెలిపారు. బాధితురాలు తన కుటుంబ సభ్యులతో కలసి మహాత్మాగాంధీరోడ్డులోని ట్రెజర్ ఐలాండు మాల్‌కు వెళ్ళిన సందర్భంలో ఈ ఘటన జరిగిందన్నారు. నిందితుడిపై సెక్షన్ 376, సంబంధిత సెక్షన్లతో కేసు నమోదు చేసి, మాల్‌లోని సెక్యూరిటీని పరిశీలిస్తామన్నారు. మధ్యప్రదేశ్ కాంగ్రెస్ ప్రతినిధి నరేంద్ర సలూజ మాట్లాడుతూ రద్దీగా ఉన్న ప్రాంతంలోనే ఇలాంటి సంఘటనలు చోటు చేసుకుంటే మహిళలకు మరెక్కడ రక్షణ ఉంటుందని ఇదేనా బీజేపీ పాలన అని విమర్శించారు.

బీజేపీ మౌనంపై కాంగ్రెస్ ఆరా

బెంగళూరు : కర్ణాటకకు ప్రత్యేక అధికారిక జెండాపై బీజేపీ ఎందుకు మౌనంగా ఉందని కాంగ్రెస్ ప్రశ్నించింది. ఆరాష్ట్ర ముఖ్యమంత్రి సిద్దరామయ్య అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో నూతన జెండాను ఆవిష్కరించిన ఒక రోజు తర్వాత కాంగ్రెస్ ఈ విషయంపై ఆరా తీసింది. బీజేపీ ఎంపీ బీఎస్ యడ్యూరప్ప కేంద్రంపై ఒత్తిడి తెచ్చి జెండా అనుమతికి ప్రయత్నించి కన్నడ స్వాభిమానాన్ని ప్రదర్శించాలని రాష్ట్ర కాంగ్రెస్ ట్వీట్ చేసింది.పసుపు తెలుపు, ఎరుపుతో ఉన్న ఈ జెండాపై గండబేరుండ పక్షి ఉంది.

నకిలీ మదరసాలతో రూ.100 కోట్ల నష్టం

లక్నో : నకిలీ మదరసాలతో రూ. 100 కోట్ల నష్టం వాటిల్లుతోందని ఉత్తరప్రదేశ్ ప్రభుత్వం గుర్తించింది. ఆన్‌లైన్ నమోదు ప్రక్రియద్వారా దీన్ని పసిగట్టామని, రాష్ట్రంలో 2000 మదరసాలు ఆన్‌లైన్‌లో నమోదులో పాల్గొంటానికి విఫలం చెందాయని మైనార్టీ సంక్షేమ మంత్రిత్వశాఖ మంత్రి లక్ష్మీనారాయణ్ చౌదురి వెల్లడించారు. రాష్ట్రంలో 19,213 మదరసాలు ఉండగా కేవలం 17 వేల మదరసాలు మాత్రమే సమాచారాన్ని వెబ్‌సైట్‌లో ఉంచాయన్నారు. మదరసాల్లో మెరుగైన సౌకర్యాలు, నాణ్యమైన విద్య అందించి ఉపకారవేతనాలను విద్యార్థుల బ్యాంకు ఎకౌంట్లలో జమచేస్తామన్నారు.

బీజేడీ రాజ్యసభ అభ్యర్థుల నామినేషన్లు

భువనేశ్వర్ : రాజ్యసభఅభ్యర్థులుగా బీజేడీకి చెందినప్రశాంత నందా, సౌమ్యా రంజన్ పట్నాయక్,అచ్యుత సమంతాలు శుక్రవారం ఒడిశానుంచి నామినేషన్లు దాఖలు చేశారు. వీరంతా ముఖ్యమంత్రి నవీన్‌పట్నాయక్ ఆధ్వర్యంలో రిటర్నింగ్ అధికారులకు నామినేషన్లు అందచేశారు. సౌమ్యా రాజన్ ఒడిశా డైలీ ఎడిటర్‌కాగ, అచ్యుతసమంతా బుధవారం బీజేడీలో చేరారు. నందా ఆపార్టీ అధికార ప్రతినిధిగా ఉన్నారు.

నాగాలాండ్ ప్రభుత్వ వంద రోజుల ఎజెండా

కోహిమా : నాగాలాండ్‌లో నూతనంగా పగ్గాలు చేపట్టిన ఎన్‌డీపీపీ నేతృత్వంలోని పీపుల్స్ డెమోక్రటిక్ (పీడీఏ) ప్రభుత్వం రాష్ట్రంలో వంద రోజులకు కార్యాచరణ ప్రణాళికతో ఎజెండాను రూపొందించింది. సచివాలయంలో గురువారం జరిగిన తొలి కేబినెట్ సమావేశంలో ప్రభుత్వ విభాగాలకు దీనికి సంబంధించిన లక్ష్యాలను ఏర్పాటు చేశారు. వందరోజుల కార్యాచరణ ప్రణాళికకు సంబంధించిన సమాచారాన్ని అన్ని ప్రభుత్వ విభాగాలు, సంస్థలు తమ వెబ్‌సైట్స్, పోర్టాల్స్, సామాజిక మాధ్యమాల్లో పొందుపరిచినట్టు కేబినెట్ సెక్రటరీ టెమ్‌జెన్ టాయ్ తెలిపారు.

మోడీకి అరుచల్‌ప్రదేశ్ గవర్నర్ కృతజ్ఞతలు

ఇటానగర్ : ఇటీవల ప్రధాని నరేంద్ర మోడీ అరుణాచల్‌ప్రదేశ్‌ను పర్యటించిన సందర్భంలో రాష్ట్రాన్ని అభివృద్ధిపరుస్తామని ప్రకటించడంపై ఆ రాష్ట్ర గవర్నర్ బీడీ మిశ్రా ఆయనకు కృతజ్ఞతలు తెలిపారు. శుక్రవారం ఆయన రాష్ట్ర అసెంబ్లీ బడ్జెట్ సెషన్‌లో ఆయన ఉపన్యసించారు. స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత ఈశాన్యరాష్ట్రంపై కేంద్రం ప్రత్యేక శ్రద్ధ కనబరచడం ఇదే మొదటిసారి అని ఆయన పేర్కొన్నారు. పేదరిక నిర్మూలన, ఉద్యోగాల కల్పన, ఉన్నత విద్య, వైద్యసేవలకే ప్రభుత్వం ప్రాధాన్యతనిస్తుందని చెప్పారు.

సూఫీ గాయకుడు కన్నుమూత

అమృత్‌సర్ : ప్రసిద్ధ పంజాబీ సూఫీ గీతాలు ఆలపించే జంట గాయకులు వదాలీ బ్రదర్స్‌లో ఒకరైన ప్యారేలాల్ వదాలీ గుండెపోటుతో శుక్రవారం ప్రైవేటు ఆసుపత్రిలో కన్నుమూశారు. ఆయన వయస్సు 75. ప్యారేలాల్ వదాలీ తన అన్న పురన్ చంద్ వదాలీతో కలిసి పాడిన 'తూ మానె యా నా మానే' పేరుగాంచింది. ప్యారేలాల్‌కు భార్య, ఇద్దరు కుమారులు, ముగ్గురు కుమార్తెలు ఉన్నారు. ఆయన తన సోదరుడితో కలిసి రాష్ట్ర, జాతీయ స్థాయి పలు పురస్కారాలను అందుకున్నారు.

రేపు ఇండోర్‌కు హిల్లరీ క్లింటన్

ఇండోర్ : అమెరికా మాజీ విదేశాంగశాఖ కార్యదర్శి హిల్లరీ క్లింటన్ ఈ నెల 11 నుంచి 13 వరకు ఇండోర్‌లో ప్రైవేట్ పర్యటన చేయనున్నట్టు సీనియర్ పోలీసు అధికారి శుక్రవారం తెలిపారు. ఇండోర్ సమీపంలోని పర్యాటక ప్రదేశాలల్లో ఆమె పర్యటిస్తారని చెప్పారు.

రాజ్యసభకు ఎస్పీ అభ్యర్థిగా జయాబచ్చన్ నామినేషన్

లక్నో : బాలీవుడ్ నటి, సమాజ్‌వాదీ పార్టీ నాయకురాలు జయాబచ్చన్ శుక్రవారం ఆ పార్టీ అభ్యర్థిగా రాజ్యసభకు నామినేషన్ వేశారు. పార్టీ నాయకులు డింపుల్‌యాదవ్, రాజేంద్ర చౌధురి, కిరణ్మయి నంద, వ్యాపారవేత్త సుబ్రతారాయ్ సహారాలతో కల్సి ఆమె అసెంబ్లీ సెంట్రల్‌హాల్‌కు వెళ్లి నామినేషన్ పత్రాలు దాఖలు చేశారు. ఏప్రిల్ 2 వ తేదీకి రాజ్యసభ సభ్యురాలిగా ఆమెకు గడువు తీరనుంది. ఉత్తరప్రదేశ్‌లో పది రాజ్యసభ స్థానాలకు మార్చి 23న ఎన్నికలు జరగనున్నాయి.

నామినేషన్ వేసిన జవదేకర్

ముంబై : మహారాష్ట్ర నుంచి రాజ్యసభ ద్వైవార్షిక ఎన్నికలకు కేంద్ర హెచ్‌ఆర్‌డీ మంత్రి ప్రకాష్ జవదేకర్ శుక్రవారం నామినేషన్ వేశారు. ముంబైలోని విద్యాభవన్‌లో ఆయన నామినేషన్ పత్రాలు దాఖలు చేశారు. ఏప్రిల్ 2వ తేదీకి రాజ్యసభ సభ్యుడిగా ఆయనకు గడువు తీరనుంది. మార్చి 23న మహారాష్ట్రలోని ఆరు స్థానాలకు ఎన్నికలు జరగనున్నాయి.

రాష్ట్ర పురోగతికి యువత సహకరించాలి : ముఫ్తీ

జమ్మూ : జమ్మూ కాశ్మీర్ రాష్ట్ర పురోగతికి కలిసి పనిచేద్దామని ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి మెహబూబా ముఫ్తీ యువతకు పిలుపునిచ్చారు. త్వరితగతిన రాష్ట్ర అభివృద్ధి, పురోగతి సాధించేందుకు యువత సహకరమందించాలని కోరారు. యువజన సంఘం ప్రతినిధులతో ఆమె మాట్లాడుతూ, రాష్ట్రంలో సోదరభావం, సమానత్వం పెంపొందించేందుకు యువత పాటుపడాలన్నారు. మత, వర్గ, ప్రాంతీయ తరతమ్యాలపై పోరాడాలని చెప్పారు.

పాకిస్తాన్ 'స్పెషల్ టెర్రరిస్ట్ జోన్'

న్యూఢిల్లీ : అంతర్జాతీయ వేదికగా పాకిస్థాన్‌ను ఎండగట్టిన భారత్ ఆ దేశం మీద మరోసారి విరుచుకుపడింది. సరిహద్దు చొరబాట్లు ప్రోత్సహిస్తూ, ఉగ్రకార్యకలాపాలకు స్వర్గంగా ఉన్న పాక్ తన వైఖరి మార్చుకోవడం లేదంటూ గురువారం ఎన్‌హెచ్ఆర్సీలో తీవ్రస్థాయిలో ఆరోపణలు చేసింది. కశ్మీర్‌లో మానవహక్కుల ఉల్లంఘనలకు భారత్ పాల్పడుతోందంటూ పాక్ చేసిన వ్యాఖ్యలపై భారత్ స్పందిస్తూ.. 'స్పెషల్ టెర్రరిస్ట్ జోన్' అని దుయ్యబడుతూ పాక్‌కు నిధులు అందించవద్దని యన్‌హెచ్ఆర్సీ కోరింది..

నేతాజీ విగ్రహానికి అవమానం...

జబల్‌పూర్ : దేశనాయకులు విగ్రహాలకు అవమానం ఇంకా కొనసాగుతోంది. తాజాగా మధ్యప్రదేశ్‌లో జబల్‌పూర్‌లో నేతాజీ సుభాష్ చంద్రబోస్ తెలుపురంగు విగ్రహానికి కొందరు గుర్తు తెలియని వ్యక్తులు శుక్రవారం ఉదయం ఎరుపురంగు పూసి అవమానించారు. సంఘటన తెలిసిన వెంటనే స్థానిక యంత్రాగం, పోలీసులు ప్రాథమిక విచారణ చేపట్టారు.

మాజీ ఎమ్మెల్యే రాజ్యలక్ష్మమ్మ (ముక్త్యాల రాణి) మృతి



విశాలాంధ్ర-జగ్గయ్యపేట : కృష్ణాజిల్లా జగ్గయ్యపేట అసెంబ్లీ నియోజకవర్గం మాజీ శాసనసభ్యురాలు రాజా వాసిరెడ్డి రాజ్యలక్ష్మమ్మ (ముక్త్యాల రాణి-94) శుక్రవారం చెన్నైలోని ఆమె కుమార్తె, కేసీపీ ఇండస్ట్రీస్ అధినేత వెలగపూడి ఇందిరాదత్ గృహంలో మరణించారు. కొంతకాలంగా అనారోగ్యంతో ఉన్నారని, ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతిచెందినట్టు ఆమె కుటుంబ సభ్యులు తెలిపారు. ఆమె భర్త వీఆర్‌జీకేఎమ్ ప్రసాద్ ముక్త్యాల రాజాగా పేరు గాంచారు. ఆయన కూడా జగ్గయ్యపేట ఎమ్మెల్యేగా పనిచేశారు. ఆయన మరణానంతరం ముక్త్యాల రాణి జగ్గయ్యపేట శాసనసభ్యురాలిగా 1974-78 కాలంలో పనిచేశారు. ఆ తర్వాత రాజకీయాలకు దూరంగా వున్నారు. ఈ ప్రాంతంలో ముక్త్యాల రాజా కుటుంబానికి మంచి పేరు ప్రతిష్ఠలు అన్నాయి. ఆమె కుమార్తె ఇందిరాదత్ ప్రముఖ పారిశ్రామికవేత్త వెలగపూడి లక్ష్మణ్‌దత్ సతీమణి. ముక్త్యాల కుటుంబం గ్రామంలో కేసీపీ సిమెంట్స్ ఫ్యాక్టరీ ఏర్పాటుచేశారు. జగ్గయ్యపేట పరిసర ప్రాంతాలలో ఎన్నో దేవాలయాలను నిర్మించిన ఘనత ముక్త్యాల రాజా కుటుంబీకులకు ఉంది. ఆమె మరణవార్త తెలుసుకున్న ఎమ్మెల్సీ తొండెపు దశరథ జనార్ధన్, శాసనసభ్యులు శ్రీరాం రాజగోపాల్, మాజీ మంత్రి నెట్టెం శ్రీరఘురాం, మాజీ విప్ సామినేని ఉదయభాను, మున్సిపల్ ఛైర్మన్ ఇంటూరి రాజగోపాల్, మున్సిపల్ మాజీ ఛైర్మన్‌లు తన్నీరు నాగేశ్వరరావు, శ్రీరాం సుబ్బారావు, నూకల రంగా, మేకా వెంకటేశ్వర్లు, చారుగుండ్ల కొండా, మున్సిపల్ కౌన్సిలర్లు తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఆమె కుటుంబ సభ్యులకు సానుభూతి తెలిపారు.

ఉత్తర భారతాన్ని చూసొద్దాం రండి!

విశాలాంధ్ర-విజయవాడ (గాంధీనగర్) : ఉత్తర భారతంలోని ముఖ్యమైన పర్యాటక ప్రదేశాలు, వైష్ణవీదేవి దేవాలయంతోసహా ఇతర ప్రదేశాలను చూసేందుకు రవాణా సౌకర్యం, ఆహారం, వసతి అన్నిటితో కలిసి భారత్ దర్శన్ పేరుతో ఇండియన్ రైల్వే క్యాటరింగ్ అండ్ టూరిజం కార్పొరేషన్ (ఐఆర్‌సీటీసీ) ప్యాకేజీని సద్వినియోగం చేసుకోవాలని విజయవాడ రైల్వే డివిజన్ రీజినల్ మేనేజర్ ఆర్.కె.చాంద్ కోరారు. విజయవాడ రైల్వేస్టేషన్‌లోని ఐఆర్‌సీటీసీ కార్యాలయంలో శుక్రవారం ఆయన విలేకరులకు ఈ ప్యాకేజీ వివరాలు వెల్లడించారు. ఈ నెల 19వ తేదీ అర్ధరాత్రి ఈ ప్రత్యేక రేణిగుంటలో బయలుదేరి మరుసటి రోజు మధ్యాహ్నం సికింద్రాబాద్ చేరుకుంటుందన్నారు. అక్కడ నుంచి ఖాజీపేట మీదుగా ఆగ్రా, తర్వాత మతురా మీదుగా వైష్ణవీదేవి ఆలయంతోపాటు ఢిల్లీ, హరిద్వార్, అమృతసర్ చుట్టుప్రక్కల పర్యాటక ప్రదేశాలను చూపించిన తర్వాత ఈ నెల 29వ తేదీకి రేణిగుంట చేరుకుంటారు. 11 రోజుల పాటు కొనసాగే ఈ విహార యాత్రలో ప్రయాణికులను రెండు తరగతులుగా విభజించినట్టు చెప్పారు. స్లీపర్‌క్లాస్, థర్డ్ ఏసీ ఉన్నాయి. స్లీపర్ క్లాస్‌లో ఒక్కొక్కరికి రూ.10,920గా నిర్ణయించారు. ఇతర వివరాలకు ఫోన్ నంబర్లు-9701360632, 9701360675, 0866-2572280 లో సంప్రదించాలని ఆయన సూచించారు.

రూ.4 కోట్ల విలువైన ఎర్రచందనం పట్టివేత

విశాలాంధ్ర-విశాఖ క్రైం : విశాఖ కంటైనర్ టెర్మినల్ వద్ద శుక్రవారం రూ.4 కోట్ల విలువైన ఎర్రచందనాన్ని డైరెక్టరేట్ ఆఫ్ రెవెన్యూ ఇంటిలిజెన్స్ అధికారులు పట్టుకున్నారు. శుక్రవారం పక్కా సమాచారంతో డైరెక్టరేట్ ఆఫ్ రెవెన్యూ ఇంటిలిజెన్స్ అధికారులు తరలించేందుకు రెండు కంటైనర్లలో సిద్ధం చేసిన 10.1 మెట్రిక్ టన్నుల ఎర్రచందనం స్వాధీనం చేసుకున్నారు. ఈ ఎర్రచందనం కంటైనర్లలో చెన్నై చేర్చి అక్కడి నుంచి చైనా తరలించడానికి నిందితులు ఏర్పాట్లు చేసుకున్నట్టు వివరించారు. దర్యాప్తు కొనసాగుతుందని డైరెక్టరేట్ ఆఫ్ రెవెన్యూ విజిలెన్స్ అదనపు డైరక్టర్ జనరల్ ఎం.కె.సింగ్ తెలిపారు.

భార్య గొంతుకోసి చంపిన కసాయి

విశాలాంధ్ర-పెద్దారవీడు : ప్రకాశంజిల్లా పెద్దారవీడు మండలంలోని బద్వీడు గ్రామంలో నిద్రిస్తున్న భార్య గొంతుకోసి చంపేసి పారిపోయి పోలీసు స్టేషన్‌లో లొంగిపోయిన ఘటన శుక్రవారం జరిగింది. ప్రగళ్లపాడు గ్రామానికి చెందిన గుండ్ల వెంగలయ్య, నాగమణి భార్యాభర్తలు. వెంగలయ్య అత్తగారి గ్రామమైన బద్వీడులో గత కొంతకాలం నుండి నివాసం ఉంటున్నాడు. గురువారం గ్రామంలో వేరొక ఇల్లు అద్దెకు తీసుకుని అక్కడికి వెళ్లిపోయారు. అదే రోజు అర్ధరాత్రి ఇంట్లో నిద్రిస్తున్న నాగమణి (20) గొంతుకోసి చంపేసి పారిపోయాడు. ఉదయం 6 గంటల సమయంలో మృతురాలి కుమార్తె నిర్జీవంగా పడి ఉన్న తల్లిని చూసి ఏడుస్తుండగా గ్రామస్తులు చూశారని పోలీసులు తెలిపారు. నిందితుడు వెంగలయ్య మద్యం సేవించి భార్యను ఇబ్బందులకు గురిచేస్తుంటాడని, అద్దెకు చేరిన మొదటిరోజే నాగమణిని అకారణంగా చంపేశాడని గ్రామస్తులు తెలిపారు. ఈ విషయాన్ని గ్రామ వీఆర్‌ఓ కె ఏడుకొండలు పోలీసులకు తెలియచేశారు. మార్కాపురం సీఐ బీమానాయక్ గ్రామాన్ని సందర్శించారు. పెద్దారవీడు హెడ్ కానిస్టేబుల్ రాజ్‌కుమార్ కేసు నమోదు చేశారు. ఇన్‌ఛార్జి తహశీల్దారు బీవీ రమణారావు సమక్షంలో శవపంచనామా జరిగింది. నాగమణి మృతదేహాన్ని మార్కాపురం ఏరియా వైద్యశాలకు తరలించి పోస్టుమార్టం నిర్వహించారు. మృతురాలికి ఇద్దరు కుమార్తెలు ఉన్నారు.



కటకటాల్లోకి ఫేస్‌బుక్, వాట్సాప్ కేటుగాళ్లు

విశాలాంధ్ర-ఏలూరు : ఫేస్‌బుక్, వాట్సాప్‌ల్లో చేసిన చాటింగ్‌లు, ప్రైవేటు ఫొటోలు నెట్‌లో పెడతామంటూ బెదిరించి ఒక యువతి నుంచి మూడున్నర కేజీల బంగారు ఆభరణాలను బలవంతంగా దోచుకున్న ఏడుగురి దుండగులను ఏలూరు వన్‌టౌన్ పోలీసులు శుక్రవారం అరెస్టు చేశారు. వారి నుంచి కోటి పది లక్షల రూపాయల విలువైన బంగారు ఆభరణాలు, కారు, రెండు మోటారు సైకిళ్లు, టాబ్, మూడు సెల్‌ఫోన్లు, ఏసీ, టీవీలను స్వాధీనం చేసుకున్నారు. పశ్చిమగోదావరి జిల్లా ఏలూరులోని జిల్లా ఎస్పీ కార్యాలయ సమావేశ మందిరంలో ఎస్పీ ఎం రవిప్రకాష్ వివరాలను మీడియాకు వెల్లడించారు. ఏలూరుకు చెందిన దట్టి బాలాజీ, సింహాద్రి బాలచందర్ అలియాస్ బాలు, పిల్లా సాయి దేవేంద్రనాయుడు, విప్పర్తి ఫ్రాన్సిస్, కొండి రాజేష్, తుమ్మలపల్లి అశోక్‌కుమార్, దెందులూరు మండలం వీరభద్రపురం గ్రామానికి చెందిన గుజ్జుల రాజీవ్ స్నేహితులు. వీరందరూ ఫేస్‌బుక్, వాట్సాప్‌లలో మహిళల ప్రొఫైల్స్‌కు రిక్వెస్టులు పెట్టి వారు అంగీకరిస్తే వారితో స్నేహితులుగా చాటింగ్ చేస్తూ ఉంటారు. తాము సినిమా హీరోలతో సన్నిహిత సంబంధాలు కొనసాగిస్తున్నామని నమ్మిస్తారు. హీరోలతో వారు దిగిన ఫొటోలను, ఎయిర్‌పోర్టుల్లో దిగిన ఫొటోలను అమ్మాయిలకు పంపిస్తూ ప్రలోభ పెడతారు. ఆ అమ్మాయిలతో చేసే చాటింగ్స్, ఫొటోలను స్క్రీన్ షాట్ తీసి తమ వద్ద ఉంచుకుంటారు. ఆ తరువాత వ్యాపారం కోసం డబ్బు, లేదా బంగారు నగలు ఇవ్వమని అమ్మాయిలను కోరతారు. వారు నిరాకరిస్తే చాటింగ్స్, ఫొటోలను తల్లిదండ్రులకు, బంధువులకు చూపిస్తామని, ఫొటోలను మార్ఫింగ్ చేసి నెట్‌లో పెడతామంటూ బెదిరిస్తూ నగదు, బంగారు ఆభరణాలను కాజేస్తూ ఉంటారు. వీరిలో కీలకమైన దట్టి బాలాజీ ఏలూరు వన్‌టౌన్ పరిధిలోని ఒక బంగారు వ్యాపారి కూతుర్ని బెదిరించి మూడున్నర కేజీ బంగారు ఆభరణాలను విడతలవారీ తీసుకున్నాడు. బాధితురాలి ఫిర్యాదుతో కేసు దర్యాప్తు చేసిన పోలీసులు ఏడుగురు వ్యక్తులను గురువారం రాత్రి ఆశ్రం ఆసుపత్రి వద్ద అరెస్టు చేశారు. విలేకరుల సమావేశంలో ఏలూరు డీఎస్పీ ఈశ్వరరావు, సీఐలు అడపా నాగమురళి, పి. శ్రీనివాసరావు, ఎస్ఐలు కిషోర్‌బాబు, మక్బుల్ పాల్గొన్నారు.

27న మాలమహానాడు 'చలో ఢిల్లీ'



విశాలాంధ్ర - విజయవాడ(గాంధీనగర్) : ఎస్సీ వర్గీకరణకు వ్యతిరేకంగా పి.వి.రావు మాలమహానాడు ఆధ్వర్యంలో ఈ నెల 27వ తేదీన 'చలో ఢిల్లీ' కార్యక్రమం నిర్వహించనున్నట్లు మాలమహానాడు జాతీయ అధ్యక్షుడు పందు అశోక్‌కుమార్ తెలిపారు. విజయవాడ తుమ్మలపల్లి కళాక్షేత్రం వద్ద అంబేద్కర్ విగ్రహానికి శుక్రవారం పూలమాలలు వేసి నివాళులు అర్పించిన తర్వాత చలో ఢిల్లీ పోస్టర్‌ను విడుదల చేశారు. ఈ సందర్భంగా అశోక్‌కుమార్ మాట్లాడుతూ కాలం చెల్లిన ఎస్సీ వర్గీకరణకు అన్ని రాజకీయ పార్టీలు స్వస్తి పలకాలన్నారు. గతంలోనూ సుప్రీంకోర్టు వర్గీకరణ చేయరాదని స్పష్టం చేసిందని, ప్రభుత్వం వర్గీకరణ అంశాన్ని విరమించుకోవాలన్నారు. కర్ణాటక, కేరళ రాష్ట్రాల్లో రిజర్వేషన్ శాతం పెంచిన విధంగా పెరిగిన ఎస్సీ జనాభాకు అనుగుణంగా ఇప్పుడున్న 15 శాతాన్ని 20 శాతానికి పెంచాలన్నారు. పి.వి.రావు మాలమహానాడు రాష్ట్ర అధ్యక్షుడు గుమ్మాపు సూర్యవరప్రసాద్, నిర్వాహక కమిటీ సభ్యులు జల్లి శ్రీనివాసరావు, నాతి శ్రీనివాసరావు, మైలాబత్తుల మైఖేల్‌రాజు, సిరింగుల వెంకటరత్నం పాల్గొన్నారు.

అవినీతికి పాల్పడలేదని ప్రమాణం చేశా



విశాలాంధ్ర - ఐరాల : సత్యప్రమాణాలకు నిలయమైన కాణిపాకం వరసిద్ధి వినాయకస్వామి ఆలయంలో నేను ఎలాంటి అవినీతికి పాల్పడలేదని ప్రమాణం చేసినట్టు రాష్ట్ర మాజీ మంత్రి కామినేని శ్రీనివాస్ తెలిపారు. వినాయక స్వామి ఆలయానికి శుక్రవారం ఆయన విచ్చేశారు. ఆలయ ఈవో పూర్ణచంద్రరావు స్వాగతం పలికి ప్రత్యేక దర్శనం చేయించారు. తీర్థప్రసాదాలు అందజేశారు. అనంతరం కామినేని శ్రీనివాస్ విలేకరులతో మాట్లాడుతూ నేను మంత్రి పదవి చేపట్టిన తరువాత నాపై వచ్చిన అవినీతి ఆరోపణలపై కాణిపాకం దేవస్థానంలో సత్యప్రమాణం చేశానన్నారు. నా సతీమణి కూడా ఆదర్శమైన ఉపాధ్యాయ వృత్తిలో గౌరవంగా ఉన్నారన్నారు. నాపై అసూయతో, రాజకీయ వివాదాలతో కొందరు బురదజల్లే ప్రయత్నం చేశారన్నారు. టీటీడీ బోర్డు మాజీ సభ్యులు భానుప్రకాష్‌రెడ్డి, శ్రీకాళహస్తి దేవస్థానం మాజీ ఛైర్మన్ కోలా ఆనంద్ పాల్గొన్నారు.

చింతపండుకు చుక్కెదురు

- మద్దతు ధర ప్రకటించని అధికారులు
- దళారుల చేతిలో దగాపడుతున్న గిరిజనులు
- కిలో ధర రూ.100 నుంచి రూ.30కి పతనం





విశాలాంధ్ర-గుమ్మలక్ష్మీపురం : అటవీ ఉత్పత్తులకు గిట్టుబాటు ధర కల్పిస్తూ గిరిజనుల ఆర్థికాభివృద్ధికి దోహదపడాల్సిన గిరిజన కోఆపరేటివ్ మార్కెటింగ్ సొసైటీల నిర్వహణపై నీలినీడలు కమ్ముకుంటున్నాయి. గతంలో గిరిజన కార్పొరేషన్లు (జీసీసీ)లను జీసీఎంఎస్‌లుగా మార్పుచేసిన తర్వాత తిరోగమనం వైపు పయనిస్తున్నాయనే విమర్శలు ఉన్నాయి. జీసీసీల మనుగడ ఆయా ప్రాంతాల్లోని ప్రధాన అటవీ ఉత్పత్తుల కొనుగోలు, విక్రయాలపై ఆధారపడి ఉంటుంది. రాష్ట్రంలోని పాడేరు, అరకు డివిజన్లలో పిప్పళ్లు, రాజ్‌మా చిక్కుడు గింజలు, మిరియాలు పంటలు ప్రధానమైనవి. చింతపల్లి, రంపచోడవరం, తిరుపతి, శ్రీశైలం డివిజన్లలో తేనె, కొండచీపుర్లు. కె.ఆర్.పురంలో మిరపకాయలు, సీతంపేటలో నరమామిడి చెక్క, పార్వతీపురం డివిజన్‌లోని సాలూరు, గుమ్మలక్ష్మీపురం బ్రాంచ్‌ల పరిధిలో చింతపండు, నల్లజీడిపిక్కలు, కరక్కాయలు, కొండచీపుర్లు ప్రధాన వనరుగా జీసీసీలను నడిపిస్తాయి. గిరిజనులు సేకరించిన ఈ అటవీ ఉత్పత్తుల కొనుగోళ్ల ధరలు ప్రభుత్వంతో పాటు జీసీసీ మేనేజింగ్ డైరెక్టర్‌పై ఆధారపడి ఉంటాయి. ఈ ఏడాది విజయనగరం జిల్లా పార్వతీపురం డివిజన్‌లో అత్యధికంగా దిగుబడి వచ్చిన చింతపండు కొనుగోలుకు జీసీసీ ముందుకు రాకపోవడం సర్వత్రా చర్చనీయాంశమవుతోంది. సాధారణంగా జీసీసీలు కొనుగోలు, అమ్మకాలపై వచ్చే లాభాలను సిబ్బందికి జీతాలుగా చెల్లిస్తూ ముందుకు నడిపించే సంస్కృతి ప్రస్తుతం కొనసాగుతోంది. ఈ నేపథ్యంలో చింతపండు కొనుగోలుకు జీసీసీ మద్దతు ధర ప్రకటించకపోవడం ప్రైవేటు వ్యాపారులను ప్రోత్సహించడమేనన్న ఆరోపణలు వినపడుతున్నాయి. చింతపండుకు మద్దతు ధర కల్పించకపోగా కొనుగోలుకు జీసీసీ నిరాకరించడంతో గిరిజనులు దళారులను ఆశ్రయిస్తూ దోపిడీకి గురవుతున్నారు. గత ఏడాది కొనుగోలు చేసిన పాత ధర కిలో రూ.25లకే చింతపండు ఇవ్వాలని అధికారులు కోరడంతో గిరిజన రైతులు నిరాకరిస్తున్నారు. జీసీసీకి సరకును విక్రయించేందుకు ఇష్టపడకపోవడంతో కొనుగోళ్లు నిలిచిపోయాయి.

గిరిజనుల జీవితాలతో ఆటలు


చింతపండు సీజన్ ప్రారంభంలో కిలో రూ.100 చొప్పున ప్రైవేటు వ్యాపారులు కొనుగోలు చేశారు. 15 రోజుల్లో శివరాత్రి తర్వాత కిలో ధర రూ.30కు తగ్గించేశారు. తూనికల్లోనూ మోసాలు తప్పడం లేదు. జీసీసీ కొనుగోలు చేయకపోవడంతో దళారుల ఆగడాలకు అడ్డూ, అదుపూ లేకుండా పోయిందనే విమర్శలు ఉన్నాయి. ఆది నుంచి అటవీ ఉత్పత్తుల కొనుగోళ్లపై గిరిజన సహకార సంస్థకు గుత్తాధిపత్యం ఉండేది. గత ప్రభుత్వాల రాజకీయ ఎత్తుగడలతో జీసీసీ పట్టు కోల్పోయింది. గిరిజనులు సేకరించిన అటవీ ఉత్పత్తులను నచ్చిన ధరకు, నచ్చిన వ్యాపారులకు విక్రయించవచ్చన్న సంకేతాలను కేంద్రప్రభుత్వం విడుదల చేసింది. ఇది ప్రైవేటు వ్యాపారులకు ఊతమిచ్చింది, ఏజెన్సీలో వారి ఆగడాలకు అడ్డు లేకుండా పోయింది.

ఉన్నతాధికారుల ఆదేశాలు శిరోధార్యం



జీసీసీ లావాదేవీలకు ఉన్నతాధికారుల ఆదేశాలే శిరోధార్యం. చింతపండు కొనుగోలుకు ప్రభుత్వ నిబంధనలు అడ్డంకిగా మారాయి. ప్రతి ఏడాది గుమ్మలక్ష్మీపురం బ్రాంచ్‌కి 10 వేల క్వింటాళ్లు లక్ష్యంగా నిర్ణయించేవాళ్లం. ఈ ఏడాది దిగుబడి బాగున్నప్పటికీ ప్రైవేటు మార్కెట్‌లో కూడా మద్దతు ధర బాగుంది. గతేదాది కిలో రూ.20కు కొనుగోలు చేశాం. ఈ ఏడాది గిరిజనులు నిరాకరించారు. దిగుబడిలో 80 శాతం విక్రయాలు ఇప్పటికే జరిగిపోయాయి. ప్రస్తుతం కిలో రూ.25లకు కొనుగోలు చేయాలని జీసీసీ మేనేజింగ్ డైరెక్టర్ ఆదేశించారు. గిరిజన రైతులు జీసీసీ అభివృద్ధిని దృష్టిలో పెట్టుకుని ఆయా డిపోలకు చింతపండు తెస్తే కొనుగోలు చేస్తాం.

-ఎస్.భాస్కరరావు,
పార్వతీపురం డివిజనల్ మేనేజర్



సముద్రతీరానికి ఆలివ్ రిడ్లే తాబేళ్లు

విశాలాంధ్ర - వజ్రపుకొత్తూరు : శ్రీకాకుళం జిల్లాలోని వజ్రపుకొత్తూరు మండలంలో సముద్ర తీరానికి ఆలివ్‌రిడ్లే తాబేళ్లు పెద్దఎత్తున చేరుతున్నాయి. ప్రతి సంవత్సరం మార్చి నెలాఖరు, ఏప్రిల్ మొదటి వారంలో తీరంలోని ఇసుక దిబ్బల్లో గుడ్లు పెట్టి సముద్రంలోకి వెళ్లిపోతుంటాయి. గుడ్లు పొదిన తర్వాత సుమారు 60 రోజులలో పిల్లలుగా మారి వాటికవే సముద్రపు నీటిలోకి చేరుతాయి. తాబేళ్లు ఒకేసారి సుమారు 100 గుడ్లు పెడతాయి. శ్రీకాకుళం జిల్లా వజ్రపుకొత్తూరు మండలంలోని మెట్టూరు, అక్కుపల్లి, గుణుపల్లి, డోకులపాడు, మంచినీళ్ళపేట, హుకుంపేట, కంబాలరాయుడుపేట, కొత్తపేట, దేవునల్తాడ తదితర గ్రామాల్లో సముద్రతీరాలకు తాబేళ్లు చేరుకొని గుడ్లు పెడుతున్నట్టు ఆయా గ్రామాల మత్స్యకారులు చెబుతున్నారు. తల్లి తాబేళ్లకు ఎటువంటి హాని కలుగకుండా మత్స్యకారులు, స్థానికులు కాపాడుతుంటారు. సముద్రంలోని వ్యర్థ పదార్థాలు, కలుపు మొక్కలు, జెల్లీఫిష్‌లను ఇవి ఆహారంగా తీసుకోవడంతో సముద్రంలోని ఇతర చేపలకు ఇబ్బంది ఉండదని అధికారులు చెబుతున్నారు. జిల్లాలో శ్రీకూర్మం, మత్స్యలేషం, బారువలలో హేచరీస్‌లను అటవీ శాఖాధికారులు ఏర్పాటు చేసినట్లు మండల మత్స్యశాఖ అధికారి తెలిపారు.

ప్రపంచీకరణతో మహిళా హక్కులకు ముప్పు

కాకతీయ వర్సిటీ విశ్రాంత ఆచార్యులు జ్యోతిరాణి



విశాలాంధ్ర-గుంటూరు సిటీ : ఐక్యరాజ్యసమితి కనీస మానవ హక్కుగా పేర్కొన్న మహిళల భద్రత, రక్షణకు ప్రపంచీకరణ నేపథ్యంలో తీవ్ర ముప్పు ఏర్పడిందని తెలంగాణ రాష్ట్రంలోని వరంగల్ కాకతీయ యూనివర్సిటీ విశ్రాంత ఆచార్యులు తోట జ్యోతిరాణి ఆందోళన వ్యక్తం చేశారు. స్త్రీ విముక్తి సంఘటన ఆధ్వర్యంలో గుంటూరు ఎన్జీఓ కళ్యాణ మండపంలో శుక్రవారం అంతర్జాతీయ మహిళా దినోత్సవ రాష్ట్ర సదస్సు జరిగింది. తొలుత రైల్వేస్టేషన్ నుంచి ఎన్జీవో కళ్యాణ మండపం వరకు నిర్వహించిన ప్రదర్శన ఆకట్టుకుంది. అనంతరం ఎన్జీఓ హాల్‌లో స్త్రీవిముక్తి సంఘటన రాష్ట్ర అధ్యక్షురాలు సి.విజయ అధ్యక్షతన జరిగిన సదస్సులో ముఖ్యఅతిథిగా జ్యోతిరాణి మాట్లాడుతూ కార్పొరేట్‌శక్తుల లాభాపేక్షతో నడుస్తున్న ప్రసార మాధ్యమాల ప్రభావంతో సాంస్కృతిక సంక్షోభం నెలకొందన్నారు. విధ్వంసాన్ని ప్రోత్సహించే ఆర్థిక విధానాలు దోపిడీ, పీడన, హింసలతో నిండిపోయాయన్నారు. ప్రపంచీకరణ విధానాల పర్యవసానాలు స్త్రీల జీవితాలను మరింత కష్టభరితం చేస్తున్నాయన్నారు. వీటిపై పోరాడేందుకు స్త్రీ విముక్తి సంఘటన కార్యాచరణలో మహిళలందరూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. ప్రజాసాహితి ప్రధాన సంపాదకులు కొత్తపల్లి రవిబాబు మాట్లాడుతూ వ్యవస్థీకృత దోపిడీ, యుద్ధాలు, కరవు, వలసలు, పురుషాధిపత్యం వల్ల మహిళలు హింసించబడుతున్నారన్నారు. స్త్రీని లైంగిక వస్తువుగా చూసే ధోరణికి, అసమానత్వానికి వ్యతిరేకంగా పోరాడాలని పిలుపునిచ్చారు. ఏపీటీఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షులు చెన్నుపాటి మంజుల మాట్లాడుతూ పాఠశాలల నుంచి విశ్వవిద్యాలయం వరకు మహిళలపై దాడులు, అత్యాచారాలకు నిలయాలుగా మారిన నేపథ్యంలో విషసంస్కృతిని నిర్మూలించడానికి చట్టసభలలో మహిళలు ప్రవేశించాల్సిన అవసరం ఉందన్నారు. ఓపీడీఆర్ రాష్ట్ర అధ్యక్షులు కె.ఏసు మాట్లాడుతూ దళిత మహిళలపై పెత్తందారులు, భూస్వాముల దాడులకు సంబంధించి పోలీసులు కనీసం కేసు కూడా నమోదు చేయని పరిస్థితి ఉందన్నారు. రైతు కూలీ సంఘం రాష్ట్ర అధ్యక్షులు సింహాద్రి ఝాన్సీ మాట్లాడుతూ శ్రమ దోపిడీకి వ్యతిరేకంగా సాగుతున్న శ్రామికవర్గ పోరాటాల్లో భాగస్వాములు కావడం ద్వారానే మహిళలు చైతన్యవంతులవుతారని పిలుపునిచ్చారు. 'మహిళల జీవన విధ్వంసం-సామాజిక, ఆర్థిక మూలాలు' అనే పుస్తకాన్ని ఆవిష్కరించారు. ఉపాధ్యాయ పత్రిక ఎడిటర్ ఎస్.జిలానీ పుస్తకాన్ని పరిచయం చేశారు. ఈ కార్యక్రమంలో స్త్రీవిముక్తి సంఘటన రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం.లక్ష్మి, స్త్రీ సంఘటన సంపాదకులు అమలేందు తదితరులు పాల్గొన్నారు.

గుప్త నిధుల కోసం గుడికి కన్నం

- ఆలయ కాపలాదారుడిని తాళ్ళలో కట్టేసి
- నిధులు దోచుకెళ్ళారని గ్రామస్తుల అనుమానం
- ప్రకాశం జిల్లాలో ఘటన



విశాలాంధ్ర-పెద్దారవీడు : ప్రకాశం జిల్లా పెద్దారవీడు మండలం బోడిరెడ్డిపల్లి గ్రామ శివారులోని నాగమల్లేశ్వర దేవాలయంలో గురువారం అర్ధరాత్రి దుండగులు గుప్త నిధుల తవ్వకాల కోసం ఆలయ గోడకు కన్నం పెట్టారు. గ్రామానికి కిలోమీటరు దూరంలోని ఈ ఆలయంలో కాపలా ఉంటున్న దుగ్గెంపూడి బోడిరెడ్డిని బెదిరించిన దుండగులు తాళ్లతో కటేశారు. అర్ధరాత్రి 12 గంటల సమయంలో వచ్చిన ఆరుగురు వ్యక్తులు గుడిలోకి చొరబడ్డారు. తాళ్లతో కట్టేసిన తన వద్ద కాపలా ఉన్నారని, మిగతా నలుగురు గుడి గోడకు రంధ్రం వేసిన తర్వాత అందరూ తనను వదిలివేసి వెళ్లిపోయారన్నారు. గుడికి వేసిన రంధ్రంలో ఏమి ఉన్నదో తనకు తెలియదని బోడిరెడ్డి అంటున్నాడు. గత నెలలో అనుమానిత వ్యక్తులు కొందరు గుడిలోనికి వచ్చి వివిధ మిషన్ల ద్వారా కొలతలు తీసుకుని వెళ్లినట్టు వివరించారు. నాగమల్లేశ్వర స్వామి దేవస్థానంలో ఎక్కడ ఏమి ఉన్నదో పరిశీలించిన తర్వాత ఇప్పుడు వచ్చి గుడిలోని గుప్తనిధులను కొల్లగొట్టుకు పోయారని గ్రామస్తులు అనుమానిస్తున్నారు. తెల్లవారుజామున మూడు గంటల సమయంలో కాపలాదారుడు బోడిరెడ్డి గ్రామంలోకి వచ్చి సమాచారం ఇచ్చాడు. గ్రామస్తులు పరిశీలించిన తర్వాత కచ్చితంగా గుప్తనిధులు కొల్లగొట్టారని అనుమానం వ్యక్తం చేస్తున్నారు. గతంలో కూడా ఈ దేవస్థానంలో గుప్తనిధుల కోసం అనేక ప్రయత్నాలు చేసినట్లు గ్రామస్తులు చెబుతున్నారు. ఆలయాల్లో గుప్తనిధుల తవ్వకాలు సాధారణంగా గర్భగుడిలో, లోపల ఎక్కువ జరుపుతుంటారని, ఈసారి దీనికి భిన్నంగా గుడి గోడను తవ్వారంటే కచ్చితమైన సమాచారంతోనే చేసివుంటారని గ్రామస్తులు అంటున్నారు. పెద్దారవీడు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయనున్నట్లు గ్రామస్తులు తెలిపారు.

త్వరలో గన్నవరం నుంచి సింగపూర్, మలేషియాకు విమాన సర్వీసులు

విశాలాంధ్ర - విజయవాడ : గన్నవరం విమానాశ్రయం నుంచి సింగపూర్, మలేషియా, థాయ్‌ల్యాండ్ దేశాలకు విమాన సర్వీసులు నడిపేందుకు కొన్ని సంస్థలు ముందుకు వచ్చాయని కృష్ణాజిల్లా కలెక్టర్ బి. లక్ష్మీకాంతం తెలిపారు. అందుకు అనుగుణంగా విమానాశ్రయ అభివృద్ధి పనులను వేగవంతం చేశామన్నారు. విమానాశ్రయం, రెవెన్యూ, ట్రాన్స్‌కో, డ్రైనేజీ, ఆర్‌అండ్‌బీ శాఖల అధికారులతో శుక్రవారం విజయవాడలోని తన క్యాంపు కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అంతర్జాతీయ విమానాశ్రయ పనులను మరింత వేగవంతం చేయాలని సూచించారు. విమానాశ్రయం సమీపంలో లేజర్ లైట్లు లేకుండా చూడాలన్నారు. గన్నవరం, పుట్టగుంట రహదారిని ఏప్రిల్ 30వ తేదీలోపు పూర్తి చేయాలన్నారు. తిరుపతి విమానాశ్రయం తరహాలో గ్రీనరీ ఏర్పాటు చేయాలని సూచించారు. ఈ సమావేశంలో కృష్ణా జేసీ-2 బాబూరావు, ఆర్డీవో సీహెచ్ రంగయ్య, ఎయిర్ పోర్టు డైరెక్టర్ మధుసూదనరావు, తహశీల్దార్ మాధురి తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీసీ ఉద్యోగులకు ఐఆర్ ప్రకటించాలి

ఈయూ రాష్ట్ర అదనపు ప్రధాన కార్యదర్శి



విశాలాంధ్ర - విజయవాడ (అజిత్‌సింగ్‌నగర్) : వేతనాల సవరణలో జాప్యం జరుగుతున్నందున ఆర్టీసీ ఉద్యోగులకు వెంటనే ఐఆర్ ప్రకటించాలని ఈయూ రాష్ట్ర అదనపు ప్రధాన కార్యదర్శి దామోదరరావు డిమాండ్ చేశారు. విజయవాడ డిపో వద్ద శుక్రవారం ఎంప్లాయిస్ యూనియన్ ఆధ్వర్యంలో నిర్వహించిన ధర్నాలో ఆయన మాట్లాడుతూ రాష్ట్ర విభజన తర్వాత జరిగిన గుర్తింపు ఎన్నికల్లో గెలుపొందిన నేషనల్ మజ్దూర్ యూనియన్ ఉద్యోగులు, కార్మికులకు ఇచ్చిన ప్రధాన హామీల్లో ఒక్కటీ నెరవేర్చలేదన్నారు. ఈయూ అధికారంలో లేకపోయినా ఎప్పుడూ కార్మికుల పక్షానే పోరాడుతుందన్నారు. ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేయాలని, ఆర్టీసీలో తొలగించిన కాంట్రాక్టు కండక్టర్లను, డ్రైవర్లను వెంటనే విధులలోకి తీసుకొని రెగ్యులర్ చేయాలన్నారు. 2017 ఏప్రియల్ నుంచి వేతనాల సవరణను వెంటనే చేయాలన్నారు. 2018 జనవరి నుంచి రావాల్సిన డీఏ ప్రకటించాలని, పెండింగ్‌లోని లీవ్ ఎన్‌క్యాష్‌మెంట్ చెల్లించాలని, ఆర్టీసీలో వెంటనే గుర్తింపు సంఘం ఎన్నికలు నిర్వహించాలని డిమాండ్ చేశారు. నిలిచిపోయిన కారుణ్య నియామకాలు చేపట్టాలని, గతంలో చేసుకున్న ఒప్పందం మేరకు సమైక్యాంధ్ర ఉద్యమం కొనసాగిన 60 రోజులను స్పెషల్ క్యాజువల్ లీవుగా పరిగణించాలన్నారు. మారుతున్న టెక్నాలజీయుతీ అనుగుణంగా సిబ్బందికి శిక్షణ, స్పేర్ పార్ట్స్‌ను సరఫరా చేయాలన్నారు. అన్ని కేటగిరీల సిబ్బందిపై పెరిగిన పనిభారం తగ్గించాలని, మహిళా కండక్టర్ల సమస్యల పరిష్కారానికి చర్యలు చేపట్టాలని కోరారు. కాలం చెల్లిన బస్సుల స్థానంలో కొత్త బస్సులు కొనుగోలు చేయాలన్నారు.

మెడికల్ అన్‌ఫిట్ అయిన ఉద్యోగులకు ప్రత్యామ్నాయ ఉద్యోగాలు ఇవ్వాలి, లేదంటే వారి కుటుంబంలో ఒకరికి ఉద్యోగ అవకాశం కల్పించాలన్నారు. దూర ప్రాంత బస్సు సర్వీసులకు తప్పకుండా ఇద్దరు డ్రైవర్లను ఏర్పాటు చేయాలన్నారు. ఈ ధర్నాలో యూనియన్ రాష్ట్ర ఉప ప్రధాన కార్యదర్శి జీవీ నరసయ్య, కృష్ణాజిల్లా రీజినల్ కార్యదర్శి వై.శ్రీనివాసరావు, డిపో నాయకులు వైయంయస్.రావు, వెంకటేశ్వర్లు, రాధాకృష్ణ తదితరులు పాల్గొన్నారు.



18 నుంచి దివ్యాంగుల నిరవధిక దీక్ష

విశాలాంధ్ర- విజయవాడ(గాంధీనగర్) : రాష్ట్రంలోని దివ్యాంగుల సమస్యలను ప్రభుత్వం పరిష్కారం చేయకుంటే ఈనెల 18వ తేదీ నుంచి విజయవాడలో నిరవధిక నిరాహారదీక్ష చేపడుతున్నట్టు వీరవసంత దివ్యాంగుల సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు మల్లెల లక్ష్మీనారాయణ హెచ్చరించారు. విజయవాడ ప్రెస్‌క్లబ్‌లో శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ కృష్ణాజిల్లాలోని రైతుబజారుల్లో దివ్యాంగులకు కేటాయించిన షాపులను తొలగించటంతో అనేక మంది రోడ్డున పడటం ఆవేదన కలిగిస్తోందన్నారు. స్థానిక సంస్థలలో దివ్యాంగులకు 5 శాతం రిజర్వేషన్ సౌకర్యం కల్పించాలన్నారు. ప్రతిజిల్లాలో దివ్యాంగుల హోం ఏర్పాటు చేయాలన్నారు. దివ్యాంగుల మహిళలు అత్యాచారానికి గురైతే బాధితులకు 5లక్షల రూపాయల ఎక్స్‌గ్రేషియా ఇవ్వాలన్నారు. ర్యాలీగా సబ్‌కలెక్టర్ కార్యాలయానికి చేరుకుని వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో సంఘం రాష్ట్ర కార్యదర్శి పి.దుర్గారావు, కమిటీ సభ్యులు బేతపూడి శ్రీనివాసరావు, జె.పాండురంగారావు, తీగల ఆంజనేయులు, కొండవీటి వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

అశోక్, సుజన రాజీనామాలకు రాష్ట్రపతి ఆమోదం

న్యూఢిల్లీ: కేంద్రమంత్రి పదవులకు సుజనాచౌదరి, అశోక్‌గజపతిరాజు చేసిన రాజీనామాలకు రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్ శుక్రవారం ఆమోదం తెలిపారు. తెలుగుదేశం పార్టీ తరపున కేంద్రమంత్రివర్గంలో ప్రాతినిధ్యం వహించిన పౌరవిమానయాన శాఖమంత్రి అశోక్‌గజపతిరాజు... శాస్త్ర, సాంకేతికశాఖ సహాయ మంత్రి సుజనాచౌదరి గురువారం తమ పదవులకు రాజీనామాలు చేసిన సంగతి తెలిసిందే. నిన్న వారిద్దరూ నరేంద్రమోడిని కలిసి సంయుక్తంగా రాజీనామా లేఖలు సమర్పించారు. ప్రజా సెంటిమెంట్‌ను గౌరవించి కేంద్రం నుంచి వైదొలగాలని తమ పార్టీ అధ్యక్షుడు చంద్రబాబునాయుడు ఆదేశాల మేరకు తామిద్దరం రాజీనామాలు చేసినట్లు ప్రకటించారు. ఇద్దరితో ప్రధాని 10 నిమిషాల పాటు సంభాషించారు. ఈ సందర్భంగా కారణాలను వారు ఆయనకు వివరించారు. ప్రభుత్వంలో పనిచేసే అవకాశం కల్పించినందుకు



మోడీకి ధన్యవాదాలు తెలిపారు. ప్రస్తుత పరిస్థితులకు దారితీసిన కారణాలను వివరిస్తూ ఒక లేఖను ప్రధానికి ఇవ్వడంతో పాటు రాష్ట్రపతిని సంబోధిస్తూ రాసిన రాజీనామా పత్రాన్ని దానికి జత చేశారు. అశోక్‌గజపతిరాజు మాత్రం ఎలాంటి కారణాలు చెప్పకుండా తాను పదవికి రాజీనామా చేస్తున్నానని, దాన్ని ఆమోదించాలని కోరారు. ఆ రాజీనామా లేఖలను కేంద్రం రాష్ట్రపతి వద్దకు పంపగా వాటిని ఆయన ఆమోదించారు. ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేసేవరకు కేంద్ర పౌరవిమానయాన శాఖను ప్రధాని మోడీ తన వద్దనే ఉంచుకోనున్నారు.

హోదాపై దద్దరిల్లిన పార్లమెంటు

- కొనసాగిన వాయిదాల పర్వం
- ఉభయ సభలను స్తంభింపచేసిన ప్రతిపక్షాలు
- వెల్‌లోకి దూసుకొచ్చి నినాదాలు



న్యూఢిల్లీ : పార్లమెంట్ బడ్జెట్ రెండో దశ సమావేశాలు మొదటి వారం తుడిచిపెట్టుకుపోయాయి. వివిధ అంశాలపై ప్రతిపక్షాల సభ్యుల ఆందోళనతో సభా కార్యకలాపాలను స్తంభింపచేయడంతో ఎటువంటి కార్యకలాపాలను చేపట్టకుండానే వారం గడిచిపోయింది. సభ్యుల ఆందోళనతో శుక్రవారం కూడా ఉభయసభలు స్తంభించాయి. దానితో సోమవారానికి వాయిదాపడ్డాయి. ఈ నెల 5వ తేదీన సమావేశాలు ప్రారంభమైనప్పటి నుంచి ప్రతిపక్ష సభ్యులతో పాటు పాలక ఎన్డీయే మిత్రపక్షాలైన టీడీపీ, శివసేన ఎంపీలు సభా కార్యకలాపాలను అడ్డుకున్నారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి విభజన హామీలు నెరవేర్చాలని టీడీపీ సభ్యులు ఆందోళన చేపట్టారు. ప్లకార్డులు ప్రదర్శించి తమ నిరసన తెలిపారు. పంజాబ్ నేషనల్ బ్యాంకు (పీఎన్‌బీ)కుంభకోణం, కావేరిజల నిర్వాహణ బోర్డు ఏర్పాటు, మరాఠాకు ప్రాచీన భాష హోదా కల్పన వంటి అంశాలపై సభ్యుల ఆందోళనలతో ఉభయ సభలు ఎటువంటి కార్యకలాపాలను చేపట్టలేదు. కాంగ్రెస్, టీడీపీ, ఏఐఏడీఎంకే సభ్యులు వెల్ వద్దకు దూసుకువచ్చి ప్లకార్డులను ప్రదర్శించి నినాదాలు చేశారు. ఉదయం సభ సమావేశమైన 15 నిముషాలకే మధ్యాహ్నం 2.30 గంటల వరకు వాయిదాపడింది. తిరిగి సమావేశమైన తరువాత కూడా పరిస్థితిలో మార్పు లేకపోవడంతో సోమవారానికి వాయిదావేశారు. పంజాబ్ నేషనల్ బ్యాంకులో రూ. 12,700 కోట్ల కుంభకోణంపై కాంగ్రెస్ పార్టీ, కర్ణాటక, తమిళనాడు రాష్ట్రాల మధ్య కావేరి జల నిర్వాహణ బోర్డు ఏర్పాటు చేయాలన్న డిమాండుపై తమిళనాడు పార్టీలు ఏఐఏడీఎంకే, డీఎంకే సభ్యులు వెల్ వద్దకు దూసుకువచ్చారు. రిజర్వేషన్ల పెంపు బిల్లును ఆమోదించాలని టీఆర్ఎస్, ప్రత్యేకహోదా, విభజన హామీలు నెరవేర్చాలని టీడీపీ సభ్యులు ఆందోళన చేశారు. టీడీపీ ఎంపీలు, కాంగ్రెస్ సభ్యులు కేవీపీ రామచంద్రరావు సభలో పోస్టర్లను ప్రదర్శించారు. రాష్ట్ర విభజన సందర్భంగా ఆంధ్రప్రదేశ్‌కు ఏర్పడిన లోటును భర్తీచేసేందుకు ప్రత్యేక హోదా హామీని అమలు చేయాలని వారు కోరారు. మొదటి వాయిదా అనంతరం సభ మధ్యాహ్నం 2.30 గంటలకు తిరిగి సమావేశమైనప్పుడు కూడా సభ్యుల ఆందోళన కొనసాగింది. శాంతించాలని పదేపదే చేసిన విజ్ఞప్తులు ఫలించకపోవడంతో డిప్యూటీ చైర్మన్ పీజే కురియన్ సభను సోమవారానికి వాయిదావేశారు. "ఇది ప్రైవేట్ సభ్యుల వ్యవహారం ప్రభుత్వ వ్యవహారం కాదు" అని కురియన్ అన్నారు. పీఎన్‌బీ కుంభకోణంపై నిబంధన 167 క్రింద పాయింట్ ఆఫ్ ఆర్డర్ లేవనెత్తేందుకు కాంగ్రెస్ ఎంపీ ప్రమోద్ తివారీ ప్రయత్నించారు. "ముందు మీరు మీ పార్టీ సభ్యులను వారి సీట్లలోకి వెళ్లి కూర్చోమని కోరండి. ఆ తరువాత మీకు అనుమతిస్తాను" అని తివారీతో కురియన్ చెప్పారు. కాంగ్రెస్, టీడీపీ, ఏఐఏడీఎంకే సభ్యులు వెల్‌లో నినాదాలు చేయడాన్ని కొనసాగించారు. లోక్‌సభలో కూడా ఇదే పరిస్థితి. ఆయా సమస్యలపై సభ్యులు నిరసన తెలిపారు. 2018 ద్రవ్యబిల్లును, అనుబంధ పద్దులను పార్లమెంట్ ఆమోదించాల్సి ఉంది.

దేశంలోని రెండో అతిపెద్ద ప్రభుత్వరంగ బ్యాంకు పీఎన్‌బిలో రూ. 12,700 కోట్లకు పైగా అక్రమాలు చోటుచేసుకోవడంపై కాంగ్రెస్, టీఎంసీ సభ్యులు తమ నిరసనను కొనసాగించారు. రాష్ట్రానికి ప్రత్యేక హోదా కల్పించాలని ఆంధ్రప్రదేశ్‌కు చెందిన టీడీపీ, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ డిమాండు చేశాయి. లోక్‌సభ ఈ ఉదయం సమావేశంకాగానే, దక్షిణ కొరియాకు చెందిన పార్లమెంటరీ ప్రతినిధిబృందానికి స్పీకర్ సుమిత్రా మహాజన్ స్వాగతం పలికారు. తరువాత సభ ఇటీవల మృతిచెందిన సీపీఐ నాయకులు, మాజీ ఎంపీ ప్రబోధ్ పాండా, శ్యామ సింగ్, భానూ కుమార్ శాస్త్రీలకు సంతాపం తెలిపింది. ఆ వెనువెంటనే వివిధ పార్టీలకు చెందిన సభ్యులు వెల్ వద్దకు దూసుకువచ్చి ప్లకార్డులను చేబూని నినాదాలు చేస్తూ గందరగోళం సృష్టించారు. కేంద్ర మంత్రి పదవికి నిన్న రాజీనామా చేసిన టీడీపీ సీనియర్ నాయకులు అశోక్‌గజపతిరాజు నేడు పార్టీ ఎంపీలతో కలిసి వెల్‌లో నిలబడడం కనిపించింది.

అప్పుల్లో టీడీపీ, టీఆర్ఎస్

- సంపన్న పార్టీగా ఎస్పీ
- ప్రాంతీయ పార్టీల ఆస్తులపై ఏడీఆర్ నివేదిక

న్యూఢిల్లీ : దేశంలో ప్రాంతీయ పార్టీలకు సంబంధించి అత్యంత సంపన్నపార్టీగా సమాజ్‌వాదీ పార్టీ నిలవగా అప్పుల ఊబిలో కూరుకుపోయిన పార్టీలుగా తెలుగుదేశం పార్టీ, తెలంగాణ రాష్ట్రసమితి నిలిచాయి. ఆస్తుల పరంగా ప్రాంతీయ పార్టీల్లో అత్యంత సంపన్నమైన పార్టీగా ఉత్తరప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి అఖిలేశ్ యాదవ్‌కు చెందిన సమాజ్‌వాదీ పార్టీ నిలిచింది. 2015-16 ఆర్థిక సంవత్సరంలో ప్రకటించిన వివరాల ప్రకారం సమాజ్‌వాదీ పార్టీ మొత్తం ఆస్తుల విలువ రూ. 634.96కోట్లు. రూ. 257.18కోట్ల ఆస్తులతో తమిళనాడుకు చెందిన డీఎంకే, రూ.224.84కోట్లతో అన్నాడీఎంకే పార్టీలు తర్వాత స్థానాల్లో ఉన్నాయి. ఈ మేరకు ఢిల్లీకి చెందిన అసోసియేషన్ ఆఫ్ డెమోక్రటిక్ రిఫామ్స్(ఏడీఆర్) తన నివేదికలో పేర్కొంది. ఈ నివేదిక ప్రకారం..2011-12 ఆర్థిక సంవత్సరంలో ఎస్పీ ప్రకటించిన ఆస్తుల విలువ రూ.212.86కోట్లు మాత్రమే. 2015-16 ఆర్థిక సంవత్సరం నాటికి ఆ పార్టీ ఆస్తులు 298 శాతం పెరిగి రూ. 634.96కోట్లుగా ఉన్నాయి. ఇక 2011-12 ఆర్థిక సంవత్సరంలో అన్నాడీఎంకే ఆస్తులు రూ.88.21కోట్లు మాత్రమేనని నివేదిక తెలిపింది. పార్టీల స్థిరాస్తులు, లోన్లు, అడ్వాన్సులు, డిపాజిట్లు, టీడీఎస్, పెట్టుబడులు, ఇతర ఆస్తులు కలిపి ఈ నివేదిక రూపొందించారు. 2011, 2012 సంవత్సరాల్లో రెండు కొత్తపార్టీలు వైఎస్ఆర్ కాంగ్రెస్‌పార్టీ, ఆమ్ ఆద్మీ పార్టీలు ఈ జాబితాలో చేరాయి. 2012-13 ఆర్థిక సంవత్సరంలో ఈ పార్టీల సగటు ఆస్తులు రూ.1.165కోట్లు కాగా.. 2015-16 ఆర్థిక సంవత్సరం నాటికి రూ.3.765కోట్లకు పెరిగినట్లు నివేదిక తెలిపింది. అప్పుల పరంగా తెలంగాణరాష్ట్ర సమితి(టీఆర్ఎస్), తెలుగు దేశం పార్టీ(టీడీపీ) తొలి రెండు స్థానాల్లో ఉన్నాయని పేర్కొంది. 2015-16 ఆర్థిక సంవత్సరంలో ప్రాంతీయ పార్టీలు ప్రకటించిన అప్పుల వివరాల ప్రకారం.. టీఆర్ఎస్‌కు రూ.15.97కోట్లు, టీడీపీకి రూ.8.816కోట్ల మేర అప్పులు ఉన్నట్లు నివేదిక వెల్లడించింది. మరో పార్టీ శివసేన మాత్రం తన అప్పులను చాలా వరకు తగ్గించుకున్నట్లు పేర్కొంది.

గౌరీ లంకేష్ కేసులో
నిందితుడి అరెస్టు, సిట్ కస్టడీకి తరలింపు



బెంగళూరు : ప్రముఖ జర్నలిస్టు, సామాజిక కార్యకర్త గౌరీ లంకేష్ హత్యకేసులో నిందితుడు కేటీ నవీన్ కుమార్ (37)ను శుక్రవారం పోలీసులు అరెస్టు చేశారు. కర్ణాటక ప్రత్యేక దర్యాప్తు బృందం (సిట్) ఈనెల ప్రారంభంలో కేసు విచారణ జరుపుతుండగా ఇతని పేరు బయటికి వచ్చింది. అతనికి ఐదు రోజుల సిట్ కస్టడీకి అనుమతిస్తూ బెంగళూరు మెజిస్ట్రేట్ కోర్టు అనుమతించింది. నవీన్‌కు మితవాద గ్రూపులతో సంబంధాలున్నాయని, ఇతని విచారణతో గౌరీ హత్యలో మరిన్ని విషయాలు వెలికి వస్తాయని సిట్ భావిస్తోంది. హిందూ యువతను హత్యకేసుల్లో ఇరికించాలని సిద్ధరామయ్య ప్రభుత్వం భావిస్తోందని బీజేపీ నాయకుడు శోభాకరంద్లాజే విమర్శించారు. నవీన్ కుమార్ విషయంలో కూడా ఇదే జరిగిందన్నారు. బెంగళూరు నుంచి 100 కిమీ దూరంలో ఉన్న నవీన్‌కుమార్‌ను రాష్ట్ర నేర పోలీసు విభాగం ఆయుధాలు అమ్ముతుండగా అరెస్టు చేసింది. హెల్మెట్‌తో మోటర్‌సైకిల్‌పై వచ్చి గౌరీ లంకేష్ (55) దేశవాళీ 7.65 తుపాకీతో 2017 సెప్టెంబరు 5న హత్యచేశారు. లంకేష్ పత్రికకు ఆమె ఎడిటర్‌గా ఉన్నారు. చంపడానికి ముందు ఆమె ఇంటివద్ద రేస్ నిర్వహించినట్లు సీసీటీవీ ద్వారా పోలీసులు గుర్తించారు. కుమార్ సీసీటీవీ ఫుటేజ్‌లో వ్యక్తిలా ఉండటంతో ఆయనను అరెస్టు చేశారు. ఈ కేసులో పురోగతి సాధించడానికి రాష్ట్రప్రభుత్వం సిట్‌ను ఏర్పాటు చేసిన విషయం తెలిసిందే.

మలాలాపై కాల్పులు జరిపిన ఉగ్రవాదులపై
రూ.32 కోట్ల రివార్డు



వాషింగ్టన్: మలాలాపై కాల్పులకు తెగబడిన ఉగ్రవాదుల ఆచూకీ తెలిపితే రూ.32 కోట్లు రివార్డుగా ఇస్తామని అమెరికా ప్రకటించింది. తెహ్రిక్ ఈ తాలిబన్ పాకిస్థాన్ (టీటీపీ), దాని అనుబంధ ఉగ్ర సంస్థలకు చెందిన పలువురు ఉగ్రవాదు ఈ ఘటనకు పాల్పడిన విషయం తెలిసిందే. టీటీపీ నేత మౌలానా ఫజుల్లా, మరో ఇద్దరు ఉగ్రవాదుల గురించి సమాచారం లేదా వారి కదలికలు తెలియజేసిన వారికి భారీ నజరానా ఇవ్వనున్నట్లు అమెరికా స్టేట్ డిపార్ట్‌మెంట్ వెల్లడించింది. పాకిస్థాన్‌కు చెందిన ప్రముఖ ఉద్యమకారిణి, నోబెల్ శాంతి బహుమతి గ్రహీత మలాలా యూసఫ్ జాయ్‌ను చంపేందుకు 2012 అక్టోబరు 9న ఆమెపై కాల్పులకు. 2012 జూన్‌లో 17 మంది పాకిస్థాన్ సైనికుల హత్యకు ఫజుల్లానే బాధ్యుడు. మౌలానా ఫజుల్లాపై అమెరికా 5 మిలియన్ డాలర్లు (సుమారు రూ.32కోట్లు) రివార్డు ప్రకటించింది. మరో ఇద్దరు ఉగ్రవాదులు అబ్దుల్ వలి, మంగల్ బాగ్‌లపై ఒక్కొక్కరిపై 3 మిలియన్ డాలర్ల రివార్డు ప్రకటించింది. అమెరికా స్టేట్ డిపార్ట్‌మెంట్ వెల్లడించిన వివరాల ప్రకారం.. మలాలాపై హత్యాయత్నంతో పాటు పాక్, అమెరికా ఆస్తులకు వ్యతిరేకంగా జరిగిన పలు ఉగ్రవాద కార్యకలాపాలకు తానే బాధ్యుడినని

అమెరికా ప్రకటన

ఫజుల్లా చెప్పినట్లు తెలుస్తోంది. 2010 మే 1న న్యూయార్క్‌లోని టైమ్‌స్క్వేర్‌లో పాకిస్థాన్‌కు చెందిన ఫైజల్ షహ్‌జాద్‌తో పేలుళ్లకు ప్రయత్నించింది కూడా ఫజుల్లానేనని అమెరికా ప్రకటించింది. పెషావర్ ఘటనలో 132మంది చిన్నారులు సహా 148 మంది మరణించారు. 2015లో అమెరికా ప్రభుత్వం ఫజుల్లాను ప్రత్యేకమైన అంతర్జాతీయ ఉగ్రవాదిగా ప్రకటించింది. రివార్డు ప్రకటించిన మరో ఉగ్రవాది అబ్దుల్ వలి టీటీపీకి అనుబంధమైన జమాత్ ఉల్ అహ్‌రార్ అనే ఉగ్రసంస్థకు చెందిన వ్యక్తి. అతడు పౌరులు, మైనార్టీలు, సైన్యం లక్ష్యంగా పలు దాడుల చేశాడు. పెషావర్‌లోని అమెరికా దౌత్య కార్యాలయంలో ఇద్దరు పాకిస్థానీ ఉద్యోగులను హత్య చేశాడు. మరో ఉగ్రవాది మంగల్ బాగ్ కూడా టీటీపీకి అనుబంధమైన లష్కర్ ఈ ఇస్లాం సంస్థకు చెందిన వాడు. ఇతడి ఆధ్వర్యంలో నాటో కాన్వాయ్‌పై దాడులు జరిగాయి. డ్రగ్ ట్రాఫికింగ్, స్మగ్లింగ్, అపహరణలు, తదితర చర్యల ద్వారా డబ్బు సమకూర్చుతాడు. ఇతడిపై 2007లో పాక్ ప్రభుత్వం కూడా 60వేల డాలర్ల రివార్డు ప్రకటించింది.

ఏపీపీఎస్సీ ఇంటర్వ్యూ ఫలితాల విడుదల

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: ఆంధ్రప్రదేశ్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (ఏపీపీఎస్సీ) నిర్వహించిన సంక్షేమశాఖ సహాయాధికారుల ఇంటర్వ్యూ మార్కుల ఫలితాలను విడుదల చేశారు. ఏపీపీఎస్సీ వెబ్‌సైట్‌లో పూర్తి వివరాల్ని అధికారులు పొందుపరిచారు. రాష్ట్ర వ్యాప్తంగా 13 జిల్లాలలో ఖాళీగా ఉన్న అసిస్టెంట్ సోషల్ వెల్ఫేర్, బీసీ వెల్ఫేర్, ట్రైబల్ వెల్ఫేర్ అధికారుల భర్తీ కోసం సెప్టెంబరు 2017న రాత పరీక్షను నిర్వహిం చారు. రాత పరీక్షలో అర్హత సాధించిన అభ్యర్థులకు ఈ నెల 5 నుంచి 7 వరకూ విజయవాడ ఏపీపీఎస్సీ కార్యాలయంలో ఇంటర్వ్యూలు నిర్వహిం చారు. రాతపరీక్ష, ఇంటర్వ్యూలో మార్కులను కలిపి కేటగిరీల వారీగా వెబ్‌సైట్లో వివరాల్ని అధికారులు పొందుపరిచారు. అసిస్టెంట్ స్టాటికల్ ఆఫీసర్ల నియామక ఇంటర్వ్యూ మార్కులను ఏపీపీఎస్సీ అధికారులు విడుదల చేశారు.

ఇంటర్ పరీక్షలకు 10,933 మంది గైర్హాజరు

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: ఏపీ ఇంటర్మీడియట్ ద్వితీయ పరీక్షలకు శుక్రవారంనాడు 10,933 మంది అభ్యర్థులు గైర్హాజరయ్యారు. రాష్ట్ర వ్యాప్తంగా ,423 పరీక్షా కేంద్రాల్లో మేథమేటిక్స్-2బి, జూవాలజీ-2, హిస్టరీ-2 పరీక్షలను నిర్వహించారు. ఈ పరీక్షలకు మొత్తం 3,99,987 మంది అభ్యర్థులు దరఖాస్తు చేయగా, వారిలో 3,89,054 మంది అభ్యర్థులు పరీక్ష రాశారు. ఐదుగురు విద్యార్థులపై మాల్ ప్రాక్టీస్ కేసుల్ని నమోదు చేశారు.

విద్యుత్ కాంట్రాక్టు కార్మిక నేతలతో చర్చలు విఫలం!

విశాలాంధ్ర-విజయవాడ : విద్యుత్ కాంట్రాక్టు కార్మిక సంఘాల ఐక్యవేదిక నాయకులతో ఆ సంస్థల ముఖ్య అధికారులు శుక్రవారం గుణదలలోని విద్యుత్ సౌధలో నిర్వహించిన చర్చలు విఫలమయ్యాయి. యాజమాన్యం ఏకపక్షంగా వ్యవహరిస్తోందని కార్మిక సంఘాల నాయకులు చెబుతున్నారు. రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న 24వేల మంది విద్యుత్ కాంట్రాక్టు కార్మికులు తమ డిమాండ్ల సాధన కోసం ఐక్యవేదికగా ఏర్పడి 15 రోజులు సమ్మె చేశారు. సమ్మెలో భాగంగా విజయవాడలో ఐక్యవేదిక నాయకులు ఆరుగురు మూడు రోజులు నిరవధిక నిరాహారదీక్ష చేశారు. వారికి మద్దతుగా ఏఐటీయూసీ రాష్ట్ర అధ్యక్షుడు చలసాని రామారావు, సీఐటీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గఫూర్ కూడా రెండు రోజులు ఆమరణ దీక్ష చేశారు. దీంతో ట్రాన్స్‌కో సీఎండీ చర్చలకు పిలిచి సమ్మె విరమించాలని, ఈ నెల 9న పూర్తిస్థాయిలో మాట్లాడి న్యాయం చేస్తామని రాతపూర్వకంగా హామీ ఇచ్చారు. సమ్మె చేస్తున్న సమయంలో జేఏసీలోని 9 సంఘాల నుంచి ఇద్దరు చొప్పున 18 మందితోపాటు ఏఐటీయూసీ, సీఐటీయూ నుంచి ఒక్కొక్కరు చొప్పున 20 మందిని చర్చలకు అనుమతిస్తామని ఉన్నతాధికారులు హామీ ఇచ్చారు. ఈ మేరకు శుక్రవారం గుణదల విద్యుత్ సౌధ వద్దకు చర్చల కోసం చేరుకున్న జేఏసీ నేతలకు చేదు అనుభవం ఎదురైంది. కేవలం ముగ్గురు మాత్రమే చర్చలకు రావాలని ఆదేశించినట్లు సమాచారం. ముగ్గురు నాయకులు చర్చలకు వెళ్లగా, పర్మినెంట్ కార్మిక సంఘాలకు మాత్రమే ప్రాధాన్యత ఇస్తామని, మిగిలిన సంఘాలను పట్టించుకునేది లేదనే ధోరణిలో ఉన్నతాధికారులు వ్యవహరించినట్లు తెలిసింది. దీంతో ఐక్యవేదిక నాయకులు చర్చల నుంచి బయటకు వచ్చినట్లు సమాచారం. అనంతరం జేఏసీ నాయకులు సమావేశమై భవిష్యత్ కార్యాచరణ గురించి చర్చించారు. ఒకటి, రెండు రోజుల్లో మరోసారి సమావేశమై పూర్తిస్థాయిలో కార్యాచరణ ప్రకటించే అవకాశం ఉంది. విద్యుత్ శాఖ యాజమాన్య వైఖరిని ఖండిస్తున్నామని, కార్మికులందరికీ న్యాయం చేయాలని ఏఐటీయూసీ నాయకుడు తాతయ్య డిమాండు చేశారు.

విగ్రహాలు కూల్చివేయడం దుర్మార్గం

విశాలాంధ్ర బ్యూరో-హైదరాబాద్: మతోన్మాద శక్తులు మహనీయుల విగ్రహాలను కూల్చివేయడం దుర్మార్గమని సిపిఐ అనుబంధ సంస్థ దళిత హక్కుల పోరాట సమితి ఉపాధ్యక్షులు గణేష్ మండిపడ్డారు. మతోన్మాద ఫాసిస్టు శక్తులు కేంద్రంలో అధికారం చేపట్టిననాటి నుంచి దేశం కోసం త్యాగం చేసిన, ఆత్మబలిదానం ఇచ్చిన యోధుల, మహనీయుల విగ్రహాలను ధ్వంసం చేయడమే లక్ష్యంగా పెట్టుకున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. సిపిఐ రాష్ట్ర కార్యాలయం మఖ్దూంభవన్‌లో జరిగిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రపంచ విప్లవపోరాట గతినే మార్చివేసి చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోయిన లెనిన్ విగ్రహాన్ని ధ్వంసం చేయడం అంటే ప్రపంచ కమ్యూనిస్టుల ఆత్మగౌరవాన్ని దెబ్బతీయడమే అని పేర్కొన్నారు. విగ్రహాలను కూల్చివేసే అధికారం, హక్కు ఎవరికీ ఇవ్వలేదని, రాజ్యాంగ విరుద్ధంగా వ్యవహరించడం సమంజసం కాదన్నారు. త్రిపురలో విజయం సాధించిన 48 గంటల్లోనే బిజెపి, ఆర్ఎస్ఎస్ శక్తులు లెనిన్ విగ్రహాన్ని కూల్చివేయడాన్ని ఆయన తప్పుబట్టారు. భారత రాజ్యాంగ నిర్మాత, భారత రత్న డా.బిఆర్.అంబేద్కర్ విగ్రహాన్ని ఉత్తర ప్రదేశ్‌లో సైతం మతోన్మాద శక్తులు ధ్వంసం చేసి కోట్లాది మంది దళితుల హృదయాలను గాయపరిచారని ఆరోపించారు. సామాజిక విప్లవకారుడు చరిత్రలో చెరిగిపోని ముద్ర వేసుకున్న పెరియార్ రామస్వామి విగ్రహాన్ని హిందుత్వ శక్తులు ధ్వంసం చేయడాన్ని గణేష్ తప్పు బట్టారు. దేశంలో అనేక మంది మహనీయుల విగ్రహాలు ఉన్నాయని, విదేశాల్లో మహాత్మా గాంధీ, విశ్వకవి రవీంద్రనాద్ ఠాగూర్, రాజ్యాంగ నిర్మాత అంబేద్కర్ విగ్రహాలు ఉన్నాయని, ఆయా దేశ ప్రజలు వారిని గౌరవంగా అంజలి ఘటిస్తున్నారని పేర్కొన్నారు. కేంద్రంలోని మోడీ ప్రభుత్వం దళితులపై దాడులకు తెగబడుతూనే మరోపక్క విగ్రహాల విధ్వంసానికి పూను కోవడం సహించరాని చర్య అని విగ్రహాలు ధ్వంసం చేసిన వారిని అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు.

13 నుంచి సాగర్ ఎడమ కాలువకు నీరు

సాగునీటి సంఘాలకు కేఆర్ఎంబీ హామీ



విశాలాంధ్ర బ్యూరో - అమరావతి: నాగార్జునసాగర్ ఎడమ కాలువ కింద భూముల్లో పంటలు ఎండిపోతున్న నేపథ్యంలో సాగు నీటి సంఘాల నీటి సంఘాల విజ్ఞప్తిని పురస్కరించుకుని ఈనెల 13వ తేదీ నుంచి నీటిని విడుదల చేయనున్నారు. ఈమేరకు జలవనరులశాఖ రాష్ట్ర ఎపెక్స్ కమిటీ సభ్యుడు ఆళ్ల వెంకట గోపాల కృష్ణారావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. కృష్ణా నదీ యాజమాన్య బోర్డు (కేఆర్ఎంబీ) నూతన చైర్మన్‌గా నియమితులైన యోగీంద్ర కుమార్ శర్మను హైదరాబాద్‌లో కలసి వినతి పత్రాన్ని అందచేసినట్లు ఆయన వివరించారు. కేఆర్ఎంబీ చైర్మన్ ఆదేశాల తాము తెలంగాణ ప్రభుత్వ చీఫ్ ఇంజనీర్ (నాగార్జునసాగర్) ఎస్ సునీల్‌తో భేటీ అయి 3వ జోన్‌కు నీటిని అందచేసి పంటలను కాపాడాలని కోరినట్లు చెప్పారు. దీంతో ఆయన వెంటనే స్పందించి ఈనెల 13 నుంచి నీటిని విడుదల చేసే విధంగా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించినట్లు పేర్కొన్నారు. సాగర్ ఎడమ కాలువ ఆయకట్టు పరిధిలో కృష్ణాజిల్లాలోని తిరువూరు, నూజివీడు, మైలవరం, గన్నవరం, నందిగామ, జగ్గయ్యపేట నియోజకవర్గాల్లో 3.60 లక్షల ఎకరాల్లో మిర్చి, పొగాకు, మొక్కజొన్న, పత్తి, మినుము, పసుపుతోపాటు మామిడి ఆరుతడి పంటలుగా సాగుచేస్తున్నట్లు తెలిపారు. ఈనెల 6వ తేదీన సాగర్ ఎడమ కాలువకు ఏపీ సరిహద్దుకు మొత్తం 7.72 టీఎంసీల నీరు ఇవ్వాల్సి ఉందన్నారు. ఈనెల 10వ తేదీ నుంచి 25 వరకూ 15 రోజులపాటు 3వ జోన్ ఏపీ సరిహద్దు 102 కి.మీ. వద్ద 1500 క్యూసెక్కుల నీటిని నిరాటంకంగా విడుదల చేయాలని చైర్మన్‌ను కోరినట్లు తెలిపారు. సాగర్ హెడ్ రెగ్యులేటర్ నుంచి 280 కి.మీ. దూరం ప్రయాణించి 3వ జోన్ ఏపీ సరిహద్దుకు నీరు రావలసి ఉన్నందున ప్రత్యేక నిఘాను ఏర్పాటు చేసి రైతులకు న్యాయం చేయాలని కేఆర్ఎంబీకి విజ్ఞప్తి చేసినట్లు గోపాలకృష్ణారావు తెలిపారు. ఇంకా చైర్మన్‌ను కలసిన వారిలో ఎడమ కాలువ ప్రాజెక్టు కమిటీ చైర్మన్ వై పుల్లయ్యచౌదరి, డిస్ట్రిబ్యూటరీ కమిటీ చైర్మన్ నాదెళ్ల చెన్న కేశవరావు ఉన్నారు.

ఆ పార్టీలు మోసం చేశాయి

బీజేపీ, టీడీపీలపై ఈసీకి కాంగ్రెస్ ఫిర్యాదు


విశాలాంధ్ర బ్యూరో -న్యూఢిల్లీ : బీజేపీ, టీడీపీలపై కాంగ్రెస్ పార్టీ కేంద్ర ఎన్నికల సంఘానికి ఫిర్యాదు చేసింది. ఏపీ పీసీసీ చీఫ్ రఘువీరారెడ్డి నేతృత్వంలో ఎంపీ కేవీపీ రామచంద్రరావు, ఇతర నేతల బృందం కేంద్ర ఎన్నికల కమిషన్ అధికారులను కలిసి వినతి పత్రం సమర్పించారు. బీజేపీ, టీడీపీలు ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలు చేయటంలో విఫలమయ్యాయని పేర్కొన్నారు. కేంద్ర ఎన్నికల సంఘం నిబంధనల ప్రకారం మ్యానిఫెస్టోలో పెట్టిన వాటిని రాజకీయ పార్టీలు అమలు చేయాల్సి ఉందన్నారు. కానీ రెండు పార్టీలు తప్పుడు వాగ్దానాలు చేసి ఆంధ్రప్రదేశ్ ప్రజల్ని మోసం చేశాయని, వీరిపై తగిన చర్యలు తీసుకోవాలని కేంద్ర ఎన్నికల సంఘాన్ని కోరారు.


బీసీ నిధుల కేటాయింపుపై
శ్వేతపత్రం విడుదల చేయాలి

విశాలాంధ్ర బ్యూరో-హైదరాబాద్: టీఆర్ఎస్ రాష్ట్ర ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత బిసిల అభివృద్ధి కోసం ఎంతబడ్జెట్ కేటాయించి ఖర్చుచేసిందో శ్వేతపత్రం విడుదల చేయాలని బిసి హక్కుల సాధన సమితి (సీపీఐ అనుబంధ సంస్థ) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రాయబండి పాండురంగాచారి కోరారు. 2014-15 వార్షిక బడ్జెట్ నుంచి, 2018-19 వార్షిక బడ్జెట్ వరకు కేటాయించిన బడ్జెట్ ఎంత సమగ్ర వివరాలతో వెల్లడించాలని కోరారు. ముఖ్యమంత్రి ఎంబిసిల అభివృద్ధి కోసం రూ.1000 కోట్లు కేటాయించామని, ఎస్సీ, ఎస్టీలతో సమానంగా సబ్సిడీలు ఇస్తామని చెప్పడం తప్పా 52 శాతం ఉన్న బిసిలను మాయమాటలతో మోసం చేస్తున్నారని ఆరోపిం చారు. మాటలు తప్ప ముఖ్యమంత్రికి బడ్జెట్ కేటాయింపులో మనసు రావడం లేదని విమర్శించారు. వృత్తి ఫెడరేషన్లకు ఇంత వరకు రూపాయి కూడా కేటాయించలేదని, బిసిలకు విధి, విధానాలు కూడా రూపొందించ లేద న్నారు. 2018-19 బడ్జెట్‌లో బిసిలకు సబ్‌ప్లాన్ కింద రూ.25 కోట్ల నిధులు కేటాయించి వారి అభివృద్ధి కోసం ఖర్చుచేయని పక్షంలో ప్రగతిభవన్‌ను ముట్టడిస్తామని హెచ్చరించారు.

పెళ్లింట విషాదం

- వరుడు సహా ఐదుగురి మృతి
- వధువుకు గాయాలు
- చెట్టును ఢీకొన్న వాహనం
- ఖమ్మం జిల్లాలో ఘటన





కొణిజెర్ల: ఖమ్మం జిల్లా కొణిజెర్ల సమీపంలో ఘోర రోడ్డు ప్రమాదం సంభవించింది. ఈ ఘటన పెళ్లింట విషాదం నింపింది. కాళ్లకు పారాణి కూడా ఆరకముందే వరుడు మృతి చెందటం, వధువు తీవ్రగాయాలతో ఆస్పత్రిలో చికిత్స పొందుతుండటంతో బంధువులు కన్నీరుమున్నీరు అవుతున్నారు. తణుకులోని ఓ దేవాలయంలో పెళ్లి చేసుకొని వర్ధన్నపేటకు వస్తుండగా నవవధూవరుల ఇన్నోవా వాహనం కొణిజెర్ల సమీపంలో అదుపుతప్పి చెట్టును ఢీకొంది. వరుడు అచ్చి రామకృష్ణప్రసాద్, అతని అక్క పద్మ, చెల్లెలు శ్రీదేవి, బావ శరదత్, డ్రైవర్ వేణు అక్కడికక్కడే మృతిచెందారు. వధువు అమ్మాజీదుర్గ, వరుడి మరోబావ శేషచలపతి తీవ్రంగా గాయపడ్డారు. వాహనంలో ఉన్న చిన్నారులు మహిత, క్రిష్, రామన్‌కు స్వల్ప గాయాలయ్యాయి. వివరాల్లోకి వెళితే.. వరంగల్ జిల్లా వర్ధన్నపేటకు చెందిన రామకృష్ణాప్రసాద్‌కు తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరానికి చెందిన దుర్గకు పశ్చిమగోదావరి జిల్లా తణుకులోని కేశస్వామి ఆలయంలో గురువారం రాత్రి పెళ్లి జరిగింది. రాత్రి ఒంటి గంటకు నవ దంపతులు తణుకు నుంచి బంధువులతో కలిసి రెండు ఇన్నోవాలు, తవేరా, ఒక మినీ బస్సులో వర్ధన్నపేటకు పయనమయ్యారు. అన్నింటి కంటే ముందు బయలుదేరిన వధూవరుల వాహనం ప్రమాదానికి గురైంది. కాగా, ఘటనాస్థలికి చేరుకొన్న పోలీసులు మృతదేహాలను ఖమ్మం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. క్షతగ్రాతులను సమీప ఆసుపత్రికి తరలించారు. మృతదేహాలను చూసేందుకు అస్పత్రి వద్దకు బంధుమిత్రులు చేరుకోవడంతో అక్కడ విషాదాఛాయలు అలుముకున్నాయి. ఘటనా స్థలాన్ని కొత్తగూడెం ఎస్పీ అంబర్ కిషోర్ ఝా సందర్శించారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు

విశాలాంధ్ర

క్రీడలు

సింధు, శ్రీకాంత్‌లకు రాజమౌళి ఆల్‌ది బెస్ట్



హైదరాబాద్: ప్రముఖ దర్శకుడు ఎస్.ఎస్. రాజమౌళి బ్యాడ్మింటన్ క్రీడాకారులు పీవీ సింధు, కిదాంబి శ్రీకాంత్‌ను కలిశారు. ఈ విషయాన్ని ఆయన ట్విటర్ వేదికగా పంచుకున్నారు. పీవీ సింధు, కిదాంబి ఆల్ ఇంగ్లండ్ ఓపెన్ కోసం వెళ్తుండగా వారిని కలిసినట్లు పేర్కొన్నారు. ఆటలో ఉత్తమ ప్రతిభ కనబర్చాలని కోరుకుంటూ ఆల్ ది బెస్ట్ చెప్పారు. ఈ సందర్భంగా వారితో కలిసి దిగిన ఫొటోను జక్కన్న ట్విటర్‌లో పోస్ట్ చేశారు. 'బాహుబలి: ది కన్‌క్లూజన్' బ్లాక్‌బస్టర్ తర్వాత రాజమౌళి తన తర్వాతి చిత్రం పనుల్లో బిజీ అయ్యారు. అగ్ర కథానాయకులు రామ్‌చరణ్, ఎన్టీఆర్ హీరోలుగా ఓ మల్టీస్టారర్‌ను తెరకెక్కించేం దుకు ఆయన సిద్ధమౌతున్నట్లు సమా చారం. ఈ చిత్రానికి డీవీవీ దానయ్య నిర్మాత. ప్రస్తుతం సినిమా ప్రీ ప్రొడక్షన్ పనులు జరుగుతున్నాయి.

తల్లిగా తొలి విజయం



ఇండియన్‌వెల్స్: ప్రపంచ మాజీ నెంబర్‌వన్, అమెరికా అగ్రశ్రేణి టెన్నిస్ క్రీడాకారిణి సెరెనా విలియమ్స్ తల్లి అయిన తర్వాత తొలి విజయాన్ని నమోదు చేసుకుంది. ఇండియన్ వెల్స్‌లో జరుగుతోన్న డబ్ల్యూటీఏ ఈవెంట్‌లో పాల్గొన్న సెరెనా తొలి రౌండ్లో విజయం సాధించి రెండో రౌండ్‌కు దూసుకెళ్లింది. గత ఏడాది ప్రతిష్ఠాత్మక ఆస్ట్రేలియన్ ఓపెన్ విజేతగా నిలిచిన సెరెనా.. గర్భం దాల్చడంతో టెన్నిస్ కోర్టుకు దూరంగా గడిపింది. సెప్టెంబరులో ఆడబిడ్డకు జన్మనిచ్చిన సెరెనా ఆ తర్వాత కొద్ది రోజులపాటు చావు బతుకుల మధ్య పోరాటం చేసింది. ఎట్టకేలకు కోలుకుని ప్రియుడు అలెక్సిస్ ఓహియాన్‌ను పెళ్లి చేసుకుంది. తనకు ఎంతో ఇష్టమైన టెన్నిస్‌ను తిరిగి కొనసాగించాలని నిర్ణయం తీసుకుంది. ఈ నేపథ్యంలోనే 2017 డిసెంబరులో తిరిగి కోర్టులోకి అడుగుపెట్టింది. ఓ ఎగ్జిబిషన్ మ్యాచ్ ఆడిన సెరెనా ఓటమి పాలైంది. అయినా ఏ మాత్రం ఆత్మవిశ్వాసం కోల్పోలేదు. మరింత కసిగా ప్రాక్టీస్ చేసింది. ఈ ఏడాది ఫిబ్రవరిలో డేవిస్ కప్ కోసం అక్క వీనస్‌తో కలిసి డబుల్స్‌లో ఆడింది. ఇందులోనూ పరాజయం తప్పలేదు. అయినా తన పోరాటాన్ని ఆపలేదు. తిరిగి పుంజుకుని సాధన చేసిన ఆమె ఇండియన్ వెల్స్‌లో డబ్ల్యూటీఏ ఈవెంట్‌లో పాల్గొంది. టోర్నీలో భాగంగా గురువారం రాత్రి కోర్టులో అడుగుపెట్టింది. గ్యాలరీలో కూర్చుని ఉన్న ప్రేక్షకులు లేచి నిలబడి చప్పట్లతో సెరెనాకు స్వాగతం పలికారు. దీంతో ఆమె ఆనందానికి అవధుల్లేవు. హోరాహోరీగా జరిగిన పోరులో సెరెనా 7-5, 6-3 తేడాతో కజకిస్థాన్ క్రీడాకారిణి జరీనా దియాస్‌పై విజయం సాధించింది. జీవితంలో మాతృత్వపు ఆనందాన్ని తనివితీరా ఆస్వాదిస్తున్న సెరెనా విలియమ్స్‌కు ఇదే తొలి గెలుపు. రెండో రౌండ్లో సెరెనా.. కికి బెర్టన్స్‌తో తలపడనుంది. ఒకవేళ రెండో రౌండ్లో సెరెనా విజయం సాధిస్తే మూడో రౌండ్లో ఆమె సోదరి వీనస్‌తో తలపడే అవకాశం ఉంది.

'నా భార్య కంటే ఎక్కువ..!'



న్యూఢిల్లీ: భారత్‌కు రెండు ప్రపంచకప్‌లు అందించిన మహేంద్ర సింగ్ ధోనీ అంటే పడి చచ్చేవాళ్లు చాలా మందే ఉన్నారు. సగటు భారతీయ క్రికెట్ అభిమాని ఎవరైనా ధోనీ శకాన్ని ఎప్పటికీ మరిచిపోలేరు. ఇంతవరకు బాగానే ఉంది. కానీ, పాక్‌కు చెందిన మహమ్మద్ బషీర్ 'నా భార్య కంటే నాకు టీమిండియా క్రికెటర్ మహేంద్ర సింగ్ ధోనీ అంటేనే ఎక్కువ ఇష్టం' అని అంటున్నాడు. ఇంతకీ ఈ బషీర్ ఎవరు.. ధోనీ అంటే ఎందుకు అంత ఇష్టం, అతని కోసం ఏం చేశాడు అంటే... భారత్-బంగ్లాదేశ్-శ్రీలంక మధ్య జరుగుతోన్న ముక్కోణపు టోర్నీ చూసేందుకు బషీర్ ఇప్పుడు ఆతిథ్య లంకలో పర్యటిస్తున్నాడు. ఈ క్రమంలో విలేకర్ల కంటపడ్డాడు. తనకు ధోనీ అంటే ఎందుకు అంతిష్టమో వారికి వివరించేశాడు. '2011 ప్రపంచకప్‌లో భాగంగా భారత్-పాకిస్థాన్ మధ్య మొహాలీలో ఓ సెమీఫైనల్ జరిగింది. ఈ మ్యాచ్ చూసేందుకు నేను పాకిస్థాన్ నుంచి రెండు మూడు రోజులు ముందుగానే వచ్చాను. టికెట్ కోసమని మైదానం వద్దకు వెళ్లగా అప్పటికే అయిపోయినట్లు బోర్డులు కనిపించాయి. దీంతో నేను తీవ్ర నిరాశ చెందాను. తిరిగి వెళ్లిపోదామని అనుకున్న నాలో మ్యాచ్ ఎలాగైనా చూడాలన్న బలమైన కోరిక అలాగే ఉండటంతో మరొక్క సారి ప్రయత్నించడంలో తప్పు లేదనుకున్నాను. అందుకే తర్వాతి రోజు మరోసారి స్టేడియానికి వచ్చాను. అయినా నిరాశ తప్పలేదు. దీంతో అక్కడే దిగాలుగా కూర్చున్నాను. ఇంతలో ఒక వ్యక్తి ఏదో కవరు చేతపట్టుకుని నా దగ్గరికి వచ్చాడు. ఆ కవర్‌ను నాకు ఇచ్చాడు. అందులో ఏముందా అని తెరిచి చూశాను. నా కళ్లను నేనే నమ్మకలేక పోయాను. ఇంతకీ అందులో ఏమున్నాయో తెలుసా.. మ్యాచ్ టికెట్లు. నిజంగా. నమ్మండి. ఎవరు పంపించారో తెలుసా మహేంద్ర సింగ్ ధోనీ. ఇక్కడ ఒక ఆశ్చర్యకరమైన విషయం ఏమిటంటే.. అప్పటి వరకు నాకు ధోనీ ఎవరో తెలియదు. కానీ, అప్పటి నుంచి మాత్రం నాకు ధోనీ అంటే చాలా ఇష్టం. ఎంతంటే.. నా భార్య కంటే కూడా నాకు ఎక్కువగా ధోనీనే ఇష్టం' అని నవ్వుతూ చెప్పేశాడు బషీర్. 'ఇప్పటికీ చాలా మంది నన్ను ప్రశ్నిస్తారు. ఎందుకు ఇండియాకు సపోర్టు చేస్తావని? వారందరికీ నేను ఒకటే సమాధానమిస్తా. అదేంటంటే.. ఇండియాలో మనకు కావాల్సినంత ప్రేమ దొరుకుతుంది. మా దేశంలో చాలా మంది వృద్ధులు యువత మనసుల్లో భారత్ ఓ శత్రుదేశమనే విష బీజాలు నాటారు. కానీ అందులో ఎంతమాత్రం నిజంలేదు' అని తెలిపాడు బషీర్. రెండు ప్రపంచకప్‌ల హీరో ధోనీ కేవలం భారత్‌లోనే కాదు ప్రపంచ వ్యాప్తంగా అభిమానులను సంపాదించుకున్నాడు. స్వదేశీ, విదేశీ గడ్డలపై మ్యాచ్‌లు జరుగుతున్న సమయంలో అభిమానులు భద్రతా సిబ్బందిని దాటి ధోనీకి పాదాభివందనం చేయడం అది అతనిపై వారికున్న అభిమానాన్ని చాటుతోంది.

'ఉబెర్' అంబాసిడర్‌గా కోహ్లి



న్యూఢిల్లీ: భారత క్రికెట్ జట్టు కెప్టెన్ విరాట్ కోహ్లి మరో ప్రముఖ సంస్థకు ప్రచారకర్తగా నియమితుడయ్యాడు. క్యాబ్ ఆపరేటర్ ఉబెర్ ఇండియాకు బ్రాండ్ అంబాసిడర్‌గా బాధ్యతలు స్వీకరించాడు. ఈ మేరకు టీమిండియా కెప్టెన్ శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఉబెర్ ఇండియాతో కొత్త సక్సెస్‌ఫుల్ ఇన్నింగ్స్ కోసం సిద్ధంగా ఉన్నానంటూ ట్వీట్ చేశారు. ఉబెర్‌తో భాగస్వామ్యంపై సంతోషం వ్యక్తం చేసిన కోహ్లి మాట్లాడుతూ ఓ క్రికెటర్‌గా నేను చాలా ప్రదేశాల్లో పర్యటించాననీ ఉబెర్‌లో తన మొదటి అనుభవం ఇంకా గుర్తుందని తెలిపారు. ఉబెర్ క్యాబ్ ద్వారా తనకు మంచి అనుభూతి ఉందని తెలిపారు. అధునాతన టెక్నాలజీని ఉపయోగించి ప్రజలు వివిధ ప్రాంతాలకు వెళ్లేలా ఒక విప్లవాత్మక మార్పులు తీసుకొచ్చి, ఆర్థిక అవకాశాలను సృష్టించడం ద్వారా లక్షలాది మందికి సాధికారికత కల్పించడం గొప్పవిషయమని పేర్కొన్నాడు. తమకు భారత్ కీలకమైన మార్కెట్‌గా ఉన్ననేపథ్యంలో ఇండియాలో ఉబెర్ పెట్టుబడుల ప్రవాహం ఇకపై కూడా కొనసాగుతుందని కంపెనీ ఒక ప్రకటనలో తెలిపింది. కాగా ప్రస్తుతం క్రికెట్‌కు దూరంగా ఉండి విశ్రాంతి తీసుకుంటున్న విరాట్ ఇప్పటికే పలు దేశీయ, అంతర్జాతీయ కంపెనీల బ్రాండ్లు, ఉత్పత్తులకు బ్రాండ్ అండాసిడర్‌గా ఉన్నసంగతి తెలిసిందే.

'ఇలా ఆడితే కష్టం'



కొలంబో: ముక్కోణపు సిరీస్‌లో భాగంగా టీమిండియాతో జరిగిన మ్యాచ్‌లో ఓటమి చెందడం కంటే కూడా జట్టు ఆడిన తీరుపై బంగ్లాదేశ్ కెప్టెన్ మొహ్మాదుల్లా తీవ్ర ఆందోళన వ్యక్తం చేశాడు. ఏ దశలోనూ తమ జట్టు నాణ్యమైన బ్యాటింగ్ చేయలేదన్నాడు. ఇంకా 30 నుంచి 40 పరుగులు చేయాల్సి ఉన్నా, సాధారణ స్కోరుకే పరిమితమయ్యాం. ప్రధానంగా మధ్య ఓవర్లలో ఎక్కువ డాట్ బాల్స్ పడ్డాయి. కనీసం సింగిల్స్‌తో బ్యాటింగ్ రొటేట్ చేయడం కూడా కష్టమైంది. టీ 20ల్లో డాట్ బాల్స్ అనేవి చాలా తక్కువ శాతం ఉండాలి. మా ఇన్నింగ్స్‌లో 46 బంతులకు అసలు పరుగులే రాలేదు. ఇది మా ఓటమిపై తీవ్ర ప్రభావం చూపింది. ఇక్కడ మా ఓటమి కంటే కూడా ఆట తీరు బాలేదు. డాట్ బాల్స్‌పై ఇకనుంచైనా జాగ్రత్త పడాలి. బౌండరీలపై ఆధాపడవద్దు.. ఒత్తిడిని అధిగమించాలంటే సింగిల్స్ చాలా ప్రధానం' అని మొహ్మాదుల్లా తెలిపాడు.

అది ప్రతి క్రికెటర్ కల : శంకర్



కొలంబో: ముక్కోణపు టోర్నీలో భాగంగా బంగ్లాదేశ్‌తో గురువారం జరిగిన మ్యాచ్‌లో భారత్ 6 వికెట్ల తేడాతో విజయం సాధించిన సంగతి తెలిసిందే. ఈ మ్యాచ్ విజయంలో ఆల్‌రౌండర్ విజయ్ శంకర్ కీలకపాత్ర పోషించి మ్యాన్ ఆఫ్ ద మ్యాచ్ అవార్డు దక్కించుకున్నాడు. రెండో అంతర్జాతీయ మ్యాచ్‌లోనే మ్యాన్ ఆఫ్ ద మ్యాచ్ అవార్డు దక్కించుకున్న అతి కొద్ది మంది ఆటగాళ్ల జాబితాలో చోటు దక్కించుకున్నాడు విజయ్. మ్యాచ్ అనంతరం విజయ్ మాట్లాడుతూ.. 'ఎంతో కష్టపడి ఈ స్థాయికి చేరుకున్నాను. చాలా సంతోషంగా ఉంది. బౌలింగ్ నాకు అదనపు బలం. ఈ రోజు నాకు రెండు వికెట్లు దక్కాయి. ప్రత్యర్థి జట్టు ఆటగాళ్ల పరుగులు చేయకుండా నియంత్రించగలిగాను. క్రికెట్‌ను కెరీర్‌గా ఎంచుకున్న ప్రతి ఆటగాడు దేశానికి ఆడాలని కలలు కంటుంటాడు. ఇన్నాళ్లకు నా కల నిజమైంది. డ్రస్సింగ్ రూమ్‌లో ఆటగాళ్లు ఎంతో మద్దతిస్తున్నారు' అని చెప్పుకొచ్చాడు విజయ్. ముక్కోణపు టోర్నీలో భాగంగా భారత్ సోమవారం లంకను ఢీకొట్టనుంది. ఈ టోర్నీలో లంకతో జరిగిన మ్యాచ్‌లో టీమిండియా ఓటమి పాలైన సంగతి తెలిసిందే. భవిష్యత్తు పర్యటనలను దృష్టిలో పెట్టుకుని కోహ్లి, పాండ్య, భువనేశ్వర్ తదితర ఆటగాళ్లకు ముక్కోణపు టోర్నీ నుంచి బీసీసీఐ ఉపశమనం కల్పించింది. దీంతో పలువురు యువ ఆటగాళ్లకు ఈ టోర్నీలో ఆడే అవకాశం దక్కిన విషయం తెలిసిందే.

షమీపై జహాన్ సంచలన ఆరోపణలు



న్యూఢిల్లీ: టీమిండియా పేసర్ మహమ్మద్ షమి గురించి రోజుకో ఆశ్చర్యకరమైన విషయం వెలుగులోకి వస్తుంది. తాజాగా షమి భార్య హసీన్ జహాన్ చేసిన వ్యాఖ్యలే ఇందుకు నిదర్శనం. 'భారత క్రికెట్ జట్టు సారథి విరాట్ కోహ్లిలా షమీ బాలీవుడ్ నటిని పెళ్లి చేసుకోవాలని అనుకునేవాడు. ఒకసారి నన్ను చంపి అడవిలో పాతిపెట్టమని తన సోదరుడికి చెప్పాడు' అని హసీన్ తెలిపింది. షమి తనను రెండేళ్ల నుంచి తనకు విడాకులు ఇవ్వాలని ఒత్తిడి చేస్తున్నాడని, అతడికి ఇతర మహిళలతో సంబంధాలు ఉన్నాయని ఆరోపించిన హసీన్ తాజాగా మరిన్ని సంచలన వ్యాఖ్యలు చేసింది. 'షమికి ఎప్పుడూ ఒక కోరిక ఉండేది. భారత క్రికెట్ జట్టు సారథి విరాట్ కోహ్లి ఎలా అయితే బాలీవుడ్ నటి అనుష్క శర్మను పెళ్లాడాడో అలా షమికి బాలీవుడ్‌కు చెందిన అమ్మాయిని పెళ్లి చేసుకోవాలని ఉండేది. నిన్ను పెళ్లి చేసుకుని చాలా పెద్ద తప్పు చేశా అని అంటుండేవాడు. రెండేళ్ల నుంచి నన్ను మానసికంగా, శారీరకంగా షమీ బాధపెట్టాడు. విడాకులు ఎప్పుడు ఇస్తావు అంటూ ప్రశ్నిస్తూనే ఉండేవాడు' అని తెలిపింది హసీన్. '2017లో టీమిండియా శ్రీలంక పర్యటనకు వెళ్లిన సంగతి అందరికీ తెలిసిందే. ఆ పర్యటనకు షమి నన్ను కాకుండా తన పాకిస్థానీ గర్ల్ ఫ్రెండ్‌ను తీసుకెళ్లాలని అనుకున్నాడు. ఒకసారి షమి.. నన్ను చంపేసి ఏదైనా అడవిలో నా శవాన్ని పాతిపెట్టమని యూపీలో ఉన్న తన సోదరుడికి చెప్పాడు. నాతో కలిసి షమి ఏ ఫంక్షన్‌కు హాజరయ్యేవాడు కాదు. ఒకవేళ ఎక్కడికైనా కలిసి వెళ్లినా తన భార్యగా నన్ను ఎవ్వరికీ పరిచయం చేసేవాడు కాదు. నాతో పెళ్లికి ముందే షమికి ట్యూబా అనే అమ్మాయితో సంబంధం ఉంది. ఈ విషయం నాకు ఎప్పుడూ చెప్పలేదు' అంటూ తన బాధను వెళ్లగక్కింది హసీన్.



భారత్ ఖాతాలో మరో పతకం

మెక్సికో: ఐఎస్‌ఎస్‌ఎఫ్ సీనియర్ ప్రపంచకప్‌లో భారత్ ఖాతాలో మరో పతకం వచ్చి చేరింది. టోర్నీలో భాగంగా ఆరో రోజు నిర్వహించిన మహిళల 50మీటర్ల రైఫిల్ త్రి పొజిషన్ ఈవెంట్‌లో భారత క్రీడాకారిణి అంజుమ్ మోద్గిల్ 454.2 పాయింట్లు సాధించి రజత పతకాన్ని దక్కించుకుంది. చైనాకు చెందిన రుజియో(455.4) స్వర్ణం గెలవగా ఇదే దేశానికి చెందిన టింగ్ సున్ (442.2) కాంస్యంతో సరిపెట్టుకుంది. పురుషుల 25 మీటర్ల రాపిడ్ ఫైర్ పిస్టోల్ ఈవెంట్‌లో భారత్‌కు నిరాశ ఎదురైంది. ఈ విభాగంలో పతకం తెస్తాడని భావించిన అనిశ్ భన్‌వాలా ఏడో స్థానంలో నిలిచాడు. మరో భారత ఆటగాడు నీరజ్ కుమార్ 13వ స్థానానికి పరిమితమయ్యాడు. తాజాగా అంజుమ్ సాధించిన పతకంతో భారత్ పతకాల సంఖ్య 8కి చేరింది. 3 బంగారు, ఒక రజతం, నాలుగు కాంస్య పతకాలతో భారత్ పతకాల పట్టికలో అగ్రస్థానంలో కొనసాగుతోంది. ఆ తర్వాతి స్థానంలో చైనా (2 బంగారు, 2 రజతం, ఒక కాంస్యం) ఉంది. చండీగఢ్‌కు చెందిన 20 ఏళ్ల అంజుమ్‌కు ఇదే తొలి అంతర్జాతీయ పతకం.



డాలీ శివానీకి అవార్డు ప్రదానం

విశాలాంధ్ర-విజయవాడ స్పోర్ట్స్: ఆర్చరీ వండర్ కిడ్ డాలిశివానీకి మెగా ఉమెన్ అచీవర్ అవార్డును మాజీకేంద్ర మంత్రి కేవీ తంగబాలు, మేనేజింగ్ డైరెక్టర్, మెగాటీవీ నెట్‌వర్క్ జయంతి తంగబాలు గురువారం అంద జేశారు. అంతర్జాతీయ మహిళల దినోత్సవం సందర్భంగా చెన్నైలో జరిగిన కార్యక్రమంలో శివానీ తల్లిదండ్రులు చెరుకూరి సత్యనారాయణ, కృష్ణకుమారి సమక్షంలో ఈ అవార్డును శివానీకి అందజేశారు. ప్రముఖ సినీనటి సీఆర్ విజయకుమారి, జస్టిస్ ఎమ్.ఫాతిమాబీవి(సుప్రీం కోర్టు మాజీ జస్టిస్, తమిళనాడు మాజీ గవర్నర్), స్నేహా మోహన్‌దాస్ (ఫుడ్‌బ్యాంక్ ఆఫ్ ఇండియా) తదితరులు పాల్గొన్నారు.

షమీ అలాంటి వాడు కాదు : కపిల్

ముంబై: టీమిండియా పేసర్ మహమ్మద్ షమికి అండగా నిలిచాడు మాజీ క్రికెటర్ కపిల్‌దేవ్. షమీ మోసగాడని, ఇతర మహిళలతో సంబంధాలున్నాయని, ఓ పాకిస్థానీ మహిళ నుంచి డబ్బు తీసుకున్నాడని ఆయన భార్య హసీన్ జహాన్ చేసిన వ్యాఖ్యలను కపిల్‌దేవ్ ఖండించాడు. 'హసీన్ రెండేళ్ల నుంచి తన జీవితంలో కఠినమైన పరిస్థితులను ఎదుర్కొంటుంటే ఇంత ఆలస్యంగా ఎందుకు బయటకు తీసుకువచ్చింది. మ్యాచ్ ఫిక్సింగ్‌కు పాల్పడ్డాడని, తనను చంపేందుకు ప్రయత్నించాడని ఏవేవో ఆరోపణలు చేస్తోంది. ఎప్పుడో మ్యాచ్ ఫిక్సింగ్‌కు పాల్పడితే ఇప్పటి వరకు ఎందుకు నోరు విప్పలేదు. భర్తతో సంబంధాలు బాగానే ఉన్నంత వరకు ఏమీ చెప్పరా? అదే సంబంధం సరిగా లేకపోతే ఇలాంటి తప్పుడు ఆరోపణలు చేస్తారా?' అంటూ కపిల్ దేవ్ ప్రశ్నించాడు.

ఇక.. రైల్వే టికెట్ ట్రాన్స్‌ఫర్



న్యూఢిల్లీ: సుదూర ప్రయాణం కోసం రైల్వే టికెట్ రిజర్వేషన్ చేయించుకుని ఒకవేళ ఆ సమయానికి ఏదో పనిపడి ప్రయాణాన్ని రద్దు చేసుకోవాల్సి వస్తే ఆ టికెట్ వృథా అయినట్టే. ఇలాంటి సమయాల్లో దీనికో ప్రత్యామ్నాయం దొరికితే ఎంత బాగుంటుంది అనుకుంటాం కదా! ఇప్పుడు ఇలాంటి సమస్యలకు భారత రైల్వేశాఖ ప్రత్యామ్నాయాన్ని తీసుకొచ్చింది. అనివార్య కారణాల వల్ల ప్రయాణం రద్దు చేసుకోదలిస్తే ప్రయాణికులు రిజర్వు చేసుకున్న టికెట్‌ను ఇతరులకు బదిలీ చేయవచ్చు.

- ఒకవేళ టికెట్ రిజర్వు చేసుకున్న ప్రయాణికులు ప్రభుత్వోద్యోగులయితే రైలు బయల్దేరడానికి నిర్దేశించిన 24గంటల్లోపు తమ టికెట్‌ను వేరే ప్రయాణికుడి పేరు మీదకు మార్చమన్నట్లు లిఖితపూర్వకంగా లేఖరాసి ఇవ్వాల్సి ఉంటుంది.
- సాధారణ ప్రయాణికులకు సైతం ఇలాంటి నిబంధనే ఉంటుంది. కాకపోతే ప్రయాణికుడి కుటుంబ సభ్యులకు అంటే అమ్మానాన్నలకు, భార్య, సోదరులు, అక్కాచెల్లెల్లు, భర్త, కొడుకు, కుమార్తెలకు ఈ నియమం వర్తిస్తుంది. రైలు బయల్దేరడానికి 24గంటలలోపు ప్రయాణికులు ఈమేరకు అభ్యర్థన పెట్టుకోవాల్సి ఉంటుంది.
- ఒకవేళ ప్రయాణికులు ప్రభుత్వ గుర్తింపు కలిగిన విద్యాసంస్థలకు చెందిన విద్యార్థులైతే... వారు టికెట్‌ను బదిలీ చేసుకోదలిస్తే సంబంధిత విద్యాసంస్థల అధికారి సంతకం కావాల్సి ఉంటుంది. రైలు బయల్దేరే 48గంటల్లోపు ఈ మేరకు సంతకంతో కూడిన అభ్యర్థను సమర్పించాల్సి ఉంటుంది.
- ఎన్‌సీసీ బృందానికీ ఇదే సూత్రం వర్తిస్తుంది. కాకపోతే వీరి బృందంలోని నాయకుడి సంతకం కావాల్సి ఉంటుంది. అయితే మొత్తం బృందంలో 10శాతం సభ్యులకు మాత్రమే ఈ వెసులుబాటు ఉంటుంది. అంతకు మించిన అభ్యర్థనలను తిరస్కరిస్తారు. ఉదాహరణకు మొత్తం బృందంలో 20మంది ఉంటే వారిలో ఇద్దరికి మాత్రమే ఈ సౌకర్యం లభిస్తుంది.

బ్యాంకు కుంభకోణం కేసుల్లో

రెండు నెలల్లో రూ.7వేల కోట్ల ఆస్తులు జప్తు



న్యూఢిల్లీ: ఇటీవల పంజాబ్ నేషనల్ బ్యాంకు(పీఎన్‌బీ)లో వెలుగుచూసిన రూ. 12వేల కోట్ల కుంభకోణం బ్యాంకింగ్ వ్యవస్థలో ప్రకంపనలు సృష్టించింది. దీని తర్వాత కూడా కొన్ని బ్యాంకు మోసాలు బయటకొచ్చాయి. దీంతో రంగంలోకి దిగిన ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్(ఈడీ), కేంద్ర దర్యాప్తు బృందం(సీబీఐ) అధికారులు విచారణ మొదలుపెట్టారు. అనేక చోట్ల సోదాలు నిర్వహించారు. అలా గడచిన రెండు నెలల్లో 234 సోదాలు చేపట్టిన ఈడీ అధికారులు రూ.7,109 కోట్ల విలువైన ఆస్తులను స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు కేంద్ర ప్రభుత్వం నేడు పార్లమెంట్‌లో వెల్లడించింది. 'బ్యాంకు కుంభకోణాలకు సంబంధించి ఈ ఏడాది జనవరి-ఫిబ్రవరి మధ్య ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ అధికారులు దేశవ్యాప్తంగా 234 సోదాలు చేపట్టారు. వీటిల్లో రూ.7,109 కోట్ల విలువైన ఆస్తులను స్వాధీనం చేసుకున్నారు. మూడేళ్ల కాలంలో మనీ లాండరింగ్ వ్యతిరేక చట్టం కింద 605 కేసులు నమోదవగా.. రూ. 27,982కోట్ల విలువైన ఆస్తులను ఈడీ జప్తు చేసింది' అని కేంద్ర ఆర్థికశాఖ సహాయమంత్రి శివప్రతాప్ శుక్లా లోక్‌సభకు ఇచ్చిన లిఖితపూర్వక సమాధానంలో పేర్కొన్నారు. గత నెలలో పంజాబ్ నేషనల్ బ్యాంక్‌లో రూ.12,700కోట్ల కుంభకోణం వెలుగుచూసిన విషయం తెలిసిందే. ప్రముఖ వజ్రాల వ్యాపారి నీరవ్‌మోడీ, ఆయన బంధువు మెహుల్ ఛోక్సీ ఈ కేసులో ప్రధాన నిందితులుగా ఆరోపణలు ఎదుర్కొంటున్నారు. దీంతో పాటు రూ.3,695కోట్ల మరో బ్యాంకు మోసం కూడా బయటకొచ్చింది. ఇందులో రొటామాక్ పెన్నుల అధినేత విక్రమ్ కొఠారీపై మనీలాండరింగ్ కేసు నమోదైంది.

Printed & published by Edupuganti Nageswara Rao on behalf of Visalaandhra Vignana Samithi, Printed at Visalaandhra Press, Chandram Buildings, Machavaram, Vijayawada, Andhra Pradesh. Published at Visalaandhra Vignana Samithi, 33-22-2, Visalaandhra Road, Chuttugunta, Vijayawada - 520004, Andhra Pradesh. EDITOR : MUTYALA PRASAD. RNI No. 1138/57, Postal: Regd. No.VJA: VJ/042/2018-20, Phones : Editorial :2430220, Manager : 2431301, Fax No. 0866 2431780, E-Mail : ap.visalaandhra@gmail.com.